# చంద్రుళ్ళో కుందేలు

నవల

- మధురవాణి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 88

**తెలతెల్లటి మబ్బు తునకలు** పల్చగా పరుచుకున్న ఆకాశం విరబూసిన మల్లెపొదలా, అప్పుడే పుట్టిన పాపాయి నవ్వులా స్వచ్ఛంగా, అందంగా ఉంది. ఎవరో మబ్బుల చాటున దాగుండి దోసిలి పట్టి సుతారంగా ముత్యాలు వెదజల్లుతున్నట్టు అలవోకగా నింగి నుంచి జారుతున్న సనసన్నటి వాన చినుకులు.. ఆగి ఆగి వీస్తున్న గాలి అలలపై తేలుతూ మెలమెల్లగా చెట్టు సిగలో నుంచి జారి నేలని తాకుతున్న ఎర్రటి గుల్మోహర్ పూలరేకులు..

గుల్మోహర్ చెట్టు కింద నించున్న ఓ అమ్మాయి చేతుల్లో అప్పటిదాకా పెనవేసి ఉన్న మరో జత చేతులు మెల్లగా వీడిపోతూ ఆమె నుంచి దూరంగా వెళుతున్నాయి. అలా ముందుకి సాగిపోతూనే వెనక్కి తిరిగి చూస్తూ "నువ్వు జాగ్రత్త.. వెళ్ళొస్తానూ.." అంటూ చెప్తున్న వీడుకోలు వాక్యాలు గాలి తెరలనీ, వాన చినుకుల్నీ దాటుకుని ఆమె దాకా వచ్చేసరికి అస్పష్టంగా వినిపిస్తున్నాయి. కళ్ళు విప్పార్చుకుని అటు వైపే చూస్తూ చెయ్యెత్తి గాలిలో ఊపుతూ ఉండిపోయిందా అమ్మాయి.

"ఇంకా ఎంతసేపు ఈ రోడ్డుకేసి చూస్తూ నించుంటావు.. పద వెళ్దాం.. మేఘా.. నిన్నే.. పలకవేంటి.. మేఘా..... మేఘా...."

తనని గట్టిగా కుదిపేస్తూ బిగ్గరగా వినిపించిన ఆ పిలుపుకి ఉలిక్కిపడి నిద్ర లేచింది మేఘ. కళ్ళు నులుముకుని చుట్టూ చూస్తే ఎర్ర పూవులు రాల్చే గుల్మోహర్ చెట్లు లేవు. గది గోడలకి వేసిన ఊదా రంగు పల్చటి బెడ్ లైటు వెలుతురులో గులాబీ రంగులోకి మారిపోయి మెరుస్తోంది.

"హ్మ్.. మళ్ళీ కలేనా!" నిట్టూర్చింది మేఘ.

మంచం దిగి గదిలోంచి బయటికి వెళ్ళి కొంచెం మంచినీళ్ళు తాగేసి మళ్ళీ వచ్చి గడియారం వంక చూసింది. అప్పుడు సమయం అర్ధరాత్రి రెండవుతోంది.

కిటికీ పరదాలు పక్కకి జరిపి బయటికి చూస్తే నల్లటి ఆకాశంలోంచి ధారాపాతంగా కురుస్తోన్న వర్షం చీకటి నలుపులో కలిసిపోయి కంటికి కనిపించకపోయినా వాన హోరు మాత్రం చెవులకు లీలగా వినిపిస్తోంది. ఉండుండీ తళుక్కున మెరిసే మెరుపుల వెలుగులో వర్షపు ధారలు వెండి తీగల్లా మెరిసి మాయమైపోతున్నాయి. బలంగా వీస్తున్న గాలివాటుకి వాన చినుకులు దురుసుగా వచ్చి కిటికీ అద్దాన్ని ఢీకొని నిశ్శబ్దంగా కిందకి జారిపోతున్నాయి. ఆ ఒరిగిపోతున్న వాన చినుకుల్ని పరామర్శిస్తున్నట్టు వాటి వెంబడే చేతి వేళ్ళతో అద్దం మీద రాస్తూ అక్కడే నించుండిపోయింది మేఘ.

దూరంగా వీధి దీపాల వెలుగులో వెన్ను విరుచుకు నిలబడిన నల్లటి మోడువారిన చెట్లు ఏ భావమూ లేనట్టు వర్షంలో తడుస్తున్నాయి. ఆ చెట్లని చూడగానే ఎప్పుడూ నవ్వుతున్నట్టుండే పచ్చని గుల్మోహర్ చెట్లు జ్ఞాపకానికొచ్చాయి మేఘకి.

నెమ్మదిగా కిటికీ మీదకి తల వాల్చి చెక్కిలితో చల్లటి కిటికీ అద్దాన్ని తాకింది. అద్దానికి అవతల వైపున జారుతున్న చినుకులన్నీ తన చెక్కిలిపై తారాడుతున్న అనుభూతి కలిగింది ఆమెకి. మనసు మూలల్లో నుంచి నిద్ర లేచిన జ్ఞాపకాల అలలేవో ఎగిసిపడుతున్నాయి.

"మేఘా.. మేఘా.." అన్న పిలుపు ఓ మార్ధవమైన గొంతులో తేలి వచ్చి చెవుల్లో గింగురుమంటోంది. ఆ పిలుపుకి ఊ కొడుతూ మెల్లగా గతంలోకి జారిపోబోతుంటే ధమధమా ఉరుముల శబ్దాలు తన మీద కేకలేస్తూ గతంలోకి వెళ్ళే వీల్లేదంటూ ప్రస్తుతంలోనే కట్టిపడేస్తున్నాయి.

మళ్ళీ ఆమె చూపు ఆకాశం మీదకు మళ్ళింది. ఆలోచనలు ఎటో వెళ్ళిపోతున్నాయి. ఎవరి మీదనో బెంగ పెట్టుకున్న ఆకాశం ఈ నిశి రాతిరి వేళ ఎవ్వరికీ తెలీకుండా ఇలా రహస్యంగా ఏడుస్తోందా.. పగలంతా ప్రశాంతంగా కనిపించిన ఆకాశం ఎందుకిలా చీకటి

రాత్రిలో ఉరుములూ మెరుపులతో వెర్రికేకలు వేస్తోంది.. తన బాధ ఎవరికీ పట్టనట్టు ఈ లోకమంతా వెచ్చగా నిదురిస్తోంది కదూ! హుమ్మ్.. ఏ మేఘం చాటున ఏ మెరుపు దాగుందో, ఏ వాన చినుకు వెనక ఏం కథలున్నాయో, వెతలున్నాయో ఎవరికెరుక!

అసలూ.. ఈ మేఘాలన్నీ వర్షించడం మానేసి వాననంతా లోపలే దాచేసుకునే ప్రయత్నం చెయ్యవెందుకో.. బహుశా మనుషుల్లా అన్నీ మనసులోనే దాచేసుకుని మథనపడే అలవాటు వాటికి లేదేమో!

**ప్చ్..** ఏంటీ పిచ్చి ఆలోచనలు.. అయినా నేరం తనది కాదులే.. వానదే! కాదా మరి.. మేఘాలూ, జడివాన ఎప్పుడు ఎదురైనా తనని నిలువెల్లా ముంచెత్తి ఎక్కడో ఎద లోతుల్లో అతి రహస్యంగా దాచిన జ్ఞాపకాల నిధుల్ని వెలికి తీస్తాయి. వాన పేరు పెట్టుకున్నదన్న ప్రేమ కొద్దీ తననిలా వేధిస్తుంటాయి కాబోలు! తన ఆశలకీ, నిరాశలకీ, కన్నీళ్ళకీ, జ్ఞాపకాలకీ.. అన్నీటికీ మౌనసాక్షిగా నిలుస్తోంది ఈ వర్షమేనేమో!

తన ఆలోచనలకి తనే నవ్వుకుంటూ కిటికీని వదిలి గదిలోకొచ్చింది మేఘ. టైము చూస్తే తెల్లవారుజాము నాలుగు దాటింది. ఇంక ఇప్పుడెలాగూ మళ్ళీ నిద్ర పట్టదులెమ్మని మంచం ఎదురుగా ఉన్న అలమరలో ఎక్కడో పై అరలో మూలనున్న ఒక చెక్క పెట్టెని బయటికి తీసింది.

లైటు వెలుతురులో ఆ పెట్టె మీద చెక్కబడిన అందమైన నగిషీల మధ్యన పొదిగిన రంగురాళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. ఒకసారి అపురూపంగా పెట్టెని రెండు చేతులతో నిమిరి మెల్లగా తెరిచింది. లోపల ఏవేవో కవర్లూ, ఉత్తరాలూ, చిన్న చిన్న డబ్బాలూ, రాళ్ళూ , గవ్వలూ.. చాలా రకాల వస్తువులు కుప్పగా పోసి ఉన్నాయి. చూడబోతే అదో పెద్ద జ్ఞాపకాల నిధిలా కనిపిస్తోంది.

అందులో చాలాసేపు వెతికీ వెతికీ చివరికి కెంజాయ రంగుతో హృదయాకారంలో ఉన్న ఒక బుల్లి డబ్బాని చేతుల్లోకి తీసుకుంది. తెరిచి చూస్తే మూతకి లోపల వైపున తన చేతివ్రాతలోనే దాదాపు పదేళ్ళ నాటి తేదీ, సమయమూ రాసున్నాయి. అందులో ఉన్న ఒక బుల్లి స్ఫటికపు నత్త బొమ్మని, ఎండిపోయిన ఎర్రటి గుల్ మోహర్ పూలరేకులని అరచేతిలోకి తీసుకుని ప్రేమగా తాకుతూ వాటికేసి తదేకంగా చూస్తూ ఉండిపోయింది.

తెలవారుతున్నా సూర్యుడి జాడే లేకుండా వాన కురుస్తూనే ఉంది. మేఘని కమ్ముకున్న జ్ఞాపకాల ముసురు కూడా ఇంకా వదల్లేదు. అర్ధరాత్రి మెలకువొచ్చినప్పటి నుంచీ తెల్లారేదాకా నిద్ర సంగతి మర్చిపోయి ఆ చెక్క పెట్టెలోని రకరకాల వస్తువుల్ని పేరుపేరునా పలకరిస్తూ నిదురించిన ఒక్కో జ్ఞాపకాన్నీ తట్టి లేపుతూ ఉండిపోయింది.

చాలాసేపటికి వాన జోరు కాస్త తగ్గి మెలమెల్లగా వెలుతురు పరుచుకుంటున్న ఛాయలు కనిపిస్తున్నాయి. ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు ఒక్కొక్కటే తేలిపోయి ఆకాశంలో అంతదాకా ఆవరించిన నలుపంతా కరిగిపోయి తెల్లబడుతోంది. మేఘ మనసు కూడా తేలికైనట్టుంది. జ్ఞాపకాల పెట్టెని వదిలి వర్తమానంలోకి వచ్చి ఫోన్ అందుకుని దాదాపు రెండు గంటల సేపు ఫోన్ కాల్స్ మాట్లాడింది.

తర్వాత వంటింట్లోకి వెళ్ళి కాఫీ కప్పు తెచ్చుకుని మంచం ఎక్కి కూర్చుని మళ్ళీ ఫోన్ అందుకుని నీలూకి కాల్ చేసింది.

"హలో నీలూ.. ఏం చేస్తున్నావే?"

"ఈ టైంలో ఇంకా చేసేదేముంటుందే.. హాయిగా ముసుగు తన్ని పడుకుని వచ్చే వారం నువ్వొచ్చాక మనం ఏమేం చీరల షాపింగులు చేస్తామా, ఏ గాజుల కొట్ల చుట్టూ తిరుగుతామా అని హాయిగా కలలు కందాం అనుకుంటున్నాను."

"అబ్బో.. చాలా పెద్ద ప్లాన్లోనే ఉన్నావే! సరే గానీ మన షెడ్యూల్లో ఒక మార్పు.."

"ఇంక చెప్పకు నాకు. అర్జెంటుగా నోరు మూసెయ్.. ఏం పాడు ఉద్యోగాలే బాబూ.. అంతంత దూరదేశాలు వెళ్ళిందే కాక ఎప్పుడో రెండు మూడేళ్ళకొకసారన్నా పట్టుమని పది రోజులు పుట్టిన దేశానికి వెళ్ళే వీలు దొరకదు. మీరూ మీ పిచ్చి ఉద్యోగాలూనూ..

నేనెన్ని కలలు కంటున్నానో తెలుసా నువ్వొస్తావని. ఇప్పుడు ఉన్నట్టుండి కుదరదు అని చెప్తే నిన్నేం చేస్తే పాపం ఉంటుందసలు.. చెప్పవే.. మాట్లాడకుండా నవ్వుతావేం!?”

“అబ్బా.. కాస్త శాంతించి ముందు నన్ను మాట్లాడనివ్వమ్మా నీలమ్మ తల్లీ.. నేను ట్రిప్ కేన్సిల్ చేసానని అనలేదుగా.. చిన్న మార్పు అంతే! అదేంటంటే నేను వచ్చే వారంలో కాకుండా రేపే బయలుదేరి వద్దాం అనుకుంటున్నాను. నా ప్రయాణాన్ని ఒక నాలుగు రోజులు ముందుకు జరుపుదామనీ..”

“అబ్బా మేఘా.. నిజంగా నిజమేనా? ఇంకా ముందే వచ్చేస్తావా నువ్వు? అయితే నేను అర్జెంటుగా హైదరాబాదుకి రిజర్వ్ చేయించిన నా ట్రైన్ టికెట్స్ కాన్సిల్ చేసి తత్కాల్ లో ఎల్లుండికి బుక్ చెయ్యమని శరత్కి చెప్తాను. నువ్వొచ్చేసరికల్లా నేను అక్కడుండాలిగా మరి.”

“ప్చ్.. నీ సంబరం మీ బెజవాడ సంతకెళ్ళా.. నన్నసలు ముందు పూర్తిగా చెప్పనివ్వవే బాబూ.. ఇప్పుడు నువ్వేం అంత అర్జెంటుగా హైదరాబాదుకి రానక్కరలేదు. నేనే నీ దగ్గరికి విజయవాడ వస్తాను. అక్కడే నాలుగు రోజులు ఉండి తర్వాత మనిద్దరం కలిసి ముందు అనుకున్న ప్లాన్ ప్రకారం హైదరాబాద్ వెళదాం. ఏమంటావ్?”

“నువ్వు విజయవాడ వస్తావా? మా ఇంట్లో నాలుగు రోజులుంటావా? కొంపదీసి ఈ ఫోన్ కాల్ నేను కలలో మాట్లాడడం లేదు కదా! నాకంతా అయోమయంగా ఉంది. విజయవాడలో నీకేం పనుందని అంత అర్జెంటుగా వస్తున్నావ్?”

“ప్రశ్నలతో నా బుర్ర తినకుండా నేను చెప్పేది బుద్ధిగా విను నీలూ.. నేను హైదరాబాద్లో ఉండే పదిరోజుల షెడ్యూల్ చాలా బిజీ బిజీగా ఉంది కదా.. నాకు నీతో ఇంకొన్ని రోజులు ఉండాలనుంది. అందుకే చాలా కష్టపడి ప్రయాణం ముందుకి జరిపాను. నేరుగా నేనే విజయవాడకి వచ్చేస్తాను. నువ్వు మీ గన్నవరం ఎయిర్పోర్ట్ కి వచ్చి నన్ను రిసీవ్ చేస్కో చాలు. ఫ్లైట్ డీటైల్స్ అన్నీ నీకు తర్వాత మెయిల్లో పంపిస్తాను. నీ సందేహాలన్నీ నేనొచ్చేదాకా ఫ్రిజ్జులో భద్రంగా దాచిపెట్టు. అర్థమైందా?”

“ఊ ఊ.. పూర్తిగా అర్థం కాలేదనుకో. కానీ నువ్వొచ్చి నాతో మా ఇంట్లో నాలుగు రోజులు ఉంటానంటున్నావు. అంత తియ్యటి మాట చెప్పాక నాకింకే వేరే సందేహాలతో ఏం పనీ! ఎంచక్కా మనం ఆ నాలుగు రోజుల్లో ఓ పది పదిహేనేళ్ళు వెనక్కెళ్ళి మన చిన్నప్పటి రోజుల్లో విహరించి రావచ్చు. అబ్బ.. ఊహించుకోడానికే ఎంత సంబరంగా ఉందో! ఇదిగో మేఘా.. ఇప్పుడే చెప్తున్నా.. నువ్వు మళ్ళీ ప్లాన్ ఏమన్నా మార్చావంటే నేను మా ఆయన ఆస్తి సగం అమ్మేసయినా సరే అర్జెంటుగా అమెరికా టికెట్టు కొనుక్కునొచ్చి నిన్ను చంపుతా..”

“హహ్హహ్హా.. నీకొచ్చే బ్రిలియంట్ ఐడియాలు ఇంకెవరికీ రావే నీలూ.. ఒక్క ఫ్లైట్ టికెట్టు కోసం సగం ఆస్తి అమ్మడం ఎందుకే తల్లీ.. పాపం శరత్! ఇప్పట్నుంచీ ఆస్తుల తాలూకు పేపర్లేవీ నీలూకి దొరికేట్టు ఇంట్లో పెట్టకండి అని చెప్పాలి.”

“నీకలాగే ఉంటుందే.. ఎప్పుడూ ప్రాజెక్టులూ, మీటింగులూ అనుకుంటూ టైం ఎలా గడుస్తుందో తెలీదు నీకు. నాకేమన్నా ఉద్యోగమా సద్యోగమా.. రోజూ ఇంటి పని, వంట పని చేసుకుంటూ మూడేళ్ళ తర్వాత మళ్ళీ నిన్ను చూస్తాను కదా అని నీతో కలిసి గడపబోయే ఆ రెండు రోజుల గురించి ఎన్నెన్ని ఊహించుకుంటున్నానో నీకేం తెలుసమ్మా?”

“నువ్వు బంగారుతల్లివి నీలూ.. చినప్పటి నుంచీ చూస్తున్నానా నిన్ను.. నా మీద నీకెప్పుడూ అంతే ప్రేమ.. ఆకాశమంత ప్రేమ!”

“ఊ.. చాల్లే సంబరం.. మళ్ళీ మొదలెట్టకు. ఎంత దూరం వెళ్ళినా, ఎంత గొప్ప ఉద్యోగాలు చేస్తున్నా నువ్వింకా ఆకాశం, మబ్బులూ, మట్టీ అంటూ మాట్లాడటం మాత్రం అస్సలు మారదేం?”

“భలేదానివి నీలూ.. కొన్ని కొన్ని మనలో ప్రాణమున్న చివరి క్షణం దాకా మారవే! ఆకాశం, మబ్బులు, ఇంకా మా నీలూ.. ఇవన్నీ ఎప్పటికీ ఉంటాయి నాతో!”

"ఆ ఆ.. ఒకోసారి రెండు మూడు నెలల పాటు కనీసం హలో చెప్పే తీరిక కూడా లేనంత బిజీలో పడి నన్ను మర్చిపోతావ్ గానీ ఇలాంటి మాయ మాటలు చెప్పి మురిపించడంలో మాత్రం ముందుంటావ్.."

"ఏం చేస్తాం చెప్పు మరి.. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో రెండు నిమిషాలు స్థిమితంగా నించుని ఆకాశాన్ని చూసే అదృష్టం కూడా దొరకదు ఒకోసారి. పరిగెత్తడానికి అలవాటు పడిన జీవితాల్లో ఏదో తెలియని మత్తు ఉంటుందనుకుంటా. కాసేపు పరుగు ఆపి నింపాదిగా బతుకుదాం అన్న ఆలోచనని అస్సలు మొలకెత్తనివ్వదా పరుగు మత్తు."

"మళ్ళీ ఫిలాసఫీ క్లాస్ మొదలెట్టావా?"

"హ్మ్.. సరేలే.. నే చెప్పే సోదికి అంతెక్కడలే కానీ నీకు చాలా రాత్రైపోయింది కదా.. రేపు నేనొచ్చాక మనం కలిసుండే నాలుగు రోజులు ఎలా గడుపుదామా అని హాయిగా కలలు కంటూ పడుకో. నా ఫ్లైట్ రేపు సాయంత్రం కాబట్టి మధ్యాహ్నం కల్లా ఎయిర్పోర్ట్ కి వెళ్ళిపోవాలి. అంటే ఇవాళ సర్దుకోడం పూర్తి చెయ్యాలి. బయలుదేరేలోపు పూర్తి చెయ్యాల్సిన కొన్ని ముఖ్యమైన ఆఫీసు పనుల సంగతి కూడా చూడాలి. రేపు బయలుదేరే ముందు మళ్ళీ మాట్లాడతాను నీతో. నువ్వు ఎయిర్పోర్ట్ కి రావాల్సిన టైము మెయిల్ పంపిస్తానన్నానుగా.. అందులో చూసుకో. ఇంక ఇప్పుడు హాయిగా బజ్జోమ్మా నీలమ్మా.. సరేనా.."

"ఊ.. ఏంటో ఇంకా కలలా ఉంది. సరేలే.. నువ్వు అన్నీ పనులు చూసుకుని జాగ్రత్తగా వచ్చెయ్. మిగతా విషయాలన్నీ నువ్వొచ్చాక మాట్లాడుకుందాం. జాగ్రత్త మేఘా!"

"అలాగేలే.. నువ్వేం కంగారు పడకు. గుడ్ నైట్ నీలూ.. ఉంటాను మరి."

"ఊ అలాగే.."

●●●

నీలూతో ఎప్పుడు మాట్లాడినా తర్వాత కాసేపు తీరిగ్గా కూర్చుని తమ చిన్నప్పటి జ్ఞాపకాలని నెమరు వేసుకునే అలవాటు మేఘుకి.

మేఘు ఏడో తరగతిలో ఉండగా వాళ్ళ నాన్నగారికి కొత్త ఊరికి బదిలీ అయింది. మేఘు అక్కడ స్కూల్లో చేరేసరికి నెల రోజుల పైనే పాఠాలు పోయాయి. మొదటి రోజున తెలుగు పాఠం జరుగుతున్న తరగతి గదిలో మేఘుని వదిలి వెళ్ళిపోయారు వాళ్ళ నాన్నగారు.

క్లాసులో పద్యం పాడి వినిపిస్తున్న శారద టీచరుగారు సాదరంగా ఆహ్వానించి పేరేమిటని అడిగారు.

"మేఘనందన" అని చెప్పగానే "ఆ పేరుకి అర్థం ఏవిటో తెలుసా" అని అడిగారు.

"మేఘంలో పుట్టేది, అంటే వర్షం" అని సమాధానం చెప్పేసరికి మెచ్చుకుని ఒకమ్మాయిని పిలిచి మేఘుని తన పక్కన కూర్చోబెట్టుకోమన్నారు.

ఆ అమ్మాయి సంతోషంగా మేఘుకి తన పక్కన చోటిచ్చింది. గవ్వలబొమ్మలా గలగలా మాట్లాడుతూ సాయంత్రానికల్లా క్లాసులోని పిల్లలందరి పేర్లూ, వివరాలతో సహా బోల్డు కబుర్లు చెప్పింది. అప్పుడు మేఘుకి పరిచయమైన అమ్మాయే నీలూ.

వారం రోజులు తిరిగేసరికల్లా నీలూ సావాసంలో మేఘుకి కొత్తదనం పూర్తిగా పోయి అదే స్కూల్లో చాలా ఏళ్ళ నుండి చదువుకుంటున్న మిగతా పిల్లలందరితో బాగా కలిసిపోయింది.

నీలూ వాళ్ళ ఇంటికి పై వీధిలోనే మేఘ వాళ్ళ ఇల్లుండేది. రోజూ ఇద్దరూ కలిసే స్కూలుకి వెళ్ళి వచ్చేవారు. ఏడవ తరగతి పబ్లిక్ పరీక్షలని క్లాసులో అందరూ శ్రద్ధగా పోటాపోటీగా చదివేవాళ్ళు. స్కూలు అయిపోయాక సాయంకాలం మళ్ళీ ప్రైవేటుకి వెళ్ళి రాత్రి ఎనిమిది గంటల దాకా స్కూల్లోనే చదువుకోవడం వల్ల రోజంతా మేఘ, నీలూ ఇద్దరూ ఎక్కువ సమయం కలిసే గడిపేవారు.

మేఘకి తోబుట్టువులు కూడా లేకపోవడంతో ఎప్పుడూ నీలూని అంటిపెట్టుకుని ఉండేది. సెలవు రోజుల్లో కూడా గుడికో, గోపురానికో వెళ్ళాలంటూ ఇద్దరూ కలిసే తిరిగేవారు. చాలా తక్కువ కాలంలోనే వాళ్ళిద్దరూ మంచి స్నేహితురాళ్ళు అయిపోయారు.

నీలూ వాళ్ళింట్లో వాళ్ళ అమ్మ, నాన్నగారు, పదో తరగతి చదివే వాళ్ళ అన్నయ్య శ్రీకాంత్, వాళ్ళ బామ్మ గారు ఉండేవారు. ఇంట్లో అందరూ "నీలూ.." అనే పిలిచినా వాళ్ళ బామ్మ మాత్రం ఎప్పుడూ "నీలమ్మా.. నీలమ్మ తల్లీ.." అని పిలిచేది. కానీ అలా పిలిస్తే మోటుగా ఉంటుందనీ, మరీ ముఖ్యంగా తన స్నేహితుల ముందు అలా పిలవడానికి వీల్లేదని నీలూ ఆవిడతో పోట్లాడేది. ఆవిడ మాత్రం నవ్వేసి మళ్ళీ మళ్ళీ అలానే పిలిచేది. బామ్మ గారి పేరైన నీలమ్మని సునీలగా మార్చిపెట్టడమే దానికి కారణం.

అప్పుడప్పుడూ నీలూని ఏడిపించడానికి మేఘ కూడా బామ్మలాగా "నీలమ్మా నీలమ్మా.." అని పిలిచి ఆట పట్టించేది.

పదో తరగతిలో ఉండగా బామ్మగారికి టైఫాయిడ్ జ్వరం వచ్చి రెండు నెలల పాటు మంచం పట్టి తిరిగి కోలుకోలేక ఆ జ్వరంలోనే చనిపోయారు. వాళ్ళ ఇంటిల్లిపాదీ ఆ దుఃఖంలో నుంచి తేరుకోడానికి చాన్నాళ్ళే పట్టింది. అప్పుడంతా మేఘ నీలూని కనిపెట్టుకుని జాగ్రత్తగా చూసుకోవడం నీలూ ఆ దిగుల్లోంచి కాస్త త్వరగా బయటపడేలా సాయపడింది.

బామ్మ గారు పోయిన దగ్గర్నుంచీ నీలూకి నీలమ్మా అనే పిలుపు మీద అయిష్టం పోయి ఎవరైనా అలా పిలిస్తే బామ్మ పిలుపే వింటున్నట్టు సంతోషంగా అనిపించేది. అప్పటికీ ఇప్పటికీ ఎప్పుడైనా గారం చేసేప్పుడు, బతిమాలేప్పుడు, సర్ది చెప్పేటప్పుడు మేఘ నీలమ్మా అనే పిలుస్తుంటుంది.

స్కూలు చదువులు అయిపోయేసరికి ఆ నాలుగేళ్ళలో మేఘ, నీలూ ఇద్దరూ ఒకే ప్రాణంలా కలిసిపోయారు. పదో తరగతి పరీక్షల ముందు మేఘ వాళ్ళ నాన్నగారికి మళ్ళీ బదిలీ అయ్యి వేరే ఊరికి వెళ్ళిపోతారని తెలిసింది. అందరు పదో తరగతి పిల్లల్లాగే స్కూలు ముగిసాక ఇన్నేళ్ళూ కలిసి చదువుకున్న నేస్తాల్నీ, స్కూలునీ విడిచిపెట్టి వెళ్ళాలనే బెంగతో పాటు మేఘ ఈ ఊరి నుంచి వెళ్ళిపోతే ఇద్దరూ పూర్తిగా దూరమైపోతారని మరో దిగులు పట్టుకుంది నీలూ, మేఘలకి.

ఈ సారి మేఘ వాళ్ళ నాన్నగారు బదిలీ అయింది చిన్న పల్లెటూరికి కావడం మూలాన అక్కడ ఇంటర్ చదువుకోడానికి కాలేజీ వసతి లేదని మేఘని హాస్టల్లో చేరుద్దామని నిర్ణయించారు. నీలూని కూడా ఉన్న ఊర్లో కన్నా వేరేచోట ఇంకాస్త మంచి కాలేజీలో చేర్చాలని వాళ్ళ నాన్నగారు అనుకున్నారు. మొదటిసారి హాస్టల్ చదువులు కాబట్టి ఇద్దరూ ఒకరికొకరు తోడుగా ఉంటారని మేఘనీ, నీలూనీ ఒకే హాస్టల్లో చేర్పించాలని తల్లిదండ్రులు నిశ్చయించడంతో మరొక రెండేళ్ళ పాటు ఇద్దరూ కలిసి చదువుకునే అవకాశం దొరికింది.

ఆ రెండేళ్ళ తర్వాత పై చదువుల కోసం ఇద్దరూ చెరొక దారిలో నడవాల్సి రావడంతో ఒకే చోట ఉండటానికి వీలు పడలేదు. అయితేనేం, ఎంత దూరంలో ఉన్నా వారి మధ్యన నిత్యం నడిచే ఉత్తరాల దొంతరలు, తరచూ ఫోనుల్లో కబుర్లు, అప్పుడప్పుడూ సెలవుల్లో కలుసుకోవడాలు.. వీటన్నీటి సాయంతో వారి చెలిమి ప్రయాణం అప్రతిహతంగా కొనసాగింది.

ఈ పదిహేనేళ్ళలో వాళ్ళిద్దరి జీవితాల్లో అన్నీ రకాలుగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఎవరి జీవితపు పరుగుపందెంలో వారు తలమునకలైపోయి చిన్నప్పటిలా పక్కపక్కనే ఉంటూ ప్రతీ చిన్న విషయాన్నీ ఒకరితో ఒకరు పంచుకునే అవకాశం లేనంత దూరంలో ఉంటున్నారు. అయినా సరే కాలపరీక్షకి వెలిసిపోకుండా ఇన్నేళ్ళకీ ఇంకా అవే చిక్కటి రంగుల్లో మెరిసిపోతోంది వారిస్నేహం!

●●●

గతం తాలూకు ఆలోచనల్లోంచి బయటపడి మరుసటి రోజు ప్రయాణానికి హడావుడిగా సిద్ధమవడంలో ఆ రోజొక క్షణంలా గడిచిపోయింది మేఘకి. తన విమానాల వివరాలు నీలూకి మెయిల్లో పంపించేసి మళ్ళీ అన్నీ ఒకటికి రెండుసార్లు చెక్ చేసి చూసుకుని ప్రయాణానికి సర్వం సిద్ధం అనుకుని ఆ పూటకి ప్రశాంతంగా నిద్రపోయింది.

తెల్లారి అనుకున్న ప్రకారం టైముకి ఎయిర్పోర్టుకి చేరుకొని మరొకసారి నీలూకి ఫోన్ చేసి చెప్పి ఇండియా వెళ్ళే విమానం ఎక్కింది మేఘ.

చివరి నిమిషంలో ఆదరాబాదరాగా ప్రయాణం ముందుకి జరిపి నేరుగా నీలూ దగ్గరికి వెళుతున్నందుకు ఓ పక్క ఉత్సాహంగానే ఉన్నా మరో పక్క చిన్నపాటి కలవరమేదో ఆమెని స్థిమితంగా ఉండనివ్వడం లేదు.

స్వతహాగా ఏదైనా మనసులోనే దాచుకుని అస్సలు తొణక్కుండా నింపాదిగా మసలే స్వభావం కలిగిన మేఘ ఎప్పుడైనా చాలా అరుదుగా తన మనసులోని భావాలని మరొకరితో పంచుకోవాలనుకుంటే మాత్రం ఆమెకి గుర్తొచ్చే మొదటి వ్యక్తి నీలూనే!ఇప్పుడు కూడా తన ప్రియసఖి సాంగత్యంలో అలసిన మనసుకి సేద తీర్చాలని ఆరాటపడుతోంది.

ఇరవై గంటలకి పైగా సాగాల్సిన ప్రయాణం క్షణక్షణం భారంగా గడుస్తుంటే అటు నిదుర దరిచేరక, ఇటు ఎడతెగని ఆలోచనల అలజడి సద్దుమణగక సతమతమైపోతోంది.

ఆలోచనలు..
ఏవో లోకాల్లో విహరింపచేస్తాయి..
ఆకాశం అంచులదాకా ఎగరేస్తాయి..
ఊహల సందడిలో ఉర్రూతలూగిస్తాయి..
ఆశల పల్లకీలో ఊరేగిస్తాయి..
కోరికల దీపాలు వెలిగిస్తాయి..
గమ్మత్తైన మత్తులో పడేస్తాయి..

నిరాశల నీడల్ని గుర్తుకి తెస్తాయి..
పదునైన వాస్తవంలోకి తీసుకొస్తాయి..
తలపుల తీరంలో నిలబెడతాయి..
ఇష్టాలూ అభిమానాలూ పెంచుతాయి..
బంధాలూ ప్రేమలూ తుంచుతాయి..
నవ్వులు రువ్వుతాయి..
కన్నీళ్లు జారుస్తాయి..

పున్నమి వెలుగులు విరజిమ్ముతాయి..
అదాటున అమావాస్య చీకట్లోకి తోసేస్తాయి..
సప్తవర్ణ కాంతులతో మెరిపిస్తాయి..
రేయిలోని నలుపంతా తెచ్చి పులిమేస్తాయి..

మనసుని లాక్కెళ్ళి గతానికి కట్టేస్తాయి.
జ్ఞాపకాల సంద్రంలో ముంచేస్తాయి..
మానిపోయిన గాయాల్ని రేపుతాయి..
మనసుకి ముసుగేస్తాయి..
ఓదార్పుని పంచుతాయి..
అలసిన మనసుకి సాంత్వన కలిగిస్తాయి..

ఎన్నో రూపాల్లో కనిపిస్తాయి..
ఏ రూపమూ లేదనిపిస్తాయి..
అంతా ఆనందమే అనిపిస్తాయి..
అదంతా భ్రాంతేనని తేల్చేస్తాయి..

మురిపిస్తాయి.. మైమరపిస్తాయి..
కవ్విస్తాయి.. కైపెక్కిస్తాయి..
కదిలిస్తాయి.. కరిగిస్తాయి..
చెరిపేస్తాయి.. మరిపిస్తాయి..
మాటలకి అందవు.. మౌనంలో దాగవు..
పరుగు ఆపవు.. చేతుల్లో చిక్కవు..
పగలూ లేదూ.. రాత్రీ లేదూ..
అలుపూ లేదు.. అదుపూ లేదు..
నిన్న.. ఇవ్వాళ.. రేపు.. అనుక్షణం..

మననొదిలి మాత్రం ఎక్కడికీ పోవు!

# 2

ఆలోచనలు మనసుని ఎంతగా ఉసిగొలిపి గతకాలపు పంజరంలోనే బంధించాలని చూసినా, రెక్కలిచ్చి ఏవో ఊహాలోకాల విహారానికి తీసుకెళ్ళినా, కాలాధిదేవత ఠంచనుగా మళ్ళీ మనని తీసుకొచ్చి వర్తమానపు ఒడిలో దిగబెట్టేస్తుంది.

అమెరికా నుంచి బయలుదేరిన మేఘనందన ముందుగా అనుకున్న సమయానికన్నా ఓ రెండు గంటలు ఆలస్యంగా విమానం దిగింది.

తన ప్రియసఖిని ఎప్పుడెప్పుడు చూస్తానా అన్న ఆరాటానికి, విమానం ఆలస్యం అయిందన్న అసహనం తోడై ఉక్కిరిబిక్కిరైపోతూ క్షణమొక ఘడియలా భారంగా గడుస్తుంటే ఎయిర్పోర్ట్ లో మేఘ రాకకై ఎదురు చూస్తూ కూర్చుంది సునీల.

చివరికి ఎదురుచూపులు ఫలించి స్నేహితురాళ్ళిద్దరూ కలుసుకున్నారు. మూడేళ్ళ తర్వాత ఒకరి కళ్ళ ముందు ఒకరు కనపడగానే ఇద్దరూ ఉద్వేగానికి లోనయ్యారు. చిన్నపిల్లల్లాగా వాళ్ళిద్దరూ కేరింతలు కొడుతూ గంతులు వేస్తుంటే పక్కనే ఉన్న నీలూ డ్రైవరు అశోక్ వాళ్ళ సంబరానికి ఏమాత్రం భంగం కలిగించకుండా నిశబ్దంగా నీలూ చేతిలోంచి లగేజ్ ట్రాలీ అందుకున్నాడు.

నీలూ, మేఘ ఇద్దరూ స్కూలుకి వెళ్ళే పిల్లల్లాగా చుట్టుపక్కల పరిసరాలని మర్చిపోయి ఒకరి చేతులొకరు పట్టుకుని బిగ్గరగా మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ నడుస్తున్నారు. అశోక్ సామాన్లన్నీ కారులో సర్దేసి శరత్ కి ఫోను చేసి చెప్పాక కారు ఎయిర్పోర్ట్ నుంచి ఇంటికి బయలుదేరింది.

“సరే గానీ, నువ్వొక్కదానివే వచ్చావేంటీ ఎయిర్పోర్టుకి. పూజని కూడా వెంట తీసుకొస్తావనుకున్నా” అడిగింది మేఘ.

“నేనూ తీసుకొద్దామనే అనుకున్నాను గానీ ఒకవేళ నీ ఫ్లైట్ డిలే అయ్యి ఎయిర్ పోర్టులో ఎక్కువసేపు ఉండాల్సి వస్తే దాని అల్లరికి ఈ ఎయిర్ పోర్టు వాళ్ళు భరించలేక నన్ను కూడా గెంటేస్తారేమో అని భయపడి ఇంట్లో వాళ్ళ నాన్నకి అప్పజెప్పేసి వచ్చాను. పైగా రేపు స్కూల్ కూడా ఉంది. మనం ఇంటికెళ్ళేసరికి తొమ్మిదవుతుందేమో.. అంతేనా అశోక్?” మేఘకి సమాధానం చెప్తూనే అశోక్ ని అడిగింది నీలూ.

“ట్రాఫిక్ మరీ ఎక్కువ లేకపోతే తొమ్మిదీ తొమ్మిదింపావు కల్లా వెళ్ళగలం. అయినా ఇందాక మీ ఫ్రెండుని చూడగానే నువ్వు వేసిన గంతులతో పోలిస్తే పూజ అల్లరి ఏపాటిదిలే వదినా..” ఆట పట్టించాడు అశోక్.

నీలూ కూడా నవ్వేసి “సారీ అశోక్.. మేఘని చూసిన సంబరంలో నిన్ను పరిచయం చెయ్యడం కూడా మర్చిపోయాను. ఇదిగో చూసావుగా.. తనే నేనెప్పుడూ చెప్తుండే మేఘ. మేఘా.. అశోక్ ది కూడా శరత్ వాళ్ళ ఊరే. ఒకే వీధిలో ఇళ్ళు . చిన్నప్పుడు ఇద్దరూ ఒకే స్కూల్లో చదువుకున్నారు. ఏడేళ్ళ క్రితం ఈ కారు కొన్న దగ్గర్నుంచీ విజయవాడలోనే ఉంటూ దీని బాధ్యతతో పాటు, ఆఫీసు పనుల్లో కూడా శరత్ కి చేదోడుగా ఉంటున్నాడు. సొంత అన్నదమ్ములు కాకపోయినా అంతే ఆప్యాయంగా ఉంటారిద్దరూ..” ఇద్దర్నీ ఒకరికొకరికి పరిచయం చేసింది.

"వదిన అలా అందంగా చెప్తుంది గానీ నిజం చెప్పాలంటే నేను పదోతరగతి ఫెయిలై పనీ పాటా లేకుండా ఊర్లో గాలికి తిరుగుతున్నానని శరతన్న నన్ను విజయవాడ తీసుకొచ్చి డ్రైవింగ్ నేర్పించి ఉద్యోగం ఇచ్చాడు. మామూలు డ్రైవరులా కాకుండా సొంత తమ్ముడిలా చూసుకునే మాట మాత్రం నిజమండీ. మీరు వస్తున్నారని తెలిసిన దగ్గర్నుంచీ మా వదిన సంతోషాన్ని పట్టలేకపోతున్నాం. ఇక్కడ మీరున్నన్ని రోజులూ తనే పని చెప్పినా ఏ మాత్రం ఆలస్యం లేకుండా వెంటనే జరిగిపోవాలని శరతన్నకి వార్నింగ్ ఇచ్చేసింది. మీరు మళ్ళీ ఊరెళ్ళేదాకా నేను ఆఫీసు వైపు వెళ్ళకుండా పూర్తిగా మీతోనే ఉండి మీకు అవసరమైనవన్నీ చూడాలని శరతన్న నన్ను పురమాయించాడు. ఇవాళ ఉదయం నుంచీ ఎయిర్పోర్టులో సరిగ్గా టైముకి ఉండాలని నాకు డజను సార్లు ఫోన్లు చేసి గుర్తు చేసింది. ఇప్పటిదాకా మా వదిన ఎవర్నీ ఇంత స్పెషల్ గా చూడలేదండీ. మిమ్మల్ని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది" మేఘుతో చెప్పాడు అశోక్.

"మా నీలమ్మకి నేనంటే చిన్నప్పటి నుంచీ ఇంతే ప్రేమండీ. నా గురించి ఇలాగే అందరి ప్రాణాలు తోడేస్తూ ఉంటుంది. మీరేం భయపడకండి. నేనుండేది నాలుగు రోజులేలే.." అభయమిచ్చింది మేఘు.

"భలేవారే.. వదిన సంబరం చూసాక మీరసలు మా ఊర్లోనే ఉండిపోతే బాగుండనిపిస్తోంది" అన్నాడు అశోక్.

"అదేమన్నా నాలాగా ఉట్టి డిగ్రీ చదివి వంట చేసుకుంటూ ఇంట్లో కూర్చునే రకం అనుకున్నావా ఏంటీ.. అమెరికాలో పేద్ద కంప్యూటర్ ఇంజనీరు! దాన్ని విజయవాడలో ఉండి ఏం చేయమంటావ్?" ఎదురాడింది నీలూ.

"అబ్బా నీలూ.. ఇంక చాల్లేవే నీ బడాయి మరీనూ! ఇదిగో ఇలా ఊరికే నా గురించి గొప్పలు చెప్పి అందరి బుర్రలు తినేసేట్టయితే నేనొప్పుకోనంతే.." మారాం చేస్తున్నట్టు అంది మేఘు.

అందరూ గట్టిగా నవ్వేశారు. ఇద్దరు స్నేహితురాళ్ళకీ కబుర్లలో పడి క్షణాల్లో ఎయిర్పోర్ట్ నుంచి ఇంటిదాకా వచ్చేసినట్టనిపించింది. నీలూ సామానంతా కార్లోంచి దించి రెండో అంతస్థులో ఉన్న నీలూ వాళ్ళ ఫ్లాట్లోకి చేర్చాడు అశోక్.

"తొమ్మిదిన్నరయింది కదా.. నువ్వు కూడా మాతో పాటు భోంచేసి వెళ్ళు" అశోక్ ని అడిగింది నీలూ.

"వద్దులే వదినా.. ఇంటి దగ్గర వసంత ఎదురు చూస్తుంటుంది. శశిగాడు నిద్రపోకుండా కూర్చుంటాడు నేనెళ్ళేదాకా. రేపు ఉదయాన్నే ఎన్నింటికి రమ్మంటావో చెప్పు" అన్నాడతను.

"సరేలే అయితే.. మేఘు చాలా దూరం ప్రయాణం చేసి అలసిపోయి వచ్చింది కదా.. రేపు ఉదయాన్నే బయటికెళ్ళే పని ఉండదులే. నేను ఫోన్ చేసి చెప్తా నీకు" అని నీలూ చెప్పాక అశోక్ వెళ్ళిపోయాడు.

మేఘు ఇంట్లోకి రాగానే సాదరంగా ఆహ్వానించాడు శరత్. పలరింపులు అయ్యాక మేఘు ప్రయాణం ఎలా జరిగిందని అడిగి కనుక్కున్నాడు.

"పూజ ఎక్కడ?" అడిగింది మేఘు.

"ఇంతసేపూ మేలుకునే ఉంది. కథ చెప్పమని గొడవ చేస్తే ఏదో నాకొచ్చినట్టు చెప్పడం మొదలెట్టాను. బోర్ కొట్టిందేమో మరి.. వెంటనే నిద్రపోయింది" నవ్వాడు శరత్.

"ఎక్కడ నిద్రపోతోంది? నేనొకసారి చూస్తాను" అంది మేఘు.

మేఘుని పూజ పడుకున్న బెడ్ రూంలోకి తీసుకెళ్ళాడు శరత్.

అప్పుడే కొత్తగా పూలమాల కట్టడం నేర్చుకున్న వారెవరో అల్లిన వంకరటింకర మల్లెచెండులా మంచం మీద మెలికలు తిరిగి పడుకుని ఉన్న పూజ బుగ్గ మెత్తగా గిల్లి "అప్పుడే ఎంత పెద్దదైపోయిందీ.. పోయినసారి నేను ఇండియా వచ్చినప్పటికి ఇంకా బుజ్జిపిల్ల. ఫోటోల్లో కన్నా బయట ఇంకా బాగా తేడా తెలుస్తోంది. ఇలా మంచంలో అడ్డదిడ్డంగా తిరిగెయ్యడం మాత్రం ఖచ్చితంగా మా నీలమ్మ పోలికే కదూ!" అనగానే మేఘ, శరత్ ఇద్దరూ గట్టిగా నవ్వేశారు.

అశోక్ ని పంపించేసి అప్పుడే లోపలికొచ్చిన నీలూ ఎందుకలా నవ్వుతున్నారని అడిగి మేఘ చెప్పింది విన్నాక కాస్త ఉడుక్కుని తనూ వాళ్ళతో పాటు నవ్వేసింది.

"టైము పదవుతోంది కదా మేఘూ.. నువ్వు స్నానం చేసొస్తే అన్నాలు తినేసి తొందరగా పడుకోవచ్చు. ఇవాళ్టికి బాగా నిద్రపోయావంటే ప్రయాణ బడలిక తీరిపోతుంది. రేపటి నుంచీ ఎంచక్కా మనం బోల్డు తిరిగెయ్యొచ్చు" అని మేఘని తీసుకెళ్ళి తనుండబోయే గెస్ట్ బెడ్ రూమ్ చూపించింది నీలూ.

తర్వాత ముగ్గురూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ డిన్నర్ చేసారు. భోజనాలయ్యాక స్నేహితురాళ్ళిద్దరినీ పూర్తిగా వాళ్ళదైన లోకంలో వదిలి 'గుడ్ నైట్' చెప్పేసి పడుకోడానికి వెళ్ళిపోయాడు శరత్.

"ఇంకా అంతా కలలా ఉందే మేఘూ.. నువ్వూ, నేనూ మా ఇంట్లో ఇలా ఈ సోఫాలో పక్కపక్కనే కూర్చోడం నిజ్జంగా నిజమేనా? రెండ్రోజుల క్రితం నువ్వొస్తావని చెప్పడం, నిజంగా రావడం.. ఏవిటో.. నాకసలు బుర్ర పని చెయ్యడం లేదంటే నమ్ము. ఎన్నాళ్ళయిందే మనిద్దరం ఇంత తీరిగ్గా, స్థిమితంగా కలిసి కూర్చుని.." అంటుంటే నీలూ కళ్ళు కూడా అవునన్నట్టు కన్నీళ్ళతో మాట కలిపాయి.

కళ్ళల్లో ఊరుతున్న కన్నీటి సుడిని నొక్కిపెట్టేసి నీలూ ఒళ్ళో పడుకుని నీలూ బుగ్గలపై జారుతున్న కన్నీటిని తుడుస్తూ "ఊ.. నాక్కూడా కలలానే ఉందింకా. ఎన్నేళ్ళయింది అచ్చంగా మనకంటూ ఇలా కాస్త సమయం చిక్కి! ఎలాగైతేనేం చివరికి అన్నీ సరిగ్గా కుదిరి మనకీ నాలుగు రోజులు దొరికాయి కదా నీలూ.. మనం ఒక్క క్షణం కూడా వృథా చెయ్యకుండా హాయిగా జాలీగా గడిపెయ్యాలి తప్ప ఇలా కన్నీళ్ళు - కర్చీఫులు ప్రోగ్రాం పెట్టకూడదు మరి. సరేనా.." నవ్వించింది మేఘ.

కాసేపటికి నీలూ మాటలకి ఊ కొడుతూనే నిద్రలోకి జారిపోయింది మేఘ. తనని సోఫాలోంచి లేపి బెడ్ రూంలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టి తను కూడా వెళ్ళి పడుకుంది నీలూ.

తెల్లారి ఉదయం మేఘ నిద్ర లేచి తన గదిలోంచి బయటకి వచ్చేసరికి నీలూ ఒక్కతే హాల్లో కూర్చుని టీవీ చూస్తోంది. ఇల్లంతా నిశబ్దంగా ఉంది.

"ఏంటీ ఇంట్లో ఎవరూ ఉన్నట్టు లేరు?" అడిగింది మేఘ.

"రోజూ ఉదయం తొమ్మిది కల్లా లంచ్ బాక్సులతో సహా శరత్ ఆఫీసుకి, పూజ స్కూలుకి వెళ్ళిపోతారు. శరత్ వీలుని బట్టి ఒకోరోజు మధ్యాహ్నం భోజనానికి ఇంటికొస్తే, ఒకోరోజు లంచ్ బాక్స్ తీసుకెళతాడు. సాయంకాలం నాలుగింటికల్లా పూజ ఇంటికొస్తుంది. అప్పటిదాకా ఈ ఇల్లంతటికీ నేనొక్కదాన్నే మహారాణిని, దాసీదాన్ని కూడా.." నవ్వింది నీలూ.

మేఘ కూడా నవ్వేసి "నేను మరీ ఒళ్ళు తెలీకుండా నిద్రపోయినట్టున్నా. టైము పది దాటింది కదూ.. సారీ నీలూ.." అంది.

"నీ మొహం.. సారీ ఎందుకే.. ఎక్కువసేపు నిద్రపోయి మంచి పనే చేసావులే. ముందు నీ అలసటంతా పోతే అప్పుడు కులాసాగా ఎన్ని కబుర్లైనా చెప్పుకోవచ్చు. పద పద.. నీకు వేడి వేడిగా పెసరట్టు వేసిస్తా."

"ఓ.. నాకోసమే వెయిటింగ్ అన్నమాట. నువ్వింకా తినలేదా?"

"ఇంతసేపా, నేనెప్పుడో తినేశా! మన లంచ్ కూడా రెడీ అయిపోయింది. అన్నీ నీకిష్టమైనవే చేసాను. తోటకూర వేపుడు, టమాటా చిక్కుడుకాయ కూర, కోడిగుడ్డు పులుసు, గోంగూర పచ్చడి..."

"అమ్మో ఎంత పెద్ద మెనూనో.. ఇంతలోనే ఇవన్నీ చేసేశావా?"

"మరి లేకపోతే అమెరికా స్టైల్లో నిన్ననే చేసి ఫ్రిజ్లో పెట్టినవి అనుకున్నావా? అన్నీ ఇప్పుడే తాజాగా చేశాను. నువ్వు నిద్ర లేచే లోపే వంటపని ముగించేస్తే తర్వాత రోజంతా నీతో కలిసి తీరిగ్గా కూర్చోవచ్చని ఉదయాన్నే అన్నీ పనులు పూర్తి చేసేసాను. అన్నం ఒక్కటీ పెట్టుకుంటే చాలు.." అంటూ పెసరట్టు ప్లేటు తెచ్చి మేఘ చేతికి అందించింది నీలూ.

"అబ్బా.. ఎంత కష్టపడుతున్నావే నీలమ్మా నాకోసం.. చిన్నప్పుడు నేనిష్టంగా తినేవన్నీ నీకింకా ఎంత బాగా గుర్తున్నాయో! నీకో విషయం తెలుసా.. అప్పుడంటే ఇష్టంగా తినేదాన్ని కానీ ఇప్పుడసలు తీరిగ్గా కూర్చుని అట్లు వేసుకునే టైము, తినాలన్న కోరిక రెండూ లేవు."

"రోజూ ఏం తింటున్నావ్ మరి.. అంతా అమెరికా తిండేనా?"

"ఉదయాన్నే సెరెల్స్, ఓట్ మీల్, హోల్ గ్రెయిన్ బ్రెడ్డో హడావుడిగా మింగేసి ఇంట్లోంచి బయటపడిపోడమే. ఇంక లంచ్లో ఏ శాండ్విచ్చో తినడం లేకపోతే ఎక్కువసార్లు కొలీగ్స్ తో కలిసి ఇటాలియన్, థాయ్, చైనీస్ ఇలా ఏదోకటి వెళ్ళిన ప్లేసుని బట్టి తినెయ్యడం. రాత్రికి డిన్నర్ లైట్ ఫుడ్ తినాలంటూ బోయిల్డ్ వెజిటబుల్స్, సాలడ్స్ తో సరిపెట్టెయ్యడం.."

"అయితే తిండి గురించి ఎక్కువ టైం వేస్ట్ చెయ్యరన్నమాట!"

"చాలాసార్లు అది వండుదాం, ఇది తిందాం అని ప్రత్యేక ఆసక్తి కూడా ఉండదులే. హ్మ్.. అయినా ఒక్క తిండి అనేముందిలే.. మనం పెద్దవాళ్ళమయ్యేకొద్దీ చిన్నప్పటిలా చిన్న చిన్న ఆశలు, ఆనందాలు, సంబరాలకి కాలం చెల్లిపోయి ఎంతసేపూ బుర్రంతా గజిబిజిగా నిండిపోయే తీరిక లేని క్షణాలే తప్ప మనసు నిండిపోయే అందమైన క్షణాలే అరుదైపోతున్నాయనిపిస్తోంది" నిట్టూర్చింది మేఘ.

"అయ్యబాబోయ్.. నిన్ను కదిలిస్తే చాలు పెద్ద పెద్ద మాటలు చెప్తావు. నీకీ వయసుకే ఇంత వేదాంతం ఎలా ఎలా అబ్బిందే తల్లీ! అయితే అంతంత కష్టపడి గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తూ కనీసం నోటికి రుచించే తిండైనా తినడం లేదన్నమాట. ఏంటోనమ్మా మీ అమెరికా జనాలు నాకస్సలు అర్థం కారు. సర్లే మీ ఇంట్లో ఎలా తిన్నా మా ఊర్లో ఉన్న నాల్రోజులు మాత్రం నేను చేసిపెట్టినవన్నీ తినాల్సిందే" తీర్మానించేసింది నీలూ.

"మాకంటే ఎప్పుడూ ఉరుకులు పరుగులు కాబట్టి సులువుగా అయిపోయేదేదో మింగేస్తుంటాం కానీ నువ్వింత బ్రహ్మాండంగా వండి పెడతానంటే తిననని నేనెందుకంటానూ.. బాగా తినేసి నా బరువు పెంచేద్దాంలే" నవ్వింది మేఘ.

"తినేదేదో హాయిగా తినక మళ్ళీ ఈ బరువు భయాలొకటి! ఏమి విజ్ఞానమో, ఏమి నాగరికతో, కడుపు నిండా తినడానికి కూడా వంద ఆలోచనలు!" నిట్టూర్చింది నీలూ.

"అది సరే గానీ నువ్వు వేసిచ్చిన పెసరట్టు తింటుంటే చిన్నప్పుడు మనం సాయంకాలం స్కూలు నుంచి వచ్చాక ఉదయం మిగిలిన కొద్ది పిండితో నానమ్మ వేసిపెట్టే రెండో మూడో పెసరట్లని ఎంత ఇష్టంగా పంచుకు తినేవాళ్ళమో గుర్తొస్తోంది. ఇప్పుడు నాన్నమ్మ ఉండుంటే నా మనవరాలు నా పేరు పెట్టుకున్నందుకు ఇంత రుచిగా వండి పెడుతోందని నిన్ను చూసుకుని మురిసిపోయేది" స్కూలు రోజుల్ని గుర్తు చేసింది మేఘ.

"మురిసిపోవడమేమో కానీ ముందు ఆశ్చర్యపోయేది. అప్పట్లో ఏదన్నా చిన్న చిన్న పనుల్లో సహాయం చెయ్యమంటే నేను మొండికేసేదాన్ని, నువ్వేమో బుద్ధిగా చేసిపెట్టేదానివి. "మేఘమ్మ తల్లీ.. పెద్దయ్యాక రోజూ పదిమందికి నీ చల్లని చేత్తో వండి పెడతావే వరాల తల్లీ.." అంటూ నిన్ను తెగ మెచ్చుకునేది. ఇప్పుడేమో ఇద్దరం వారు వీరు, వీరు వారులా అయిపోయాముగా వంట విషయంలో!" నవ్వింది నీలూ.

"అదే కదా.. నాకసలు తినడానికే బద్ధకమైతే నేనెప్పుడులే అంత వంటగత్తెని అయేది! ఈ జన్మకి కష్టం!" పెదవి విరిచింది మేఘ.

"ఆ మాట మాత్రం నిజం తల్లీ! మనం హాస్టల్లో ఉన్నప్పుడు ఎప్పుడైనా నీకిష్టమైన కూరలు చేసినప్పుడు తప్ప ప్రతిరోజూ సరిగ్గా అన్నం తినేదానివే కాదు. నేనేమో నీ చేత తిండి తినిపించడానికి రోజూ నీ వెంటపడి బతిమాలేదాన్ని. నువ్వు ఉదయాన్నే టిఫిన్ కి రాకుండా పడుకుంటే నేను రూంకి టిఫిన్ తీసుకొచ్చి నిన్ను బలవంతంగా లేపి తినిపించేదాన్ని. అప్పుడు నీ చేత తిండి తినిపించడానికీ, ఇప్పుడు పూజకి అన్నం పెట్టడానికీ పెద్ద తేడా ఏం లేదు. అంత హింసించేదానివి!"

"హిహిహీ.. అయినా నువ్వు మాత్రం అంత కష్టపడటం ఎందుకంట? ఒక రెండ్రోజులు తినకపోయినా వదిలేస్తే నేనే దారిలోకి వచ్చేదాన్నేమో! చూశావా, నువ్వే గారం చేసి ఇలా మొండిదానిలా తయారు చేశావ్ నన్ను" కిలకిలా నవ్వింది మేఘ.

"ఏంటోనే ఆ రోజులన్నీ భలే ఉండేవి. అవన్నీ దాటిపోయి ఎంత దూరం వచ్చేశామో! పూజ కళ్ళ ముందు తిరుగుతుంటే ఒకోసారి ఇంత కాలం ఎప్పుడు గడిచిందీ, ఇంతలోనే నాకో కూతురు కూడా పుట్టుకొచ్చి అది బడికెళ్ళే వయసుకి కూడా వచ్చేసిందని ఎంత విచిత్రంగా అనిపిస్తుంటుందో! అసలు నువ్వొస్తున్నానని చెప్పిన దగ్గర్నుంచీ అప్పటి రోజులన్నీ గిరగిరా కళ్ళ ముందే తిరుగుతున్నాయి మేఘా.. ఎంత తియ్యటి రోజులో కదా అవన్నీ" పరవశంగా చెప్పింది నీలూ.

"ఊ ఊ.. ఇలా నీతో కలిసి ఆ తియ్యటి గతాన్ని తవ్వుకుంటూ ఆనాటి జ్ఞాపకాల్లో విహరించాలనే కదా నేను రెక్కలు కట్టుకు ఎగిరొచ్చాను" నవ్వింది మేఘ.

మేఘ టిఫిను తినడం అయిపోయాక నీలూని పక్కన కూర్చోబెట్టుకుని తన సూటుకేసు తెరిచి అమెరికా నుంచి నీలూ, శరత్ ల కోసం తెచ్చిన కానుకలు, పూజ కోసం తెచ్చిన చాక్లెట్స్, బొమ్మలూ అన్నీ బయటపెట్టింది.

"నువ్వు బొమ్మలు, చాక్లెట్స్ చాలా తెచ్చావు. వీటిల్లో కొన్ని అశోక్ కొడుకు శశికి ఇద్దాం మేఘా.. వాడికి రెండున్నరేళ్ళే గానీ మహా గడుగ్గాయి" అంది నీలూ.

"అలాగే ఇవ్వు.. నీ ఇష్టం.." అని చెప్పి వాటన్నీటినీ పొందిగ్గా సర్దుతూ కూర్చుంది మేఘ.

"మేఘా.. నీకు గుర్తుందా.. మనం మొదటిసారి హాస్టలుకి వెళ్ళేటప్పుడు ఇలాగే పెట్టెలు ముందేసుకుని బట్టల దగ్గర్నుంచీ బ్రష్లు, సబ్బుల దాకా ఎలా సర్దుకున్నామో?" గుర్తు చేసింది నీలూ.

"ఓ.. గుర్తు లేకేం.. నువ్వేమో మీ నాన్నమ్మ పాత ట్రంకు పెట్టె, నేనేమో మా నాన్న కొనిచ్చిన సరికొత్త ట్రంకుపెట్టె ముందేసుకుని మహదానందంగా సర్దుకుంటుంటే మనల్ని చూసి అందరూ తెగ ఆశ్చర్యపోయారుగా!" చెప్పింది మేఘ.

"ఆశ్చర్యపోరూ మరి! మొదటిసారి ఇల్లు విడిచి హాస్టలుకి వెళుతున్నామన్న బెంగ ఇసుమంతైనా లేకుండా అంత హుషారుగా పెట్టెలు సర్దుకుంటుంటే!"

"స్కూల్లోలాగే మళ్ళీ ఇద్దరం కలిసి ఒకే కాలేజీలో చదువుకోవచ్చన్న ఆనందం కొద్దీ పెట్టెలు సర్దుకునేదాకా బానే సంబరపడ్డాం కానీ తీరా మనిద్దర్నీ తీసుకొచ్చి విజయవాడ హాస్టల్లో చేర్చి అమ్మా, నాన్నా వాళ్ళు వెళ్ళిపోయేప్పుడు మాత్రం ఇద్దరం బేర్ మని ఏడ్చేశాం."

"ఊ.. అప్పుడు ఒకరికొకరు తోడుగా ఉండి బాగా చదువుకోండి, ప్రతీవారం ఉత్తరాలు రాయండని చెప్పి ఒక పెద్ద ఇన్లాండ్ లెటర్స్ కట్ట చేతికిచ్చి, రెండు నెలలకొకసారి వచ్చి మనల్ని చూస్తామని ధైర్యం చెప్పారు."

"మొదటిసారి ఇల్లు వదిలి బయట ఉండటం ఆ వయసుకి చాలా కష్టం అనిపిస్తుంది కదా నీలూ.." భారంగా అంది మేఘ.

"నిజమే.. ఇప్పుడంటే అన్నీటికీ అలవాటు పడిపోయాం గానీ అప్పుడెంత అమాయకంగా ఉండేవాళ్ళమో. హాస్టల్లో నీకూ, నాకూ, రేవతికి కలిపి ఒక రూమ్ ఇచ్చినప్పుడు అదేమో విజయవాడలోనే పుట్టి పెరిగి, వాళ్ళిల్లు విజయవాడలోనే ఉండి కూడా హాస్టల్లో చేరిందని చెప్తే ఎంత ఆశ్చర్యపోయామో!" బదులిచ్చింది నీలూ.

"హే.. రేవతిని భలే గుర్తు చేశావ్ నీలూ! అప్పుడు మనం పిచ్చి మొహాలం కాబట్టి అర్థం చేసుకోలేకపోయాం కానీ ఉన్న ఊర్లోనే హాస్టల్లో చేర్చారంటే పాపం వాళ్ళింట్లో వాళ్ళు అప్పటికే దానితో ఎంత హింసపడ్డారో!" గట్టిగా నవ్వింది మేఘ.

"అన్నట్టు నీకీ విషయం చెప్పడం మర్చిపోయా! నాలుగు నెలల క్రితం ఒకరోజు బీసెంట్ రోడ్లో షాపింగుకి వెళ్ళినప్పుడు రేవతి కనిపించింది.."

నీలూని మధ్యలోనే ఆపి "నిజమా! రేవతి విజయవాడలోనే ఉందా అయితే?" ఆసక్తిగా అడిగింది మేఘ.

"నన్ను పూర్తిగా చెప్పనివ్వు మరి! మనిషి అప్పటి కన్నా మోడరన్ గా, ఇంకాస్త పుష్టిగా తయారైంది. అసలు నేను గుర్తే పట్టలేదు. అదే నన్ను గుర్తుపట్టి నా దగ్గరకొచ్చి పలకరించింది. పెళ్ళైపోయిందట. చెన్నైలో ఉంటున్నారట. ఏదో ఫంక్షన్ కోసమని విజయవాడ వచ్చిందట. ఎవరో పెద్దవాళ్ళతో కలిసి షాపింగ్ కి వచ్చింది. హడావుడిగా ఒక నిమిషం మాట్లాడేసి తన ఫోన్ నంబర్ ఇచ్చి తప్పకుండా కాల్ చెయ్యమని చెప్పి వెళ్ళిపోయింది. కానీ రేవతిలో అప్పటికీ ఇప్పటికీ పెద్ద మార్పేం లేదనిపించింది. మా ఆయన కూడా మా డాడీ లాగానే బ్యాంక్ మేనేజరే కాదు పరమ స్ట్రిక్ట్ కూడా అని చెప్పి పకపకా నవ్వింది" వివరంగా చెప్పింది నీలూ.

"భలే! వాళ్ళాయన స్ట్రిక్ట్ అయితే ఏమిటటా, దీన్ని ఆపడం వాళ్ళ నాన్న తరమే కాలేదు. ఇంక అతనేం చెయ్యగలడులే, పూర్ ఫెలో! ఇంతకీ నువ్వు మళ్ళీ రేవతికి ఫోన్ చేశావా?"

"ఒకసారి ట్రై చేస్తే ఆన్సర్ చెయ్యలేదు. తనే వెనక్కి చేస్తుందిలే అనుకున్నా కానీ చెయ్యలేదు. నేను కూడా మళ్ళీ ప్రయత్నించలేదు" అంది నీలూ.

"నేను వెళ్ళేలోపు మనిద్దరం కలిసి సరదాగా ఒకసారి రేవతికి ఫోన్ చేసి అది చెప్పే చిత్రవిచిత్రమైన కథలు విందాం నీలూ.." సరదాపడింది మేఘ.

"అలాగేలే.. అగ్నికి ఆజ్యం తోడైనట్టు ఈ రేవతికి తోడు ఆ రజని ఒకర్తి దొరికింది మన ప్రాణానికి. రజనిది మన పక్క రూమ్ అయినా ఎప్పుడూ మన రూములోనే తిష్ట వేసేది. అన్నయ్యేమో రజనితో స్నేహంగా ఉండమని చెప్పాడు కాబట్టి మనం ఏమీ అనలేని పరిస్థితి! ఇద్దరికిద్దరూ మన బుర్ర తినేసేవారు బాబోయ్!" అంది నీలూ.

"రజని ఇప్పుడు ఎక్కడుంది? నీతో కాంటాక్ట్ లోనే ఉందా?" అని అడుగుతుంటే మేఘ మొహంలో నవ్వు మాయమైంది.

"రెండేళ్ళ క్రితం పెళ్ళి చేసుకుని సింగపూర్ వెళ్ళిపోయినప్పటినించీ దాని హింస పూర్తిగా తప్పిపోయింది నాకు. ఇండియాలో ఉన్నంతవరకూ ఒక గోల కాదు దానితో. ఇక్కడున్నప్పుడు నీ గురించి ఎంత అడిగినా నేనేమీ చెప్పేదాన్ని కాదు. నీకసలు రజని ప్రస్తావన తెస్తే ఇష్టం ఉండదని తెలుసు కానీ ఈ రోజేదో పాత రోజులన్నీ తలచుకుంటూ గబుక్కున దాన్ని కూడా గుర్తు చేసాను. సారీ మేఘా.." నొచ్చుకుంది నీలూ.

"పర్లేదులే నీలూ.. నువ్వు చెప్పకపోయినా నేనైనా అడిగేదాన్ని. ఒకసారి గతం గుర్తు చేసుకుందాం అనుకున్నాక అన్నీ నచ్చేవే కాదుగా, కొన్ని గిచ్చేవి కూడా గుర్తొస్తాయి. తప్పదు మరి!" గమ్మత్తుగా కళ్ళు చికిలిస్తూ నవ్వింది మేఘ.

"మాటల్లో పడి టైము చూసుకోలేదు. రెండవుతోంది. పద పద మనం అన్నం తింటూ మాట్లాడుకుందాం" మేఘని అక్కడి నుంచి లేపింది నీలూ.

అన్నం తింటూ ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చిన నీలూ "మేఘా.. అన్నం తినగానే నీకొకటి చూపిస్తాను. నువ్వు భలే థ్రిల్లయిపోతావు చూడు" అని ఊరించింది.

"అబ్బా.. అంత ఊదరగొట్టేస్తున్నావ్, ఏం అద్భుతం చూపిస్తావే తల్లీ.. కొంపదీసి మీ బాల్కనీలోంచి గలగలా పారే కృష్ణవేణి కనిపిస్తుందా ఏవిటీ?" నవ్వింది మేఘ.

భోజనాలు పూర్తయ్యీ అవగానే పదపదమని తొందరపెడుతూ మేఘ గదిలో వెనకవైపున్న తలుపు తీసి రెండో అంతస్థులో ఉన్న బాల్కనీలో నుంచి కిందకి చూపించింది నీలూ. అక్కడ కనిపించిన దృశ్యం చూసి మేఘ నిజంగానే ఆశ్చర్యపోయింది.

అక్కడ విశాలమైన స్థలంలో ఒక పక్కగా రెండు పొడవాటి రేకుల షెడ్లు ఉన్నాయి. అవి మినహాయిస్తే మిగిలిన చోటంతా నాపరాళ్ళు పరిచారు. వాటి మీద వరసగా లైనుల్లో కుర్చీలు వేసుకుని, కుర్చీ చేతుల మీదుగా పెద్ద అట్టలు పెట్టుకుని, వాటి మీద పుస్తకాలు ముందేసుకుని చదువుకుంటూ పదహారు, పదిహేడేళ్ళ వయసున్న అమ్మాయిలు కనిపిస్తున్నారు.

నిశ్శబ్దంగా చదువుకుంటున్న ఆ ఆడపిల్లల మధ్య దాదాపు పాతికేళ్ళ వయసున్న ఆడవాళ్ళు ముగ్గురు పహారా కాస్తున్నట్టు అటూ ఇటూ తిరుగుతున్నారు. అదొక ఇంటర్మీడియట్ కాలేజీకి సంబంధించిన హాస్టల్ అని మేఘకి అర్థం కావడానికి ఎంతోసేపు పట్టలేదు.

"అప్పుడప్పుడూ కాసేపు ఇక్కడికొచ్చి ఈ పిల్లలని గమనిస్తూ ఉంటాను. వీళ్ళ ని చూసినప్పుడల్లా మన జ్ఞాపకాలన్నీ మళ్ళీ మళ్ళీ గుర్తొస్తూ ఉంటాయి" అని నీలూ చెప్తోంటే ఇంకా సంభ్రమంలోంచి తేరుకోని మేఘ అటువైపే చూస్తూ ఉండిపోయింది.

"అదిగో అక్కడ ఆ మూలన చూడు. రేకుల షెడ్డు ముందు వరసగా ఎర్రటి మట్టికుండల్లో మంచినీళ్ళు పెట్టారు. ఆ ముగ్గురు అమ్మాయిఅమ్మాయిలూ మంచినీళ్ళు తాగడానికి వచ్చి కబుర్లు చెప్పుకుంటున్నారు" ఇంకో వైపుకి చూపించింది నీలూ.

"నిజంగా చాలా వింతగా ఉంది నీలూ! మన ఇంటర్ చదువులు అయిపోయి పదేళ్ళ పైనే అయింది. కానీ ఇప్పటికీ ఇంటర్ కాలేజీలు, హాస్టళ్ళు ఏ మార్పూ లేనట్టు అచ్చం అప్పటిలానే ఉన్నాయేంటి? కనీసం కుండల్లో మంచినీళ్ళు పెట్టడం కూడా మారలేదా?" ఆశ్చర్యపోయింది మేఘ.

"ఆ అమ్మాయిని చూడు. చన్నీళ్ళు మొహం మీద చల్లుకుంటోంది. నిద్రొస్తుందేమో పాపం!" అంది నీలూ.

"మనం కూడా రాత్రిపూట పదకొండింటి దాకా స్టడీ అవర్స్ ఉంటే మధ్యలోనే తెగ నిద్రొచ్చేసి ఆ మత్తు వదిలించుకోడానికి కుండల్లోని చల్లటి నీళ్ళతో కళ్ళు తడుపుకునేవాళ్ళం. ఏదో పెద్ద ఐఏఎస్ పరీక్షలకి ప్రిపేర్ అయ్యేవాళ్ళలాగా తెగ కష్టపడిపోయేవాళ్ళంలే.." గట్టిగా నవ్వింది మేఘ.

"అదేంటే అలా అంటావు.. అప్పటికీ ఇప్పటికీ ఆంధ్రదేశంలో ఐఏఎస్ కన్నా అతి ముఖ్యమైన పరీక్ష ఎంసెట్ ఎంట్రన్సే! నిద్రని తప్పించుకోడానికి పుస్తకం చేత పట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ చదివేవాళ్ళం. రేవతి మాత్రం నడుస్తూ కూడా నిద్రపోయేది. అదింకా నయంలే, రజని అయితే నిద్ర రాకుండా ఉండాలంటే కళ్ళ కింద జండూ బామ్ రాసుకోవాలని చెప్పేది. రాకాసి మొహంది.. నిజంగానే అలా చేసేది" పడీ పడీ నవ్వింది నీలూ.

"ఇంతకీ ఇది కాలేజా, హాస్టలా నీలూ?" అడిగింది మేఘ.

"ఇంటర్ పిల్లల కాలేజీకీ, హాస్టలుకీ ఏం తేడా ఏడుస్తుందిలే! ఈ షెడ్లు క్లాసు రూమ్స్, ఆరుబయటేమో స్టడీ అవర్స్. ఈ స్థలాన్ని ఆనుకుని ఆ మూడంతస్థుల అపార్ట్మెంట్ ఉంది చూడు. అది హాస్టలు. అదిగో అక్కడ అటూ ఇటూ తిరగడానికి వీలుగా లోపల నుంచే చిన్న దారి కూడా ఉంది. చుట్టూ ఎత్తైన ప్రహరీ, గేటు దగ్గర వాచ్ మెన్ ని చూసావు కదా! ఇంకంతే, రెండేళ్ళ పాటు వీళ్ళకి బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా ఈ జైల్లోనే కూర్చుని చదివీ చదివీ భావి భారత డాక్టర్లూ, ఇంజనీర్లూ అయిపోవలసిందే!" అన్నీ చూపిస్తూ వివరంగా చెప్పింది నీలూ.

"హ్మ్.. వీళ్ళ పరిస్థితి చూస్తే అప్పటి మన హాస్టలే నయం అనిపిస్తుందిగా! ఆ అపార్ట్మెంట్ బాల్కనీలకి మొత్తం ఇనుప కచ్చడాలు పెట్టి ఆ సందుల్లోంచి కూడా బయటికి చూడకూడదనేమో ప్లాస్టిక్ రేకులతో మూసేసారు. వాళ్ళ గదుల్లోకి సరైన గాలి, వెలుతురైనా వస్తాయంటావా?" జాలిపడింది మేఘ.

"ఇంటర్మీడియెట్ కాలేజీలంటే అంతే మరి! జైళ్ళలానే ఉంటాయి. పాపం అనిపిస్తుంటుంది వాళ్ళని చూస్తే!" నిట్టూర్చింది నీలూ.

"అప్పటి మన క్యాంపస్లు, హాస్టల్సు కూడా ఏమీ మారకుండా ఇప్పటికీ అలాగే ఉన్నాయంటావా నీలూ?" ఏటో ఆలోచిస్తూ అడిగింది మేఘ.

"ఓ.. బ్రహ్మాండంగా ఉన్నాయి. తాడిగడపలోని మన క్యాంపస్ ఇప్పటికీ అమ్మాయిల మెయిన్ క్యాంపస్ లానే ఉంటోంది. ఏడాదేడాదికీ స్టూడెంట్స్ కూడా వేలల్లో పెరుగుతూ పోతున్నారు కాబట్టి ఇంకా బోల్డన్ని కొత్త క్యాంపస్లు తెరుస్తూనే ఉన్నారు. పైగా అప్పటికీ ఇప్పటికీ ఆంధ్రదేశంలో అత్యధికంగా డాక్టర్లనీ, ఇంజనీర్లనీ తయారు చేసిన ఘనత వారిదేనని ఇప్పటికీ మన కాలేజ్ పేరు పేపర్లలో, టీవీల్లో మారుమోగిపోతూనే ఉంటుంది" చెప్పింది నీలూ.

"నువ్వెప్పుడైనా మళ్ళీ మన క్యాంపస్ కి వెళ్ళి చూశావా నీలూ?" కుతూహలంగా అడిగింది మేఘ.

"అక్కడికి ఎప్పుడూ వెళ్ళలేదు కానీ మన కాలేజీ వాళ్ళదే పడమటలంకలో ఒక క్యాంపస్ ఉంది. మా ఆడపడుచు వాళ్ళమ్మాయి విజితని మెడిసిన్ ఇంటెన్సివ్ కోచింగ్ కోసం అక్కడే చేర్పించాం. అక్కడికి వెళ్ళాను ఒక రెండు సార్లు. వాళ్ళది హైటెక్ హాస్టలులే! ఇలా మంచినీళ్ళ కుండలూ అవీ ఉండవు అక్కడ!"

"అంటే? మంచి సౌకర్యాలతో హాయిగా ఉంటుందా?"

"హాస్టలుకి ఏసీ ఉంటుంది. ఏసీ జైలు, ఫ్రిజ్ వాటరు, ఇంకొంచెం ఎక్కువ రుద్దుడు, తేడా అంతవరకే! ఇనుప కచ్చడాలు, చీకటి గదులు అదంతా మామూలే! లోపల ఎలా ఉందో చూద్దామన్నా మనల్ని పిల్లల గదుల దాకా వెళ్ళనివ్వరు. అదే ప్రత్యేకత!" చెప్పింది నీలూ.

"లోపల చూసొచ్చి వాళ్ళని ఏ రకంగానూ నిలదీయకూడదని ముందుజాగ్రత్త కాబోలు!" అంది మేఘ.

"ఇందాక మనం చదువుకున్నప్పటి రోజులకీ ఇప్పటికీ ఏమీ మారలేదా అని అడిగావుగా.. ఫీజుల విషయంలో చాలా మారింది. విజితకి ఏడాదికి మొత్తం కాలేజీకి, హాస్టలుకి కలిపి ఫీజు రెండున్నర లక్షలు. అప్పట్లో మనం పాతిక వేలు కడితే ఇప్పుడది వేలల్లోంచి లక్షల్లోకి ఎగబాకింది. పిల్లలని చదివించడం అంటే లక్షల్లో పని ఇప్పుడంతా!" నీరసంగా చెప్పింది నీలూ.

"వినడానికే భయంగా ఉన్నాయి ఈ విషయాలు. ఈ లెక్కన మనం ఇంటర్ చదివేశాం హమ్మయ్యా అని గట్టిగా ఊపిరి పీల్చుకోవాలన్నమాట!" నవ్వింది మేఘ.

కాసేపటి తర్వాత బాల్కనీలోంచి లోపలకి వెళ్ళి స్నేహితురాళ్ళిద్దరూ కలిసి ఎప్పటెప్పటివో పాత ఫొటోలు, పూజ చిన్నప్పటి ఫోటోలు అన్నీ ముందేసుకుని చూస్తూ కూర్చున్నారు.

సమయం సాయంత్రం నాలుగవుతుండగా "కనకదుర్గ గుడికి వెళ్ళి వద్దామా మేఘూ?" అడిగింది నీలూ.

"ఎప్పుడు వెళదాం?" అంది మేఘ.

"మనం చీకటి పడకముందే వెళితే కాసేపు ప్రకాశం బ్యారేజీ మీద నించుని కృష్ణమ్మని చూసి ఆ తర్వాత ఇంద్రకీలాద్రిపైకి వెళ్ళి అమ్మవారి దర్శనం చేసుకుని రావొచ్చు. ఎలాగూ పూజ స్కూలు నుంచి వచ్చే వేళయింది. నువ్వు కూడా రెడీ అయిపో. నేను వెళ్ళి అయిదింటికల్లా రమ్మని అశోక్ కి ఫోన్ చేసి చెప్తాను" అని మేఘని గదిలో వదిలి వెళ్ళింది నీలూ.

మళ్ళీ ఒకసారి బాల్కనీలోకి వెళ్ళి కాలేజీ వైపు చూసింది మేఘ. గ్రౌండ్ అంతా ఖాళీ కుర్చీలు ఉన్నాయి. బహుశా టీ టైమేమో, పిల్లలందరూ హాస్టల్లోకి వెళ్ళినట్టున్నారు. ఆ కాలేజీ వాతావరణాన్ని చూస్తూ ఉంటే పదేళ్ళ నాటి జ్ఞాపకాల దొంతరలన్నీ కదిలి ఆనాటి స్నేహాలు గుర్తొస్తున్నాయి మేఘకి.

*కొన్ని స్నేహాలు..*
*గులాబీల్లా అందంగా కనిపిస్తూనే ముల్లులా గుచ్చి గాయం చేసిపోతాయి.*
*ఇంకొన్ని సిరిమల్లెల్లా బహుసున్నితమై క్షణాల్లో వడలి చేజారిపోతాయి.*
*మరి కొన్ని పారిజాతాల్లా విరిసీ విరియగానే వెలుతురు సోకి నేలరాలిపోతాయి.*
*కొన్ని మాత్రం మొగలిపూవులా పాతబడినకొద్దీ తియ్యటి పరిమళాన్ని పంచుతాయి.*

*చేదైనా తీపైనా గతించిన స్నేహాలు, అవి పంచిన మధుర క్షణాలు అమరమై నిలిచిపోతాయి!*

# 3

నీలూ చెప్పినట్టే గుడికి వెళ్ళడానికి తయారవుతోంది మేఘ. డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని బొట్టు పెట్టుకుంటుంటే తన వెనుకగా ఉన్న తలుపు కాస్త తెరుచుకుని ఆ సందులోంచి కెంజాయ రంగు పట్టులంగా కొద్ది కొద్దిగా కనిపిస్తోంది అద్దంలో.

లేచి తలుపు దగ్గరగా వచ్చి “ఎవరదీ.. తలుపు వెనక దాక్కుందీ.. పూజా.. నువ్వేనా?” అడిగింది మేఘ. వెంటనే తలుపు సందులోంచి కనిపిస్తున్న పట్టులంగా మాయమైపోయి ఘల్లుఘల్లుమని మువ్వల చప్పుడు వినిపించింది.

మేఘ గదిలోంచి బయటికొచ్చి కిలకిలా నవ్వుతూ పరిగెడుతున్న పూజ వెనుకగా వెళ్ళి ఎత్తుకుంది.

“అమ్మదొంగా పారిపోతున్నావా.. అప్పుడే స్కూలు నుంచీ రావడం, పట్టులంగా వేసుకుని బుట్టబొమ్మలా తయారవడం కూడా అయిపోయిందే.. అంత ఫాస్ట్ ఫాస్ట్ గా ఎలా రెడీ అయిపోయావమ్మా.. నాక్కూడా నేర్పిస్తావా?”

“నేను రెడీ అవ్వలేదు. అమ్మే ఫాస్ట్ ఫాస్ట్ గా నన్ను రెడీ చేసింది. ఎప్పుడు గుడికి వెళ్ళినా నేను పట్టులంగాలే వేసుకుంటాను” ముద్దు ముద్దుగా చెప్పింది పూజ.

పూజని ఒళ్ళో కూర్చోబెట్టుకుని “నేనెవరో తెలుసా నీకు?” అడిగింది మేఘ.

“తెలుసుగా.. అమ్మ బెస్ట్ ఫ్రెండ్ మేఘవి.. ఫోటోస్ లో చాలాసార్లు చూసాను”

“బెస్ట్ ఫ్రెండ్ అంటే కూడా తెలుసా నీకు?”

“బెస్ట్ ఫ్రెండ్ అంటే అందరి కన్నా ఎక్కువ స్పెషల్ ఫ్రెండ్ అనే కదా.. విన్నీ లాగా..”

“విన్నీ ఎవరు?”

“విన్నీ నా బెస్ట్ ఫ్రెండ్. స్కూల్లో మేమిద్దరం ఒకే డెస్క్ షేర్ చేసుకుంటాం. స్కూల్ బస్లో కూడా ఒకే సీట్లో కూర్చుంటాం” అని చెప్తూనే మేఘ ఒళ్ళోంచి దిగి వెళ్ళి స్కూల్ బ్యాగ్ లోంచి పెన్సిల్ బాక్స్ తీసుకొచ్చి “ఇది నా హేపీ బర్త్ డే అప్పుడు విన్నీనే గిఫ్ట్ ఇచ్చింది. ఎంత బాగుందో కదా..” గర్వంగా చూపించింది పూజ.

పసివయసులో కల్లాకపటం ఎరుగని లేత మనసుల్లో పెంచుకునే ప్రేమాభిమానాలు, స్నేహాలు ఎంత స్వచ్ఛంగా ఉంటాయో కదా అనిపించింది మేఘకి.

మేఘ, పూజ ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

“ఇంకేముందీ.. సింహం కథ అయిపోయిందీ..” అని మేఘ కథ ముగించగానే “భలే భలే.. సింహం కథ భలే బాగుంది” సంబరంగా చప్పట్లు కొట్టింది పూజ.

అప్పుడే ఇంట్లోకి వచ్చిన అశోక్ "అప్పుడే మీ చేత కూడా కథలు చెప్పించేసుకుంటోందా? పూజకి కథలుంటే చాలు అన్నం నీళ్ళు కూడా అక్కర్లేదు. కదా పూజా.." అని పూజని ఆటపట్టిస్తూ ఎత్తుకున్నాడు.

"బాబాయ్.. మేఘ కొత్త కథ చెప్పింది తెలుసా.. నీకేం కథలు రావసలు. ఎప్పుడు అడిగినా ఏడు చేపల కథ ఒక్కటే చెప్తావు" భుజాల మీద టపటపా చేతులతో కొట్టింది పూజ.

అశోక్ గట్టిగా నవ్వేసి "కథల సంగతి సరే గానీ ఆంటీని పేరు పెట్టి పిలుస్తావేంటి.. తప్పు కదా.. పెద్దవాళ్ళని పేరు పెట్టి పిలవకూడదు" అన్నాడు.

"అమ్మ అలానే పిలుస్తుంది కదా.. మేమిద్దరం కూడా ఫ్రెండ్స్ అయిపోయాం. అందుకే మేఘ అనే పిలుస్తా" అని పూజ అనగానే "నాక్కూడా ఆ పిలుపే నచ్చిందిలెండి" నవ్వింది మేఘ.

ఇంతలో నీలూ కూడా తయారైపోయి హాల్లోకి వచ్చి "పదండి పదండి మళ్ళీ చీకటి పడిపోతుంది" అని హడావుడిగా అందర్నీ బయలుదేరదీసింది.

కారు రోడ్డు మీదకి వెళ్ళగానే కారు కిటికీలోంచి బయటికి చూస్తున్న మేఘతో అంది నీలూ.

"మేఘా.. దాదాపు ఏడెనిమిదేళ్ళయి ఉంటుందా నువ్వు విజయవాడ వచ్చి? అప్పటికీ ఇప్పటికీ ఎంత మారిపోయిందో చూడు."

"మన ఇంటర్మీడియెట్ అయిపోయాక ఒక్కసారే వచ్చాను. అప్పుడు అమ్మకి మొక్కుందని అమ్మవారి గుడికి వచ్చి వెళ్ళాం కానీ అప్పుడు కూడా ఊరు చూసింది లేదు. నిజమే.. చాలా మారిపోయింది. ఏదో కొత్త ఊరుని చూస్తున్నట్టుంది."

అప్పటికన్నా ఇప్పుడు విజయవాడ రోడ్లు విశాలమయ్యాయి. అయినా సరే పెరిగిన జనాభాతో వీధులన్నీ కిటకిటలాడిపోతున్నాయి. చిన్న చిన్న ఇళ్ళు, భవంతుల స్థానంలో పెద్ద పెద్ద అపార్ట్మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్ లు వెలిసాయి. బహుశా అభివృద్ధి తోసుకొచ్చిన మార్పులేమో!

ఈ ఊరు ప్రతి నిత్యం ఎంతమంది కొత్తవాళ్ళని చూస్తూ ఉంటుందో!

ఖాళీ చేతులతో వచ్చినవారు, చదువులో, ఆస్తులో సంపాదించుకోవడంతో పాటు వెళుతూ వెళుతూ పెద్దదో చిన్నదో జ్ఞాపకాల మూటని కూడా మోసుకెళుతుంటారు.

మనం కొన్నాళ్ళు ఒక ఊరిలో ఉంటే మనకు తెలీకుండానే ఆ ఊరితో మనకొక బంధం ఏర్పడుతుంది. ఆ ఊరు వదిలి వెళ్ళిపోయాక మన స్మృతిపథంలో అప్పటి పాతచిత్రమే సజీవంగా ముద్రించుకుపోతుంది. స్థలకాలాదులు రూపాంతరం చెందటం ప్రకృతి ధర్మమే అయినా ఎప్పటికీ అక్కడే ఉండిపోతే కాలంతో పాటు కొత్తగా వచ్చే మార్పులు మనని ఇబ్బంది పెట్టకపోవచ్చు గానీ చాలా ఏళ్ళ తర్వాత మళ్ళీ వచ్చి కొత్తగా మారిపోయిన ఊరిని చూసినప్పుడు అక్కడ మన జ్ఞాపకాల తాలూకు అస్థిత్వం మరిక లేదంటే అంగీకరించడం మనసుకి కష్టంగా తోస్తుంది.

ఊరంతా మారిపోయిందనిపిస్తున్నా ప్రకాశం బ్యారేజీ దగ్గరికొచ్చేసరికి మాత్రం తనకి తెలిసిన విజయవాడలానే అనిపించింది మేఘుకి.

తెల్లటి బోర్డు మీద ప్రకాశం బ్యారేజీ అని రాసిన నీలం రంగు అక్షరాలని చూస్తూ "ఆహా.. నా ప్రాణం లేచొచ్చింది నీలూ. ఏది ఎలా మారినా ఇది మాత్రం అచ్చం అప్పటిలానే ఉంది. కనీసం రంగు కూడా మళ్ళీ వేసినట్టు లేరు" నవ్వింది మేఘ.

సరిగ్గా ప్రకాశం బ్యారేజీ ముందు ముగ్గురినీ కారు దింపి మీరెప్పుడు కాల్ చేస్తే అప్పుడు వస్తానని చెప్పి కారు వేరే దగ్గర పార్క్ చేసుకోడానికి వెళ్ళిపోయాడు అశోక్.

మేఘు, నీలూ, పూజ ముగ్గురూ ప్రకాశం బ్యారేజీ మీదున్న ఫుట్ పాత్ మీద నడవసాగారు.

సాయంసంధ్యాసమయం.. అప్పుడప్పుడే సూర్యుడు ఈ రోజుకిక వెళ్ళొస్తానంటూ కృష్ణవేణి ఒడిలోకి చేరబోతున్నాడు. సంధ్యాకాశంలో విరబూస్తున్న వర్ణసమ్మేళనాలు కనువిందు చేస్తున్నాయి. దూరంగా కృష్ణవేణమ్మ విగ్రహం ఉన్న మండపం అరుణ కిరణాల కాంతిలో వెలిగిపోతుంటే లోపల కొలువై ఉన్న నల్లటి శిల్పం మరింత మెరిసిపోతోంది. సాయంకాలపు గాలి కాస్త గట్టిగానే వీస్తోంది.

ఫుట్ పాత్ అంచున గుంపులుగా నించున్న జనాలు బిరబిరా పరుగులిడుతున్న కృష్ణమ్మ హొయలని ఆనందంగా తిలకిస్తున్నారు. వంతెన మీద నించుని ఉరకలు వేస్తున్న కృష్ణా ప్రవాహాన్ని తదేకంగా చూస్తుంటే ఆ వేగానికి మనం కూడా కదిలిపోతున్న భ్రమ కలుగుతోంది.

రయ్యి రయ్యిమంటూ దూసుకెళుతున్న వాహనాల రణగొణధ్వనులు, జనసందోహపు కోలాహలం, శనక్కాయలు, బఠాణీలు అమ్ముకునే వారి అరుపులు, రివ్వున వీస్తున్న గాలి, ఇవేవీ ఛేదించలేని ప్రశాంతతేదో ఆ పరిసరాల్లో పరిమళిస్తోంది.

దూరంగా నదీతీరాన కనిపిస్తున్న ఆకుపచ్చటి కొండలు, అగ్గిపెట్టెల దొంతరల్లా కనిపిస్తున్న బొమ్మరిళ్ళ లాంటి జనావాసాలు.. తరచి చూస్తున్న కొద్దీ ఈ ఊరికే సొంతమైన అందమేదో ఉందనిపిస్తోంది.

"అబ్బా.. ఎంత బాగుంది నీలూ.. ఇక్కడనుంచి కదలబుద్ధి కావడం లేదు. మీరు తరచూ వస్తుంటారా ఇక్కడికి?" తన్మయంగా అడిగింది మేఘు.

"నాకూ చాలా ఇష్టం ఇక్కడ నిలబడి కృష్ణలో మనసు పారేసుకోవడం. సూర్యాస్తమయం సమయంలో మరింత ఆహ్లాదంగా అనిపిస్తుంది. శరత్ కి కూడా నచ్చుతుంది. కనీసం నెలకొకసారైనా వస్తూనే ఉంటాం" చెప్పింది నీలూ.

"నాక్కూడా ఇష్టమని చెప్పవేంటమ్మా?" పూజ నీలూ చెయ్యి పట్టుకు లాగుతూ అడిగింది.

"అవునవును మర్చేపోయాను. పూజకి ఇక్కడికి రావడం చాలా ఇష్టం మేఘూ. తను ఎప్పుడు వెళదామంటే అప్పుడే వస్తాం. లేకపోతే అసలు రాము" నీలూ నవ్వుతూ చెప్పింది.

"ఈ రోజు కలర్ కలర్ బెలూన్స్ కనిపించడం లేదేంటమ్మా?" చుట్టూ కళ్ళతోనే వెతుకుతోంది పూజ.

"బెలూన్లు కొనకుండా నిన్ను ఇంటికి తీసుకెళ్ళను లేవే తల్లీ.. నువ్వేం దిగులు పెట్టుకోకు. కొండమీదికెళ్ళాక గుడి ముందు ఉంటాయి. అక్కడ కొనుక్కుందాంలే" పూజకి నచ్చచెప్పింది నీలూ.

చీకటి తెరలు అలముకునేదాకా అక్కడే ఉండి అటుతర్వాత అమ్మవారి దర్శనానికై ఇంద్రకీలాద్రికి బయలుదేరారు. గుడిలో వేదమంత్రాల నడుమ మనసారా అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు తీసుకుని బయటికొచ్చేసరికి చీకటి పడిపోయింది.

కొండ మీదనుంచి కిందకి చూస్తే ఊరంతా విద్యుద్దీపాల కాంతిలో వెలిగిపోతోంది. కాసేపు అక్కడే నించుని ఆ వెలుగుల్ని చూస్తూ ప్రసాదాలు ఆరగిస్తుంటే ఇంతలో శరత్ ఫోన్ చేసి "ఆఫీసు దగ్గరికొస్తే అందరం కలిసి బయటికి డిన్నర్ కి వెళదాం" అన్నాడు.

అశోక్ మాత్రం భోజనానికి ఇంటికి వెళతానన్నాడు. శరత్, నీలూ, పూజ, మేఘ నలుగురూ కలిసి డిన్నర్ కి వెళ్ళారు. స్నేహితురాళ్ళిద్దరి కబుర్లతో, శరత్ ఛలోక్తులతో, అన్నీటికీ మించి పూజ ముద్దు మాటలతో ఆ సాయంకాలం మరింత ఆహ్లాదంగా గడిచింది.

భోజనాలు ముగించుకుని హోటల్ నుంచి ఇంటికొచ్చేసరికి బాగా ఆలస్యమవడంతో పూజ మధ్యలోనే నిద్రపోయింది. ఇంటికొస్తూనే బాగా అలసిపోయినట్టున్న మేఘ మొహం చూసి నీలూ మేఘ గదిలో పడక ఏర్పాట్లన్నీ మరోసారి సరిచూసి హాయిగా పడుకొమ్మని 'గుడ్ నైట్' చెప్పి వెళ్ళింది.

విజయవాడ నగరవీధుల్లో తిరుగుతున్న కొద్దీ మేఘకి ఈ ఊరు తనకి పరిచయం చేసిన ఎన్నో రంగుల క్షణాలు, అద్భుతాలు, ఆనందాలు, అయోమయాలు, అవాంతరాలు, ఆశానిరాశలు, కలలు, కన్నీళ్ళు... అన్నీ ఇప్పటివే ఈ రోజువే అన్నంత తాజాగా కళ్ళ ముందు భ్రమణం చేస్తున్నాయి.

నిద్ర కోసం కాసేపు ప్రయత్నించి విఫలమై మంచం దిగి బాల్కనీలోకి వచ్చి కింద కాలేజీ గ్రౌండ్ వైపు చూసింది. దాదాపు అర్ధరాత్రి కావొస్తున్నా కుర్చీల్లో బారులు తీరి నిశబ్దంగా పుస్తకాలు ముందేసుకున్న విద్యార్థులు, వాళ్ళ మధ్యన పచార్లు చేస్తున్న వార్డెన్లు కనిపించారు.

కొన్నేళ్ళ కిందట ఇదే ఊరిలో తను వాళ్ళ వయసులో ఉన్ననాటి రోజులు, అప్పటి స్నేహాలు గుర్తుకొచ్చాయి.

ఎటువైపు చూసినా ఆకాశమంతా అల్లుకున్న నల్లటి మేఘమాలే కనిపిస్తోంది. ఎండుటాకులపై పడుతూ చిటపట చినుకులు చేస్తోన్న చిరుశబ్దాలన్నీ కలిసిపోయి ఓ చిత్రమైన సంగీతస్వరాలాపన ధ్వనిస్తోంది. అంతదాకా గాలికి రేగిన దుమ్మంతా చినుకుల సవ్వడి చెవిన పడటంతోటే అల్లరి మానుకుని బుద్ధిగా నేలపై పరుచుకుంటోంది.

వాన స్పర్శకి పరవశించిన నేల తన సంబరాన్ని కమ్మటి మట్టి పరిమళం రూపంలో వెదజల్లుతుంటే దోవ మధ్యలో ఉన్న పొడుగాటి సిమెంటు రోడ్డు మాత్రం పడ్డ చినుకుని పడ్డట్టు ఆత్రంగా మింగేస్తోంది. రోడ్డుకి ఇరువైపులా విరగబూసిన 'గుల్ మోహర్' చెట్లు ఆకాశం నుంచి రాలుతున్న చినుకుపూలల్లో ఎర్రటి పూరెమ్మలు కలిపి రోడ్డు మీదకి జారవిడుస్తున్నాయి.

పదహారేళ్ళ వయస్సులో ఉన్న ఇద్దరు అబ్బాయిలు ఆ రోడ్డు మీద ఒక గుల్ మోహర్ చెట్టు కింద నించుని ఆటో కోసం ఎదురు చూస్తున్నారు.

ఎదురుగా ఉన్న సందులోంచి ఒక ఆటో వచ్చి వాళ్ళ ముందర ఆగిందో లేదో ఒకమ్మాయి చేతుల్లో పెద్ద పెద్ద బ్యాగులతో ఆటో దగ్గరికి వచ్చింది. పరిగెత్తుకు రావడం మూలాన ఆయాసపడుతోంది.

ఆ అమ్మాయి ఏదో తొందరలో ఉందని అర్థం చేసుకుని "పర్లేదు.. మేమింకో ఆటో ఎక్కుతాం" అన్నారు.

బదులుగా ఆ అమ్మాయి థాంక్స్ చెప్పి "మేఘా.." అని పిలుస్తూ వెనక్కి తిరిగి చూసింది.

అక్కడ ఎవరూ కనిపించలేదు కానీ వాళ్ళున్న చోటికి ఓ యాభై అడుగుల దూరంలో తెల్లటి చుడీదార్ వేసుకున్న ఓ అమ్మాయి రోడ్డు మధ్యలో కూర్చుని కనిపించింది. ప్రక్కనే రెండు పెద్ద బ్యాగులు రోడ్డు మీదే ఉన్నాయి. తెల్లటి బట్టల్లో ముత్యంలా మెరిసిపోతున్న అమ్మాయి అంత దుమ్ముగా ఉన్న రోడ్డు మధ్యలో కూర్చుని ఏం చేస్తోందో అర్థం కాలేదు.

ఆ అమ్మాయి రెండు చేతులతో భద్రంగా ఏదో తీసుకుని, మెల్లగా లేచి నిలబడి, నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి రోడ్డు పక్కనే ఉన్న నీలం రంగు ఇంటి పిట్టగోడ మీద పదిలంగా విడిచి వచ్చింది.

వెంటనే రోడ్డు మీద వదిలిన పెద్ద బ్యాగులు రెండూ తీసుకుని పరిగెడుతూ ఆటో దగ్గరికి వచ్చింది. ఆ ఇద్దరమ్మాయిలూ గబగబా సామాను ఆటోలో ఎక్కించడం, వెనువెంటనే ఆటో కదిలి వెళ్ళిపోవడం, అంతా క్షణాల్లో జరిగిపోయింది.

ఇద్దరిలో ఒకబ్బాయి ఇందాక ఆ తెల్ల డ్రస్సు అమ్మాయి రోడ్డు మీద ఆగి ఏం చేసిందో తెలుసుకోవాలన్న కుతూహలం కొద్దీ సరాసరి వెళ్ళి రోడ్డు ప్రక్కన ఉన్న నీలం రంగు ఇంటి పిట్టగోడ మీద ఏమైనా కనిపిస్తుందేమోనని చూసాడు.

అక్కడ కనిపించిన ఒక చిన్న నత్తని చూసి ఆశ్చర్యపోతుండగానే ఈ లోపు మళ్ళీ ఇంకో ఆటో దొరికేసరికి రెండో అబ్బాయి "అరేయ్.. కిరణ్.." అంటూ కేకెయ్యడంతో అతను పరుగున వచ్చి ఆటో ఎక్కాడు.

బస్ స్టేషనులో ఆటో దిగి వాళ్ళు వెళ్ళాల్సిన ఊరికి బస్ ఎప్పుడుందో తెలుసుకుందామని విచారణాధికారిని వెతుక్కుంటూ వెళ్ళారు. అక్కడ చాలా పెద్ద 'క్యూ' ఉండి వాళ్ళ వంతు రావడానికి చాలాసేపు పట్టింది.

వాళ్ళు ఎక్కాల్సిన బస్సొకటి పదకొండో నంబరు ప్లాట్ఫారం మీద నుంచి సరిగ్గా అప్పుడే బయలుదేరుతోందనీ, త్వరపడితే అందుకోగలరనీ, ఒకవేళ ఇది తప్పిపోతే ఆ తరవాత మరో రెండు గంటలకి ఇంకో బస్సుందనీ సమాచారం తెలిసింది.

వెంటనే ఆ బస్ అందుకోవాలని ఇద్దరూ ఆదరాబాదరాగా పరుగు మొదలెట్టారు.

వాళ్ళు కొద్ది దూరంలో ఉండగానే బస్సు అప్పుడే ప్లాట్ఫారం దాటుతూ కనపడింది. దాన్ని చూసి ఇక పరిగెత్తడం ఆపి "అయ్యయ్యో.. బస్సు మిస్సయ్యింది" అని నిట్టూరుస్తుండగా బస్సు డోర్ దగ్గర నిల్చున్న కండక్టరు పరిగెడుతూ వస్తున్న వీళ్ళిద్దరినీ గమనించి బస్సుని ఆపి త్వరగా రమ్మని గట్టిగా కేకేశాడు.

"మళ్ళీ రెండు గంటల దాకా బస్సు లేదని మీ కోసం ఆపాను. ఖాళీ సీట్లు లేవు గానీ నేను టికెట్లు తీస్కోవడం అయ్యేదాకా నా సీట్లో ఒకరు కూర్చోండి. ఆ పక్క సీట్లో మరొకరు సర్దుకోండి" అని చెప్పి 'టికెట్ టికెట్' అంటూ వెనక్కి వెళ్ళిపోయాడు.

కండక్టరు చేసిన సహాయానికి థాంక్స్ చెప్పి సీట్లో కూలబడ్డారు ఇద్దరూ.

బస్సు స్టేషను దాటిందో లేదో బస్సు ఆపమని బెల్లు కొట్టాడు కండక్టరు. ఎవరో పల్లెటూరివాళ్ళు తెలీక పొరపాటున తప్పు రూటు బస్సెక్కారని వాళ్ళకి ఏ బస్సెక్కాలో సరైన వివరాలు చెప్పి బస్సు దింపేసి "వెనకాల రెండు సీట్లు ఖాళీ అయ్యాయి. ఇక్కడికొచ్చి కూర్చోండి బాబూ.." అని అబ్బాయిలిద్దరినీ పిలిచాడు.

వెనక సీట్లో కూర్చుందామని వెళ్ళిన వాళ్ళిద్దరూ అక్కడ ఇంతకుముందు ఆటో దగ్గర కనిపించిన ఇద్దరమ్మాయిలనీ చూసి ఆశ్చర్యపోయారు.

వాళ్ళలో ఒకమ్మాయి వీళ్ళని గుర్తు పట్టి "మేఘా.. ఇందాక హడావుడిలో నువ్వు గమనించావో లేదో మనం బయలుదేరినప్పుడు మన హాస్టల్ రోడ్డులో నేను హడావిడిగా ఆటో కోసం చూస్తుంటే అక్కడున్న ఇద్దరబ్బాయిలు వాళ్ళు ఎక్కబోతున్న ఆటోని మనకిచ్చి హెల్ప్ చేసారని చెప్పాను కదా.. వాళ్ళే వీళ్ళు" అని తన స్నేహితురాలితో చెప్పి "థాంక్సండీ. మీవల్లనే మేమీ బస్ అందుకోగలిగాం. సారీ.. మా మూలాన్నే మీకు ఆలస్యమైందనుకుంటా. ఈ బస్ అందుకోవాలనే మేమంత కంగారుగా వచ్చాం" అని క్షమాపణగా చెప్పింది.

"పర్లేదు లెండి. ఏమైనా చివరికి అందరం బస్ అందుకోగలిగాం కదా. అయినా మేము కూడా ఈ బస్సే ఎక్కుతామని అప్పుడు మాకు తెలీదులెండి. నా పేరు ప్రదీప్. వీడు నా బెస్ట్ ఫ్రెండ్ ఆదిత్య కిరణ్. మాది ఇంటర్ ఫస్టియర్ అయిపోయింది" అని తన స్నేహితుడిని కూడా పరిచయం చేశాడు.

"నా పేరు సునీల. తను నా ఫ్రెండ్ మేఘనందన. మాది కూడా ఇంటర్ ఫస్టియర్ అయిపోయింది. మేఘ ఎంపీసీ. నేను బైపీసీ. మీరే గ్రూప్?"

"మేమిద్దరం బైపీసీనే. ఫస్టియర్ 'అక్షర' కాలేజ్లో చదివాము. ఇప్పుడు సెకండియర్ కి 'విద్య' కాలేజీకి షిఫ్ట్ అయ్యాము. ఇంతకీ మీరే కాలేజ్?" అడిగాడు ప్రదీప్.

"అయితే మీరు కొత్తగా మా కాలేజీకే షిఫ్ట్ అయ్యారన్నమాట!" నవ్వింది మేఘ.

"ఓహో.. మీరు కూడా విద్య కాలేజేనన్నమాట. నిజంగా సర్ప్రైజ్! అక్షరలో ఫిజిక్స్ కోచింగ్ అస్సలు బాగోలేదని మేము సెకండియర్ కి మీ కాలేజీకి మారిపోయాం" ఉత్సాహంగా చెప్పాడు కిరణ్.

"మా హాస్టల్ కి పక్క వీధిలోనే కదా మీ బాయ్స్ క్యాంపస్.. తెలుసులెండి" అంది మేఘ.

"మీ ఇద్దరిదీ ఒకే ఊరా?" అడిగింది సునీల.

"కాదు. మాది హైదరాబాదు. ఇప్పుడు మేమిద్దరం కిరణ్ వాళ్ళింటికి వెళుతున్నాం" చెప్పాడు ప్రదీప్.

"మా నాన్నగారు బ్యాంక్ మేనేజర్. ఆయనకి ఈ మధ్యనే కొత్తగా ఒక పల్లెటూరికి ట్రాన్స్ఫర్ అయ్యింది. నేను ఇక్కడ హాస్టల్లో ఉన్నప్పుడే అమ్మా, నాన్నా ఆ ఊరికి మారిపోయారు. నేనిదే మొదటిసారి వెళ్ళడం. అందుకే బస్సుల గురించి సరిగ్గా తెలీదు" చెప్పాడు కిరణ్.

"నేనూ, నీలూ ఏడో తరగతి నుంచి కలిసి చదువుకున్నాం. మొన్నటిదాకా ఎంచక్కా ఒకే ఊర్లో ఉండేవాళ్ళం. మా నాన్నగారికి కూడా ట్రాన్స్ఫర్ అవ్వడం వల్ల ఇప్పుడు ఇద్దరిదీ చెరొక ఊరు అయిపోయింది" అని మొదలుపెట్టి తమ సంగతులన్నీ వివరంగా చెప్పింది మేఘ.

"మేమిద్దరం ఈ ఏడాదే ఇంటర్ హాస్టల్లో ఫ్రెండ్స్ అయ్యాము. ప్రదీప్ వాళ్ళమ్మ గారు కొన్ని నెలల క్రితమే కేన్సరుతో చనిపోయారు. వాళ్ళ నాన్నగారు పోలీసు ఉద్యోగ బాధ్యతలతో చాలా బిజీగా ఉంటారు. ప్రదీప్ కి ఉన్న ఒక్కగానొక్క అక్కకి పెళ్ళైపోయి ఢిల్లీలో ఉంటోంది. అందుకని ఇప్పుడు సెలవలకి హైదరాబాదు వెళితే అక్కడ తను ఒంటరిగా ఉండి దిగులు పడతాడని నాతో పాటు మా ఇంటికి తీసుకువెళుతున్నాను" చెప్పాడు కిరణ్.

ప్రదీప్ గురించి అయ్యో పాపం అనిపించినా ఆ విషయం గురించి మాట్లాడి ప్రదీప్ ని ఇబ్బంది పెట్టలేదు.

అనుకోకుండా పరిచయమైన వాళ్ళు నలుగురూ ఇట్టే కలిసిపోయి ఆ బస్సు ప్రయాణంలోనే చక్కటి స్నేహితులైపోయారు. హాస్టళ్ళ గురించీ, కాలేజీల గురించీ బోలెడన్ని సరదా కబుర్లు చెప్పుకున్నారు.

తమ స్నేహాన్ని బస్సు దిగగానే వదిలేయకుండా తర్వాత కూడా కొనసాగించాలనే ఉద్దేశ్యంతో అందరి వివరాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

ప్రదీప్, మేఘ పుట్టినరోజులు ఒకే రోజని తెలిసి చాలా సరదాపడ్డారు. అందరి ఇంటి అడ్రస్సులు నోట్ చేసుకున్నారు. నీలూ వాళ్ళింట్లో ఫోన్ లేదు కాబట్టి కిరణ్, మేఘ ఫోన్ నంబర్లని రాసి పెట్టుకున్నారు.

హాయిగా కబుర్లతో కాలక్షేపం చేస్తూ సమయం ఎలా గడిచిందో తెలీకుండానే మూడు గంటలు మూడు క్షణాల్లా దొర్లిపోయి బస్ కిరణ్ వాళ్ళ ఊరు చేరింది.

"సెలవుల్లో ఫోన్లో మాట్లాడుకుందాం. మళ్ళీ కాలేజీలు తెరిచాక తప్పకుండా కలుద్దాం" అని వీడ్కోలు చెపుతూ కిరణ్, ప్రదీప్ ఇద్దరూ బస్ దిగిపోయారు.

మిగిలిన ప్రయాణమంతా స్నేహితురాళ్ళిద్దరూ ఆ రోజు జరిగిన సంఘటనల గురించి, ప్రదీప్, కిరణ్ లతో స్నేహం కలవడం గురించి చర్చించుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

బస్సు నీలూ వాళ్ళ ఊరికి చేరేసరికి బస్ స్టేషనులో సిద్ధంగా ఉన్న నీలూ అన్నయ్య శ్రీకాంత్ మేఘకి జాగ్రత్త చెప్పి నీలూని తీసుకుని వెళ్ళాడు. నీలూ బస్సులో పరిచయమైన కొత్త స్నేహితుల కబుర్లన్నీ వివరంగా అన్నయ్యకి చెప్పింది.

మరో గంట ప్రయాణం తర్వాత బస్సు మేఘ వాళ్ళ ఊరికి చేరుకునేసరికి మేఘ నాన్నగారు

వచ్చారు. ఇంటికి వెళుతుండగానే దారిలోనే ఉత్సాహంగా బస్సులో ప్రదీప్, కిరణ్ పరిచయం అవ్వడంతో మొదలుపెట్టి వాళ్ళ కుటుంబ వివరాలతో సహా జరిగినవన్నీ పూస గుచ్చినట్టు వాళ్ళ నాన్నగారికి చెప్పింది మేఘ.

ఇన్ని రోజులూ హాస్టల్లో చదువులు, పరీక్షలని కంటి నిండా నిద్రకి మొహం వాచిపోయుందేమో సెలవుల్లో పొద్దు నడినెత్తికొచ్చేదాకా నిద్రపోయేది మేఘ. ఒక రోజు ఉదయం తొమ్మిదిన్నర దాటినా ఇంకా నిద్రపోతూనే ఉండగా వాళ్ళ నాన్నగారొచ్చి "మేఘా.. నీ ఫ్రెండ్ కిరణ్ ఫోన్ చేశాడు. లైన్లో ఉన్నాడు. వెళ్ళి మాట్లాడు" అని నిద్ర లేపారు.

ఆ మాట వినగానే నిద్ర మత్తు వదిలించుకుని మంచం మీద నుంచి దిగ్గున లేచి ఉత్సాహంగా హాల్లోకి పరిగెత్తి ఫోనందుకుంది మేఘ.

"హలో.. ఎవరు మాట్లాడేది?"

"హలో.. మేఘా. నేను కిరణ్ ని. పోయిన వారం బస్లో కలిశాం కదా.. అప్పుడే మర్చిపోయావా?"

"ఉహూ.. అదేం లేదులే. నిద్రమంచం మీద నుంచి ఇప్పుడే లేచి వచ్చాను. నువ్వెలా ఉన్నావ్? ప్రదీప్ ఎలా ఉన్నాడు? ఏం చేస్తున్నారు సెలవల్లో?"

"నేను ఫోన్ చేస్తే క్వశ్చన్స్ అన్నీ నువ్వు అడిగేస్తున్నావేంటీ? మీ నాన్నగారు నాకు చాలా నచ్చేసారు. నువ్వు మా గురించి చెప్పావంట కదా.. కిరణ్ అని చెప్పగానే గుర్తు పట్టేశారు. కాసేపు అవీ ఇవీ వివరాలు అడిగారు. నువ్వింకా నిద్ర పోతున్నావని చెప్తే మళ్ళీ చేస్తానులెండి అన్నాను"

"ఏం పర్లేదు. కనీసం ఈ ఫోన్ వంకతోనైనా ఈ రోజుకి ఆవిడ మేలుకొలుపు సేవ మాకు సులువవుతుంది అన్నారా నాన్నగారు?"

"సరిగ్గా అలాగే అన్నారు. నీ నిద్ర చెడగొట్టానని ఇప్పుడు నన్ను శపిస్తావా ఏంటీ?" నవ్వాడు కిరణ్.

"సందేహమా.. అసలే నా శాపాలు చాలా పవర్ ఫుల్ అని నీలూ ఎప్పుడూ అంటుంది. ఒక ఆరేళ్ళలో నువ్వు డాక్టర్ అయిపోవుగాక.. ఇదే నీకు నా శాపం!" అల్లరిగా అంది మేఘ.

"ధన్యోస్మి దేవీ.. ధన్యోస్మి! ఇంత మంచి శాపాలు కూడా ఉంటాయని నాకిప్పుడే తెలిసింది. నేనింకా రాయివి అయిపో, చెట్టువి అయిపో టైపులో శపిస్తావేమో అనుకున్నా."

"మరీ అంత సంతోషపడిపోకు. నువ్వీ క్షణంలోనే నా కళ్ళ ముందు నుంచి మాయం అయిపోదువు గాక అని మా ట్యాప్లో నీళ్ళు నీ మీద చల్లీ మరీ శపించేయగలను. నాకలాంటి పిచ్చి శాపాలు కూడా వచ్చు" బెదిరిస్తున్నట్టుగా అంది మేఘ.

"అబ్బో నిజమే.. నీకంత శక్తి ఉందంటే నమ్మడం కష్టమే! అది సరే కానీ నిద్రపోడం తప్ప ఇంకేం చేస్తున్నావ్ సెలవల్లో?"

"తినడం, నిద్రపోడం, టీవీ చూడటం తప్ప ఇంకేం చెయ్యడం లేదు. ఇప్పుడప్పుడే మళ్ళీ ఇలాంటి ఛాన్స్ దొరుకుతుందా.. ఒక్కసారి హాస్టల్లో వెళ్ళి పడ్డామంటే ఎంసెట్ కోచింగ్, పుస్తకాలు, పరీక్షలు ఇదే గోల.." దీర్ఘంగా నిట్టూర్చింది మేఘ.

"నీలూ కూడా ఇంతేనా? తనెలా ఉంది? వాళ్ళింట్లో ఫోన్ లేదన్నారుగా.. మీరిద్దరూ టచ్లో లేరా అయితే?"

"ఉహూ.. నీలూ నాలా కాదులే. చాలా బుద్ధిమంతురాలు. ఉదయాన్నే లేవడం, వాళ్ళ నాన్నగారికి పూజకి పూలు కోసివ్వడం, అమ్మకి పనుల్లో సాయపడటం అలాంటివన్నీ చేస్తుంది. నిన్ననే తనతో మాట్లాడాను. ఎవరో చుట్టాలింట్లో ఏదో ఫంక్షన్ ఉంటే వెళ్ళొచ్చిందట. వాళ్ళ పక్కింటివాళ్ళకి ఫోను ఉందిలే. అక్కడికి చేసి మాట్లాడతాను నేను. కానీ పక్కింటివాళ్ళ నంబర్ అందరికీ ఇస్తే బాగోదు కదా అని మీకివ్వలేదు. ఇంతకీ మీరిద్దరూ ఏం చేస్తున్నారు సెలవల్లో?"

"మా మమ్మీ చేసి పెట్టే స్పెషల్స్ అన్నీ బాగా లాగించేస్తున్నాం. మొన్న డాడీ బ్యాంక్ పని మీద అడవిలో ఉన్న పల్లెటూర్లకి వెళుతుంటే నేనూ, ప్రదీప్ కూడా వెళ్ళాం. అడవి మధ్యలోనుంచి రైడ్ చాలా బాగుంది. ఆ చిన్న చిన్న ఊర్లలో ట్రైబల్స్ ఉంటారన్నమాట. చిన్న చిన్న గుడిసెల లాంటి ఇళ్ళు , విచిత్రమైన బట్టలు, భాష, అదంతా చాలా సరదాగా అనిపించింది. నేను కొన్ని ఫొటోస్ కూడా తీశాను. నిన్నేమో దగ్గరలో ఒక వాగు ఉందంటే అది చూడటానికి వెళ్ళాము."

"ఆహా.. మీరెంత బాగా గడుపుతున్నారు సెలవల్ని. వింటుంటే థ్రిల్లింగా ఉంది" ఉత్సాహంగా అంది మేఘ.

"అయితే నువ్వూ, నీలూ కలిసి మా ఊరికి వచ్చెయ్యండి, మనందరం కలిసే తిరగొచ్చు."

"నువ్వు మాటవరసకి అన్నా మేము నిజంగానే వచ్చేస్తాం ఏమనుకుంటున్నావో.."

"నేనేం మాటవరసకి అనలేదు. స్పెషల్ ఇన్విటేషన్ కావాలంటే చెప్పు. మమ్మీ పక్కనే ఉంది."

"ఓయ్ ఓయ్.. నేనేదో సరదాకి అన్నాను బాబూ.. నువ్వలా సడన్ గా మీ అమ్మగారికి ఫోన్ ఇవ్వకు ప్లీజ్. నాకేం మాట్లాడాలో తోచదు" కంగారుపడింది మేఘ.

"మా మమ్మీ చాలా ఫ్రెండ్లీ తెలుసా.. నా ఫ్రెండ్స్ అందరూ నాకన్నా మమ్మీతోనే ఎక్కువ మాట్లాడుతుంటారు. సారీ మేఘా.. డాడీకి ఫోన్ అవసరమట. మనం మళ్ళీ మాట్లాడదాం. ప్రదీప్ టిఫిన్ చేసి బుక్ చదువుతూ నిద్రపోయాడు. నాకేం తోచక నీకు ఫోన్ చేశాను. మళ్ళీ మాట్లాడదాం. సరేనా.. బాగా నిద్రపో మరి! నీలూని అడిగామని చెప్పు. బై.."

"సరే సరే.. ఏం పరవాలేదు. నేను కూడా ప్రదీప్ కి హాయ్ చెప్పానని చెప్పు. టాటా.." అని చెప్పేసి ఫోన్ పెట్టేసింది మేఘ.

వెంటనే నీలూ వాళ్ళ పక్కింటికి ఫోన్ చేసింది.

"హలో.. సుజాతాంటీ.. నేనూ మేఘని మాట్లాడుతున్నాను. బావున్నారా?"

"నేను బానే ఉన్నానమ్మా. అమ్మా, నాన్నా బాగున్నారా? విజయవాడలో హాస్టల్లో నీలూ, నువ్వూ కలిసే చదువుకుంటున్నారంటగా.. చదువు బాగా నడుస్తుందా?"

"అంతా బాగే ఆంటీ.. ఇప్పుడు ఎండాకాలం సెలవులు. పోయినవారమే ఇంటికొచ్చాం. ఇదివరకు ఫోన్ చేసినప్పుడు కుసుమక్క మాట్లాడింది. మీరు ఊరికెళ్ళారని చెప్పింది. ఆంటీ.. ఒకసారి నీలూని పిలుస్తారా?"

"అవునమ్మా.. మా చిన్నత్త గారి చిన్న కొడుకు పెళ్ళి. అమ్మాయి గవర్నమెంటు ఉద్యోగస్థురాలైనా ఘనంగా కట్నం ఇచ్చి చేశారు. మా చిన్నత్త గారు ఫోన్ చేసి "నువ్వు లేకపోతే ఎలా సుజాతా.. నాల్రోజుల ముందే రావాలి" అని మరీ మరీ చెప్పారు. మా పెద్దత్త గారు కూడా అదే ఊళ్ళోగా ఉండేది. ఆవిడ ఈ మధ్య బట్టలుతికే బండ దగ్గర కాలు జారి పడి ఉన్నపళంగా ఎడం చేతికి పక్షవాతం వచ్చి మంచాన పడింది. ఆవిడని కూడా చూసినట్టుంటుందని వెళ్ళాను. అన్నీ చూసుకుని వచ్చేసరికి పది రోజులు పట్టింది. ఇక్కడ కుసుమ చక్కగా ఇంటిపని, వంటపని చూసుకుంటుందిగా. అందుకని ఇంటి మీద బెంగ లేకుండా నాల్రోజులు అట్లా తిరిగొద్దామనీ.. అందునా మా అమ్మగారింటి వైపు చుట్టాలు కూడా ఉన్నారాయే ఆ ఊర్లో...." నాన్ స్టాప్ గా సాగిపోతూనే ఉంది ఆవిడ మాటల ప్రవాహం.

అతి కష్టం మీద ఆవిడ మాటల మధ్యలో దూరిపోయి "అవునా.. చాలా మంచి పని చేశారాంటీ.. ఒకసారి నీలూని పిలుస్తారా ఆంటీ.. కొంచెం ముఖ్యమైన పనుంది" అని అడిగింది మేఘ.

"అదెంత పనమ్మా.. ఇప్పుడే పిలుస్తా. నువ్వు లైన్లోనే ఉంటావా, మళ్ళీ కాసేపాగి ఫోన్ చేస్తావా?"

"పది నిమిషాల్లో మళ్ళీ చేస్తాను. ఉంటానాంటీ.." అని చెప్పి తిరిగి సమాధానం కోసం చూడకుండా టక్కున ఫోన్ పెట్టేసింది మేఘ.

పది నిమిషాల తర్వాత మళ్ళీ ఫోన్ చేస్తే నీలూ ఎత్తింది.

"హాయ్ మేఘా.. నువ్వేంటీ ఎర్లీ మార్నింగ్ పదింటికే నిద్ర లేచేసావ్? మీ ఊర్లో ప్రకృతి వైపరీత్యాలేమీ సంభవించలేదు కదా!"

"ఇంకా ఏం జరగాలి తల్లీ.. సుజాతాంటీ ఊరు నించి వచ్చేసింది. ఇప్పటి నుంచీ నేను నీకు ఫోన్ చెయ్యాలంటే వాళ్ళ చిన్నత్త గారి కొత్త కోడలు సారెలో ఏం స్వీట్లు తెచ్చింది, పెద్దత్త గారి ఎడమచెయ్యికే పక్షవాతం ఎందుకొచ్చింది.. ఇలాంటి టాపిక్స్ మీద స్పీచులు వినాలి. వామ్మో.. ఆ గోలంతా నాకెందుకే బాబూ.. ఆవిడ మాటల వరదని ఎలా ఆపాలో తెలీక చచ్చాను."

"ఓ అవునా, అలాగా.. నిజంగా అలా జరిగిందా.. శ్రీలత గురించి మనకి మొదటినుంచీ తెలిసిందే కదా మేఘా.."

"వామ్మో.. శ్రీలత ఎవరే మధ్యలో? కొంపదీసి సుజాతాంటీ దగ్గర ట్యూషన్ ఏమన్నా పెట్టించుకున్నావా ఏవిటీ?" అయోమయంగా అడిగింది మేఘ.

"హలో హలో.. ఏంటీ సరిగ్గా వినిపించడం లేదా? ఫోన్ లైన్లు బాగున్నట్టు లేవు."

"ఓహో.. ఫోను పక్కనే ఆంటీ కూర్చుందా.. హీహీహీ.. భలే మేనేజ్ చేస్తున్నావే.. నువ్వు సూపర్ స్మార్ట్ నీలూ.."

"ఆ సంగతి వదిలేసి వేరే విశేషాలు చెప్పమంటావా? పెద్ద విశేషాలు ఏం లేవే.. అందరం బానే ఉన్నాం."

"ఓహో.. నన్ను టాపిక్ మార్చమంటున్నావా? సర్లే నేను కూడా సుజాతాంటీ మాటలకి మతి పోయి

అసలు సంగతి చెప్పడం మర్చిపోయా. కిరణ్ ఫోన్ చేసాడు ఇందాకే. నిన్ను అడిగానని చెప్పమన్నాడు. సెలవుల్లో అటూ ఇటూ తిరుగుతున్నారంట బాగా. మనల్ని కూడా వాళ్ళ ఊరికి రమ్మన్నాడు తెలుసా..” చివరి మాట గొప్పగా చెప్పింది మేఘ.

“అవునా.. భలే! ఆ రోజు బస్లో కలిసిన తర్వాత మళ్ళీ కలుస్తామో లేదో అనుకున్నా నేను. ఫోన్ చేశారన్నమాట.”

“ఊ.. ప్రదీప్ నిద్రపోతున్నాడని మాట్లాడలేదు. మళ్ళీ చేస్తానని అన్నాడు”

“హమ్మయ్యా.. ఆంటీ ఎవరో వచ్చారని బయటికెళ్ళింది. నీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి మేఘా..” మెల్లగా చెవిలో చెబుతున్నట్టు అంది నీలూ.

“ఏంటది? ఏమైనా సమస్యా?” ఆదుర్దాగా అడిగింది మేఘ.

“మన రజని ఉంది కదా.. సెలవుల్లో అది రోజూ మా ఇంటికి వస్తోందని చెప్పా కదా. కాలక్షేపానికి ఇద్దరం కాసేపు కలిసి టీవీ చూడటం, కథల పుస్తకాలు చదువుకోవడం చేస్తుంటాం. “నేనంటే నీకు ఇష్టమే కదా, మనిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్ కదా..” అంటూ రోజుకొకసారి అడుగుతుంటే ఏంటోలే దీని గోల అనుకున్నా.

నిన్న సాయంత్రం “నువ్వొక సహాయం చెయ్యాలి నీలూ.. చేస్తానని ఒట్టు వెయ్యి..” అని నన్ను గంట సేపు అడిగీ అడిగీ ప్రాణం తీసింది. చివరికి విషయమేంటో చెప్పింది. రజని ఒక అబ్బాయిని ప్రేమిస్తోందట. ఆ విషయంలో నేను తనకి సహాయం చెయ్యాలట” అని నీలూ గబగబా చెబుతుండగానే అప్పుడే సుజాతాంటీ బయటనుంచి లోపలికి వచ్చేసరికి ఆ సంభాషణని అర్ధాంతరంగా ఆపేసి “రజని తీసుకెళ్ళింది మేఘా ఆ పుస్తకం..” అంటూ మాట మార్చింది.

“హ్మ్.. ఆంటీ వచ్చేసిందా? సరేలే.. మనం ఇంకో నాలుగు రోజుల్లో కలుస్తాం కదా.. అప్పుడు వివరంగా మాట్లాడుకుందాం. విషయం ఏదైనాసరే నువ్వు అస్సలు కంగారు పడకు. సరేనా..”

“ఊ..”

“నేను నిద్ర మంచం మీద నుంచి లేచొచ్చి ఫోన్ దగ్గరే కూర్చున్నా. ఇంకాసేపుంటే నాక్కూడా అక్షింతలు పడతాయి. ఇంక ఉండనా మరి?” నవ్వింది మేఘ.

“సరేలే.. బై” అని చెప్పి ఫోన్ పెట్టేసింది నీలూ.

నీలూని ఇబ్బంది పెడుతున్న రజని విషయం ఏమై ఉంటుందా అని మేఘ ఆలోచనలో పడింది.

# 4

ఆ రోజు మేఘనందన పుట్టినరోజు. రోజుటిలా కాకుండా బుద్ధిగా ఉదయాన్నే నిద్ర లేచి చక్కగా తలస్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని అమ్మతో పాటు గుడికి వెళ్ళొచ్చింది.

టైము పది దాటిందో లేదో ఒకటే హడావుడి పడుతూ ఇంట్లోకీ బయటికీ పచార్లు చేస్తోంది. “ఎందుకే అంత ఆత్రం నీకు? బస్సు ఆలస్యం అయిందేమోలే. ఒక పది నిమిషాలు అటూ ఇటూగా వచ్చేస్తుందిగా. అందాకా కాస్త స్థిమితంగా కూర్చోరాదూ?” మేఘ వాళ్ళమ్మ పరిహాసంగా నవ్వింది.

“నేనేం కంగారు పడటం లేదు. నీలూ తొందరగా వచ్చేస్తే బాగుండు అని ఎదురుచూస్తున్నానంతే! అయినా నువ్వేంటి నన్ను చూసి నవ్వుతున్నావ్? మైసూర్ పాక్ చెయ్యడం అయిపోయిందా? నీలూ వచ్చేసరికి వేడి వేడిగా రెడీగా ఉండాలి. వెళ్ళు వెళ్ళూ.. వంట గదిలోకి పో నువ్వు” నవ్వుతూ ఆవిడని వంటింట్లోకి నెట్టేసింది మేఘ.

ఒక అరగంట తర్వాత మేఘ వాళ్ళ నాన్నగారి స్కూటర్ హారన్ వింటూనే వీధిలోకి పరుగెత్తింది. స్కూటర్ వెనుక సీట్లో కూర్చున్న నీలూ వంగి మేఘ వైపు చూసి చెయ్యి ఊపింది.

వీధిలోకి పరిగెత్తుకొచ్చిన కూతుర్ని చూసి నవ్వుతూ ఆయన స్కూటరు అక్కడే ఆపి నీలూని దించారు.

“హేపీ హేపీ బర్త్ డే టు యూ మేఘా..” చెప్తూనే స్నేహితురాలిని హత్తుకుంది నీలూ.

“థాంక్యూ సో మచ్ నీలమ్మా..” నెచ్చెలిని చూసిన ఆనందంలో మొహం వెలిగిపోతుండగా బదులిచ్చింది మేఘ.

వాకిట్లోంచే ఇద్దరూ కబుర్లు చెప్పుకోడం మొదలెట్టేశారు.

వాళ్ళు ఇంట్లోకి వస్తూండగానే మేఘ వాళ్ళమ్మ గారు ఎదురు వచ్చి “ప్రయాణం బాగా జరిగిందా నీలూ? నాన్నగారొచ్చి బస్ ఎక్కించారా?” అడుగుతూనే మంచినీళ్ళు అందించారు.

“అన్నయ్య వచ్చి బస్ ఎక్కించాడు ఆంటీ. ఇదిగో అమ్మ బెల్లపు బూందీ చేసి పంపింది మేఘ కోసమని..” బ్యాగులోంచి ఒక స్టీలు డబ్బా తీసి ఆవిడ చేతిలో పెట్టి అప్పుడు మంచినీళ్ళ గ్లాసు అందుకుంది.

ఆ మాట వినగానే మేఘ ఆత్రంగా అమ్మ చేతిలోంచి డబ్బా లాక్కుని మూత తీసి ఒక ముక్క తీసుకుని తింటూ “అబ్బా.. ఎంత బాగుందో.. బెల్లపు బూందీ చేస్తే ఆంటీనే చెయ్యాలి” అని సంబరపడింది.

“నువ్వు తినడమేనా.. నీలూకి పెట్టేది లేదా?” అని ఆవిడ నవ్వుతూనే లోపలకి వెళ్ళి ఒక ప్లేట్లో వేడి వేడి మైసూరుపాకుతో వచ్చారు.

స్నేహితురాళ్ళిద్దరూ తీపి తింటూ తమ ఆనందాన్ని పంచుకుంటూండగా మేఘ వాళ్ళ నాన్నగారొచ్చి “మీ సంబరాలు తర్వాత జరుపుకుందురు గానీ ముందు నీలూ వాళ్ళింటికి ఫోన్ చేసి తను క్షేమంగా ఇల్లు చేరిందని చెప్పండి” అన్నారు.

“వీళ్ళకి ఇప్పుడప్పుడే తెమలదు కానీ నేనెళ్ళి చేస్తానుండండి” అంటూ మేఘ వాళ్ళమ్మ గారు వెళ్ళారు.

అందరూ కలిసి మేఘ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా వండిన పదార్థాలతో ఘనంగా మధ్యాహ్న భోజనం చేస్తుండగా పోస్ట్ మేన్ వచ్చాడు.

మేఘ వెళ్ళి పోస్టులో వచ్చిన పార్సిల్ పైన తన పేరుండటం చూసి ఆశ్చర్యపోతూ సంతకం చేసి దాన్ని తీసుకుని ఇంట్లోకి వచ్చింది.

"విచిత్రంగా ఉంది. నాకు పోస్టు రావడమేంటి?" అని ఆసక్తిగా పార్సిల్ వంక చూస్తోంది మేఘ. "ముందు వచ్చి భోజనం చెయ్యి. తర్వాత తీరిగ్గా చూసుకోవచ్చులే" అన్నారు వాళ్ళమ్మ గారు.

భోజనాలు అయ్యాక పార్సిల్ విప్పి చూస్తే లోపల తెల్లటి పద్మంలో ఆసీనురాలై తెల్లటి వస్త్రాల్లో మెరిసిపోతూ చిద్విలాసంగా నవ్వుతూ వీణ వాయిస్తున్న సరస్వతీ దేవి బొమ్మ అందంగా లామినేట్ చేయబడి ఉంది. క్రింది వైపు ఒక మూలన మార్కర్ పెన్ తో ప్రదీప్ అని రాసి ఆ రోజుటి తేదీ వేసి ఉంది. అది చూడగానే మేఘ, నీలూ ఇద్దరూ ఒకేసారి ఆశ్చర్యానికి లోనయ్యి మొహమొహాలు చూసుకున్నారు.

వెంటనే మేఘ ఆ పటాన్ని రెండు చేతులతో జాగ్రత్తగా పట్టుకుని వాళ్ళ నాన్నగారి దగ్గరికి వెళ్ళింది.

"నాన్నా.. చూశారా.. ఎంత పెద్ద సరస్వతీ దేవి పటమో! ప్రదీప్ పంపించాడు. అప్పుడు బస్లో పరిచయమైన ఫ్రెండ్స్ అని చెప్పాను కదా.. కిరణ్ మొన్నొకరోజు ఫోన్ చేసినప్పుడు మీరు కూడా మాట్లాడారు. ప్రదీప్ అంటే ఇంకొక అబ్బాయి. తన పుట్టిన రోజు కూడా ఈ రోజే. కాకపోతే, నాకన్నా ఒక ఏడాది ముందు పుట్టాడు. ఇద్దరిదీ సేమ్ డే బర్త్ డే అని థ్రిల్ అయ్యాము. మన ఫోన్ నంబర్, అడ్రస్ తెలుసు కదా.. భలే గిఫ్ట్ పంపించాడు" అంటూ తన ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ ప్రకటించింది.

అందరూ ఆ సరస్వతీ దేవి బొమ్మ చాలా అందంగా ఉందన్నారు. తర్వాత అంత పెద్ద పటాన్ని ఏ గోడ మీద పెడితే బాగుంటుందా అని కాసేపు తర్జన భర్జనలు పడ్డాక "ఆ సంగతి నాకొదిలేసి నువ్వు హాయిగా ఉండమ్మా.." అన్నారు మేఘ నాన్నగారు.

మధ్యాహ్న భోజనాల తర్వాత ఆయన తిరిగి ఆఫీసుకి వెళ్ళిపోయారు. మేఘ వాళ్ళమ్మ గారు ఇంటి పనుల్లో పడిపోయారు.

మేఘ, నీలూ ఇద్దరూ ప్రదీప్ అంత బాగా గుర్తుంచుకుని పుట్టినరోజుకి సర్ప్రైజ్ గిఫ్ట్ పంపినందుకు అతని మంచితనం గురించి గొప్పగా చెప్పుకుని సంబరపడ్డారు.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు "తనేమో అంత చక్కగా నన్ను విష్ చేస్తే నేనేమో కనీసం తనకి ఫోన్ చేసి అయినా బర్త్ డే విషెస్ చెప్పలేదు. ప్చ్" నిరుత్సాహంగా అంది మేఘ.

"ఇప్పటికైనా మించిపోయిందేముంది? ఇప్పుడు ఫోన్ చేసి విష్ చేద్దాం. ప్రదీప్ కిరణ్ వాళ్ళింట్లోనే కదా ఉన్నాడు" అంది నీలూ.

సరేనని ఇద్దరూ కలిసి హాల్లో ఫోన్ పక్కన కూర్చుని కిరణ్ వాళ్ళింటికి కాల్ చేశారు.

"హలో.." ఒక కొత్త స్వరం మృదువుగా పలికింది.

"నా పేరు మేఘ అండీ. నేను కిరణ్ ఫ్రెండ్ ని."

"ఓ.. మేఘా మాట్లాడేది. నేను కిరణ్ మమ్మీని. నన్ను అండీ అనక్కర్లేదు. ఆంటీ అనొచ్చు" నవ్వారు ఆవిడ.

"అంటే.. అదీ.. గబుక్కున అలా వచ్చేసింది ఆంటీ.." సిగ్గుపడింది మేఘ.

"హేపీ బర్త్ డే.. ఈ రోజు నీ పుట్టినరోజని కిరణ్ చెప్పాడు. వాళ్ళ డాడీతో కలిసి ఉదయమనగా బయటికి వెళ్ళి ఇప్పుడే వచ్చాడు. ఒక్క క్షణం లైన్లో ఉండు. ఫోన్ తనకిస్తాను" అని చెప్పి కార్డ్ లెస్ ఫోన్ తీసుకుని కిరణ్ గదిలోకి వెళ్ళారు.

"హలో.. హాయ్ మేఘా.. హేపీ బర్త్ డే!" ఫోన్ అందుకుంటూనే విష్ చేశాడు కిరణ్.

"థాంక్స్.. ఏంటీ, ఫోన్ నేను చేస్తే నువ్వు విషెస్ చెప్పేస్తున్నావా ఎంచక్కా?"

"ఉదయం ఎర్లీగా ఎయిట్ కే బయటికి వెళ్ళిపోయాను. అప్పుడు నీకు మిడ్ నైట్ కదా, డిస్టర్బ్ చేస్తే శపిస్తావేమోనని చెయ్యలేదు."

"నేనివాళ ఉదయం ఏడింటికే లేచాను తెలుసా! ఉదయాన్నే తలస్నానాలు, గుళ్ళు, పూజలు పూర్తి చేసేసి నీలూ వచ్చేసరికి రెడీగా ఉండాలనీ.."

"నీలూ వచ్చిందా.. ఎలా ఉంది తను?"

"ఫోన్ తనకిస్తున్నా. నువ్వే మాట్లాడు."

"హాయ్ కిరణ్.. ఎలా ఉన్నారు నువ్వూ, ప్రదీప్?"

"వి ఆర్ ఫైన్ నీలూ.. ప్రదీప్ లేడు ఇక్కడ. నేను మేఘుతో ఫోన్లో మాట్లాడిన మరుసటి రోజే హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఢిల్లీ నుంచి ప్రదీప్ వాళ్ళ అక్క వచ్చిందని చెప్తే వెంటనే అప్పటికప్పుడు బయలుదేరి వెళ్ళాడు. సెలవులు అయిపోయాక నేరుగా హాస్టలుకే వచ్చేస్తానన్నాడు."

"ప్రదీప్ అక్కడ లేడా.. హ్మ్! ఈ రోజు తన బర్త్ డే కదా.. తనకి విషెస్ చెపుదాం అనుకున్నాం. మేఘుకి సర్ప్రైజ్ బర్త్ డే గిఫ్ట్ కూడా పంపాడు. మధ్యాహ్నమే పోస్టులో వచ్చింది."

"అప్పుడే వచ్చేసిందా! టైముకి అందుతుందో లేదో అన్నాడు నాతో. బర్త్ డే బేబీకి నచ్చిందా మరి గిఫ్ట్?"

"అందరికీ చాలా నచ్చింది. ఇదిగో మేఘు మాట్లాడుతుందంట" మేఘుకి ఇచ్చేసింది ఫోన్.

"ప్రదీప్ హైదరాబాద్ ఫోన్ నంబర్ ఇవ్వు కిరణ్. మేము కాల్ చేస్తాము" అడిగింది మేఘు.

"నంబర్ ఉంది కానీ. వాళ్ళక్క వచ్చిన దగర్నుంచీ మేనల్లుడిని వెంటబెట్టుకుని ఊరి మీద తెగ తిరుగుతున్నాడు వాడు. ఇంట్లో దొరకడం కష్టమే. నేను కూడా వాడు చేసినప్పుడే మాట్లాడుతున్నాను. ఉదయం వాడే కాల్ చేస్తే నేను విష్ చేశాను" అన్నాడు కిరణ్.

"సరేలే అయితే, మా ఇద్దరి తరపున కూడా విషెస్ చెప్పు నువ్వు మళ్ళీ మాట్లాడినప్పుడు."

"అలాగే, తప్పకుండా చెప్తాను" మాటిచ్చాడు కిరణ్.

ముగ్గురు స్నేహితుల మధ్యన మరి కాసిని కబుర్లు దొర్లాయి.

సాయంకాలం మల్లెమొగ్గలు కోయడానికని నేస్తాలిద్దరూ ఒక గిన్నె చేత పుచ్చుకుని పెరట్లో గుబురుగా పెరిగి నిండా మొగ్గ తొడిగిన మల్లెపందిరి దగ్గర చేరారు.

"జాగ్రత్తగా చూసి పసిమొగ్గలు కాకుండా రేపటికి విచ్చుకునే దోరమొగ్గలు మాత్రం తెంపండి. మరీ చెట్టు మొత్తం ఈడుబోయేలా ఊడ్చేయకుండా కొన్ని మొగ్గలు చెట్టు మీదనే ఉండనివ్వండి. అస్సలు పువ్వులే లేకపోతే చెట్టు చిన్నబోయినట్టుంటుంది. ఉదయాన్నే మీ నాన్నగారు కొన్ని పూజకి కోసుకుంటారు కూడానూ" ఇంట్లోనించే అరిచి చెప్పారు మేఘ అమ్మగారు.

మల్లెమొగ్గలు కోస్తూ ఆవిడ దగ్గర్లో లేరని రూఢీ చేసుకున్నాక మేఘ నెమ్మదిగా లోగొంతుకతో అడిగింది.

"మొన్న మాట్లాడినప్పుడు రజని ఏదో సమస్య తెచ్చిపెట్టింది అన్నావు కదా నీలూ.. ఏమిటది వివరంగా చెప్పు ఇప్పుడు."

ఆ ప్రస్తావన వింటూనే నీలూ మొహంలోకి విసుగు వచ్చింది.

"దాని పేరెత్తితేనే నాకు చిర్రెత్తుకొస్తోంది. ఎంత పిచ్చి వాగుడు వాగిందనుకున్నావూ! అది మన అన్నయ్యని ప్రేమిస్తున్నదట. పైగా నేను దానికి సాయం చెయ్యాలట" చిరాగ్గా చెప్పింది నీలూ.

నీలూ మాటలకి ఖంగు తిన్న మేఘ "ఏంటీ!!!!" అని బిగ్గరగా అరిచింది.

రజని అన్నయ్య సతీష్, నీలూ అన్నయ్య శ్రీకాంత్ ఇద్దరూ డిగ్రీ కాలేజీలో మంచి స్నేహితులు.

దూరపు చుట్టరికం కూడా ఉంది. శ్రీకాంత్ చెల్లెల్ని ఇంటర్మీడియెట్ కోసం విజయవాడలో హాస్టల్లో చేర్చారని తెలుసుకున్న సతీష్ తన చెల్లెలు రజనిని కూడా అక్కడే చేర్పిస్తే ఒకరికొకరు తోడుగా ఉంటారని అనుకున్నాడు.

నీలూకి, రజనికి బీరకాయ పీచు బంధుత్వం ఉన్నప్పటికీ ఇద్దరూ చిన్నప్పటి నుంచీ వేరే వేరే స్కూళ్ళలో చదువుకోవడం వల్ల వాళ్ళిద్దరి మధ్య ముఖపరిచయం తప్ప స్నేహం లేదు. రజని కూడా వచ్చి తమతో పాటు హాస్టల్లో చేరిన తర్వాత నీలూ, మేఘ ఇద్దరూ రజనితో స్నేహంగా ఉండసాగారు. కానీ రజని మనస్తత్వం వాళ్ళిద్దరికీ భిన్నమైనది. వాళ్ళిద్దరూ స్కూలు రోజుల నుంచీ ప్రాణస్నేహితురాళ్ళనీ, వేరే ఎవ్వరినీ తమ మధ్యకి రానివ్వనట్టు ప్రవర్తిస్తారని ఆమెకి ఉడుకుమోతుతనంగా ఉంటుంది.

రజని, మేఘ ఇద్దరూ ఎంపీసీ గ్రూప్ కాబట్టి ఇద్దరూ ఒకే క్లాసులో ఉంటారు. రజని కంటే మేఘకి ఎక్కువ మార్కులు వస్తాయని ఆమెకి కాస్త అసూయ కూడా ఉంది. మనసులో ఏమున్నా సరే బయటికి మాత్రం ఎప్పుడూ వాళ్ళిద్దరి చుట్టూనే తిరుగుతూ వాళ్ళ మధ్యలో దూరాలని విశ్వప్రయత్నాలు చేస్తూ ఉంటుంది రజని.

నీలూ, మేఘలతో పాటు ఉండే వాళ్ళ మరో రూమ్మేట్ రేవతి అల్లరి చిల్లరిగా గోల చేసే రకం. రేవతికి, రజనికి దోస్తీ బాగా కుదురుతుంది. అందుకని హాస్టల్లో ఏ మాత్రం సమయం దొరికినా రజని వచ్చి వీళ్ళ రూములోనే తిష్ట వేస్తుంటుంది. అయినాసరే ఎప్పుడూ విసుక్కోరు. రజనిలో తమకి నచ్చని లక్షణాలు ఉన్నాసరే తమ ఊరి అమ్మాయి అనీ, శ్రీకాంత్ మరీ మరీ చెప్పాడు కదా అనీ ఆమెతో ఎప్పుడూ స్నేహంగానే మసలుకుంటారు నీలూ, మేఘ.

అలాంటిది ఇప్పుడు కొత్తగా రజని ప్రేమకథ నీలూ మెడకి చుట్టుకుని కొత్త సమస్య తెచ్చిపెట్టింది.

సెలవుల్లో రజని రోజూ నీలూ వాళ్ళింటికి వచ్చి గంటల తరబడి కూర్చుని కబుర్లు చెబుతుంటే తనతో స్నేహం కొద్దీనేమో అనుకుంది. కానీ ఒక రోజు రజని తను ఎంత గాఢంగా శ్రీకాంత్ ని ప్రేమిస్తుందో వర్ణించి చెప్పి, అలాగే తనంత ప్రేమించే అమ్మాయి వాళ్ళన్నయ్యకి ఎంత అవసరమో, తాను వదినగా వస్తే జీవితాంతం నీలూని ఎంత గొప్పగా చూసుకుంటుందో, ఇంకా ఏవేవో నీలూకి పూర్తిగా అవగాహన లేని, అర్థం కాని విషయాలన్నీ చెప్పి ఒకటే ఊదరగొట్టేసింది. తెలివిగా ముందు తనకి సహాయం చెయ్యమని కాళ్ళా వేళ్ళా పడి తీరా సరేనన్నాక "మీ అన్నయ్యనే ప్రేమిస్తున్నాను" అని చెప్పి నీలూ నెత్తిన పిడుగు వేసింది.

పైగా "ఈ విషయం అతి రహస్యంగా ఉంచు. మన కుటుంబ విషయాలు బయటికి పొక్కితే మనకే అవమానం. ఎంత ప్రాణస్నేహితురాలైనా మేఘుకి చెప్పొద్దు" అని మాట కూడా తీసుకుంది.

కానీ నీలూ మేఘు దగ్గర ఏమీ దాచకుండా అంతా చెప్పేసింది.

ముందు బాగా కోపం వచ్చి స్నేహితురాళ్ళిద్దరూ రజనిని తిట్టుకున్నాక, కాసేపటికి శాంతించి, అటు పిమ్మట చర్చించుకుని ఇకపై ఈ విషయం గురించి నీలూ దగ్గర మాట్లాడే అవకాశం రజనికి ఇవ్వకుండా కట్టడి చెయ్యడమే సరైన పరిష్కారం అన్న నిర్ణయానికి వచ్చారు.

"నువ్వేం బెంబేలు పడిపోకు నీలూ. ఇలా పిచ్చి పిచ్చిగా వాగేవాళ్ళ గురించి మనం భయపడకూడదు. నీ వెనక నేనున్నాను. ఈసారి మళ్ళీ నీ జోలికి వస్తే అప్పుడు పెట్టాల్సిన నాలుగూ నేనే పెడతాను. ఇవన్నీ మర్చిపోయి ప్రశాంతంగా ఉండు నువ్వు" అని నీలూకి ధైర్యం చెప్పింది మేఘు.

మేఘు పుట్టినరోజు కోసమని వచ్చిన నీలూ మేఘు వాళ్ళింట్లో ఒక రోజుండి తెల్లారి మధ్యాహ్నం తిరిగి వాళ్ళ ఊరికి వెళ్ళిపోయింది.

మరొక వారం రోజులకి వేసవి సెలవులు అయిపోయాయి. ఇంటరు రెండో సంవత్సరం చదవడానికి మళ్ళీ హాస్టలుకి బయలుదేరడానికి సిద్ధమయ్యారు అందరూ.

కిరణ్ ఒక రోజు మేఘుకి ఫోన్ చేసి వాళ్ళ డాడీకి విజయవాడలో పని ఉందన్నారనీ, పనిలో పనిగా తనని కూడా హాస్టల్లో దింపుతానన్నారనీ చెప్పాడు.

సెలవులకి హాస్టలు నుంచి వచ్చేప్పుడు రజని బంధువుల ఇంటికి వెళ్ళిన కారణంగా నీలూ, మేఘులతో కలిసి ఇంటికి రాలేదు. ఇప్పుడు సెలవులయ్యాక ముగ్గురినీ కలిపి ఒకేసారి నీలూ అన్నయ్య శ్రీకాంత్ తీసుకెళ్ళి హాస్టల్లో దిగబెట్టి వచ్చేలా ఇళ్ళల్లో పెద్దవాళ్ళు నిర్ణయించారు.

ఇంట్లో అమ్మానాన్నలు ఎప్పట్లాగే పుస్తకాలు, బట్టలు అన్నీ సర్దిపెట్టి, హాస్టల్లో అప్పుడప్పుడూ తినడానికని చిరుతిండ్లు చేసి పెట్టి బాగా శ్రద్ధగా చదువుకోమని చెప్పి ప్రయాణం కట్టించారు.

నీలూ, మేఘ రజని విషయం గురించి మాట్లాడుకున్నా ఏమీ తెలియనట్టు తనతో ఇదివరకులానే మామూలుగా ఉన్నారు. నలుగురూ కలిసి ప్రయాణం చేస్తున్నంతసేపూ శ్రీకాంత్ ఎప్పటిలాగే తన తరహాలో సరదా మాటలు చెప్పి నవ్విస్తూనే ఉన్నాడు.

మేఘ, నీలూ మాటల్లో శ్రీకాంత్ ని 'అన్నయ్యా' అని సంబోధిస్తున్నా రజని నోటి వెంట మాత్రం ఒక్కసారి కూడా ఆ పిలుపు రాకుండా జాగ్రత్తపడుతోందని మేఘ గ్రహించింది.

హాస్టల్లో ముగ్గురు అమ్మాయిలనీ భద్రంగా దింపి, మరొకసారి జాగ్రత్తలన్నీ చెప్పి తిరిగి వెళ్ళిపోయాడు శ్రీకాంత్.

తిరిగి హాస్టల్లోకి రాగానే వెంటనే మొదలైన ఇంటర్ రెండో సంవత్సరం క్లాసులు, నోట్సులు, స్టడీ అవర్స్, అదనంగా ఎంసెట్ కోచింగ్ వగైరాలతో అందరూ చదువు లోకంలో పడిపోయారు.

రజని అధిక ప్రసంగానికి నీలూ మరొకసారి అవకాశం ఇవ్వలేదు.

ఒక రోజున మ్యాథ్స్ లెక్చరర్ క్లాసుకి రాలేదని మరొక లెక్చరర్ వచ్చి ఆ పీరియడ్ ని స్టడీ అవర్ గా మార్చి నిశబ్దంగా చదువుకోమని చెప్పి వెళ్ళారు. దొరక్క దొరక్క ఒక గంట ఖాళీ దొరికేసరికి క్లాసులో పిల్లలందరూ పుస్తకాలు ముందేసుకుని ఒకరితో ఒకరు గుసగుసలాడుతూ కబుర్లు చెప్పుకోసాగారు.

క్లాసులో రెండు బెంచీల వెనక కూర్చునే రజని లేచి వచ్చి మేఘ పక్కన కూర్చుంది. కులాసాగా కాసేపు చదువుల గురించి మాట్లాడుకున్నాక నెమ్మదిగా రజని అంది.

"మేఘా.. నీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. చాలా పెద్ద రహస్యం. నువ్వెవరికీ చెప్పనని ఒట్టు వెయ్యాలి. నీలూక్కూడా తెలీకూడదు. సరేనా?"

రజని ఉపోద్ఘాతం వింటూనే మేఘకి సెలవుల్లో నీలూ చెప్పింది గుర్తొచ్చింది. అసలు ఏం చెప్తుందో చూద్దాం అనుకుంటూనే "సరే అలాగేలే.. ముందు సంగతేంటో చెప్పు" అంది.

"మరేమో.. నీలూ అన్నయ్య శ్రీకాంత్ ఉన్నాడు కదా.."

"ఆ.. ఉంటే? నిన్నేమైనా అన్నాడా?"

"ఉహూ.. నన్నేం అనలేదు. తను.. తను.. నన్ను ప్రేమిస్తున్నాడు"

ఆ మాట వినగానే మేఘకి నోట మాట రాలేదు.

"ఏవిటీ???" అంది ఆశ్చర్యంగా.

"నిజం మేఘా.. శ్రీకాంత్ నన్ను ప్రేమిస్తున్నాడు. కానీ, ఈ విషయం నీలూకి చెప్తే ఏమనుకుంటుందోనని అలా చెప్పకుండా వేరేలా చెప్పాను."

"వేరేలా అంటే?"

“అంటే.. నేనే శ్రీకాంత్ ని ప్రేమిస్తున్నానని చెప్పాను. నీలూకి నా మీద కోపం వచ్చిందనుకుంటా. అప్పటినుంచీ నాతో సరిగ్గా మాట్లాడటం లేదు.”

“నీలూకి నచ్చలేదేమో!”

“అది కాదు మేఘా.. నా మీద ఎందుకు చెప్పు తనకి కోపం? వాళ్ళ అన్నయ్య నన్ను ఇష్టపడితే, ప్రేమిస్తే అది నా తప్పా? నేనేం శ్రీకాంత్ వెంటపడలేదే? ఇప్పుడు ఎవరైనా నిన్ను ప్రేమిస్తే అది నీ తప్పా? నువ్వే చెప్పు.”

ఆ చివరి మాట వినేసరికి మేఘుకి కోపమొచ్చింది.

“ఇప్పుడేమంటావు అయితే?”

“నువ్వు చాలా మంచిదానివి మేఘా. కనీసం నువ్వైనా నన్ను అర్థం చేసుకుంటావని చెప్తున్నాను.”

మేఘుకి అసహనం దాచుకోవడం కష్టంగా ఉంది.

“సరేలే. నెక్స్ట్ పీరియడ్ ఫిజిక్స్ స్లిప్ టెస్ట్ ఉంది కదా.. నేనింకా సరిగ్గా ప్రిపేర్ అవ్వలేదు.”

“నువ్వు నా బెస్ట్ ఫ్రెండ్ వి మేఘా.. థాంక్స్ నన్ను అర్థం చేసుకున్నందుకు. నీ కాలుక్యులస్ హోం వర్క్ నోట్స్ ఇస్తావా ఒకసారి” అడిగింది రజని.

ఆ పుస్తకమేదో ఇచ్చేసి అప్పటికి ఆ చర్చని దాటవేసింది మేఘు.

తర్వాత ఆలోచిస్తున్న కొద్దీ మేఘుకి ఇదంతా వింతగా అనిపించింది. మేఘు స్కూల్లో ఉన్నప్పటి నుంచీ తనకి నీలూ ఇంటితో అనుబంధం ఉంది. అందరూ సొంత కుటుంబసభ్యుల్లా అనిపిస్తారు. శ్రీకాంత్ నీలూతో సమానంగా మేఘునీ చూసుకుంటాడు. ఎప్పుడూ సరదాగా జోక్స్ వేస్తూ అందర్నీ నవ్విస్తూ ఉంటాడు. తనకి తెలిసిన శ్రీకాంత్ అన్నయ్య గురించి ఇలా వినడం విచిత్రంగా అనిపించడంతో పాటు నమ్మశక్యంగా కూడా అనిపించలేదు.

మధ్యాహ్నం లంచ్ బ్రేక్ లో కలిసినప్పుడు రజని తనతో రహస్యంగా చెప్పిన విషయం నీలూతో చెప్పింది మేఘు.

ఒకే విషయాన్ని ఇద్దరికీ చెరో రకంగా చెప్పింది రజని. అసలు ఈ రెంటిలో ఏది నిజం? అసలు కాస్తైనా నిజం ఉందా లేదా అన్న అనుమానం కూడా రాకపోలేదు వాళ్ళిద్దరికీ. అంతా గందరగోళంగా అనిపించింది.

ఈ అయోమయాన్ని ఛేదించాలనే ఉద్దేశ్యంతో “అసలు మన అన్నయ్యే తనని ఇష్టపడుతున్నాడని రజని అంటోంది కదా.. నీకెప్పుడైనా అన్నయ్యని చూస్తే తను రజనిని ప్రత్యేకంగా చూస్తున్నట్టు ఏమైనా అనిపించిందా? బాగా గుర్తు తెచ్చుకుని చెప్పు” నీలూని అడిగింది మేఘు.

నీలూ బాగా ఆలోచించి “ఏమో.. మనందరితో కూడా ఎప్పుడూ జోక్స్ వేస్తూ సరదాగా ఆటపట్టిస్తూ ఉంటాడు కదా.. రజనితో కూడా అలా మాట్లాడినట్టే అనిపిస్తుంది. కాకపోతే నువ్వు పిలిచినట్టు అన్నయ్యా అని మాత్రం రజని ఎప్పుడూ పిలవదు. అయినా మనలో మనం ఇలా బుర్ర బద్దలు కొట్టుకోవడం ఎందుకు? ఏవిటే మా ఇద్దరికీ ఇలా రెండు రకాలుగా చెప్పావు, అసలు సంగతి ఏంటో

సరిగ్గా చెప్పి చావు.. అని దాన్నే కడిగేస్తే సరి. లేనిపోని తలనొప్పి తెచ్చిపెట్టింది రాక్షసి!" చిరాకుపడుతూనే పరిష్కారాన్ని సూచించింది నీలూ.

నీలూ ఆలోచన ప్రకారం తెల్లారి ఆదివారం మధ్యాహ్నం ఖాళీగా ఉన్న సమయంలో ఇద్దరూ కలిసి రజనిని మధ్యలో కూర్చోపెట్టి మా ఇద్దరితో ఇలా ఎందుకు చెప్పావని గట్టిగా నిలదీశారు.

ఇద్దరూ ఒకటైపోయి తనని నిలదీస్తున్నా రజని ఏ మాత్రం అదరలేదు బెదరలేదు.

"నేను మీ ఇద్దరితో నిజమే చెప్పాను" అంది తాపీగా.

వీళ్ళిద్దరూ తెల్ల మొహాలు వేసారు.

"అవును.. నేను శ్రీకాంత్ ని ప్రేమిస్తున్నాను. తను కూడా నన్ను ప్రేమిస్తున్నాడు" అంది రజని.

"అలాగని అన్నయ్య నీతో చెప్పాడా?" అడిగింది నీలూ.

"ఇంతవరకూ నేరుగా చెప్పలేదు. కానీ నాకు తెలుసు" అంది రజని నమ్మకంగా.

"అదే ఎలా తెలుసు అని మా ప్రశ్న" కాస్త కఠినంగా అంది మేఘ.

"ఎలా అంటే, నాకు మాత్రమే అర్థమయ్యేలా తను నా మీద ఇష్టాన్ని ప్రదర్శిస్తాడు" నిబ్బరంగా చెప్పింది.

"మాకు నీ అంత తెలివి లేదులే కానీ ఆ ప్రత్యేకంగా ప్రదర్శించడం అంటే ఏవిటో అర్థమయ్యేలా చెప్పి మాకు జ్ఞానబోధ చెయ్యి తల్లీ.." అంది మేఘ అసహనంగా.

"మీకు శ్రీకాంత్ మీ అన్నయ్యగా మాత్రమే తెలుసు కాబట్టి మీకలా అనిపించడం సహజమే. కానీ తను నాతో వేరేలా ఉంటాడు. నేనున్నప్పుడు టేప్ రికార్డర్ లో ప్రత్యేకంగా కొన్ని లవ్ సాంగ్స్ ప్లే చేస్తాడు. నాకిష్టం అని చెప్పిన పాటలే కావాలని మళ్ళీ మళ్ళీ పెడతాడు. నీలూ లేకుండా నేనొక్కదాన్ని ఉన్నప్పుడు నాతో వేరేలా మాట్లాడతాడు. తనకి నేనంటే ఇష్టమని నాకు ఖచ్చితంగా తెలుసు. మీకిప్పుడు నేనెంత చెప్పినా అర్థం కాదులే. భవిష్యత్తులో మీకే తెలుస్తుంది" గట్టిగా తేల్చేసింది రజని.

"సరే నువ్వు చెప్పిందే నిజం అనుకుందాం. అలాగైతే అన్నయ్య నిన్ను ప్రేమిస్తుంటే మరి నీలూని నీ ప్రేమకి హెల్ప్ చెయ్యమని ఒట్లు అవీ ఎందుకు వేయించుకున్నావ్? తన సాయంతో నీకేం అవసరం?" లా పాయింట్ లాగింది మేఘ. "అప్పుడు వాళ్ళ అన్నయ్య కూడా నన్ను ప్రేమిస్తున్నాడని తనతో చెప్పలేదు కాబట్టి అలా అడిగాను. నాకేమీ ఎవరి సహాయం అవసరం లేదు. ఏదో ఒక రోజు మీకు నిజం తెలుస్తుంది. అప్పుడు మీరే నమ్ముతారు నా మాటలు నిజమని. ఇప్పుడిలా మాట్లాడినందుకు బాధపడతారు కూడా. అయినా మీతో అబద్ధాలు చెప్తే నాకేం వస్తుంది. ఉట్టి పుణ్యానికి నన్ను మీ అన్నయ్య ప్రేమిస్తున్నాడని నేనెందుకు చెప్పుకుంటాను?" ఎదురు వాదించింది రజని.

చాలాసేపు అన్నీ రకాలుగా అటూ ఇటూ పీకి పాకం పెట్టాక కూడా రజని ధోరణి ఇదమిద్దంగా ఇదీ అని అర్థం కాకపోయేసరికి ఇక ఈ విషయం మీద రాద్ధాంతం అనవసరం అనిపించి రజనితో వాదించడం మానుకున్నారు.

"ఇంత మాట్లాడాం కాబట్టి మళ్ళీ ఇంకోసారి మన జోలికి వచ్చి విసిగించకుండా ఉంటుందిలే. తను మళ్ళీ ఇంకోసారి ఈ ప్రస్తావన తెస్తే ఏం చెయ్యాలో అప్పుడాలోచిద్దాం. మనం కూడా అనవసరంగా దీన్ని పెద్దది చెయ్యకుండా ఇంతటితో వదిలేసి ఊరుకుందాం" అని నీలూకి సర్దిచెప్పింది మేఘ.

ఈ సంఘటన తర్వాత అందరూ మళ్ళీ ఎప్పట్లానే ఎవరి చదువుల్లో వాళ్ళు మునిగిపోయారు. రజని వీళ్ళ దగ్గరికి వచ్చి కూర్చోవడం ఇదివరకటికన్నా తగ్గింది. రేవతికి ఈ విషయాలేమీ తెలియవు కాబట్టి రజనిని పిలుచుకొచ్చి వీళ్ళ గదిలో కూర్చోబెట్టి కబుర్లు చెప్తూ ఉండేది.

ఇది జరిగిన కొన్ని రోజులకి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షాఫలితాలు వచ్చాయి. మేఘకి ఎనభై ఏడు శాతం మార్కులు వచ్చాయి. నీలూకి డిస్టింక్షన్ వచ్చింది. రేవతి, రజని ఇద్దరూ ఫస్ట్ క్లాస్ తో సరిపెట్టారు కానీ దురదృష్టవశాత్తూ రజని ఒక మేథ్స్ పేపర్లో ఫెయిల్ అయ్యింది.

రిజల్ట్స్ వచ్చిన రోజు రజని భోరుభోరున ఏడుస్తుంటే మేఘ, నీలూ, రేవతి ముగ్గురూ కలిసి చాలాసేపు సముదాయించారు. ఫస్ట్ ఇయరే కాబట్టి అదేం పర్లేదని, బెటర్మెంట్ పరీక్షల్లో రాసేసి క్లియర్ చేసేసుకుంటే ఫైనల్ సర్టిఫికెట్లో కూడా ఏమీ తేడా తెలియదని చెప్పి రజనిని ఊరడించారు. కేవలం కొన్ని మార్కుల తేడాతోనే పోయింది కాబట్టి ఈసారి చాలా సులువుగా క్లియర్ చేసేస్తావులెమ్మని ధైర్యం చెప్పారు.

"ఈ విషయంలో మేమిద్దరం పెద్దగా హెల్ప్ చేయలేకపోయినా మీ మ్యాథ్స్ సబ్జెక్ట్ కాబట్టి మేఘ నీకు పరీక్షకి ప్రిపేర్ అవ్వడానికి సాయం చేస్తుందిలే" అంది రేవతి.

మేఘకి కూడా రజనిని చూసి పాపం అనిపించి సరేనని మాట ఇచ్చింది.

"మా నాన్న నేను గ్యారెంటీగా డాక్టర్ని అయిపోవాలని, నా చదువుకి ఏ విధమైన డిస్టర్బెన్సూ కలగకూడదని ఉన్న ఊర్లోనే నన్ను హాస్టల్లో పెట్టి మరీ చదివిస్తున్నారు. అయినా నేను చూసావా మార్కులని ఎంత ఈజీగా తీసుకున్నానో. ఏదో మనకి చేతనైంది చేస్తాం. వచ్చేది వస్తుంది, రానిది రాదు. మహా దీని వల్ల కొంపలేం మునిగిపోవులే. నేనొక్కదాన్ని డాక్టరు అవ్వకపోవడం వల్ల ప్రపంచమంతా అలమటించి చస్తుందా ఏవిటీ? నువ్వే చెప్పు. దీనికే బేలగా అయిపోకు" అని ధైర్యరసం నూరిపోసింది రేవతి.

రేవతి చెప్పింది విని ఏడుస్తున్న రజనికి కూడా నవ్వొచ్చింది.

ఈ పరీక్షా ఫలితాలతో రజని మీదున్న కోపం పోయి నీలూ, మేఘ తనతో ఇదివరకటిలా మనస్ఫూర్తిగా స్నేహంగా మసలుకోసాగారు. పైగా పరీక్ష తప్పిందన్న జాలి కొద్దీ తనని ఇంకొంచెం ఎక్కువ జాగ్రత్తగానే చూసుకుంటున్నారు. రజని కూడా మళ్ళీ ఇదివరకటిలా ఎప్పుడూ వీళ్ళ గదిలోనే ఉంటూ మామూలైపోయింది.

# 5

ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులను గమనిస్తే ఏదో యుద్ధానికి సిద్ధమవుతున్న సైనికుల్లా కనిపిస్తారు. అప్పటిదాకా స్కూల్లో ఆడుతూ పాడుతూ ఆనందంగా చదువుకున్న వాళ్ళకి ఒక్కసారిగా స్వేచ్ఛ మొత్తం కోల్పోయి, జైల్లో ఖైదీల్లాంటి జీవితం ప్రాప్తిస్తుంది. ఇప్పటి రోజుల్లో భావిభారత డాక్టర్లు, ఇంజనీర్లు కావాలంటే ఇదే సరైన మార్గమని ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల, పిల్లల నమ్మకం కూడా!

ప్రతీరోజూ ఉదయాన్నే ఐదు గంటల నుంచి ఆరు గంటల దాకా స్టడీ అవర్స్ అయ్యాక స్నానాలు చేసి, టిఫిన్లు తినడానికి నలభై ఐదు నిమిషాల బ్రేక్. ఆ తర్వాత మధ్యాహ్నం పన్నెండున్నర దాకా కాలేజీలో క్లాసులు. ఒక గంటన్నర లంచ్ బ్రేక్ తర్వాత మళ్ళీ రెండింటి నుంచీ నాలుగింటి దాకా క్లాసులు. ఒక అరగంట స్నాక్స్ బ్రేక్ తర్వాత ఏడింటి దాకా స్టడీ అవర్స్. మళ్ళీ ఒక గంట రాత్రి భోజనానికి బ్రేక్. ఎనిమిది నుండి పదకొండు దాకా స్టడీ అవర్స్. మళ్ళీ తెల్లారి ఐదు గంటల దాకా నిద్రకి సమయం. వారమంతా ఇదే చక్రంలో తిరుగుతుంటారు. రోజూ ఉండే చిన్న చిన్న పరీక్షలతో పాటు ప్రతీ ఆదివారం ఉదయం అదనంగా ఎంసెట్ మోడల్ టెస్ట్ కూడా ఉంటుంది. ఇంటరు, ఎంసెట్ కోసమని రెండు రకాల పరీక్షలు రాసేసరికి మధ్యాహ్నం పన్నెండు అవుతుంది. అప్పటి నుంచీ సాయంత్రం ఐదు గంటల దాకా ఆటవిడుపు. రాత్రి భోజనం తర్వాత మళ్ళీ స్టడీ అవర్స్ షరా మామూలే.

దొరక్క దొరక్క వారానికొక్కసారి ఆదివారం పూట దొరికే ఈ నాలుగైదు గంటలే వాళ్ళ పాలిట పెన్నిధిలా భావిస్తుంటారు విద్యార్థులు. మగపిల్లల హాస్టల్లో అయితే ఈ ఒక్క పూట అందరూ బయటికి వెళ్ళి తిరిగి రావడానికి అనుమతి ఉంటుంది కానీ, ఆడపిల్లల్ని మాత్రం వాళ్ళ తల్లిదండ్రులు వస్తే తప్ప బయటికి పంపరు. ఆదివారం వస్తే ఆడపిల్లల హాస్టల్లో కొందరు తమని చూడటానికి వచ్చిన తల్లిదండ్రులతో 'ఔటింగ్' పేరుతో బయటికి వెళితే, కొందరు ఈ ఖాళీ సమయాన్ని నిద్రపోవడానికి వినియోగించుకుంటే, మరి కొందరేమో ఈ పూట సైతం వృథా పోకుండా ఎంసెట్ కి బాగా ప్రిపేర్ అవ్వాలని అప్పుడు కూడా పుస్తకాలు ముందేసుకుని కూర్చుంటారు.

రేవతి తల్లిదండ్రులు విజయవాడలోనే ఉంటారు. ప్రతీ ఆదివారం మధ్యాహ్నం పరీక్ష కాగానే ఇంటికి వెళ్ళి మళ్ళీ సోమవారం పొద్దున్నే తిరిగి హాస్టలుకి వస్తుంది. రేవతి నాన్నగారు మద్రాసులో బ్యాంక్ మేనేజరుగా పని చేస్తారు. ప్రతీ శనివారం బయలుదేరి విజయవాడ వచ్చి కుటుంబంతో గడిపి మళ్ళీ ఆదివారం రాత్రి తిరిగి వెళ్ళిపోతారు. రేవతి అమ్మ గారు స్కూల్లో టీచరుగా పని చేస్తారు. రేవతికి ఎనిమిది, ఆరు తరగతులు చదివే ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు.

రేవతి వాళ్ళింట్లో పద్ధతులన్నీ చాలా స్ట్రిక్ట్ గా ఉంటాయి. వాళ్ళింట్లో కేబుల్ టీవీ కనక్షన్ ఉండదు. టేప్ రికార్డర్ ఉన్నా దేవుడి పాటలు తప్ప సినిమా పాటలు ఉండవు. పిల్లలు ముగ్గురూ ఎప్పుడూ సినిమా హాల్ మొహం ఎరుగరు. స్కూల్ నుంచి వచ్చాక ఇంట్లో ఎలా గడపాలి అని వాళ్ళ నాన్నగారు తయారు చేసిన టైం టేబుల్ ఉంటుంది. చదువుకోవడం, ఆడుకోవడం, తిండి తినడం అన్నీ దాని ప్రకారమే జరగాలి. ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళడం నిషిద్ధం. ఎక్కడికి వెళ్ళాలన్నా, ఏమి కొనాలన్నా వాళ్ళ నాన్నగారే స్వయంగా తీసుకెళతారు, కొనిస్తారు. రేవతి చిన్నప్పటి నుంచీ ఆడపిల్లల స్కూల్లోనే చదివింది. ఎప్పుడూ మగపిల్లలతో మాట్లాడి ఎరుగదు.

చిన్నప్పటి నుంచీ ఇలాంటి వాతావరణంలో పెరగడం వల్ల తండ్రి తనని ఎంత ప్రేమగా చూసుకుంటున్నప్పటికీ రేవతికి ఇల్లంటే జైలు అన్న భావన ఉంది. హాస్టల్లో అందరూ ఇంటి మీద బెంగ పెట్టుకుంటే రేవతి మాత్రం ఇంటికన్నా హాస్టలు బాగుంటుంది అంటుంది. ఇంట్లో దొరకని స్వేచ్ఛ ఇక్కడ దొరుకుతుందంటూ హాస్టల్లో తెగ అల్లరి చేస్తుంది.

ఆ ఆదివారం ఎప్పట్లాగే రేవతి ఇంటికి వెళ్ళింది. నీలూ, మేఘ ఆ వారమంతా పోగేసిన మాసిన బట్టలకి చాకిరేవు పెట్టారు. ఇద్దరూ కలిసి అలసట తెలీకుండా ముచ్చట్లు పెట్టుకుంటూ బట్టలు ఉతుక్కుంటున్నారు.

వాళ్ళని వెతుక్కుంటూ వార్డెన్ వచ్చింది అక్కడికి.

"మీ ఇద్దరితో చిన్న పనుంది. మీ గదికి వెళదాం రండి" అని పిలుచుకు వెళ్ళింది.

వీళ్ళు వెళ్ళేసరికి గది ముందు ఒక కొత్త అమ్మాయి పక్కనే పెద్ద సూట్కేసుతో నిలబడి ఉంది. దాదాపు వీళ్ళ వయసే ఉంటుంది. ఎవరా ఈ కొత్త మనిషి అనుకుంటూ వచ్చారు. ఆ అమ్మాయిని చూపిస్తూ వార్డెన్ పరిచయం చేసింది.

"తన పేరు సునంద. మొన్న వేసవిలోనే ఇంటర్మీడియెట్ అయిపోయింది. తను ఎంసెట్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం మన కాలేజీలో జాయిన్ అయింది. పక్క వీధిలో ఉన్న మన ఎంసెట్ క్యాంపస్లో ఉంటాయి తనకి క్లాసులు. ప్రస్తుతానికి అక్కడ హాస్టల్లో బెడ్స్ ఖాళీ లేవని మన బిల్డింగులో అడ్జస్ట్ చేయమని పంపించారు. మీ రూములో ఇదివరకు తీసేసిన మంచం ఉంది కదా.. అదే ప్లేసులో ఇప్పుడు మళ్ళీ మంచం తెప్పించి తనకిస్తాను. రెండు మూడు నెలల్లో అక్కడ ఖాళీ దొరికితే షిఫ్ట్ అయిపోతుంది" అని చెప్పి ఆ కొత్త అమ్మాయిని వాళ్ళ గదిలో వదిలి వెళ్ళింది వార్డెన్.

నీలూ, మేఘ ఇద్దరూ పేర్లు చెప్పి పరిచయం చేసుకున్నారు. సునంద చాలా కలుపుగోలుగా మాట్లాడటం వల్ల కొత్త అమ్మాయిలా అనిపించలేదు వాళ్ళకి.

"నేను మీకు సీనియర్ నే కాబట్టి నన్ను అక్కా అని పిలవచ్చు" అనడం మరీ నచ్చింది.

"మాది హైదరాబాదు. నేను ఇంటరు అక్కడే చదువుకున్నాను. ఎంపీసీ గ్రూప్. అప్పుడు ఎంసెట్ కోచింగ్ ప్రత్యేకంగా ఏమీ తీసుకోలేదు. ఎంసెట్ ఎంట్రన్స్ టైములో వైరల్ ఫీవర్ వచ్చి సరిగ్గా రాయలేదు. ఇక్కడ లాంగ్ టర్మ్ తీసుకుని మళ్ళీ రాస్తే మంచి కాలేజీలో సీటు వస్తుందని నాన్న ఫ్రెండ్ ఒక అంకుల్ చెప్పి నన్నిక్కడికి తీసుకొచ్చి జాయిన్ చేశారు. మీరిద్దరూ ఏ గ్రూప్?" తన గురించి వివరాలు చెప్తూ అడిగింది సునంద.

"మేఘ ఎంపీసీ. రేవతి అని ఇంకొక రూమ్మేట్ ఉంది మనకి. తనూ, నేనూ బైపీసీ. తను ఇంటికి వెళ్ళింది. రేపు ఉదయాన్నే వస్తుంది" చెప్పింది నీలూ.

"ఇదివరకు ఒక మంచం ఉండేది అన్నారు వార్డెన్ ఇందాక?" అడిగింది సునంద.

"అదా.. మేము ఫస్టియర్లో జాయిన్ అయినప్పుడు మాతో పాటు బబిత అని ఇంకొక అమ్మాయి ఉండేది. తనకి చాలా హోమ్ సిక్ నెస్ ఉండేది. సరిగ్గా అన్నం తినకుండా, నిద్రపోకుండా ఎప్పుడూ దిగాలుగా ఉండేది. రోజూ ఏడ్చేది. తనని చూస్తే పాపం అనిపించేది.

మాకందరికీ కూడా మొదట్లో హోమ్ సిక్ గా ఉన్నా నెమ్మదిగా అలవాటు పడిపోయాము. కానీ తను సర్దుకోలేకపోయింది. రెండు నెలల తర్వాత తనని ఇంటికి పంపించేశారు" జాలిగా చెప్పింది నీలూ.

"మొదటిసారి హాస్టలుకి రావడం కష్టంగానే ఉంటుందిలే. అంత మాత్రానికే ఇంటికి పంపించేసారా?" అడిగింది సునంద.

"అదంతా ఒక పెద్ద కథ. నువ్వు ఇవాళే హాస్టల్లో చేరావు కదక్కా.. అలాంటివన్నీ వింటే భయమేసి పారిపోతావేమో!" నీరసంగా అంది మేఘ.

"నేనేం అంత పిరికిదాన్ని కాదులే. అదేంటో వివరంగా తెలుసుకోకపోతేనే ఎక్కువ ఆలోచిస్తాను. పర్లేదు చెప్పండి" అంది సునంద.

మేఘ గతంలో జరిగినదంతా చెప్పడం మొదలు పెట్టింది.

"మేము ఇంటరు ఫస్టియరు కోసం ఈ కాలేజీలో చేరినప్పుడు ఈ బిల్డింగులోని రూములన్నీ మాకు, అంటే కొత్తగా వచ్చిన ఫస్టియర్స్ కి ఇచ్చారు. ఇలాంటిదే పక్కనే ఉన్న ఇంకో బిల్డింగు చూసే ఉంటావుగా, అందులో సెకండ్ ఇయర్ వాళ్ళు ఉండేవారు. మేము చేరిన ఐదారు వారాలకి సీనియర్స్ హాస్టల్లో ఒకమ్మాయి డాబా మీద నుంచి కిందకి దూకి ఆత్మహత్యాప్రయత్నం చేసింది. అది రెండంతస్థుల బిల్డింగ్ కదా, ఆ పైన డాబా ఎక్కి అక్కడినుంచి కింద ఉన్న నాపరాళ్ళ మీద పడేలా దూకింది."

"వామ్మో! నిజంగానా!? ఎందుకలా చేసింది? ఆ అమ్మాయి బతికిందా లేదా?" కంగారుగా అడిగింది సునంద.

"ఎందుకలా చేసిందనేది మాకైతే తెలియదు. మధ్యాహ్నం పన్నెండింటికి లంచ్ బ్రేక్ ఉంటుంది మనకి. మళ్ళీ రెండింటికి క్లాసులు ఉంటాయి. ఆ రోజు మధ్యాహ్నం రెండవుతుండగా ఆ అమ్మాయి దూకింది. అప్పటికే మేము చాలామందిమి వెళ్ళి క్లాసురూముల్లో కూర్చున్నాం. మా క్లాసులోకి లెక్చరర్ వచ్చిన అయిదు నిమిషాలకే ఇంకొక సర్ వచ్చి ఆయన్ని పిలుచుకుని బయటికి తీసుకు వెళ్ళారు. అప్పటికి ఏం జరిగిందని మాకు తెలీదు. క్లాసుకి ఆలస్యంగా వచ్చిన ఒక అమ్మాయి విషయం ఇదీ అని మా అందరికీ చెప్పింది."

నీలూ మధ్యలో అందుకుని "ఆ రోజు మేము ఎంత భయపడిపోయామంటే, చాలామంది ఏడవడం మొదలుపెట్టారు. హోమ్ సిక్ నెస్ వల్ల అలా చేసిందని ఒకరంటే, ఫస్టియర్లో మార్కులు సరిగ్గా రాలేదని చేసిందని మరొకరు, ఎంసెట్ ర్యాంక్ రాదని భయపడి చేసిందేమోనని మరొకరు, ఇలా అందరూ ఒకటే చర్చలు. కొందరేమో ఇలాంటి హాస్టల్లో మేముండం అన్నారు, కొందరేమో ఇలా ఆత్మహత్యలు చేసుకున్న ఇంట్లో ఉంటే ఏవో అరిష్టాలు జరుగుతాయి అన్నారు. మరికొందరేమో ఏమీ ఆలోచించలేక భయంతో వణికి చచ్చారు" అని చెప్పింది.

"ఆ చివరి కేటగిరీలో మేమున్నాం. ఆ రోజు ఆ అమ్మాయి దూకిన చోటకి స్టూడెంట్స్ ని ఎవర్నీ రానివ్వకుండా క్లాసుల్లోకి పంపించేసారు. మా లెక్చరర్ కూడా అరగంట తర్వాత వచ్చి యథాప్రకారంగా క్లాసులు తీసుకున్నారు. తర్వాత అలా ఇలా వార్డెన్ల దగ్గర నుంచి, కొందరు స్టూడెంట్స్ దగ్గర నుంచీ తెలిసింది, అప్పటికప్పుడు ఆ అమ్మాయిని హాస్పిటల్ కి తీసుకు వెళ్ళారని. తర్వాత ఆ అమ్మాయికి ఏం జరిగింది, బతికిందా లేదా అనేది మాకెవరికీ తెలియదు" చెప్పింది మేఘ.

"ఇంతకీ అసలు ఆ అమ్మాయి ఎందుకలా చేసిందో అదైనా తెలిసిందా?" అడిగింది సునంద.

“ఒకరకంగా అప్పటికి మేము కొత్త కాబట్టి మాకు సీనియర్స్ అందరూ సరిగ్గా తెలియరు కాబట్టి బతికిపోయాం. ఆ అమ్మాయి ఎవరో మాకు తెలిసుంటే ఇప్పటికీ ఆ విషయం మర్చిపోలేక భయపడి, బాధపడి చచ్చేవాళ్ళం. కొంతమంది సీనియర్స్ చెప్పడమైతే ఆ అమ్మాయి ఎప్పుడూ చాలా దిగులుగా ఉంటుంది, ఇంటి గురించి బాగా బెంగ, ఎంత చదివినా ఎక్కువ మార్కులు రావని బాధపడేది అని. ఏ కారణంతో అలా చేసిందని మనకి తెలియదు కానీ ఒక మనిషి ఇలా కావాలని చచ్చిపోవడం అనేది మాత్రం మొదటిసారి అంత దగ్గర నుంచీ చూసేసరికి బాగా భయపడ్డాం. నాన్నావాళ్ళకి చెప్పి ఈ హాస్టలు నుంచి వెళ్ళిపోదాం అనుకున్నాం. కానీ, మెల్లగా అందరిలాగే మేము కూడా ఈ హాస్టలుకి అలవాటు పడిపోయాము” జాలిగా చెప్పింది నీలూ.

“ఇక్కడ చదువుకోకుండా ఇంటికి వెళితే మా ఊర్లో ఇంత మంచి కాలేజీలు లేవక్కా. ఎలాగైనా కష్టపడి ఇంటర్ బాగా చదివితేనే కదా తర్వాత ఏమైనా చేయగలిగేది. మా పేరెంట్స్ చాలా కష్టపడి ఇంతింత ఫీజులు కట్టి చేర్పించారు. కాబట్టి ఎలాగైనా సర్దుకుపోవడం తప్ప మాకు వేరే అవకాశం కూడా లేదు” నెమ్మదిగా, స్థిరంగా చెప్పింది మేఘ.

“హ్మ్.. అనవసరంగా నేనిప్పుడు మీకు అదంతా గుర్తు చేసినట్టున్నాను. అన్నీ చోట్లా రకరకాల మనుషులు ఉంటారు. మన వీధిలో, మన పక్కింట్లో కూడా వేరే రకం మనుషులు ఉండొచ్చు. ఎవరెవరికి ఏమేం సమస్యలున్నాయో మనకి తెలియదు కదా.. ఎవరికో ఏదో జరిగిందని మనం ఏదేదో ఊహించుకుని భయపడకుండా ధైర్యంగా ఉండటం నేర్చుకోవాలి” అని సునంద చెప్తుంటే “సునందక్కకి చాలా ధైర్యం ఉంది” అనుకున్నారు నీలూ, మేఘ.

“ఇంతకీ ఆ అమ్మాయి ఎవరో సూసైడ్ చేసుకోవడానికీ, మీ రూమ్లో ఉన్న అమ్మాయి వెళ్ళిపోవడానికీ సంబంధం ఏంటో చెప్పలేదు?” అంది సునంద.

“ఓ.. మర్చేపోయాం. మా రూమ్మేట్ బబిత ఎప్పుడూ ఏడుస్తూ, బాధగా ఉండేది అని చెప్పాం కదా. తను ఒకటి రెండు సార్లు నిద్రలో గట్టిగా ఏడుస్తూ కేకలు పెట్టింది. మేమందరం బిత్తరపోయాం. వార్డెన్ తనని సముదాయించి ఆవిడ రూమ్లో పడుకోబెట్టుకున్నారు. అయినాసరే తను రాత్రి పూట అలాగే అరిచేది. ఇంతలో ఆ సీనియర్ అమ్మాయి సూసైడ్ చేసుకునేసరికి హాస్టలు వాళ్ళు భయపడి ముందుజాగ్రత్తగా బబిత పేరెంట్స్ ని పిలిపించి తనని ఇంటికి పంపించేసారు. బబిత పూర్తిగా రెండు నెలలు కూడా లేదు ఇక్కడ. తను వెళ్ళిపోయాక ఇంకెవరూ ఈ రూంకి రాలేదు. మేము ముగ్గురమే ఉంటున్నాం. ఇప్పటికి నువ్వొచ్చావు” నవ్వింది నీలూ.

అప్పుడే బట్టల విషయం గుర్తొచ్చి మేఘ “నీలూ.. మనం బట్టలు ఉతకడం మధ్యలో వదిలేసి వచ్చి ఇక్కడ కూర్చుని కబుర్లు చెప్తున్నాం” అనేసరికి అందరూ నవ్వారు.

“పదండి. నేనూ వచ్చి మీకు హెల్ప్ చేస్తాను” అని లేచింది సునంద.

“అయ్యో పర్లేదక్కా.. మేము ఉతికేస్తాంలే” అన్నా వినకుండా “కనీసం ఆరెయ్యడంలో అయినా హెల్ప్ చేస్తాను” అంటూ వాళ్ళ కూడా వెళ్ళింది.

హాస్టల్లో ఒక ఆదివారం మధ్యాహ్నం భోజనాల తర్వాత నీలూ, మేఘ, రేవతి, సునంద, రజని అందరూ కలిసి కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. రేవతి నాన్నగారు ఆ వారం మద్రాసు నించి రాలేదని రేవతి ఇంటికి వెళ్ళకుండా హాస్టల్లోనే ఉంది.

ఇంతలో ఒక అమ్మాయి వచ్చి నీలూ, మేఘ కోసం ఎవరో వచ్చారని క్రింద నుంచి వాచ్ మెన్ పిలుస్తున్నాడని చెప్పింది.

"నాన్నా వాళ్ళు ఈ వారం వస్తానని చెప్పలేదే, మనకోసం ఎవరు వచ్చి ఉంటారు?" అనుకుంటూ బయట బాల్కనీలోకి వెళ్ళి చూస్తే కింద వాచ్ మెన్ కనిపించాడు.

"విజిటర్స్ వచ్చింది ఎవరి కోసం?" అని అడిగితే "సెకండియర్ మేఘనందన, సునీల" అని చెప్పాడు.

వాళ్ళిద్దరూ మెట్లు దిగి కిందకి వెళుతుంటే రజని తనని పిలవకపోయినా ఉత్సాహంగా "మన ఊరి నుంచి ఎవరన్నా వచ్చారేమో పదండి పదండి" అంటూ వారి వెనకే తనూ బయలుదేరింది.

ముగ్గురూ కలిసి గేటు దగ్గరికి వెళ్ళి చూసేటప్పటికి అక్కడ ప్రదీప్, కిరణ్ కనిపించారు.

"హాయ్.. మీరేంటి ఇక్కడ? గర్ల్స్ హాస్టల్ కి భలే వచ్చారే. వాచ్ మెన్ ఏమీ అనలేదా?" ఆశ్చర్యపోతూ పలకరించారు నీలూ, మేఘ.

"మాకు తెలిసిన వాళ్ళ అమ్మాయిలు ఉన్నారు. ఐదు నిమిషాలు మాట్లాడి వెళ్ళిపోతాం అని రిక్వెస్ట్ చేశాం. మీ పేర్లు చెప్పాక వెంటనే సరే అన్నాడు. మీ మీద మంచి ఇంప్రెషన్ ఉందనుకుంటా.." నవ్వారు వాళ్ళిద్దరూ.

వాళ్ళ నలుగురి వంకా అయోమయంగా చూస్తున్న రజనిని చూసి మేఘ "అప్పుడు సెలవుల్లో ఇంటికి వెళ్ళేప్పుడు పరిచయం అయిన ఫ్రెండ్స్ అని చెప్పాం కదా, ప్రదీప్, కిరణ్" తనకి పరిచయం చేసింది.

"నీలూ వాళ్ళ ఊరే రజనిది. నీలూకి బంధువులు కూడా. ఇక్కడ మేము ముగ్గురం కలిసే ఉంటాం హాస్టల్లో" రజనిని కూడా వాళ్ళిద్దరికీ పరిచయం చేసింది మేఘ.

ముగ్గురూ పరస్పరం హలో హాయ్ చెప్పుకున్నారు.

"నా పుట్టినరోజుకి నువ్వు పంపించిన సరస్వతీదేవి బొమ్మ చాలా చాలా బాగుంది ప్రదీప్.. అమ్మా, నాన్నలకి కూడా చాలా నచ్చింది. అంత మంచి గిఫ్ట్ పంపించినందుకు చాలా థాంక్స్" అభిమానంగా చెప్పింది మేఘ.

"ఇట్స్ ఓకే మేఘా.. మై ప్లెజర్.. హేయ్.. ఫస్టియర్ రిజల్ట్స్ వచ్చాయి కదా. కిరణ్ కి 95% వచ్చింది. మనోడికి ఫస్ట్ అటెంప్ట్ లోనే డాక్టర్ సీటు ఖాయం" గొప్పగా చెప్పాడు ప్రదీప్.

"అవునా!" అని అందరూ ఆశ్చర్యం ప్రకటించి కిరణ్ కి కంగ్రాట్స్ చెప్పారు.

"మరి నీ సంగతేంటి ప్రదీప్? నీకు డాక్టర్ పట్టా రిజర్వ్ అవ్వలేదా?" ఆటపట్టించింది మేఘ.

"నాకు డిస్టింక్షన్ వచ్చింది. అయినా నాకు డాక్టరే అవ్వాలని రూల్ లేదులే. అది కాకపోతే ఇంకోటి. బోల్డు దారులున్నాయిలే" అన్నాడు ప్రదీప్.

కాసేపు మార్కుల గురించి సరదా మాటలు అయ్యాక రజని ఏమైనా ఇబ్బందిగా ఫీలవుతుందేమోనని మేఘ టాపిక్ మార్చాలని ప్రయత్నిస్తూ "ఇంతకీ మీరింత సడన్ గా మమ్మల్ని చూడ్డానికి వచ్చారేం? ఏంటీ విశేషం?" అని అడిగింది.

"మీ ఇద్దరికీ హేపీ ఫ్రెండ్షిప్ డే" అని ఒక కవర్ మేఘ చేతికిచ్చాడు ప్రదీప్.

అప్పటిదాకా 'ఫ్రెండ్షిప్ డే' అని ప్రత్యేకంగా ఒకటి ఉంటుందని కూడా తెలియని నీలూ, మేఘ, రజని ముగ్గురూ బిక్కమొహం వేసారు.

"ఇంతకీ మేము ఏం ఇచ్చామో చూడరా?" అని ప్రదీప్ అనేసరికి కవర్ తెరిచి చూసారు.

అందులో రెండు పెన్ పెన్సిల్స్, రెండు చిన్ని టెడ్డీ బేర్ బొమ్మలు, రెండు ఫైవ్ స్టార్ చాక్లెట్స్ ఉన్నాయి. అప్పటిదాకా మామూలు పెన్సిళ్ళే తప్ప అలాంటి లేటెస్ట్ పెన్ పెన్సిల్స్ వాడింది కూడా లేదు కాబట్టి అవన్నీ చూస్తూనే సంతోషంగా అనిపించింది నీలూ, మేఘలకి.

"ఎల్లో కలర్ కావాలనే తీసుకున్నాం. ఫ్రెండ్షిప్ కి ఎల్లో కలర్ సింబల్ కదా" అని ప్రదీప్ చెప్పగానే వీళ్ళకి ఆ విషయం తెలీకపోయినా బదులుగా "అవును కదా.." అన్నట్టు ఒక వెర్రి నవ్వు నవ్వేశారు.

"మీరు తెచ్చిన గిఫ్ట్స్ చాలా బాగున్నాయి. మెనీ థాంక్స్" అని మేఘ చెప్పాక "రజనితో మాట్లాడుతూ ఉండండి. ఇప్పుడే ఒక్క నిమిషంలో వస్తాం" అని చెప్పి నీలూ మేఘని లాక్కుని పక్కకి తీసుకెళ్ళింది.

"ఏవిటే వాళ్ళని అక్కడ నించోబెట్టేసి మనం ఇలా వచ్చెయ్యడం ఏం బాగుంటుంది?" అని మేఘ అంటే, "నీ మొహం.. వాళ్ళు మన కోసం అంత చక్కటి గిఫ్ట్స్ తీసుకొచ్చి ఇస్తే మనం సోదిమొహాల్లా తీసుకుని ఊరుకుంటే ఇంకా అస్సలు బాగోదు. మనం కూడా వాళ్ళకి ఫ్రెండ్షిప్ డే విషెస్ చెప్తూ ఏదైనా ఇస్తే బాగుంటుంది కదా.." అంది నీలూ.

"నీ ఆలోచన బానే ఉంది కానీ ఇప్పటికిప్పుడు ఏం ఇవ్వగలం?" తిరిగి ప్రశ్నించింది మేఘ.

"నీకసలు పరీక్షల్లో అన్నేసి మార్కులు ఎలా వస్తున్నాయే బాబూ.. ఇంత చిన్న విషయాలు కూడా బుర్రకి ఎక్కవు. మన హాస్టల్ షాపీ ఉంది కదా.." అని మేఘతో చెప్తూనే ఆ షాప్ కౌంటర్ దగ్గరికి లాక్కెళ్ళింది.

"ఆంటీ.. మంచి పెన్స్ ఏం ఉన్నాయి? స్పెషల్ వి ఏమన్నా ఉంటే చూపించండి. కాస్త అర్జెంట్" అని అడిగింది.

ఆవిడ రెండు మూడు రకాలు చూపించి "ఇవి బాల్ పెన్స్ లో రకాలు. ఇంకా పైలట్ పెన్స్, ఇంక్ పెన్స్ కూడా ఉన్నాయి" అని చెప్పింది.

పైలట్ పెన్ అంటే బోల్డు ఇష్టం ఉన్న మేఘ పైలట్ పెన్స్ తీసుకుందాం అంది. వాటితో పాటు రెండు డైరీ మిల్క్ చాక్లెట్స్ కూడా తీసుకుని డబ్బులు మళ్ళీ తర్వాత వచ్చి ఇస్తాం అని రిక్వెస్ట్ చేసి గబగబా అవి తీసుకుని వెనక్కి వెళ్ళారు.

తిరిగి వెళ్ళేసరికి రజనితో పాటు రేవతి, సునంద కూడా ఉన్నారు.

"మళ్ళీ ఇంకోసారి పరిచయాలు అక్కర్లేదు. ఆల్రెడీ అయిపోయాయి" రేవతి అనగానే అందరూ నవ్వారు.

"మా తరపున మీక్కూడా హేపీ ఫ్రెండ్షిప్ డే" అని చెప్పి పెన్నులు, చాక్లెట్లు కిరణ్ చేతికిచ్చింది నీలూ.

వాళ్ళు తీసుకుని థాంక్స్ చెప్పారు.

ఇంకో పది నిమిషాలు గడిచాక "మేము వచ్చి దాదాపు ఇరవై నిమిషాలు కావొస్తోంది. మీ వాచ్ మెన్ వచ్చి చెప్పేలోపు మేమే వెళతాం" నవ్వాడు ప్రదీప్.

ఇంకోసారి వాళ్ళు వచ్చినందుకు, గిఫ్ట్స్ ఇచ్చినందుకు థాంక్స్ చెప్పి బై చెప్పేసి హాస్టల్లోకి వచ్చేసారు నలుగురమ్మాయిలు.

రూంకి వెళ్ళగానే రేవతి ఉత్సాహంగా "గిఫ్ట్స్ చూపించండీ" అంటూ మేఘ చేతిలో ఉన్న కవర్ లాక్కుంది. వాళ్ళు తెచ్చిచ్చిన బుల్లి టెడ్డీస్ చూసి పెద్ద కేక పెట్టింది.

"ఏవిటే నీ ఆర్తనాదాలు, ఏదో బాంబుని చూసినట్టు అంత గావుకేక పెట్టావేమిటీ? భయపడి చచ్చాను" వీపు మీద ఒక్కటి చరిచింది మేఘ.

"అసలీ టెడ్డీస్ గురించి నీకేమన్నా తెలుసా అని? హయ్యో హయ్యో.. నాలాంటిదానికి ఇవ్వకుండా నీలాంటి ముసలమ్మలకి ఇలాంటి గిఫ్ట్స్ ఇచ్చే బాయ్ ఫ్రెండ్స్ ఉన్నారు. సో సాడ్!" దుఖం అభినయించింది రేవతి.

"నోర్ముయ్యి.. నీకసలు హద్దూ పద్దూ లేకుండా పోతోంది. బాయ్ ఫ్రెండ్స్ ఏంటీ.. పిచ్చి మాటలన్నీ వాగకు. మేము మంచి ఫ్రెండ్స్ అంతే.." చిరుకోపంగా అంది మేఘ.

"ఆపు తల్లోయ్ నీ లెక్చర్లు.. బాయ్ ఫ్రెండ్ అంటే లవర్ అని కాదు అర్థం, ఎ బాయ్ హూ ఈజ్ ఎ ఫ్రెండ్ అని, సరేనా! అయినా ప్రతీదీ అంత సీరియస్ గా తీసుకుంటావేంటి? సరదాగా జోక్స్ వేసుకుంటే కూడా తప్పేనా?" బుంగమూతి పెట్టింది రేవతి.

"సర్లే.. అలాగే ఏదోకటి ఏడువు.." రేవతి తల మీద చిన్నగా మొట్టికాయ వేసింది మేఘ.

"అది సరే, ముందు ఈ బొమ్మలు చూసి ఎందుకు అరిచావో అది చెప్పు.." ఆసక్తిగా అడిగింది రజని.

"లేటెస్ట్ గా అబ్బాస్, ప్రీతి ఝాంగియానిది ఒక హిందీ మ్యూజిక్ వీడియో వచ్చింది. 'చుయ్ ముయ్ సీ తుమ్ లగ్తీ హో..' భలే రొమాంటిగ్గా ఉంటుందిలే. అందులో హీరోయిన్ దగ్గర ఇలాంటిదే బుల్లిటెడ్డీ ఉంటుంది. దీని చేతులతో దేన్నైనా ఫ్లక్ చెయ్యొచ్చు. ఇలా భుజం మీద డ్రెస్ ని పట్టుకు వేళ్ళాడుతున్నట్టు పెట్టుకుంటుంది అందులో హీరోయిన్. చివరికి ప్రేమించిన హీరోకి గిఫ్ట్ గా ఇస్తుంది. సేమ్ అదే ఇది. కావాలంటే చూడండి" అని డ్రెస్ కి పెట్టి మరీ చూపించింది రేవతి.

"హాయ్యే.. భలే కదా!" ఉత్సాహంగా అరిచారు నీలూ, మేఘ.

రజని ఏమీ మాట్లాడలేదు. ఆమెకి అసూయగా అనిపించింది. ఆ రోజు తను కూడా ఊరెళ్ళేప్పుడు వాళ్ళతో ఉందుంటే తనకి కూడా ఫ్రెండ్స్ అయ్యుండేవాళ్ళు కదా అని మనసులో గింజుకుంది.

"మీ ఇంట్లోనేమో పరమ వీర స్ట్రిక్టు. కనీసం కేబుల్ టీవీ కూడా లేదు కదా.. నీకెలా తెలుసే ఇలాంటి విషయాలన్నీ?" రేవతిని ఆరాగా అడిగింది మేఘ.

"మా నాన్నకి ఇంక ఇరవై నాలుగ్గంటలూ నన్ను కనిపెట్టుకు ఉండటమే పనా ఏంటీ, అయినా అప్పటికీ పాపం 23 గంటలు అదే పనిలో ఉంటారనుకో! కానీ ఆ దొరికిన ఒక గంటని నేను సద్వినియోగం చేసుకుంటానుగా.. అదే మరి మన గొప్పతనం" కాలర్ ఎగరేసింది రేవతి.

"నువ్వసలు జగత్కంత్రీవే బాబూ.. మరి మీ అమ్మ గారి సంగతో?" నీలూ అడిగింది.

"మా అమ్మకి పాపం అంత టైం ఎక్కడ ఉంటుందే? ఓ పక్క టీచరు ఉద్యోగంతో స్కూల్లో పిల్లల సంత కాకుండా ఇంట్లో మా ఇద్దరు తమ్ముళ్ళని భరించాలి. మా నాన్న ఎలాగో సూపర్ స్ట్రిక్ట్ కదాని నా బాధ్యత పూర్తిగా ఆయనకే వదిలేసిందిలే. ఆయన మద్రాసులో ఉద్యోగం చెయ్యడం మనకి కలిసొస్తుంది అప్పుడప్పుడూ" గట్టిగా నవ్వింది రేవతి.

"ఆహాహా.. ఏం తెలివితేటలే నీవి. సూపర్ బ్రెయిన్" స్నేహితురాళ్ళందరూ నవ్వేసారు.

"ఇంతకీ ప్రదీప్, కిరణ్ కోసం మీరిద్దరూ వెళ్ళి ఏవో గిఫ్ట్స్ కొనుకొచ్చి ఇచ్చారుగా. ఏం తెచ్చారేంటి?" అడిగింది రేవతి.

"పైలట్ పెన్స్, డైరీ మిల్క్ చాక్లెట్స్" చెప్పింది నీలూ.

"పెన్నులు ఎందుకు ఇచ్చారు? ఫ్రెండ్స్ కి పెన్స్ గిఫ్ట్ గా ఇస్తే విడిపోతారంట తెలుసా?" అంది రేవతి.

"అయ్యో అవునా.. ఈ విషయం మాకు తెలీదు. మరి ఏం గిఫ్ట్స్ ఇస్తే ఫ్రెండ్షిప్ ఎప్పటికీ నిలుస్తుంది?" ఆదుర్దాగా అడిగింది నీలూ.

"హేండ్ కర్చీఫ్ గిఫ్ట్ గా ఇస్తే ఫ్రెండ్స్ ఎప్పటికీ విడిపోరంట" నమ్మకంగా చెప్పింది రేవతి.

"నీ మొహం! నువ్వు అనవసరంగా వర్రీ అవ్వకు నీలూ.." రేవతి మాటల్ని కొట్టిపారేస్తూ నీలూకి సర్ది చెప్పింది మేఘ.

"ఏమో.. కొంతమంది ఎక్స్పీరియెన్స్ ని బట్టి అలా చెప్పారు. ఎప్పుడో అప్పుడు నీకు అనుభవమైతే నువ్వూ నమ్ముతావేమో, ఎవరికి తెలుసు!" అంది రేవతి.

"సర్లే.. నీ శాపం ఫలించాలని కోరుకుందాం" తేలిగ్గా నవ్వేసింది మేఘ.

కొన్నాళ్ళకి కాలేజీకి వారం రోజులు దసరా సెలవులు ఇచ్చారు.

షరా మాములుగా సెలవలిచ్చే రోజున పరీక్షలు పెట్టి మధ్యాహ్నం నుంచి ఇంటికి వెళ్ళడానికి అనుమతినిచ్చారు కాలేజీ యాజమాన్యం. సునంద అప్పటికి నాలుగు రోజుల ముందే హైదరాబాదు వెళ్ళిపోయింది. రేవతిని వాళ్ళ నాన్నగారు వచ్చి ఇంటికి తీసుకువెళ్ళారు.

నీలూ, మేఘ, రజని ముగ్గురూ కలిసి హాస్టల్ నుంచి ఇంటికి వెళ్ళడానికి బస్టాండుకి బయలుదేరారు. మొత్తం కాలేజీ అంతటికీ ఒకేసారి సెలవులు ఇస్తారు కాబట్టి వీళ్ళు అక్కడికి వెళ్ళేసరికి ప్రదీప్, కిరణ్ బస్టాండులో ఎదురుచూస్తూ కనిపించారు.

ప్రదీప్ వెళ్ళి మంచినీళ్ళ బాటిల్స్ తో పాటు చాక్లెట్స్, బిస్కెట్స్ కొనుక్కొచ్చాడు. ముగ్గురు కూర్చునే వీలున్న సీట్లో అమ్మాయిలు కూర్చుంటే, వారి పక్కనే ఉన్న డబుల్ సీట్లో ఇద్దరు అబ్బాయిలు కూర్చున్నారు.

బస్సు కృష్ణానది మీద నుంచి వెళుతూ ప్రకాశం బ్యారేజీ మీదకు రాగానే మేఘ ఆనందంగా కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చుంది. అంతలోనే ఏదో గుర్తొచ్చి బ్యాగులో వెతుక్కుని "నీలూ, నీ దగ్గర చిల్లర నాణేలు ఉంటే నాకొకటి ఇవ్వు. అర్జెంట్, తొందరగా.." అని కంగారుపెట్టింది.

"దీనికిదో పిచ్చి.." నీలూ ముద్దుగా విసుక్కుంటూ చిల్లర కోసం తన బ్యాగు వెతికి చూసి లేదని చెప్పింది.

"నా దగ్గరుంది" అని చెప్పి కిరణ్ తన జేబులోంచి రూపాయి నాణెం తీసి ఇచ్చాడు. మేఘ అది తీసుకుని కిటికీలోంచి కృష్ణానది నీళ్ళల్లో పడేలా విసిరింది.

"అదేంటి.. డబ్బులు అలా పారేశావ్?" అర్థంకాక అడిగాడు కిరణ్.

"అయ్యో రామా.. అది పడెయ్యడం కాదు. కృష్ణానదికి భక్తిగా సమర్పించడం. చిన్నప్పుడు మా అమ్మమ్మ చెప్పింది. కృష్ణా, గోదావరి లాంటి పుణ్యనదులలో కానుకలు వేసి మనం ఏది కోరుకుంటే అది జరిగిపోతుందట తెలుసా!"

మేఘ చెప్పింది విని నిమిషం సేపు ఆపకుండా గట్టిగా నవ్వాడు కిరణ్.

"ఓయ్.. అలా నవ్వుతావేంటి? అది నిజమే. నేను పోయినసారి నాకు ఫస్టియర్ లో మంచి మార్క్స్ రావాలని కోరుకున్నాను. నా కోరిక నెరవేరిందిగా!" అంది మేఘ.

"నువ్వు డబ్బులు పారేసుకోకపోయినా నీకు మంచి మార్కులే వచ్చి ఉండేవి. ఎందుకంటే నువ్వు కష్టపడి చదివి ఎక్జామ్స్ రాశావు కాబట్టి. అంతేగానీ కృష్ణానది వెళ్ళి నీ పరీక్ష పేపర్లు దిద్ది నీకేం మార్కులు వెయ్యలేదు. చదువురాని పల్లెటూరివాళ్ళలా ఇలాంటి మూఢనమ్మకాలు కూడా నువ్వు నమ్ముతావా సిల్లీగా?" అన్నాడు కిరణ్ ఇంకా నవ్వుతూ.

ఆ చివరి మాటకి అలిగి మూతి బిగించుకుని కిటికీలోంచి బయటకి చూస్తూ కూర్చుంది మేఘ.

"ఓకే.. సారీ.. నువ్వు చెప్పిందే కరక్ట్ అని ఒప్పుకుంటాలే. ఈసారి నువ్వు కోరుకుంది జరుగుతుందో లేదో టెస్ట్ చేసి చూద్దాం. మరి నువ్వేం కోరుకున్నావో చెప్పు" అన్నాడు కిరణ్ రాజీకొస్తూ.

"ఊహూ.. మనం కోరుకున్నవి ఎప్పుడూ బయటికి చెప్పకూడదు. చెప్తే నేరవేరవు. మనసులోనే ఉంచుకోవాలి" నమ్మకంగా చెప్పింది మేఘ.

"మళ్ళీ ఇదొక రూల్ ఉందా? సరే అయితే నా రూపాయి తీసుకుని వేసావు కదా నువ్వు. ఇప్పుడు నీ కోరిక తీరుతుందా, నా కోరిక తీరుతుందా? ఏది న్యాయం చెప్పు" మళ్ళీ నవ్వాడు కిరణ్.

"అయ్యబాబోయ్.. ఎక్కువ మాట్లాడనట్టు సైలెంట్ గా కనిపిస్తావ్ కానీ నువ్వు కనిపించేంత బుద్ధిమంతుడివి కాదు" కోపంగా అంది మేఘ.

"ఒక్క రూపాయి కోసం ఇప్పుడు మీరిద్దరూ బస్సులో కురుక్షేత్ర యుద్ధం చెయ్యకండి ప్లీజ్.. కావాలంటే మీ ఇద్దరికీ చెరొక రూపాయి నేనిస్తాను" అని ప్రదీప్ అనేసరికి అందరూ నవ్వేశారు.

వీళ్ళందరితో కలిసి ఇలా సరదాగా ప్రయాణం చెయ్యడం రజనికి చాలా నచ్చింది. ప్రదీప్, కిరణ్ లతో నీలూ, మేఘలకి ఉన్నంత పరిచయం లేకపోయినా కొత్త లేకుండా తను చాలా తొందరగా కలిసిపోయింది.

మధ్యలో ఒక ఊరి దగ్గర ఉడికించిన వేరుశనక్కాయలు అమ్ముతుంటే అందరూ తింటారని ప్రదీప్ బస్ దిగి వెళ్ళి కొనుక్కొచ్చాడు. అందరూ ఇష్టంగా తింటుంటే కిరణ్ మాత్రం వద్దన్నాడు.

"ఎందుకొద్దు? చాలా రుచిగా ఉంటాయి. తిను నువ్వు కూడా.." అని మేఘ అంటే "ఉహూ.. నాకిష్టం లేదు" అన్నాడు.

మేఘ ఊరుకోకుండా కొన్ని కాయలు వలిచి "ఏదీ.. ఒకసారి నీ చెయ్యి చాపు" అని అడిగి వలిచిన గింజల్ని అరచేతిలో పెట్టి "ఒకసారి తినూ.. నిజంగా బాగుంటాయి" అంది.

కిరణ్ కి చాలా నవ్వొచ్చింది మేఘ అలా చెప్తుంటే. మారుమాట్లాడకుండా తినేశాడు.

"బావున్నాయి కదూ.. నే చెప్పలేదూ.." మేఘ అంటుంటే ఏం బదులివ్వకుండా నవ్వాడు కిరణ్.

అందరూ ఎవరివి వాళ్ళు తినేస్తుంటే మేఘ మాత్రం కిరణ్ కోసం కూడా కొన్ని కాయలు వలిచిపెట్టింది. వద్దనుకుండా తనూ తినేశాడు.

ఐదుగురూ కలిసి కాలేజీ, హాస్టలు కబుర్లు చెప్పుకున్నారు. అందరికీ కామన్ గా ఉన్న సబ్జెక్టులకి లెక్చరర్స్ ఒకరే కావడంతో వాళ్ళందరూ ఎవరెవరు ఎలా పాఠాలు చెప్తారో సరదాగా ముచ్చటించుకున్నారు. అబ్బాయిల హాస్టల్లో మెస్ మేనేజర్ వంటలు సరిగ్గా చేయించి పెట్టడం లేదని అబ్బాయిలందరూ కలిసి అతన్ని చీకట్లో ఎలా పట్టుకుతన్నారో ప్రదీప్ వర్ణించి చెప్తుంటే అందరూ తెగ నవ్వారు.

ఐదుగురి స్నేహితులకీ ఛలోక్తులతో, నవ్వులతో గంటల కొద్దీ సాగిన ప్రయాణం క్షణాల్లో ముగిసినట్టు తోచింది. ఎంత అందమైన ప్రయాణమైనా, ఎంత ఆనందంగా సాగినా గమ్యం చేరేవరకేగా పయనం సాగేది!

ముందు ప్రదీప్, కిరణ్, తర్వాత నీలూ, రజని, చివరిగా మేఘ అందరినీ ఎవరి ఊరికి వారిని వరసగా చేర్చింది బస్సు. వర్తమానంలో తమ అస్థిత్వాన్ని కోల్పోయిన ఆ అందమైన క్షణాలన్నీ వారందరి మనసుల్లో ఒక అరుదైన జ్ఞాపకంగా శాశ్వతమై నిలిచాయి.

ఎప్పట్లాగే హాస్టలు పక్షులు ఇంటికొచ్చాక ఇంట్లో కమ్మగా అమ్మ వండిపెట్టినవి కడుపు నిండా తింటూ, కంటి నిండా నిద్రపోతూ సెలవుల వైభోగాన్ని అనుభవిస్తున్నారు.

దసరా పండక్కి ఊరు నుంచి వచ్చిన పిన్ని పిల్లలతో హాయిగా కాలక్షేపం చేస్తోంది మేఘ. సెలవుల్లో చదువుకుందామని తెచ్చుకున్న పుస్తకాలన్నీ మోసుకొచ్చిన బ్యాగులోనే మగ్గిపోతున్నా సరే ఇంట్లో పెద్దవాళ్ళు చదువు ఊసెత్తకుండా స్వేచ్ఛగా వదిలేశారు.

నీలూ సెలవల్లో పూర్తి చేయవలసిన బయాలజీ రికార్డ్స్ ముందేసుకుని రోజూ కాసేపు శ్రద్ధగా బొమ్మలేసుకుంటోంది. రజని ప్రతిరోజూ నీలూ వాళ్ళింటికి వచ్చిపోతున్నా మామూలుగా తనతో కబుర్లు చెప్పి వెళ్ళిపోతోందే తప్ప మళ్ళీ శ్రీకాంత్ ప్రేమ విషయం ప్రస్తావించలేదు. నీలూ కూడా గతంలో జరిగినవి మర్చిపోయి రజనితో ఇదివరకటిలానే స్నేహంగా ఉంటోంది.

మేఘ సెలవులు ఉన్నన్నాళ్ళూ విధిగా రెండు రోజులకొకసారి నీలూకి ఫోన్ చేస్తూనే ఉంది. రజని ప్రవర్తన మారిందని నీలూ చెప్పిన విషయం విని సంతోషించింది.

ప్రదీప్ కిరణ్ వాళ్ళింట్లో మూడు రోజులు ఉండి మిగతా సెలవులకి హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఊరికెళ్ళే రోజున మేఘకి ఫోన్ చేసి మాట్లాడాడు. తర్వాత కిరణ్ కూడా రెండు సార్లు ఫోన్ చేశాడు. కాలేజీ చదువులు, హాస్టలు కష్టాలు, కుటుంబం, ఫ్రెండ్స్.. ఇలా

బోల్డన్ని విషయాలు వాళ్ళ కబుర్లలో దొర్లేవి. పెళ్ళిళ్ళయిపోయి అమెరికాలో ఉంటున్న పెద్దక్క గురించి, హైదరాబాదులో ఉంటున్న చిన్నక్క గురించి చెప్పేవాడు కిరణ్. తోబుట్టువులు లేని మేఘకి అవన్నీ వినడం ఉత్సాహంగా అనిపించేది.

ఒకసారి మాటల్లో "నేను అడిగితే మా మమ్మీ ఏమైనా చేస్తుంది తెలుసా.." అని కిరణ్ గొప్పగా చెప్తే "ఎవరి మమ్మీలైనా అంతే.." అంది మేఘ.

"అదేం కాదు మా మమ్మీ ఇంకా సూపర్ స్పెషల్. నా కోసం బయాలజీ రికార్డులు కూడా గీసిస్తుంది. ఆ బొమ్మలన్నీ గీస్తూ కూర్చోవాలంటే నాకు మహా బోర్.." అన్నాడు కిరణ్.

ఆ మాట విని మేఘ చాలా ఆశ్చర్యపోయింది. తను చెప్పిన విషయాలన్నీ వింటుంటే కిరణ్ వాళ్ళ మమ్మీ, డాడీ తనని చాలా గారంగా చూసుకుంటారని, వాళ్ళింట్లో కిరణ్ మాటకి ఎదురు ఉండదని మేఘకి అర్థమైంది.

ఇంటిపట్టున వారం రోజుల సెలవల్ని హాయిగా గడిపేసి అందరూ తిరిగి హాస్టళ్ళకి చేరుకున్నారు. హాస్టలుకి వస్తూనే మళ్ళీ క్లాసులు, కోచింగ్, పరీక్షలు అంటూ చదువుల్లో మునిగిపోయారు.

బెటర్మెంట్ పరీక్షల తేదీలు ప్రకటించారని తెలిసింది. రజని తప్ప ఎవరూ పరీక్షలు రాయడం లేదు. ఇంటర్మీడియేట్ పరీక్షల్లో మార్కులు అటూ, ఇటూ అయినా పెద్ద నష్టమేమీ లేదనీ, దానికన్నా ఉన్న సమయాన్నంతా ఎంసెట్ కి ప్రిపేర్ అవ్వడంలోనే వినియోగించుకోవాలని వారందరూ నిర్ణయించుకున్నారు.

మాథ్స్ సప్లిమెంటరీ పరీక్షకి ప్రిపేర్ అవడంలో రజనికి మేఘ చాలా సహాయపడింది. తనతో పాటు కూర్చుని ఫస్టియర్ సబ్జెక్ట్ దగ్గరుండి చదివించింది.

ఇంటర్మీడియేట్ పరీక్షాకేంద్రాల్లో జంబ్లింగ్ సిస్టం అమలులో ఉండటం వల్ల ఒకే కాలేజీ విద్యార్థులు కూడా వేర్వేరు పరీక్షాకేంద్రాల్లో రాయవలసి వచ్చింది. అన్నీ ఎగ్జామినేషన్ సెంటర్లకి ఒక్కో చోటకి ఒక్కో మినీ వ్యాన్ వేసారు కాలేజీ వారు. బెటర్మెంట్ పరీక్షలు రాసే విద్యార్థులు మరీ ఎక్కువమంది లేకపోవడంతో ప్రతీ సెంటరుకీ అమ్మాయిలకీ, అబ్బాయిలకీ కలిపి ఒకే వ్యాన్ పెట్టారు. విద్యార్థుల మీద అజమాయిషీకి వారి కూడా ఇద్దరేసి వార్డెన్లు వెళ్ళారు.

రజని మ్యాథ్స్ పరీక్ష రోజున ఉదయాన్నే స్నేహితురాళ్ళందరూ రజనికి 'బెస్టాఫ్ లక్' చెప్పి తనని పరీక్షకి సాగనంపారు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకి క్లాసులు ముగిసి లంచ్ బ్రేక్ ఇచ్చారు.

నీలూ, మేఘ, రేవతి భోజనానికి వెళ్ళకుండా రజని కోసం వేచి ఉన్నారు. రజని ఎలా పరీక్ష రాసిందో, పేపరు సులువుగా వచ్చిందో, కష్టంగా వచ్చిందోనని ఆదుర్దాపడుతూ గేటు వంక చూస్తూ కూర్చున్నారు.

ఓ పావుగంట తర్వాత రజని వస్తూనే దూరం నుంచే హుషారుగా కనిపించేసరికి ముగ్గురు స్నేహితురాళ్ళూ 'హమ్మయ్యా' అనుకున్నారు.

తనకి ఎదురు వెళ్ళి "పరీక్ష ఎలా రాశావు? ఏదీ క్వశ్చన్ పేపర్ చూపించు. ఎలా వచ్చిందో చూద్దాం" అడిగింది మేఘ.

"నేను పరీక్ష బాగానే రాసానులే కానీ అంత కన్నా అతి ముఖ్యమైన విషయం ఒకటి అర్జెంటుగా చెప్పాలి మీకు" మెరుస్తున్న కళ్ళతో అంది రజని.

"ఏమిటది? తొందరగా చెప్పు.." ఉత్సాహంగా అడిగింది రేవతి.

"పరీక్ష రాసి బయటకి రాగానే ఒక అబ్బాయి నా దగ్గరికి వచ్చి 'మీ పేరు రజనియే కదా? నేను ప్రదీప్, కిరణ్ ల ఫ్రెండ్ ని. మీకీ ఉత్తరం ఇమ్మని చెప్పారు. ఎవరూ లేనప్పుడు చదవండి' అని చెప్పి ఒక లెటర్ నా చేతిలో పెట్టి హడావుడిగా వెళ్ళిపోయాడు" చెప్పింది రజని.

"ఏం లెటర్ అది?" రేవతి అడగ్గానే "లవ్ లెటర్" అని సంతోషంగా బదులిచ్చింది రజని.

నీలూకి, మేఘుకి రజని చెప్తున్నదేవిటో అర్థం అర్థం కాక అయోమయంగా చూస్తున్నారు.

నీలూ ముందుగా తేరుకుని "మళ్ళీ కథలు చెప్పడం చెప్పడం మొదలెట్టావా రజనీ? అస్తమానం ఎందుకిలాంటి వెధవ కబుర్లన్నీ చెప్తున్నావ్?" కోపంగా అరిచింది.

ఆ మాటకి కోపం వచ్చిన రజని "నేనేం అబద్ధం చెప్పడం లేదు. కావాలంటే ఇదిగో నువ్వే చూడు" అంటూ తన బ్యాగ్ లోంచి నాలుగు మడతల్లో ఉన్న ఒక కాగితాన్ని బయటికి తీసింది.

ఊహించని ఆ పరిణామానికి నీలూ, మేఘు ఇద్దరికీ బుర్ర తిరిగిపోయి నోట మాట రాలేదు!

# 6

పరీక్ష రాయడానికి వెళ్ళిన రజని ప్రేమలేఖ తీసుకొచ్చాననడం, నీలూ రజని మీద కోపంగా అరవడం చూసిన రేవతి ఇద్దరినీ శాంతింపచేసి "మీరిద్దరూ ఇక్కడ పోట్లాడుకుంటే విషయం అందరికీ తెలిసిపోతుంది. అలా పక్కకి వెళ్ళి వివరంగా మాట్లాడుకుందాం పదండి" అంటూ పక్కనే ఖాళీగా ఉన్న క్లాసురూంలోకి తీసుకెళ్ళింది.

మేఘు ఏమీ మాట్లాడకుండా జరుగుతున్నది చూస్తూ ఉంది. నీలూకి అసహనంగా ఉంది. రజని మొహంలో ఉత్సాహం తొంగిచూస్తోంది.

"ఇంతకీ ఆ ఉత్తరం ఎవరు ఎవరికి రాసారు?" రజనిని అడిగింది రేవతి.

"ఎవరైనా చూస్తారేమోనని నేను ఉత్తరం చదివే ప్రయత్నం చేయలేదు. కొద్దిగా మడతలు విప్పి చూసినప్పుడు మాత్రం చివర్లో కిరణ్ పేరు కనిపించింది" అని చెప్పి ఉత్తరం తెరిచి చదవసాగింది రజని. పక్కనే కూర్చున్న రేవతి కూడా అటే కళ్ళప్పగించింది.

'డియర్ రజని' అన్న సంబోధనతో మొదలైన ఆ ఉత్తరం చదువుతున్న కొద్దీ రజని ముఖకవళికలు మారిపోసాగాయి.

"అందులో ఏం రాసుందో చెప్పు" అడిగింది నీలూ.

"ఉత్తరం రాసింది రజనికే కానీ కిరణ్ ప్రేమిస్తున్నది మాత్రం మేఘుని. అదే రాసాడు" రేవతి నవ్వుతూ చెప్పింది.

అప్పటిదాకా మౌనంగా ఒక పక్కన కూర్చున్న మేఘ ఆ మాట వినగానే బెదిరిపోయింది. నమ్మలేనట్టు అయోమయంగా చూసింది. ఒక్క ఉదుటున లేచి నించునేసరికి ఒళ్ళో ఉన్న స్టీలు కంచం జారి గచ్చు మీద పడి గణగణమని శబ్దం చేసింది. దాన్ని తీసే ప్రయత్నం కూడా చెయ్యకుండా కళ్ళల్లోంచి జలజలా కన్నీళ్ళు రాలుతుండగా ఎవ్వరి వైపు చూడకుండా అక్కడి నుంచి వెళ్ళిపోయింది మేఘ.

"కిరణ్ మేఘని ప్రేమిస్తున్నానని రాసాడా? ఏదీ ఇటివ్వు ఉత్తరం" ఆశ్చర్యపోతూ రజని చేతిలోంచి లాక్కుంది నీలూ.

'మనందరం మంచి స్నేహితులమే అయినా నిన్ను నా సోదరిగా భావించి ఈ సహాయం చేయమని అడుగుతున్నాను. నేను మేఘని ప్రేమిస్తున్న సంగతి తనకి తెలియజేయి' అంటూ రాసాడు కిరణ్.

ఉత్తరం చదవగానే నీలూకి ఎక్కడలేని నీరసం ఆవరించింది. స్వయంగా తనే ఉత్తరం చదివాక కూడా నమ్మలేకపోతోంది. ఏదేమైనా సరే ముందు ఏడుస్తూ వెళ్ళిపోయిన మేఘని సముదాయించాలని అక్కడనించి లేచి పరుగున వెళ్ళింది.

"పాపం మేఘ, నీలూ భోజనం చేయకుండానే వెళ్ళిపోయారు. నువ్వు అన్నాలు తిన్నాక ఈ లెటర్ సంగతి చెప్పాల్సిందేమో!" జాలిగా అంది రేవతి.

"ఇలా జరుగుతుందని నేనేమన్నా కలగన్నానా?" నిష్ఠూరంగా అంది రజని.

"అదీ నిజమేలే.. నీకేదో లవ్ లెటర్ వచ్చిందని సరదా పడేలోపు కథ ఇలా అడ్డం తిరిగింది. బ్యాడ్ లక్!" పకపకా నవ్వింది రేవతి.

"నోరు ముయ్యి.. నువ్వూ, నీ పరాచికాలూనూ! ఎవరన్నా వింటే మన సరదా కాస్తా తీరుతుంది" చుట్టూ చూస్తూ కంగారుపడింది రజని.

"సరేలే.. నాకు చాలా ఆకలిగా ఉంది. ఇప్పటికే ఆలస్యమైంది. నేను భోజనానికి వెళ్తాను" అంది రేవతి.

"ఈ ఉత్తరం దాచేసి నేనూ వస్తాను పద" వెంట నడిచింది రజని.

నీలూ మేఘ కోసం గదికి వెళ్ళేసరికి తలుపు లోపల వైపు నుంచి గడియ వేసి ఉంది. రెండుసార్లు తలుపు కొట్టినా తియ్యలేదు. నీలూకి గాభరాగా అనిపించింది. పది నిమిషాల సేపు బతిమాలాక తలుపు తెరిచింది మేఘ.

భుజం మీద బట్టలు, చేతిలో బకెట్టుతో నిలబడి ఉంది. ఎర్రగా కందిపోయిన కళ్ళు , బుగ్గల మీద కన్నీటి చారికలు అప్పటిదాకా ఎంతలా ఏడ్చిందో సాక్ష్యం చెబుతున్నాయి.

నీలూ మాట్లాబోయేంతలో "నేను స్నానానికి వెళుతున్నాను" అని చెప్పి జవాబు కోసం ఎదురుచూడకుండా అక్కడినుంచి వెళ్ళిపోయింది మేఘ.

చేసేదేమీలేక మంచం మీద కూలబడింది నీలూ.

మేఘ తనతో కూడా మాట్లాడటానికి ఇష్టపడటం లేదంటే ఎంతో కోపంలో, బాధలో ఉందని అర్థమైంది. తీవ్రమైన ఆలోచనల్లోనో, ఆవేదనలోనో ఉన్నప్పుడు మేఘ ఒంటరితనాన్నే కోరుకుంటుంది. తనంతట తను మాట్లాడటానికి సిద్ధపడితే తప్ప ఎంత ప్రయత్నించినా ఎవరమూ తన మౌనాన్ని భంగం చేయలేమన్న సంగతి నీలూకి బాగా తెలుసు.

భోజనం సంగతి మర్చిపోయి ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తూ పడుకుంది నీలూ.

అరగంట తర్వాత స్నానం ముగించుకు వచ్చిన మేఘ అదే మౌనాన్ని కొనసాగిస్తూ పుస్తకాలు తీసుకుని వెళ్ళాల్సిన సమయం కన్నా ముందుగానే క్లాసుకి వెళ్ళిపోయింది.

సాయంత్రం టీ బ్రేక్ లో కూడా రూముకి వెళ్ళకుండా క్లాసురూంలోనే ఉండిపోయింది మేఘ.

రాత్రి భోజనాల సమయానికి కూడా రాకపోయేసరికి మేఘని వెతుక్కుంటూ వెళ్ళింది నీలూ.

ఖాళీగా ఉన్న క్లాసురూంలో డెస్క్ మీద తల పెట్టుకుని పడుకుని ఉన్న మేఘని చూసి నిశబ్దంగా వెళ్ళి పక్కన కూర్చుని ప్రేమగా తట్టి లేపింది. తడికళ్ళతో వాడిపోయిన మొహంతో ఉన్న మేఘని చూడగానే నీలూ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మనిద్దరం ఉదయం ఎప్పుడో ఆరున్నరకి తిన్న మూడు ఇడ్లీలు తప్ప మళ్ళీ ఏమీ తినలేదు. నాకు చాలా ఆకలిగా ఉంది. నువ్వొస్తే తప్ప నేను భోజనానికి వెళ్ళనని నీకు తెలుసు. నీ అంతట నువ్వు మాట్లాడాలనుకునేదాకా నేను నిన్ను ఇబ్బంది పెట్టను" నెమ్మదిగానైనా స్థిరంగా చెప్పింది నీలూ.

వెంటనే చిన్నపిల్లలా నీలూని హత్తుకుపోయి భోరుమంది మేఘ. అనునయంగా వీపు మీద చేత్తో నిమురుతూ సముదాయించింది నీలూ.

"మామూలప్పుడు ఎంతో ధైర్యంగా మాట్లాడుతుంటావే, ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఇలా బేలగా అయిపోవడమేనా చెప్పు. ఇలా అన్నాలు మానుకోడాలూ, ఏడ్చీ ఏడ్చీ తలనొప్పులు తెచ్చుకోడాలూ పిచ్చితనం కదూ.. నా మాట విని ఊరుకో మేఘా.. ఏం చెయ్యాలో తీరిగ్గా ఆలోచిద్దాం."

"కిరణ్ ఎందుకిలా చేసాడు నీలూ? ఇప్పుడు రజని, రేవతి, ఇంకా అందరూ ఏమనుకుంటారు? ఒక్కమాటతో ఇన్నిరోజుల స్నేహాన్ని కూల్చేయడంతో పాటు నన్ను తలెత్తుకోనీకుండా చేసాడు" వెక్కుతూ చెప్పింది మేఘ.

"వాళ్ళేమనుకుంటారోనని నువ్వు ఏడుస్తున్నావా? తను నిన్ను ఇష్టపడినంత మాత్రాన నువ్వేదో తప్పు చేసినట్టేనా? అసలు నువ్వు ముందు ఏడవడం ఆపి స్థిమితంగా ఉండటానికి ప్రయత్నించు" గట్టిగా చెప్పింది నీలూ.

"నా తప్పేమీ లేకపోతే నన్నే ఎందుకు ప్రేమిస్తున్నానంటాడు? మనం బెస్ట్ ఫ్రెండ్స్ అనుకున్నందుకు బాగా బుద్ధి చెప్పాడు. అసలు మనం వాళ్ళతో స్నేహం చెయ్యకుండా ఉండాల్సింది. అసలిలా ఎలా చేయగలిగాడు? ఎదురుగా కనిపిస్తే కొట్టాలన్నంత కోపం వస్తోంది" ఏడుపు, బాధ, ఆవేశం కలగలిసిపోతున్నాయి మేఘకి.

మేఘ మాటలకి నవ్వొచ్చింది నీలూకి.

"నీ కోపంలో న్యాయం ఉంది. ఈసారి ఎదురుపడితే తప్పకుండా అలాగే కొడుదువు గానీలే.. నేనే పక్కనుండి నీ చేత కొట్టిస్తాను. కానీ ఇప్పుడు మాత్రం ఏడుపు ఆపెయ్యి. సరేనా!"

"ఉహూ.. అది కూడా అనవసరం. మనం ఇంకెప్పుడూ వాళ్ళతో మాట్లాడొద్దు" కళ్ళు తుడుచుకుంటూ ఖరాఖండీగా చెప్పింది మేఘ.

"సరే అలాగేలే. మనం భోజనానికి వెళదాం పద. ఈ రోజు ఎగ్ కర్రీ కదా.. మధ్యాహ్నం వంతు కూడా ఇప్పుడు లాగించేద్దాం" నవ్వుతూ మేఘ చెయ్యి పుచ్చుకుని లేవదీసింది నీలూ.

మరో మూడు రోజులు గడిచేసరికి జరిగిన విషయం తాలూకు తీవ్రత తగ్గి మేఘ కాస్త సర్దుకుంది. మేఘ ముందు ఆ విషయం ప్రస్తావించవద్దని నీలూ గట్టిగా చెప్పి ఉండటంతో రేవతి, రజని నోరు మెదపలేదు.

ఆ రోజు శనివారం. రాత్రి పూట పదకొండు గంటలకి స్టడీ అవర్స్ ముగిశాక రూముకి చేరుకున్నారు అందరూ. అప్పటిదాకా పుస్తకాలు ముందేసుకుని కునికిపాట్లు పడ్డా సరే రూముకి రాగానే నిద్రమత్తు వదిలిపోతుంది అందరికీ. తీరిగ్గా కూర్చుని కాసేపు ఆ రోజుటి విశేషాలు చెప్పుకుని పడుకునేసరికి పన్నెండు దాటుతుంది రోజూ.

తెల్లవారి ఆదివారం పరీక్ష గురించి రేవతి, నీలూ ఏదో చర్చించుకుంటూ ఉండగా రజని వచ్చింది.

లోపలకి వస్తూనే "ఇంతకీ రేపటి గురించి ఏం నిర్ణయించుకున్నారు?" నీలూ, మేఘలని ఉద్దేశించి అడిగింది.

"స్పెషల్ ఏముంది.. రేపు సండే నాన్న వాళ్ళెవరూ వస్తానని చెప్పలేదుగా? ప్రతీ సండే లాగానే మధ్యాహ్నం టెస్ట్ లు అయ్యాక హాయిగా భోజనాలు చేసి కాసేపు కునుకు తీసి లేచి బట్టలు ఉతుక్కుని..." చెపుతున్న మేఘ మాటలకి అడ్డం పడింది రజని.

"అది కాదు నేనడిగింది. కిరణ్ ఉత్తరం గురించి ఏం నిర్ణయించుకున్నావని? తనకి కనిపించాలిగా రేపు" అంది రజని.

మేఘ రజని మాటలు అర్థంకానట్టు చూస్తుంటే నీలూ కల్పించుకుని "మేఘ కిరణ్ ఉత్తరం చదవలేదుగా. తనకి ఆ సంగతి తెలీదు" అని చెప్పింది.

"అదేంటీ? మేఘని ఆలోచించుకుని ఈ ఆదివారం కల్లా తన నిర్ణయం చెప్పమని కిరణ్ రాసాడుగా. నువ్వైనా తనకి చెప్పలేదా ఆ సంగతి? నేను వెళ్ళి ఉత్తరం తీసుకురానా?" పెద్ద ఘోరం జరిగినట్టు ఆదుర్దాగా నీలూతో అంది రజని.

మేఘ మొహంలో అయోమయాన్ని గమనించిన నీలూ మెల్లగా చెప్పింది.

"మరేం లేదు మేఘా.. కిరణ్ నిన్ను ఇష్టపడుతున్నానని, నువ్వు కూడా తనని ఇష్టపడితే ఆ విషయం తనకి తెలియజేయమని రాసాడు."

"రేపు ఆదివారం సాయంకాలం నాలుగు గంటలకి రోడ్డు వైపున ఉన్న మన హాస్టల్ బిల్డింగ్ మెట్ల మీద నువ్వు కనిపిస్తే తన ప్రేమని అంగీకరించినట్లు అర్థం చేసుకుంటానని రాసాడు" అసలు విషయం చెప్పింది రేవతి.

వాళ్ళు చెప్పిన కొత్త విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్న మేఘ చేతిలో ఉత్తరం తీసుకొచ్చి పెట్టింది రజని.

ఉత్తరం మడతలు విప్పుతుంటే మేఘ చేతులు వణికాయి.

ఐదు నిమిషాలు సమయం తీసుకుని ఉతరం మొత్తం మూడు నాలుగు సార్లు క్షుణ్ణంగా చదివాక మళ్ళీ మడిచేస్తూ "ఇందులో రాసినట్టు మనం కనిపించకపోతే ఏమవుతుంది?" అంది నిర్లిప్తంగా.

"ఏమవుతుందీ.. నువ్వు 'నో' అన్నావని అతను కిరణ్ అన్న పేరుని కాస్తా దేవన్ అని మార్చుకుని దేవదాసు అయిపోతాడు" ఫకాలున నవ్వింది రేవతి.

"ఊరుకోవే.. నీకన్నీ హాస్యాలే.." మెత్తగా విసుక్కుంది నీలూ.

"పాపం కిరణ్! నిన్ను ఎంతగా ప్రేమిస్తే ఇలా ఉత్తరం రాస్తాడు. నువ్వు కాదంటే ఎంత బాధ పడతాడో ఏమో! అసలు అతనికేం తక్కువ? మనిషి బాగుంటాడు. చాలా తెలివైనవాడు, మంచివాడు. భవిష్యత్తులో గొప్ప డాక్టర్ అవుతాడు. ఒకవేళ రేపొద్దున మీ అమ్మానాన్నలు నీకు పెళ్ళిసంబంధం చూసినా ఇంతకన్నా గొప్పవాడిని చూడరు. వాళ్ళు కాదనదగ్గ విషయాలేమీ అతని దగ్గర లేవు. నువ్వు కాదనడానికి నాకైతే ఏ కారణమూ కనిపించడం లేదు నీ పొగరు, మొండితనం తప్ప" మేఘని నిందిస్తున్నట్టుగా అంది రజని.

చురుక్కున చూసింది మేఘ రజని మాటలకి.

"అంటే ఏంటీ నువ్వు చెప్పేది. ఇప్పుడు వెంటనే వెళ్ళి మేఘని 'ఐ టూ లవ్ యూ' అనమంటావా? అసలా మాటకొస్తే కిరణ్ ప్రేమిస్తున్నానన్నది మేఘని. యెస్ అంటుందో, నో అంటుందో, ఇంకేమైనా అంటుందో దానిష్టం. మధ్యలో నీ బోడి సలహాలు ఎందుకంట?" రజనిని కోప్పడింది నీలూ.

"నాకెందుకా.. మరి నాక్కాకపోతే నీకు అక్కరా? అతను ఉత్తరం నాకు రాసాడు. మేఘుకి ఈ విషయం చెప్పించి ఒప్పించమని నన్ను అడిగాడు. నువ్వే చూసావుగా, నన్ను సొంత సిస్టర్ లాంటిదాన్ని అన్నాడు. నేను కాకపోతే ఎవరు మాట్లాడతారు తన తరపున? ఇన్ని రోజులూ బెస్ట్ ఫ్రెండ్ అని కబుర్లు చెప్పి, గిఫ్ట్స్ తీసుకుని ఇప్పుడేమో ఒకేసారి ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నారో అతని గురించి. ఎంత స్వార్థపరులో మీరసలు!" ఇంకాస్త గొంతు పెంచింది రజని.

వాతావరణం వేడిగా మారుతోందని గ్రహించిన రేవతి తేలికపరుద్దామని "ఈ గొడవంతా ఎందుకులే గానీ అదేదో నేను ఒప్పేసుకుంటాను. రేపు ఆదివారం కాబట్టి మా డాడీ వచ్చి నన్ను ఇంటికి తీసుకెళతారు గానీ లేకపోతేనా..." అని నవ్వింది.

అంతదాకా మౌనంగా ఉన్న మేఘ నోరు విప్పింది.

"రజనీ.. ఇది నాకు సంబంధించిన విషయం కాబట్టి నిర్ణయం తీసుకునే హక్కు నాకుందని ఒప్పుకుంటావుగా. నాకిష్టం లేదు. నేనెక్కడికీ రాను. ఎవరికీ కనిపించను. పొగరు అనుకున్నా, ఇంకేమనుకున్నా నాకేం అభ్యంతరం లేదు" అంది స్థిరంగా.

మేఘ నుంచి సూటిగా వచ్చిన ఆ సమాధానానికి రజని నోరు మూతపడింది.

"సరే ఎవరిష్టం వారిది. ఏదో మంచి చెపుదామనుకున్నాను. పుణ్యానికి పోతే పాపం ఎదురైందని నాకెందుకు మధ్యన. నాకు నిద్రొస్తుంది. నేనెళ్ళి పడుకుంటా" లేచి నించుని మంచం మీద ఉన్న ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుంది.

"ఆ ఉత్తరం నీ దగ్గర ఎందుకు? మేఘుకి ఇచ్చేసి వెళ్ళు" అంది నీలూ.

"ఇటివ్వు. చింపి పడేద్దాం" రజని చేతిలోంచి ఉత్తరం తీసుకోబోయింది మేఘ.

చటుక్కున చెయ్యి వీపు వెనక్కి దాచేసింది రజని.

"ఈ ఉత్తరం ఎవరు ఎవరికి రాసారో తెలుసుగా. నాకు రాసిన ఉత్తరాన్ని మీకెందుకు ఇవ్వాలి? నా దగ్గరే ఉంచుకునే హక్కు ఉందిగా" దురుసుగా చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది రజని.

తెల్లవారి ఆదివారం మధ్యాహ్నం పరీక్ష అయిపోగానే ఎప్పట్లాగే రేవతి ఇంటికి వెళ్ళింది. భోజనాలు చేసి వచ్చాక తీరిగ్గా మంచం మీద వాలారు నీలూ, మేఘ.

ఏమీ మాట్లాడకుండా ఆలోచనలో మునిగిపోయిన మేఘని అడిగింది నీలూ.

"అంత తీవ్రంగా ఏం ఆలోచిస్తున్నావు? కిరణ్ గురించేనా?"

సమాధానం చెప్పకుండా దీర్ఘంగా నిట్టూర్చింది మేఘ.

ఒక నిమిషం తర్వాత మౌనం వీడి "సమయానికి సునందక్క ఊరెళ్ళింది. ఇప్పుడు తను ఉన్నట్టయితే మంచి సలహా చెప్పి ఉండేది కదూ" అంది మేఘ.

"ఊ నిజమే! సునందక్క దేనికీ తొందరగా చలించదు. నిలకడగా ఆలోచిస్తుంది. రేపు ఉదయానికి వచ్చేస్తుందిగా" బదులిచ్చింది నీలూ.

"వస్తుందనుకో. కానీ... ఇప్పుడు..." వాక్యం పూర్తి చేయలేదు మేఘ.

"అసలు నువ్వు దేని గురించి ఆలోచిస్తున్నావో చెప్పు. సాయంకాలం నాలుగింటికి మేడ మెట్ల మీద కిరణ్ కి కనపడాలా వద్దా అనా? ఒకవేళ సమస్య అదే అయితే దానికి సమాధానం చాలా సింపుల్. అతను అడిగిన ప్రశ్నకి నీ సమాధానమేంటో తెలిస్తే సరి" సూటిగా చెప్పింది నీలూ.

"హ్మ్.. తను చెప్పిన విధంగా నాకైతే తన పట్ల అలాంటి ప్రేమ లేదు, రాదు కూడా! ఆ విషయంలో నాకు రవ్వంత సందేహమైనా లేదు. కానీ నా సమస్య వేరే ఉంది. మనం రోడ్డు మీద పోతున్నప్పుడు ఎవడో అనామకుడు మనల్ని ఇబ్బంది పెట్టేలానో, గాయపడేలానో అవాకులు చెవాకులు పేలితే ముందు కాసేపు బాధనిపించినా ఎవడో ఏదో అంటే మనం ఎందుకు విలువివ్వాలి లెమ్మని చాలా తొందరగా దాన్ని అక్కడే దులిపేసుకుని ముందుకెళ్ళిపోతాం. ఒక రోజు గడిచేసరికి ఆ సంఘటననే పూర్తిగా మర్చిపోతాం. అవునా?"

"అవును. అయితే?"

"కిరణ్ కీ, నాకూ మధ్యన ఒక చక్కటి స్నేహబంధం ఉంది. అది నాకు చాలా నచ్చేది, ఆనందాన్ని కలిగించేది. అలాంటిది అకస్మాత్తుగా ఇప్పుడు ఎదురైన పరిస్థితి వల్ల తన మీద కోపం వస్తున్న మాట నిజమే అయినా ఎందుకనో పూర్తిగా అసహ్యించుకుని దులిపేసుకుని తనని పూర్తిగా పక్కకి పెట్టి ముందుకు వెళ్ళలేకపోతున్నాను. మనసుకి చాలా కష్టంగా ఉంది. ఎందుకిలా అని అర్థం చేసుకోలేకపోతున్నాను. ఈ బాధని ఎలా పోగొట్టుకోవాలో తెలియడం లేదు నీలూ.." మేఘ కంటి కొనల నుంచి రెండు కన్నీటి చుక్కలు జారాయి.

నీలూ మేఘ వైపుకి తిరిగి తన కళ్ళు తుడిచి పొట్ట మీద చెయ్యేసి అనునయంగా చెప్పింది.

"ఏ వ్యక్తినైనా ఒకసారి 'మన' అనుకున్నాక వారు చేసిన పనులేవైనా మనకి కష్టం కలిగించినా కూడా వారి పట్ల మనకుండే ప్రేమ, ఆప్యాయతల మూలంగా మనసు పూర్తిగా విరిగిపోదు. ఇది చాలా సహజం. కొంత కాలం గడిస్తే అన్నీ సర్దుకుంటాయి. కాస్త ఓపిగ్గా ఉండాలంతే."

"పదే పదే ఇలా జరక్కుండా ఉండుంటే బాగుండు అనిపిస్తుంది తప్ప ఇప్పుడిలా చేస్తే బాగుంటుంది అని ఏమీ తోచడం లేదు" నిస్పృహగా అంది మేఘ.

అలా మాట్లాడుతూనే కాసేపటికి ఇద్దరూ కళ్ళు మూసుకుని ఆలోచనల్లో పడేసరికి కాస్త మగతగా కన్నంటుకుంది.

కిర్రుమన్న తలుపు శబ్దానికి మేఘ నిద్ర తేలిపోయి లేచి కూర్చుంది. తలుపు తీసుకుని లోపలికి వచ్చిన రజని గడియ పెట్టి వచ్చి మేఘకి ఎదురుగా కూర్చుంది.

"ఏం నిర్ణయించుకున్నావు?" సూటిగా విషయంలోకి వచ్చేసింది రజని.

"ఏ విషయం?" ఎదురు ప్రశ్న వేసింది మేఘ.

"అదే రాత్రి చెప్పానుగా. నాలుగు గంటలకి కిరణ్ కి కనపడే విషయం" గుర్తు చేసింది రజని.

"కొత్తగా నిర్ణయించేది ఏమీ లేదు. కనపడేది లేదంతే!" తేల్చి చెప్పింది మేఘ.

వీళ్ళిద్దరి మాటలకి మెలకువ వచ్చి నీలూ కూడా లేచి కూర్చుంది.

"అది కాదు మేఘా.. మరొకసారి బాగా ఆలోచించు. నీకింకా గంటన్నర టైముంది. సమయం దాటిపోయాక నువ్వు నిర్ణయం మార్చుకున్నా లాభం ఉండదు. కిరణ్ వైపు నుంచి అసలు ఆలోచించావా? పాపం తనెంత బాధపడతాడో? తనంటే నీకు చాలా ఇష్టం ఉందిగా. తనని కాదనడానికి నీ దగ్గర సరైన కారణాలేవీ లేవని నీకనిపించడం లేదా?" మృదువుగా అడిగింది రజని.

"కిరణ్ ఇలా చేసినందుకు నేను కూడా బాధపడుతూనే ఉన్నాను రజనీ. తనని ఏ రకంగానూ తక్కువ చేసే ఉద్దేశ్యం నాకు లేదు. తనంటే నాకు ఇష్టం, గౌరవం ఉన్నాయి కానీ అది ఒక ఫ్రెండ్ గా మాత్రమే. ఈ ప్రేమా, దోమా నాకసలు సరిపడవు. నాకు అస్సలంటే అస్సలు ఇష్టం లేకపోగా వాటి పట్ల మంచి అభిప్రాయం కూడా లేదు. కాబట్టి ఇంక ఆలోచించాల్సింది ఏమీ లేదు" మెత్తగానే అయినా స్పష్టంగా చెప్పింది మేఘ.

మరి కాసేపు మేఘ కిరణ్ ప్రేమని అంగీకరిస్తే బాగుంటుందని రకరకాలుగా నచ్చచెప్పటానికి ప్రయత్నించింది రజని. ముగ్గురి వాదోపవాదాల్లో దాదాపు గంట సమయం గడిచిపోయింది.

ఎన్ని రకాలుగా చెప్పి చూసినా లాభం లేదని, మేఘ మొండిగా నిర్ణయించుకుందని రజనికి అర్థమయ్యింది.

"సరే అయితే, ఇది నీ సొంత విషయం కాబట్టి ఇంతకన్నా ఎక్కువ కల్పించుకోను. నేను మాత్రం నాలుగింటికి వీధి వైపునుండే మన బిల్డింగ్ మెట్ల మీదకు వెళ్ళి కిరణ్ ని చూసి వస్తాను" తన నిర్ణయాన్ని చెప్పింది రజని.

ఆ మాట వినగానే మేఘ కంగారుపడింది.

"వద్దు వద్దు. నువ్వు కూడా వెళ్ళొద్దు. నువ్వు కనిపిస్తే మనం 'సరే' అన్నట్లుగా తను భ్రమపడొచ్చు" అంది మేఘ.

మరి కాసేపు ముగ్గురూ అటూ ఇటూ అన్నీ రకాలుగా వాదించుకున్నాక చివరిగా రజని చెప్పిన మాటకి అందరికీ అంగీకారం కుదిరింది.

“కిరణ్ కి మనమెవరమూ కనిపించకూడదనే కదా నీ పట్టుదల. అతనికి నేను కనిపించకుండా నేను మాత్రం అతన్ని చూస్తే నీకేమీ అభ్యంతరం లేదుగా?” మేఘని అడిగింది రజని.

“అదెలా కుదురుతుంది? నువ్వు మెట్ల మీద నుంచి వెళుతుంటే రోడ్డు మీదున్న తనకి కనిపించకుండా ఎలా ఉంటావు?” ఒప్పుకోలేదు నీలూ.

“నాకొక ఐడియా వచ్చింది. రెండో అంతస్థు నుంచి పైన మేడ మీదకి వెళ్ళడానికి మెట్లున్నాయిగా. నాలుగింటి కన్నా ముందే మేడ మీదకి వెళ్ళి పిట్టగోడ చాటున కూర్చుని రోడ్డు వైపు పిట్టగోడకున్న డిజైనులో ఉన్న సందుల్లోంచి చూస్తే మొత్తం వీధంతా కనిపిస్తుంది. కానీ అక్కడ ఎవరైనా ఉన్నట్టు వీధిలోకి కనపడదు. ఏమంటారు?” ఉపాయం చెప్పింది రజని.

“ఆలోచన బాగానే ఉంది కానీ వార్డెన్ కి తెలీకుండా ఒంటరిగా మేడ మీదకి ఎక్కితే పర్లేదా?” సందేహం వెల్లిబుచ్చింది నీలూ.

“అదేం పరవాలేదులే. ఆదివారం పూట ఎవరు పట్టించుకుంటారు? అదీగాక మనమేమీ రోడ్డు మీదకి కనపడేలా షికార్లు చెయ్యముగా. సైలెంట్ గా అలా ఎక్కి ఇలా దిగిపోతే సరి” ధైర్యం చెప్పింది రజని.

“అయితే మరి నువ్వు ఒక్కసారి కూడా లేచి నించోకుండా, కిరణ్ కి అస్సలు కనపడకుండా ఉంటానని ప్రామిస్ చేస్తావా?” అడిగింది మేఘ.

“నా మీద నమ్మకం లేకపోతే మీరూ రండి నాతో పాటు” తేలిగ్గా అంది రజని.

రజని మాట విని నీలూ, మేఘ ఆలోచనలో పడ్డారు.

“మనం వెళ్ళేట్లయితే పావు తక్కువ నాలుగింటి కల్లా మేడ ఎక్కి దాక్కోవాలి. ఆలస్యంగా వెళితే పొరపాటున మెట్ల మీద మనల్ని కిరణ్ గానీ చూస్తే మేఘ 'యెస్' చెప్పిందనే అర్థం చేసుకుంటాడు. కాబట్టి ఇంకో పది నిమిషాలే సమయం ఉంది. నేనిప్పుడే వస్తాను” హెచ్చరించి వెళ్ళింది రజని.

అంత తక్కువ సమయంలో ఏం చెయ్యాలో పాలుపోలేదు మేఘకి.

“పోనీ రజనితో పాటు నువ్వూ వెళతావా నీలూ? నాకు రజని మీద నమ్మకం లేదు. నువ్వు పక్కనే ఉంటే రజని కిరణ్ కి కనపడే ధైర్యం చెయ్యదు. తనొక్కతే వెళితే మనకి లేనిపోని చిక్కులు రావచ్చు” అంది మేఘ.

“నాకూ అదే సందేహం. కానీ రజని చెప్పిన ప్లాన్ అయితే బాగానే ఉంది. మనం ఎవరికీ కనపడనప్పుడు నేనొక్కదాన్నే ఎందుకు, నువ్వూ రావచ్చుగా! ముగ్గురం కలిసే వెళదాం. ఈ విషయం జరిగిన దగ్గర్నుంచీ ఇంకా నమ్మలేనట్టే ఒకలాంటి భ్రాంతిలో ఉన్నాం. అసలు కిరణ్ ఉత్తరంలో రాసినట్టుగా ఆ టైముకి వస్తాడో రాడో, ఒకవేళ వస్తే దూరంనుంచైనా ఒకసారి తనని చూస్తే మనకి ఒక అభిప్రాయం రావచ్చు. తనకి కనిపించకుండా తనని చూడటం వల్ల మనకొచ్చే నష్టమేమీ లేదుగా!” ఆలోచించి చెప్పింది నీలూ.

అనుకోని విధంగా క్షణాల్లో పరిస్థితి మారేసరికి మేఘకి కాస్త కంగారుగా అనిపించింది. పక్కనే ఉన్న మంచినీళ్ళు తాగి ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని “సరే అయితే పద. నేనూ వస్తాను. ఏం జరుగుతుందో చూద్దాం” లేచి నిలబడింది.

అంతలో రజని వచ్చింది. నీలూ, మేఘ కూడా వస్తామనేసరికి ఆశ్చర్యంతో పాటు ఉత్సాహంగా అనిపించింది రజనికి.

“పదండి పదండి. ఆలస్యమైతే ప్రమాదం..” అంటూ హడావుడిగా బయలుదేరదీసింది.

రజని, నీలూ, మేఘ ముగ్గురూ అనుకున్నదే తడవుగా మెట్లు దిగి కిందకి వచ్చారు.

ఆదివారం కాబట్టి బయటికి వెళ్ళినవాళ్ళు వెళ్ళిపోగా మిగిలిన వాళ్ళందరూ మధ్యాహ్నపు కునుకు తీస్తుండటంతో హాస్టలు ఆవరణ ఖాళీగా ఉంది. కొబ్బరి చెట్ల మీద తిరిగే ఉడుతల అలికిడి, గాలికి కొబ్బరాకులు చేస్తున్న శబ్దం మినహా నిశబ్దంగా ఉంది.

ముగ్గురూ కలిసి రోడ్డు వైపుకి ఉన్న మరొక బిల్డింగు వైపు నడిచారు.

మెట్లు ఎక్కబోతుండగా "ఎందుకైనా మంచిది మనం వంగుని మెట్లు ఎక్కుదామా.. వీధిలోకి కనపడకుండా ఉంటాం" అంది మేఘ సంశయిస్తూ.

"ఇంకా టైం నాలుగవలేదుగా" అంది రజని.

"మేఘ చెప్పినట్టే చేద్దాం. దానివల్ల వచ్చే నష్టమేమీ లేదుగా" నిర్ణయించేసింది నీలూ.

ముగ్గురూ వీధిలోకి కనపడకుండా వంగునే రెండంతస్థుల మెట్లు గబగబా ఎక్కి మేడ మీదికి చేరుకున్నారు.

ముందుగా అనుకున్నట్టుగా పిట్టగోడ చాటున నక్కి కూర్చున్నారు.

"భలే థ్రిల్లింగా ఉంది కదూ.. ఏదో సినిమాలో లాగా!" ఉత్సాహంగా అంది రజని.

"అయినా డాబా మెట్ల మీద కనిపించమని అడగడం ఏమిటో విడ్డూరం" అంది నీలూ.

"మరి లేకపోతే సరాసరి మన హాస్టలుకొచ్చి తెలుసుకోమంటావా? గర్ల్స్ హాస్టలుకి రావడం చాలా కష్టం. పోనీ ఏదో రకంగా తిప్పలు పడి వచ్చినా మేఘ ఎలా స్పందిస్తుందో, తిడుతుందో కొడుతుందో తెలీదు. అందుకే తెలివిగా ఈ మార్గం ఎంచుకుని ఉంటాడు కిరణ్" నవ్వింది రజని.

"అమ్మో.. హాస్టలుకి రాకపోవడం చాలా మంచిదయింది. మేఘ ఏమంటుందని తర్వాత సంగతి, ముందు చూసిన వాళ్ళందరూ ఏమనుకునేవారో. అనవసరంగా లేనిపోని పుకార్లు షికార్లు చేసేవి హాస్టల్లో. లెటర్ రాస్తే రాశాడు గానీ అలా చెయ్యనందుకు మాత్రం సంతోషం" అంది నీలూ.

మేఘ మౌనంగా ఇద్దరి మాటలు వింటూ కూర్చుంది. కిరణ్ కి కనిపించకూడదని పట్టుదలగా ఉన్నప్పటికీ అతన్ని చూడాలని ఇలా రహస్యంగా ఎదురుచూడటం తనకీ ఉద్విగ్నంగానే ఉంది.

"ఎండ ఇంకా పోలేదు. కింద గచ్చు వేడిగా ఉంది" ఇబ్బందిగా మొహం పెట్టింది నీలూ.

"కుర్చీ తెచ్చుకుని అందులో హాయిగా కూర్చుని సినిమా చూసినట్టు చూడాల్సిందంటావా.. డిటెక్టివ్ పనులు చెయ్యాలంటే కష్టాలు పడాలి మరి" ఫక్కున నవ్వింది రజని.

"ష్.. ఇంత కష్టపడి గుసగుసగా మాట్లాడుకుంటుంటే నువ్వంత గట్టిగా నవ్వుతావేంటి?" జాగ్రత్త చెప్పింది నీలూ.

చేతికున్న వాచీ వైపు చూసి "నా వాచీ ప్రకారం ఇంకా మూడు నిమిషాలుంది. జాగ్రత్తగా చూడండి వీధి వైపు. మన హీరో గారొచ్చే టైం అయింది" అందర్నీ అప్రమత్తం చేసింది రజని.

ముగ్గురూ నిశబ్దంగా ఊపిరి బిగబట్టి ఆతృతగా వీధి వైపే చూస్తున్నారు.

ఓ ఐదు నిమిషాలు అరగంటలా భారంగా గడిచాక "హేయ్.. అక్కడ చూడండి, కుడి వైపుకి. దూరంగా ఒక అబ్బాయి వస్తున్నాడు. మన కిరణ్ లా లేదూ?" సంబరంగా చూపించింది రజని.

నీలూ, మేఘ అటువైపు చూశారు. ఎర్ర చొక్కా, తెల్ల ప్యాంటు వేసుకున్న ఒక అబ్బాయి కనిపించాడు. రూపురేఖలు స్పష్టంగా తెలియడం లేదు.

"నేను పోల్చుకోలేకపోతున్నాను" అంది నీలూ.

"నాకూ అంత క్లియర్ గా తెలియడం లేదులే కానీ పొడవూ అదీ అలాగే ఉన్నాడు" అంది రజని.

"కిరణ్ ఒక్కడే వస్తాడంటావా? పక్కన ప్రదీప్, వేరే ఫ్రెండ్స్ ఉంటారేమో" సందేహంగా అంది నీలూ.

"నిజమే. నాకా ఆలోచనే రాలేదు. ఆ రోజు నాకు లెటర్ ఇచ్చిన అబ్బాయి కూడా వస్తాడేమో" అంది రజని.

దూరంగా కనిపించిన ఎర్ర చొక్కా అబ్బాయి దగ్గరికొచ్చేసరికి కిరణ్ కాదని తేలింది.

మరొకసారి టైము చూసి "నాలుగుంపావు కావొస్తోంది. కిరణ్ ఇంకా కనిపించడేంటి? మనలాగే తను కూడా ఎక్కడో దాక్కుని మెట్ల వైపు చూస్తున్నాడేమో!" అనుమానంగా అంది రజని.

"ఏమిటో ఈ డిటెక్టివ్ పనులు" నవ్వింది నీలూ.

'ఇప్పుడు కిరణ్ కనపడకపోతే ఏమిటీ అర్థం, ఒకవేళ ఆ ఉత్తరం అబద్ధపు ఉత్తరం కాదు కదా' అన్న ఆలోచన వచ్చి రజని వైపు నిశితంగా చూసింది మేఘ.

ఎంతో ఆతృతగా వీధి వైపే చూస్తున్న ఆమెని చూస్తే మరీ అంతగా అనుమానించడం పొరపాటు అనిపించింది.

"అదిగో కిరణ్" పక్కన కూర్చున్న నీలూని పట్టుకు ఊపేస్తూ గుసగుసగానే అరిచింది రజని.

అవును. అక్కడ కనిపిస్తోంది ముమ్మాటికీ కిరణే. వీధిలో ఒక్కడే మెల్లగా నడుస్తూ వస్తున్నాడు.

ముగ్గురూ నిశబ్దంగా చూస్తున్నారు.

ఇప్పటిదాకా ఇదంతా నిజం కాదేమోనన్న మేఘ భ్రమని తుడిచేస్తూ కళ్ళెదురుగా కిరణ్ కనిపించాడు. అతన్ని చూడగానే ఆమెలో రేగిన కలవరాన్నీ, కంగారునీ అవసరానికి మించి కొట్టుకుంటున్న గుండె చప్పుడు రూఢీ చేస్తోంది.

అప్పుడప్పుడూ వెనక్కి తిరిగి మేడ మెట్ల వైపు చూస్తూ వెళ్ళిపోయాడు. అటువైపు రోడ్డు మీదున్న పెద్ద పెద్ద గుల్మోహర్ చెట్ల కారణంగా కొంత దూరం వరకే వీళ్ళు అతన్ని చూడగలిగారు.

"ప్రేమ కోసమై వలలో పడెనే పాపం పసివాడు" నవ్వింది రజని.

రజని మాటలకి నీలూకి కూడా నవ్వొచ్చింది.

"బొత్తిగా పంక్చువాలిటీ లేకుండా చెప్పిన టైముకి రాకపోతే అంతే మరి."

"సరైన టైముకే వచ్చి ఏ చెట్టు చాటు నుంచో చూస్తూనే ఉండుంటాడులే నీలూ" అంది రజని.

"వచ్చిన పని అయిపోయిందిగా. ఇంక మనం వెళ్ళిపోవచ్చా?" అంది మేఘ మొహంలో ఏ భావమూ కనపడనీయకుండా.

"ఇప్పటికిప్పుడు మనం వెళితే అతనికి కనిపించే ప్రమాదం ఉంది. ఇంకాసేపు ఉండాలి. మేమేదో సరదాకి అంటున్నాములే. నువ్వేం కోపం తెచ్చుకోకు మేఘా" ప్రేమగా చెప్పింది రజని.

మళ్ళీ కనిపించాడు కిరణ్ అటునుంచీ ఇటు వస్తూ. రోడ్డు మీద ఈ చివర నుంచీ ఆ చివరకి పచార్లు చేస్తున్నాడు. అతనలా తిరుగుతుంటే మొదట సరదాగా అనిపించినా కాసేపటికి జాలిగా అనిపించింది ముగ్గురికీ.

"పాపం కదా.. ఎంత డల్ గా కనిపిస్తున్నాడో, మేఘ కనిపించలేదని హర్ట్ అయినట్టున్నాడు" బాధగా అంది రజని.

అవునంటే మేఘకి కోపం వస్తుందేమోననుకున్న నీలూ కాదని కూడా అనలేక గాఢంగా నిట్టూర్చింది.

వాళ్ళిద్దరూ అన్నారని కాకుండా తనకెంతో ఇష్టమైన బెస్ట్ ఫ్రెండ్ ని అలా దిగులు మొహంతో చూడటం మేఘకి కూడా కష్టంగానే అనిపించింది. 'తను బాధపడటానికి నేనే కదా కారణం' అన్న ఆలోచన వచ్చి గిల్టీగా అనిపించింది. కానీ బయటికేమీ చెప్పకుండా మౌనంగానే ఉంది.

"ఇప్పటికైనా సమయం మించిపోలేదు. నీ నిర్ణయం మార్చుకుంటావా?" మేఘ మొహంలోకి చూస్తూ అడిగింది రజని.

"ఉహూ.. అలాంటిదేం లేదు. మనం ఊరికే చూడ్డానికి వచ్చాం. మళ్ళీ ఇవన్నీ చెప్పకండి" కంగారుపడింది మేఘ.

మరొక అరగంట గడిచాక కిరణ్ వీధిలో కనిపించలేదు.

"నువ్వు తన ప్రేమని తిరస్కరించావని నిర్ధారించుకుని ఇక వెళ్ళిపోయాడనుకుంటా" మేఘతో అంది రజని.

"ఇంక మనం వెళదామా?" అడిగింది మేఘ.

టైం చూసి "ఐదు పది అయింది. ఇంకొక్క పది నిమిషాలు ఆగి వెళితే నయం" చెప్పింది రజని.

రజని తీసుకుంటున్న జాగ్రత్తలు చూస్తుంటే అనవసరంగా తన మీద కోప్పడ్డానేమో అనిపించింది మేఘకి. అతనెవరో ఉత్తరం ఇచ్చాడు, తను తీసుకొచ్చింది. అందులో ప్రత్యేకంగా రజని తప్పేం లేదుగా అనుకుంది.

కాసేపయ్యాక ఎలా వెళ్ళారో అలాగే జాగ్రత్తగా ఎవరికంటా పడకుండా మేడ దిగి వచ్చేశారు స్నేహితురాళ్ళు ముగ్గురూ.

తెల్లవారి సోమవారం ఉదయం పది రోజుల క్రితం ఊరెళ్ళిన సునంద తిరిగి హాస్టలుకి వచ్చింది.

పగలంతా క్లాసులు, స్టడీ అవర్స్ తో మాట్లాడుకునే తీరిక దొరకదు కాబట్టి రాత్రి పదకొండు దాటాక సునందని పక్కన కూర్చోబెట్టుకుని జరిగిన విషయాలన్నీ వివరంగా చెప్పింది మేఘ.

అంతా విన్న సునంద ఈ విషయంలో మేఘ ఎంత బాధపడుతున్నదీ గ్రహించింది.

"అబ్బాయిలైనా, అమ్మాయిలైనా ఎవరు ఎవర్ని ఇష్టపడతారనేది వాళ్ళ వ్యక్తిగత విషయం. దానికి కారణాలు ఏంటనేది రెండో మనిషికి తెలియాల్సిన అగత్యం లేదు. ఇంకా చెప్పాలంటే అసలు కారణాలంటూ ఉండి తీరాల్సిన అవసరం కూడా లేదు. ఇన్నాళ్ళూ నువ్వూ, కిరణ్ మంచి స్నేహితులుగా ఉన్నారు. ఆ స్నేహమే అతనిలో ప్రేమని పుట్టించి ఉండవచ్చు. అయినా సరే అతని ఆలోచనలకి, భావాలకి నువ్వు బాధ్యురాలివి కావు. ముందు నీ మనసులోంచి ఆ అపరాధ భావన పూర్తిగా చెరిపెయ్. ఇక అతను చేసింది తప్పా అంటే, నా దృష్టిలో అయితే కాదు. అతను నిన్ను ఇష్టపడ్డా, ఇంకెవరినన్నా ఇష్టపడ్డా దానివల్ల ఎవరికీ హాని లేదు, అతను మరీ

బలవంతపెట్టి ఇబ్బంది పెడితే తప్పు. ప్రస్తుతానికి ఆ పరిస్థితి లేదు కాబట్టి సమస్య లేనట్టే. ఇకపోతే అతను నీ అంగీకారం కోసం మెట్ల మీద కనిపించమన్నాడు. నీకిష్టం లేదు కాబట్టి నువ్వు కనిపించలేదు. నువ్వు తిరస్కరించావని అతను అర్థం చేసుకుని ఉంటాడు. అందుచేత ఇక్కడితో ఈ కథ ముగిసింది. ఇక నువ్వు బాధ పడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే అనవసరంగా చాలా ఎక్కువ నలిగిపోయావని నాకనిపిస్తోంది" వివరంగా అన్ని వైపుల నుంచీ విశ్లేషించి వివరించింది సునంద.

"నువ్వు చెప్పాక కాస్త మనసు తేలికపడింది అక్కా. అప్పుడు నువ్వుంటే బాగుండేదని చాలా అనిపించింది. రజని అయితే చాలా ప్రయత్నించింది నన్ను ఒప్పించడానికి. నేనేదో అన్యాయంగా కఠినంగా ఉంటూ ఎదుటివారిని ఇబ్బంది పెడుతున్నట్టు గిల్టీగా అనిపించింది" మెల్లగా చెప్పింది మేఘ.

"అలా అస్సలు అనుకోవద్దు. అయినా ఇది పూర్తిగా నీకు సంబంధించిన విషయం. నీకేదనిపిస్తే అదే చెయ్యాలి. ఇందులో మరొకరి ప్రమేయం అనవసరం. ఇక ఈ విషయాన్ని పూర్తిగా పక్కన పెట్టేసి హాయిగా చదువుకో మేఘా" ఆప్యాయంగా తల నిమిరింది సునంద.

వారం రోజుల నుంచీ పడ్డ వేదనంతా ఎగిరిపోయి ఆ వేళ ప్రశాంతంగా నిద్రపోయింది మేఘ.

కాలేజీలో పాఠాలు, హాస్టల్లో స్టడీ అవర్స్, మధ్య మధ్యన వీక్లీ టెస్టులు, మంత్లీ టెస్టులు, ఎంసెట్ స్పెషల్ కోచింగ్ అంటూ రకరకాల పేర్లతో విద్యార్థులందర్నీ పుస్తకాల్లో వేసి రుబ్బేస్తున్నారు కాలేజీ వారు. ఆ పరమ వీర రుబ్బుడు మహాయాగంలో రోజులు, వారాలు, నెలలు విరామం లేకుండా గడిచిపోతున్నాయి.

దసరా పండుగకి ఇచ్చిన వారం రోజుల సెలవుల తర్వాత మళ్ళీ సెలవులేమీ ఇవ్వలేదు. డిసెంబర్ ముప్పై నుంచీ జనవరి పదహారు దాకా రెండు వారాల పైనే సెలవులు ప్రకటించింది కాలేజీ యాజమాన్యం.

తిరిగి వచ్చాక మే లో ఎంసెట్ ఎంట్రన్స్ పూర్తయ్యే దాకా మళ్ళీ ఎటువంటి సెలవులు ఉండవు. సంక్రాంతి నుంచి వచ్చాక వారానికి రెండు ఎంసెట్ మోడల్ టెస్టులతో పాటుగా ఇంటర్మీడియెట్ మోడల్ ఎక్జామ్స్ కూడా ఉంటాయి కాబట్టి ఈ సెలవల్ని కేవలం సంక్రాంతి సెలవులుగా భావించకుండా ఎక్జామ్ ప్రిపరేషన్ హాలిడేస్ గా భావించి బాగా చదువుకురమ్మని చెప్పారు.

కాలేజీ వారు ఏం పేరు పెట్టినా సరే ఇన్ని రోజులు సెలవులిచ్చారన్న ఆనందంలో విద్యార్థుల మొహాలు కళకళలాడిపోతున్నాయి.

ఎప్పట్లాగే ఉదయం పూట పరీక్షలు పెట్టి మధ్యాహ్నం నుంచి సెలవులిచ్చారు.

సునంద హైదరాబాదు వెళ్ళడానికి రైలు ప్రయాణం చెయ్యాలి. విజయవాడలో ఉండే వాళ్ళ అంకుల్ రైలుకి రిజర్వేషన్ చేయించి మధ్యాహ్నం హాస్టలుకి వచ్చి ఇంటికి తీసుకెళ్ళారు. దగ్గరుండి రాత్రికి సునందని ట్రైన్ ఎక్కిస్తారు.

రజని, నీలూ, మేఘ ముగ్గురూ సునందకి వీడ్కోలు చెప్పి ఆటో తీసుకుని బస్టాండుకి బయలుదేరారు.

బస్టాండులో ఆటో దిగి తమ ఊరికి వెళ్ళే ప్లాట్ఫారం మీదకు వెళుతుండగా అక్కడ కిరణ్ కనిపించాడు. పక్కన ఎవరూ లేరు. ఒక్కడే నిలబడి ఉన్నాడు.

ఇక మళ్ళీ ఎదురుపడడేమో అనుకున్న మేఘకి ఊహించని విధంగా అక్కడ కిరణ్ ని చూసాక అడుగులు ముందుకి పడలేదు. అతను కూడా వీళ్ళ రాకని గమనించాడు.

కిరణ్ ని చూడగానే రజని మొహంలో ఉత్సాహం వచ్చింది. నీలూ కంగారుగా మేఘ మొహంలోకి చూసింది.

ముగ్గురూ బ్యాగులు మోసుకుంటూ మెల్లగా వెళుతుండగా అతనికి కాస్త దూరంలో ఆగి "మనం ఇక్కడే నించుందాం" అంది మేఘ.

రజని, నీలూ ఇద్దరూ ఎదురు మాట్లాడకుండా మేఘ పక్కనే నిలుచుండిపోయారు.

వీళ్ళు అక్కడే ఆగిపోయారని గమనించిన కిరణ్ తనే అటువైపు నడిచాడు.

తమ వైపే వస్తున్న కిరణ్ ని చూసి మేఘ గుండె దడదడా కొట్టుకోసాగింది.

# 7

మేఘ కాదన్నాక కూడా కిరణ్ ఎదురుపడ్డాడంటే ఇప్పుడేం జరుగుతుందో చూడాలన్న ఉత్సుకత కలిగింది రజనికి. సరిగ్గా అదే కారణంగా ఆందోళన మొదలైంది నీలూకి. మేఘ మనసులో భావాలని ఇదీ అని చెప్పడం కష్టం. కానీ ముగ్గురూ తమ ఉద్దేశ్యాలేవీ ముఖాల్లో కనపడనీయకుండా మామూలుగా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు.

కిరణ్ వచ్చి పలకరించేసరికి రజని, నీలూ ఎప్పటిలా నవ్వుతూనే బదులిచ్చారు. మేఘ మాత్రం అతని ఉనికే గమనించనట్టుగా ఎటో చూస్తూ నించుంది.

"ఒక్కడివే వెళుతున్నావా ఇంటికి? ప్రదీప్ రావడం లేదా?" అడిగింది నీలూ.

"ఈసారి ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చారుగా. ప్రదీప్ వాళ్ళ అక్క దగ్గరికి ఢిల్లీ వెళుతున్నాడు" సమాధానం చెప్పాడు కిరణ్.

చేతిలో ఉన్న 'ఆర్చీస్' కవర్లోంచి ఒక గ్రీటింగ్ కార్డ్ తీసి "హ్యాపీ న్యూ ఇయర్" చెప్పి రజని చేతికిచ్చాడు. ఇంకొక గ్రీటింగ్ కార్డ్ నీలూకి కూడా ఇస్తే మేఘ ఏమంటుందో అని సందేహిస్తూనే తీసుకుంది.

తర్వాత తన చేతిలో మిగిలిన కవర్ ని మేఘకి అందిస్తూ "తీసుకో మేఘా.." అన్నాడు.

మేఘ ఉలకలేదు పలకలేదు. ముందుకి సాచిన చేతిని అలాగే ఉంచి తీసుకోమని ఐదారు సార్లు బతిమాలాక "నేను తీసుకోను" అంది.

కిరణ్ బతిమాలే కొద్దీ మేఘకి పంతం పెరిగిపోతోంది. "నాకొద్దు" కాస్త గట్టిగానే అరిచింది.

అప్పటికే చుట్టూ ఉన్న జనాలు ఆసక్తిగా వీళ్ళ వైపే చూస్తున్నారు. మేఘ మొండితనానికి రజనికి చాలా కోపం వస్తోంది.

నీలూ మేఘ చెయ్యి పట్టుకుని "అందరూ మన వైపే చూస్తున్నారు. తీసుకో" అనునయంగా నచ్చచెప్పింది.

చుట్టూ ఉన్న జనాల మొహాలు చూసి ఇబ్బందిగా అనిపించింది మేఘకి. తల వంచుకుని నేల చూపులు చూస్తూనే అతని చేతిలో నుంచి కవర్ అందుకుంది.

అక్కడ నిలబడటం అసహనంగా ఉంది ఆమెకి. కానీ ఏం చెయ్యాలో తెలియడం లేదు. ఇంతలో వాళ్ళు ఎక్కాల్సిన బస్ ప్లాట్ఫారం మీదకి రాగానే తప్పించుకోడానికి మార్గం దొరికిందనుకుని "నేను వెళ్ళి బస్లో కూర్చుంటాను" అని నీలూతో చెప్పి సమాధానం కోసం చూడకుండా నీలూ బ్యాగ్ కూడా తీసుకుని గబగబా బస్ ఎక్కేసింది మేఘ.

అప్పటిదాకా అతి కష్టం మీద మౌనంగా ఉన్న రజని మేఘ వెళ్ళగానే "ఎందుకంత పొగరుగా ప్రవర్తిస్తుంది? తన పంతమే తనది కానీ ఎదుటి మనుషుల గురించి అసలు పట్టదు" ఆవేశపడింది.

కిరణ్ తమకిచ్చిన గ్రీటింగ్ కార్డ్ కన్నా మేఘకిచ్చిన కార్డ్ రెండింతలు పెద్దగా ఉండటం గమనించింది రజని. మేఘ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నా అతను ప్రత్యేకంగా చూడటం, వద్దంటున్నా బతిమాలి గ్రీటింగ్ కార్డ్ ఇవ్వడం అస్సలు నచ్చలేదు ఆమెకి.

"లెటర్లో నువ్వు మేఘని మేడ మెట్ల మీద కనపడమని రాసావుగా. ఆ రోజు" ఆత్రంగా కిరణ్ కి వివరించబోతున్న రజని చేతిని చున్నీ చాటుగా గట్టిగా లాగి మధ్యలోనే ఆపేసింది నీలూ.

"నువ్వు పంపిన లెటర్ చూసి మేఘ బాధపడింది కిరణ్. తనకి నీ మీద కోపం పోలేదింకా" చెప్పింది నీలూ.

"నీలూ ప్లీజ్.. ఈ రోజు నేను మేఘ పక్కన కూర్చోవచ్చా? తనతో మాట్లాడాలి" అని సౌమ్యంగా అడుగుతున్న అతని మొహంలో కాదనగ్గ కారణమేదీ కనిపించలేదు నీలూకి.

ఇంతలో ఉన్నట్టుండి పక్కనున్న రజని భోరుమని ఏడ్చింది.

"ఏమైంది రజనీ? ఎందుకు ఏడుస్తున్నావు?" ఆశ్చర్యంగా అడిగాడు కిరణ్.

"కిరణ్.. కాస్త రజని బ్యాగు కూడా అందుకుని నువ్వెళ్ళి బస్లో కూర్చో. నేనూ, రజని వెళ్ళి వాటర్ బాటిల్ కొనుక్కొస్తాం" అంది నీలూ.

"నా దగ్గర ఒక బాటిల్ ఉంది. ఇంకా కావాలంటే నేను వెళ్ళి తీసుకొస్తానులే. మీరు పదండి" అన్నాడతను.

"మేము పది నిమిషాల్లో వచ్చేస్తాం. బస్ బయలుదేరడానికి టైము ఉందిగా. మరేం పర్వాలేదు" అని చెప్పి అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా రజని చెయ్యి పట్టుకు లాక్కుని పక్కకి తీసుకెళ్ళింది నీలూ.

"ఇప్పుడున్న సమస్యతోనే చస్తుంటే మధ్యలో నీకేమైందే తల్లీ.. ఎందుకేడుస్తున్నావు?" నీరసంగా అడిగింది నీలూ.

సమాధానం చెప్పకుండా కళ్ళొత్తుకుంటూనే ఉంది రజని. కాసేపు సర్ది చెప్పడానికి ప్రయత్నించి లాభం లేక చివరి మాటగా "పద వెళదాం. బస్ ఎక్కాక కూడా ఏడుస్తూనే కూర్చుంటానంటే నీ ఇష్టం" అంది నీలూ. కళ్ళు తుడుచుకుని వెంట నడిచింది రజని.

అందరికన్నా ముందే బస్ ఎక్కిన మేఘ ప్రయాణం చేసినంతసేపూ కిరణ్ ఉనికిని తప్పించుకోవాలని తమ నలుగురికి రెండు పక్క పక్కన సీట్లు కాకుండా తను కూర్చున్న చోటుకి వెనుక దూరంగా ఇంకొక సీటు ఆపింది. ఊహించని విధంగా కిరణ్ వచ్చి సరాసరి మేఘ పక్కనే కూర్చున్నాడు.

మామూలుగా అయితే అతను పక్కన కూర్చోవడం అంత విడ్డూరమైన విషయమేమీ కాదు కానీ ప్రస్తుత పరిస్థితిలో ఇష్టం లేదు మేఘుకి. బయటికి మొండిగా ఉన్నట్టు మాత్రం కనిపిస్తోంది కానీ లోలోపల అతనికి ఎదురుపడటానికి ఆమెకి కాస్త బిడియంగా కూడా ఉంది.

కిరణ్ వచ్చి పక్కన కూర్చోగానే "నీలూ, రజని ఎక్కడా?" అంటూ లేచి నిలుచుంది మేఘ.

"మంచినీళ్ళు కొనుక్కురావడానికి వెళ్ళారు" సమాధానం చెప్పాడు.

"ఇక్కడ నీలూ కూర్చుంటుంది" అంది అతని వైపు చూడకుండానే.

"నేను నీలూని అడిగే వచ్చాను. నీతో మాట్లాడాలి. ప్లీజ్ మేఘా" అనునయంగా అడిగాడు.

ఇక తప్పించుకోవడం కుదరదని గ్రహించి సీట్లో కూలబడింది మేఘ.

పది నిమిషాలు నిశబ్దంలో గడిచాయి.

కళ్ళు తుడుచుకుంటూ బస్ లోపలికి వచ్చిన రజనిని చూసి మేఘ కంగారుపడింది. ఏమిటని అడగబోయేంతలో కళ్ళతోనే వారించింది నీలూ. వాళ్ళిద్దరూ వెనక్కి వెళ్ళి కూర్చున్నారు.

బస్సు ప్రయాణం మొదలైంది.

మేఘ మౌనం వీడకుండా తల పూర్తిగా పక్కకి తిప్పి కళ్ళు కిటికీకి అప్పచెప్పింది.

బస్సు ప్రకాశం బ్యారేజీ మీదకు రాగానే "రూపాయి నాణెం కావాలా?" అడిగాడు కిరణ్.

"....."

"ఎప్పుడూ గలగలా మాట్లాడుతూ ఉండేదానివి. ఇంత సైలెంట్ అయిపోయావేమిటి.. నాతో మాట్లాడవా?"

"....."

"మూడు గంటల సేపు అటే చూస్తూ కూర్చుంటే మెడ పట్టేస్తుంది. పోనీ నేను లేచి వెళ్ళి ఇంకెక్కడైనా కూర్చోనా?" అతని గొంతులో ఏ మాత్రం నిష్ఠూరం ధ్వనించలేదు.

ఆ మాట వినగానే అతన్ని నొప్పిస్తున్నానేమోననిపించి తల తిప్పి మామూలుగా కూర్చుంది మేఘ.

హాస్టలు, క్లాసులు, పరీక్షల గురించి అతనేవో ప్రశ్నలు అడుగుతుంటే క్లుప్తంగా బదులిచ్చింది.

అతని మొహంలోకి చూస్తుంటే, మాటలు వింటుంటే ఇదివరకటిలానే ఉన్నాడు తప్ప అతనిలో అసహజమైన మార్పేమీ కనిపించడం లేదు.

“గ్రీటింగ్ కార్డ్ చూశావా?”

“....”

“చూడవా?”

“....”

“ఒక్కసారి చూడు”

మేఘ తన ఒళ్ళో ఉన్న ‘ఆర్చీస్’ కవర్లోంచి గ్రీటింగ్ కార్డ్ బయటికి తీసింది.

రెండు లాంగ్ నోట్ బుక్స్ కలిపినంత పెద్దగా ఉన్న లేత నీలం రంగు ఎన్వలప్ మీద ‘టు మేఘ, ఫ్రమ్ కిరణ్’ అని రాసుంది. దాన్లోంచి గ్రీటింగ్ కార్డ్ ని బయటికి లాగగానే ముదురు, లేత నీలం రంగుల్లో అందంగా డిజైన్ చేసిన కార్డ్ మధ్యలో చిన్న చిన్న గులాబీ తీగలతో అల్లిన హృదయం ఒకటి కొద్దిగా పైకి ఎగిరినట్టు ముందుకొచ్చింది. పైన ‘న్యూ ఇయర్ విషెస్’ అని పెద్దగా కనపడుతోంది.

తెరిచి చూస్తే లోపల ఎడమవైపున చేతిరాతలో రాసిన రెండు మూడు వాక్యాలు బంగారు రంగులో మెరుస్తున్నాయి. మేఘ అదేం చదవకుండా కార్డ్ అంతా పైపైన చూస్తూ కుడి వైపు పైన మేఘ పేరు, కింద చివర్లో కిరణ్ పేరు చూస్తూనే మధ్యలో ప్రింట్ చేయబడి ఉన్న న్యూ ఇయర్ విషెస్ ఆఖరు లైన్లో ముద్రించి ఉన్న పెద్ద పెద్ద అక్షరాలని చూసి అక్కడే ఆగిపోయింది.

‘ఐ లవ్ యూ!’

ఆ రోజు ఉత్తరానికి స్పందించకపోవడంతోనే ముగిసిపోయింది అనుకున్న విషయం మళ్ళీ ముఖాముఖి ఇలా ఇంత సూటిగా ఎదురవుతుందని ఊహించకపోవడం వల్ల ఉలికిపాటుకి లోనయింది.

తను అంగీకారాన్ని తెలిపిందని అపోహ పడుతున్నాడేమోనన్న ఆదుర్దా కొద్దీ అతికష్టం మీద మాట పెగిలింది.

“నేను... నేను ఆ రోజు నీకు కనిపించలేదుగా?”

“ఊ.. స్టిల్ ఐ మీన్ ఇట్!” స్పష్టమైన సమాధానం వచ్చింది అతని నుంచి.

ఆ గ్రీటింగ్ కార్డులో తను రాసిన మాటలని ఆమె అర్థం చేసుకుందని భావించి అతనా మాటన్నాడు.

మేఘ చూపు ఉండటానికి గ్రీటింగ్ కార్డ్ మీదే ఉన్నా అక్కడున్నదేదీ తన దృష్టికి అందడం లేదు. చప్పున దాన్ని మూసేసి వంచిన తల ఎత్తకుండా అలాగే ఉండిపోయింది.

ఆమెకి తన మనసు తెలపాలని అక్షరాలతో పాటు కాసిన్ని మాటలు తోడు తెచ్చుకున్నాడతను.

ఇన్నాళ్ళ స్నేహంలో తనాడే నాలుగు మాటలకి ఆచి తూచి పొదుపుగా ఒకటీ అరా పలుకులు బదులివ్వడమే చూసిన ఆమెకి మొదటిసారి అతనూ మాటకారే అనిపించింది. అతగాడీ వేళ మనసుని మాట్లాడిస్తున్నట్టున్నాడు మరి!

ఎంతగా తప్పులెంచాలని ప్రయత్నిస్తున్నా అతని మాటల్లో తొంగి చూస్తున్న స్వచ్ఛత ఆమె నోరు నొక్కేస్తోంది. సూటిగా కళ్ళల్లోకి చూస్తూ తేటతెల్లంగా అతని అంతరంగాన్ని తన ముందు పరుస్తున్న తీరుకి ఆమె కళ్ళు వాలిపోతున్నాయి. తన సొంత గుండే ఎదురుదాడికి దిగి లోపల చేస్తున్న వీరంగం బయటికి తెలిసిపోతుందేమో అని ఆందోళనగా ఉంది.

నిజం చెప్పాలంటే చెవులని దాటి తనదాకా వచ్చిన మాటలకి అర్థం ఇదని అనువదించి చెప్పకుండా మెదడు కాస్తా చేష్టలుడిగి చోద్యం చూస్తూ కూర్చుంది. కానీ ఇంతవరకూ పరిచయం లేని ఓ కొత్త భాషని మనసు అప్పటికప్పుడు అక్షరాభ్యాసం చేసి అక్షరమక్షరం కూడబలుక్కుని చదివేస్తోంది ఆరాటంగా.

అతను ఓపిగ్గా ఇద్దరి మధ్యనా మాటల ఇటుకలు పేరుస్తూ వంతెన వేసే కొద్దీ మేఘ బింకం క్రమంగా సడలిపోయి ఊ కొడుతూ వింటోంది.

పక్క సీటులో వాళ్ళు బ్యాగులు సర్దుకుంటూ బస్సు దిగడానికి సిద్ధపడటం చూసి "నీలూని ఇక్కడికి రమ్మని చెప్తాను" లేచి వెళ్ళాడు కిరణ్.

కిటికీలోంచి బయటికి చూసి "అప్పుడే ఇక్కడిదాకా వచ్చేశామా!" ఆశ్చర్యపడుతూ చేతికున్న వాచీ వంక చూసి గంట సమయం గడిచిందని నమ్మలేకపోయింది మేఘ.

వస్తూనే వెనుక సీట్లో వాళ్ళు ఇంతసేపు ఎలా వినోదం కలిగించారో గుసగుసగా చెప్తున్న రజని ముఖంలో ఉత్సాహం చూసి బస్సు ఎక్కినప్పటి ఏడుపు మొహం గుర్తొచ్చింది మేఘుకి. మళ్ళీ మామూలైనందుకు సంతోషించింది.

తుఫాను సూచనలేవీ లేకుండా ప్రసన్నంగానే కనిపిస్తున్న మేఘ మొహం చూసి అప్పటిదాకా ఆందోళన పడుతున్న నీలూ స్థిమితపడింది.

రజని పాప్ కార్న కావాలంటే కిరణ్ వెళ్ళి పాప్ కార్న తో పాటు బిస్కెట్స్, ఉడికించిన వేరుశనక్కాయలు కొనుక్కొచ్చి ముగ్గురికీ ఇచ్చాడు.

అందరూ ఒకచోట చేరేసరికి మళ్ళీ ఎప్పటిలాగే చిరుతిళ్ళు పంచుకు తింటూ ఒకటే కబుర్లు, నవ్వులు.. మేఘ ముభావం వీడి అందరితో పాటు మాటలు కలుపుతోంది, నవ్వుతోంది కానీ మధ్య మధ్యలో ఆలోచనల్లో తప్పిపోతోంది.

మరొక రెండు గంటలు కులాసాగా గడిచాక బస్సు కిరణ్ వాళ్ళ ఊరు చేరింది. అందరికీ మరొకసారి కొత్త సంవత్సరంలో సెలవులు బాగా గడపమని వీడ్కోలు చెప్పి బస్సు దిగిపోయాడు.

కిరణ్ వెళ్ళగానే రజని గబగబా వచ్చి మేఘ పక్కన కూర్చుని "చెప్పు చెప్పు తొందరగా.. ఏం మాట్లాడాడు?" అడిగింది ఉత్సాహంగా.

"ఇంతసేపూ మనందరం ఏం మాట్లాడుకున్నామో అవే" అంది మేఘ.

మేఘ సమాధానం రజని ఉత్సాహం మీద నీళ్ళు చల్లింది.

"నీకిచ్చిన గ్రీటింగ్ కార్డ్ ఏదీ చూపించు. మాకిచ్చినవి చాలా బాగున్నాయి తెలుసా" మేఘని తొందరపెట్టింది చూపించమని.

'న్యూ ఇయర్ విషెస్ టు ఏ డియర్ ఫ్రెండ్' అన్న సంబోధనతో డిజైన్ చేయబడిన ఆ కార్డులు చూసిన మేఘ కూడా బాగున్నాయంది.

మేఘకిచ్చిన గ్రీటింగ్ కళ్ళింతింత చేసుకుని చూసిన రజని ఉద్వేగంతో గట్టిగా అరిచింది.

"అబ్బా.. ఎంతందంగా ఉందో! నేనింతవరకూ ఇంత పెద్ద ప్రపోజల్ కార్డ్ ఎప్పుడూ చూడలేదు. సూపర్ టేస్ట్ కదూ" అంటూ గబగబా నీలూకి చూపించింది.

నేరుగా అలాంటి కార్డ్ ఇస్తాడని ఊహించని నీలూ ఆశ్చర్యపోయి అందులో ఏం రాసాడో ఆసక్తిగా చదివింది. మేఘ ప్రతిస్పందన ఏమిటో తెలుసుకోవాలని ఆమె ముఖంలోకి చూసింది. అక్కడేముందో స్పష్టంగా తెలీలేదు కానీ ఇదివరకటి కోపం, చిరాకు మాత్రం కనిపించలేదు.

అసలు అందులో అతనేమి రాసాడో సరిగ్గా చదవనేలేదు మేఘ. ఇప్పుడు చూడాలనిపించినా స్నేహితుల ముందు మొహమాటంగా అనిపించి రజని చేతిలోంచి అందుకుని సరాసరి బ్యాగులో పెట్టేసింది.

"మొత్తానికి నువ్వు ఇప్పటికైనా పచ్చజెండా ఊపినందుకు ఆనందంగా ఉంది" నవ్వింది రజని.

"పచ్చజెండా లేదూ ఏం లేదూ.. అందరిముందూ రాద్ధాంతం చేస్తే బాగోదని తీసుకున్నానంతే" చప్పున రజని మాటని కొట్టిపారేసింది మేఘ.

"మొండిఘటానివి నువ్వసలు.. అంత మాత్రానికి బస్సులోకి రాగానే తిరిగి ఇచ్చేయకపోయావా మరి?" రజని మొహంలో నవ్వు మాయమైపోయి నిష్టూరం పలికింది.

ఆ మాటకి వెంటనే సమాధానం చెప్పలేకపోయింది మేఘ.

'అవునూ.. నేనెందుకా పని చేయలేదు? నాకా ఆలోచన రాలేదేంటి?' తనని తాను ప్రశ్నించుకుంది కానీ బదులు దొరకలేదు.

"అబ్బా.. ప్రతీదానికి శత్రువుల్లా ఈ వాదించుకోవడాలేమిటి? కాస్త సౌమ్యంగా మాట్లాడుకోవచ్చుగా. అయినా ఏదో కోర్టు బోనులో నిలబెట్టి అన్నీ ఇపుడే తేల్చేయాలన్నట్టు నువ్విపుడే ప్రశ్నల చిట్టా విప్పాలా రజనీ.. దాన్ని కాస్త ప్రశాంతంగా వదిలేయ్" ఇద్దరికీ నచ్చచెప్పింది నీలూ.

తర్వాత ఆ సంగతి పక్కన పెట్టి లోకాభిరామాయణం చెప్పుకుంటూ కాలక్షేపం చేసారు స్నేహితురాళ్ళు ముగ్గురూ.

బస్సు రజని, నీలూ వాళ్ళ ఊరికి చేరింది. వాళ్ళు బస్సు దిగిపోతుంటే బెంగగా అనిపించింది మేఘకి. ఇప్పుడు నీలూతో ఉంటే బావుండనిపిస్తోంది కానీ వీలవదుగా. సెలవుల్లో పక్కింటివాళ్ళ ఫోనుకి కాల్ చేస్తుంటానని చెప్పింది.

అప్పుడిప్పుడే కేబుల్ టీవీలు వచ్చాక సినిమాలు, సీరియళ్ళూ పేరు మీద పల్లెల్లో కూడా అర్ధరాత్రి దాకా లైట్లు వెలుగుతున్నాయి కానీ డిసెంబరు ముప్పై ఒకటో తేదీ రాత్రి పన్నెండు గంటలకి పాత సంవత్సరానికి వీడుకోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ సిటీల్లో, పట్టణాల్లోలాగా వేడుకలు జరుపుకునే సాంప్రదాయం ఇంకా పల్లెల దాకా పాకలేదు.

క్రితం ఏడాది హాస్టల్లో విద్యార్థులు, వార్డెన్లు అందరూ కలిసి అర్ధరాత్రి దాకా ఆటపాటలతో ఎంత సరదాగా న్యూ ఇయర్ వేడుక జరుపుకున్నారో గుర్తొచ్చి ఈసురోమనిపించింది మేఘకి.

టీవీలో ప్రోగ్రాములు చూస్తూ కాలక్షేపం చేద్దామన్నా నాన్నేమో ఉదయాన్నే ఆఫీసు ఉందని తప్పించుకుంటే అమ్మేమో "మన ఉగాదిలా చక్కగా ఉదయాన్నే లేచి రోజంతా హాయిగా గడపాలి కానీ అర్ధరాత్రి దాకా నిద్ర చెడగొట్టుకుని కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడం ఏంటో విడ్డూరం! అయినా తెల్లవారుజామున లేచి ముగ్గులు పెట్టొద్దూ.. అంతసేపు మేలుకోవడం నావల్ల కాదు" అని చేతులెత్తేశారు.

మేఘకి ఒక్కదానికీ చూసే ఆసక్తి లేక ముసుగుతన్ని పడుకుంది. తెల్లవారి ఉదయం మాత్రం ఇంటి ముందు అమ్మ వేసే న్యూ ఇయర్ ముగ్గుకి రంగులద్దడానికి త్వరగానే నిద్ర లేచింది.

స్నానాలూ, టిఫిన్లూ అయ్యాక నీలూకి న్యూ ఇయర్ విషెస్ చెప్పాలని వాళ్ళ పక్కింటికి ఫోన్ చేసింది.

"హ్యాపీ న్యూ ఇయర్ నీలూ.. ఏంటి అంతా గోలగా ఉంది, న్యూ ఇయర్ సెలబ్రేషన్సా?" అడిగింది మేఘ.

"అదేం లేదు. సుజాతాంటీ వాళ్ళింటికి చుట్టాలు వచ్చారు."

"రాత్రి పన్నెండు దాకా మేలుకుని ఉన్నావా? నేనైతే పదిన్నరకే నిద్రపోయాను. ఒక్కదానికీ బోర్ కొట్టింది."

"సేమ్ హియర్. నేను నీకంటే ఒక అరగంట ముందే నిద్రపోయాలే. హ్యాపీ న్యూ ఇయర్!"

"థాంక్యూ థాంక్యూ.. నేను చూడు నిన్ను విష్ చేద్దామని ఫోన్ చేసి ఆ సంగతే మర్చిపోయాను. నీక్కూడా వెరీ హ్యాపీ న్యూ ఇయర్ మై డియర్ నీలమ్మా.."

"థాంక్స్. ఈ రోజు ఫోన్ చేసి మంచిపని చేశావ్. రేపటినుంచి నాలుగు రోజులు ఆంటీ వాళ్ళు ఊరెళుతున్నారు. ఇంట్లో ఎవరూ ఉండరట."

"అవునా.. హ్మ్.."

"ఇంతకీ ఎగ్జామ్స్ ప్రిపరేషన్ ఎప్పటినుంచీ మొదలుపెడతావు?"

“నిన్న, ఇవాళ రెస్ట్. ఇక రేపటినుంచైనా పుస్తకాలు తెరవాలి. రజని వచ్చిందా?”

“ఉహూ.. లేదు.”

మేఘ కిరణ్ గురించి నీలూతో మాట్లాడాలనుకుంది కానీ చుట్టూ ఉన్న ఆ గందరగోళ వాతావరణంలో ఆ ప్రస్తావన తీసుకురావాలనిపించలేదు. మరో రెండు నిమిషాలు మామూలు విషయాలేవో మాట్లాడి ఫోన్ పెట్టేసింది.

కూర్చున్న చోటు నుంచీ కదలకుండా శ్రద్ధగా చదువుకుంటున్నదల్లా ఏదో పుస్తకం అవసరమయ్యి లేచి వెళ్ళి హాస్టలు నుంచి తీసుకొచ్చిన బ్యాగు తెరిచింది మేఘ. కావలసిన పుస్తకం తీసుకుంటూ ఉండగా పుస్తకాల మధ్యన దాచిన గ్రీటింగ్ కార్డ్ కనిపించింది.

ఇప్పటికే ఈ నాలుగు రోజుల్లో నాలుగైదుసార్లు చూసినా సరే మళ్ళీ ఇంకోసారి ముందేసుకుని కూర్చుంది. ఆ కార్డ్ చూసిన ప్రతీసారి ఆ రోజుటి బస్ ప్రయాణం గుర్తొస్తోంది.

మొదటిసారి రజనితో పంపిన ఉత్తరం చూసినప్పటి కోపం, బాధ కిరణ్ ని కలిసి మాట్లాడాక మాయమైపోయాయి. ఎంతగా ఆలోచించినా ఎందుకన్నది అర్థం కాలేదు. తను కూడా కిరణ్ ని ప్రేమిస్తోందా? అన్న ప్రశ్న వేసుకుంటే మాత్రం ఖచ్చితంగా లేదు లేదన్న సమాధానం ఎదురవుతోంది.

కిరణ్ ని తను ప్రేమించడం లేదు. కానీ అతనంటే కోపం లేదు. అతనితో ఉన్నప్పుడు, మాట్లాడినప్పుడు అతని మాటల్లో, నడతలో తప్పు పట్టాల్సింది ఏమీ కనిపించలేదు. తను కూడా అతని పట్ల దురుసుగా ప్రవర్తించకుండా ఉండాలి. ఇది మొదటి నుంచీ తామిద్దరి మధ్యా ఉన్నా స్నేహమే తప్ప తనలో ఇప్పటికిప్పుడు కొత్తగా వచ్చిన మార్పేమీ కాదుగా.. నిజానికి ఆ రోజు తనే కాస్త తలబిరుసుగా ప్రవర్తించి అతని మనసుకి కష్టం కలిగించిందేమో!

మనం ఎప్పటిలా మంచి ఫ్రెండ్స్ లా ఉందాం అని చెప్తేనో? ఎలా చెప్పడం, ఫోన్ చేసి చెప్పొచ్చు కానీ నేరుగా చెప్పడానికి మొహమాటం అడ్డొస్తోంది. మరి ఎలా చెప్పాలి? తను అందరికీ హ్యాపీ న్యూ ఇయర్ విషెస్ చెప్పినట్టు తనకి నేను చెప్తే తన మీద నాకేం కోపం లేదు అని అర్థం చేసుకుంటాడుగా. కానీ ఇప్పటికే న్యూ ఇయర్ దాటిపోయిందే. అయినా పర్లేదు, కాస్త ఆలస్యంగా చెపితే తప్పేముంది. మళ్ళీ ఇలాంటి సందర్భం తనకి దొరక్కపోవచ్చు.

అన్నీ రకాలుగా బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది మేఘ. వాళ్ళుండే పల్లెటూర్లో గ్రీటింగ్ కార్డ్స్ లాంటివేమీ దొరకవు. వెంటనే తను దాచుకున్న గ్రీటింగ్ కార్డ్ కలక్షన్ తీసి కిరణ్ కి పంపించడానికి పనికొచ్చే కార్డ్ ఏమైనా ఉందేమో అని వెతికింది. చాలాసేపు వెతగ్గా వెతగ్గా ఒక కార్డ్ బాగుందనిపించింది.

ఒక ఇంటి ముందు పచ్చటి తోటలో ఉన్న చెక్క గేటు మీద నించుని ఊగుతూ ఒక చిన్న పాప, పక్కనే గేటు పట్టుకుని నించుని నవ్వుతున్న ఒక బాబు ఉన్నారు. లోపల హ్యాపీ న్యూ ఇయర్ సందేశం ఉంది.కార్డ్ లోపల డియర్ కిరణ్ అన్న సంబోధనతో మొదలుపెట్టి చివర్లో యువర్స్ ఫ్రెండ్ మేఘ అని రాసింది.

హాస్టలు నుంచి ఇంటికి ఉత్తరాలు రాయడం కోసం పోస్టల్ ఎన్వలప్స్ తో పాటు స్టాంపులు కూడా తన దగ్గర ఎప్పుడూ ఉంటాయి కాబట్టి గ్రీటింగ్ కార్డ్ కవర్ మీద అడ్రస్ రాసి, స్టాంప్స్ అంటించింది.

వీధి చివరనున్న ఉన్న పోస్ట్ బాక్స్ లో వేసి వద్దామని బయలుదేరబోతూ ఇలా గ్రీటింగ్ పంపుతున్నానని ఒకసారి నీలూతో చెప్పాక పోస్ట్ చేస్తే బాగుంటుంది అనుకుంది.

పక్కింటివాళ్ళ ఫోన్ కి ఒకసారి ప్రయత్నించుదామని రిసీవర్ అందుకోగానే డయల్ టోన్ వినపడలేదు. ఫోన్ వైర్లూ, కనక్షన్స్ అన్నీ సరి చూసినా లాభం లేకపోయింది. ఫోన్ డెడ్ అయిందని తెలిసి ఉస్సూరుమనిపించింది మేఘకి.

ఈ పల్లెటూర్లో ఫోన్ పోయిందని కంప్లెయింట్ ఇచ్చి, వాళ్ళు వచ్చి బాగుచేసేసరికి పుణ్యకాలం కాస్తా అయిపోతుంది. అందులో సంక్రాంతి పండుగ రోజులు అని తలచుకుంటే నీరసం వచ్చింది.

ఇప్పటికే న్యూ ఇయర్ అయిపోయాక న్యూ ఇయర్ విషెస్ కార్డ్ పంపుతోంది. ఇంకా ఆలస్యం చేసేట్టయితే పంపడమే అనవసరం అనిపించి మళ్ళీ ఒకసారి బాగా ఆలోచించి తను సరైన పని చేస్తున్నదని నిర్ధారించుకుని గ్రీటింగ్ కార్డ్ ఎర్రడబ్బాలో వేసి వచ్చింది.

గ్రీటింగ్ కార్డ్ వెయ్యడం అయితే వేసింది కానీ మరుసటి రోజు నుంచి కొత్త సందేహాలు బయలుదేరాయి.

మొదటిసారి బస్లో కలిసినప్పుడు అందరూ అడ్రసులు ఇచ్చి పుచ్చుకున్నారు. అప్పుడు కిరణ్ చెప్పిన అడ్రస్ కే పోస్ట్ చేసింది కానీ అది ఇంటి అడ్రస్ కాదు, వాళ్ళ నాన్నగారి బ్యాంక్ అడ్రస్. కిరణ్ పేరు కూడా రాసింది కానీ ఏమిటీ కవర్ అని వాళ్ళ నాన్నగారు తెరిచి చూస్తారేమో! చూస్తే ఈ అమ్మాయి ఎవరు, ఇలా కార్డ్ పంపిందేంటి అనుకుంటారా? అయినా చూస్తే మాత్రం తప్పేం ఉంది? ఫ్రెండ్ హ్యాపీ న్యూ ఇయర్ విషెస్ పంపింది అనుకుంటారు.. దీంట్లో వేరేగా అనుకోడానికి ఏముంది, తను అనవసరంగా ఎక్కువ ఆలోచిస్తుందేమో! కానీ ఎందుకో తెలీదు చాలా కంగారుగా ఉంది.

ఇప్పుడు గ్రీటింగ్ కార్డ్ పంపిందని తన ప్రపోజల్ కి యెస్ చెప్పాననుకుంటాడా? అహా అలా ఎలా అనుకుంటాడు? తను ఫ్రెండ్ అనే రాసిందిగా. అసలు కార్డ్ ఎందుకు పంపినట్టు? ఎందుకంటే ఫ్రెండ్ కాబట్టి పంపాను. అంతే.. అంతకన్నా ఎక్కువ మరేం లేదు!

అసలీ కార్డ్ సెలవలు అయిపోయే లోపల అందుతుందో లేదో?

ఇలా ఆలోచనల తుట్టె కదిలి ఒకదానికొకటి అడ్డం పడుతూ చిక్కుబడిపోతున్నాయి ప్రశ్నలు. సమయం గడిచే కొద్దీ ఆలోచనల తీవ్రత పెరిగి ఆందోళనగా మారుతోంది. నీలూతో మాట్లాడే అవకాశం కూడా లేకపోవడంతో ఒక్కత్తే తనలో తాను సతమతమైపోతోంది మేఘ.

మనిషి టీవీ ముందు కూర్చుని ధ్యాస మాత్రం అక్కడ లేకుండా ఆలోచనల్లో కొట్టుకుపోతూ ఉండగా అమ్మ పిలుపు బిగ్గరగా వినిపించేసరికి ఈ లోకంలోకి వచ్చింది. ఎంతసేపటి నుంచి పిలుస్తుంటే వినిపించుకోలేదోనని కంగారుగా వెళ్ళింది.

"ఇప్పటికి అరడజను సార్లు పిలిచాను. ఆ పాడు టీవీ ముందు కూర్చుంటే మనుషులు ఈ లోకంలో ఉండరసలు.." పూల సజ్జ చేత పట్టుకుని గన్నేరు చెట్టు కొమ్మ వంచి పూలు కోస్తూ అన్నారు మేఘ వాళ్ళమ్మ గారు.

"టీవీ సౌండ్లో వినిపించలేదులేమ్మా.. ఏంటో చెప్పు."

"ఇవాళ శనివారం కదా, నేనలా గుడి దాకా వెళ్ళొస్తాను. నువ్వు తలుపేసుకుని జాగ్రత్తగా ఉండు. కుక్కర్ పెట్టి వెళితే విజిల్స్ వచ్చాక ఆపుతావా?"

ఓ క్షణం ఆలోచించి "అమ్మా.. గుడికి నేనూ వస్తాను" అంది మేఘ.

"గుడికా, నువ్వా.. స్నానాలు జపాలు లేకుండానే? అడిగినా ఎలాగూ రానంటావని ఊరుకున్నా. మళ్ళీ రేపు వెళదాంలే."

"ఉహూహూ.. కుదరదు. నేనిప్పుడే వస్తా. ఒక్క పది నిమిషాల్లో రెడీ అయిపోతా.. ప్లీజ్ ప్లీజమ్మా.."

"నీ బుర్రలో ఏదో తిక్క పురుగు ఉందనుకుంటా. ఎప్పుడు ఏ బుద్ధి పుడుతుందో చెప్పలేం."

"అంతే మరి! వర్షం ఎప్పుడొస్తుందో ప్రతీసారీ మనకి తెలుస్తుందా ఏంటీ? నేనూ అంతే. పేర్లు పెట్టే ముందే ఆలోచించుకోవాలమ్మా ఇలాంటివన్నీ.." కిలకిలలాడింది మేఘ.

"ఆ చాల్లే బడాయి. అయినా నీ పేరు బాధ్యత మొత్తం మీ నాన్నగారిదే. నాదేం లేదు. తొందరగా తెములు. తాళం వేసి ఇద్దరం వెళదాం" నవ్వారు మేఘ అమ్మ గారు.

గుళ్ళో దేవుడికి ఎదురుగా నించుని భక్తిగా కళ్ళు మూసుకుంది మేఘ.

'దేవుడా దేవుడా.. నేను పంపించిన గ్రీటింగ్ కార్డ్ తొందరగా కిరణ్ కి అందేట్టు, దాని వల్ల ఎవరికీ ఎటువంటి సమస్యలు, అపార్థాలు రాకుండా ఉండేట్టు చూడు. నేను చేసిన పని పొరపాటు అవ్వకుండా చూడు. ఉహూహూ కాదు కాదు.. నేను చేసింది పొరపాటు అయితే ఈ సారికి క్షమించి ఏ ఇబ్బందులు రాకుండా చూడు. అలాగైతే నేను మళ్ళీ వచ్చి కొబ్బరికాయ కొడతాను. ఒక శనివారం ఉపవాసం కూడా చేస్తాను. దేవుడా దేవుడా.. ప్లీజ్..'

అంతసేపు ఏకాగ్రతగా దణ్ణం పెట్టుకోవడం చూసి మేఘ వాళ్ళమ్మ గారు పక్కకొచ్చి నవ్వుతూ "పెద్ద కోరికల లిస్టే చదువుతున్నట్టున్నావుగా. అన్నీ ఒకేసారి చెప్తే కష్టం. కాస్త ఊపిరి పీల్చుకోనివ్వాలి దేవుణ్ణి కూడా" అన్నారు.

"నువ్వు మరీనమ్మా.." కంగారుగా కళ్ళు తెరిచి నవ్వింది మేఘ.

ప్రతీసారీ సెలవుల్లో తిండి, నిద్ర, చదువు అన్నీ కొలతల ప్రకారం జరిగే హాస్టలు టైంటేబుల్ ని పూర్తిగా పక్కన పెట్టి రాత్రి పొద్దు పోయిందాకా టీవీ చూస్తూ, బారెడు పొద్దెక్కిందాకా నిద్రపోతూ కులాసాగా సెలవులని గడిపేసే మేఘకి ఈసారి ఎడతెగని ఆలోచనల మధ్య రోజులు భారంగా గడుస్తున్నాయి.

పండుగకి రెండు రోజుల ముందు ఊరు నుంచి పిన్ని కుటుంబం వచ్చాక మేఘకి హుషారు వచ్చింది. అమ్మ, పిన్ని కలిసి అరిసెలు చేస్తుంటే తమ్ముడు, చెల్లితో కలిసి అరిసెల క్రతువుకి ఉడత సాయం చేస్తూ మధ్యలో నీళ్ళలో వేసి చూసే బెల్లంపాకం కోసం పోటీలు, గిల్లికజ్జాలు, పుస్తకాల్లోనూ, ఇంటి చుట్టూ నేల మీదా రంగుల ముగ్గులు తీర్చిదిద్దడం, గొబ్బెమ్మలు పెట్టడం, బంతిపూల దండలు గుచ్చడం, రోజూ ఉదయాన్నే భోగిమంటల పేరుతో చలిమంట చుట్టూ చేరి హంగామా చెయ్యడం, ఆటలు, పాటలు, అల్లరి, ఆనందంతో ఇల్లంతా సంక్రాంతి కళ వచ్చింది.

భోగి పండుగ రోజు సాయంత్రం మేఘ అమ్మ గారు, పిన్ని కలిసి భోగిపళ్ళు పోసే కార్యక్రమం కోసం అన్నీ సిద్ధం చేస్తున్నారు. చుట్టుపక్కల వాళ్ళు కొంతమందిని పిలిచారు పేరంటానికి. అప్పుడప్పుడే ఒక్కొక్కరు వస్తున్నారు. అక్కలిద్దరూ కలిసి చిట్టి తమ్ముడిని ముస్తాబు చెయ్యడంతో పాటు పట్టులంగాలు సింగారించారు. ఇప్పుడు కూడా కాస్తైనా కుదురు లేకుండా ఇల్లంతా ఒకటే గంతులు వేస్తున్న తమ్ముడి వెనక పరుగులు తీస్తున్నారు.

అంతలో హాల్లోంచి ట్రింగ్ ట్రింగ్ మన్న శబ్దం విని ఫోన్ బాగయినట్టుందే అనుకునే లోపలే మేఘ తమ్ముడు పరిగెత్తుకు వెళ్ళి ఫోన్ ఎత్తి “మేఘక్కా.. నీకే ఫోన్” అని అరిచాడు.

తన కోసం ఎవరు చేసుంటారు, ఒకవేళ కిరణ్ గానీ చేశాడా?

# 8

“హలో..”

“హాయ్ మేఘా.. ఎలా ఉన్నావ్? చాలా మాటలు వినపడుతున్నాయి. ఏంటీ హడావుడి?”

“బావున్నాను. ఇంతకు ముందు నీతో మాట్లాడిన సిసింద్రీ మా పిన్ని కొడుకు. వాడికి భోగిపళ్ళు పోసే కార్యక్రమం జరుగుతోంది ఇప్పుడు. అదే హడావుడి. నువ్వెలా ఉన్నావ్?”

“సూపర్ గా ఉన్నా. నువ్వు పంపిన కార్డ్ అందింది. డాడీ తెచ్చిచ్చారు మధ్యాహ్నం.”

“ఏమన్నా అన్నారా?” ఇన్ని రోజుల తన ఆరాటాన్నంతా ఒక చిన్నమాట చాటున దాచేసి చాలా మామూలుగా అడిగింది మేఘ.

“నేనే ఓపెన్ చేశాక చూపించాను. నువ్వెవరని తెలుసు కదా.. ఏమంటారు, ఊరికే చూసారంతే!”

“ఏం చేస్తున్నావ్ సెలవుల్లో? ఎగ్జామ్స్ ప్రిపరేషన్ ఎలా ఉంది?”

“హాలీడేస్ లో నో మోర్ బుక్స్. మా కజిన్ గాడు వచ్చాడు. ఇద్దరం కలిసి బైక్ మీద తెగ తిరుగుతున్నాం.”

“నీ పని బాగుంది. హాయిగా ఎంజాయ్ చేస్తున్నావ్.”

"అదేం.. నీకు బాగాలేవా సెలవులు?"

"ఎంత బాగున్నా ఇంకొక మూడు రోజులేగా. మళ్ళీ హాస్టలుకి వెళ్ళిపోవాలి."

"అది మూడు రోజుల తర్వాత కదా.. అప్పుడు చెయ్యాల్సిన పనులు అప్పుడు ఎలాగూ తప్పవు. దాని గురించి ఆలోచిస్తూ ఇప్పుడు టైం వేస్ట్ చెయ్యడం ఎందుకు? జస్ట్ టేక్ వన్ డే ఎట్ ఎ టైం! బి హ్యాపీ!"

"ఆహా.. ఎంత సింపుల్ గా చెప్పావ్.. నువ్వు అన్నీ ఇంతే ఈజీగా తీసుకుంటావా?"

"దేన్లోనైనా పాజిటివ్ పాయింట్స్, సంతోషాన్నిచ్చే విషయాలని మాత్రం పట్టించుకుంటాను. వర్రీ అవ్వడం వల్ల ఏమీ ఉపయోగం ఉండదుగా!"

"నేనేం అంత వర్రీ అయిపోడం లేదులే. మా పిన్ని వాళ్ళు వచ్చిన దగ్గర్నుంచి చాలా సరదాగా ఉంది. ఇన్నిరోజులూ ఫోన్ డెడ్ అవ్వడం వల్ల నీలూతో మాట్లాడడం కూడా కుదర్లేదు. అన్నట్టు తెలుసా, ఇప్పుడు నీ కాల్ తోనే మా ఫోన్ బాగయ్యింది."

"నా కాల్ తో ఫోన్ బాగవలేదు. అది బాగయ్యాకే నేను ఫస్ట్ కాల్ చేశాను."

"అబ్బా.. నేనన్నది కూడా అదేలే బాబూ.."

"సరదాగా అన్నాలే. మళ్ళీ దీని గురించి కూడా వర్రీ అవ్వకు."

"ఓయ్.. నేనేం ఊరికే ప్రతీదానికీ వర్రీ అవను. అసలు నాకెలాంటి వర్రీలు లేవు. నేను వర్రీ అవుతున్నానని నువ్వేం వర్రీ అవ్వక్కర్లేదు."

"ఇదేదో భలే ఉందే టంగ్ ట్విస్టర్ లాగా.. మళ్ళీ చెప్పు ఇంకోసారి.."

"నాకు పనుంది. వెళ్ళాలి. ఇప్పటికే రెండుసార్లు పిలిచింది మా చెల్లి" అతని అల్లరికి అడ్డుకట్ట వెయ్యాలని చిన్న అబద్ధం ఆడింది.

"ఒకే ఒకే.. నీ టైం వేస్ట్ చెయ్యన్లే.. నేను రేపు మా కజిన్ వాళ్ళ ఊరికి వెళుతున్నాను. రెండు రోజులు అక్కడుండి అటునుంచే హాస్టల్ కి వెళతాను."

"అవునా.. మా ప్రయాణం ఎప్పుడో తెలీదింకా."

"సరే అయితే.. ఉంటాను మరి. టేక్ కేర్!"

"ఊ.. బై"

కిరణ్ తో మాట్లాడాక కాసేపు నిశబ్దంలో ఉండాలనిపించి ఇంటి వెనుక మొక్కల మధ్యకి వెళ్ళింది మేఘ. మనసంతా ఎందుకో గుబులుగా ఉంది. నిజానికి తను పంపిన కార్డ్ అందుతుందో లేదో దానివల్ల ఏమైనా సమస్యలు, అపార్థాలు వస్తాయేమోనని ఇన్ని రోజులూ పడిన ఆందోళన అంతా ఇప్పుడు మాయమైపోయి మనసు తేలికపడాలి. కానీ చిత్రంగా ఏదో కొత్త దిగులు బయలుదేరింది.

మొదట ఫోన్లో కిరణ్ గొంతు వినగానే కలిగిన ఉత్సాహం ఫోన్ పెట్టేసే టైముకి దిగులుగా మారిపోయింది. ఎందుకిలా వర్రీ అవుతోంది తను.. వర్రీ అన్న మాటకి అదాటున నవ్వొచ్చింది.

ఆలోచనల్లో తేలిపోతూ బంతిపూల కొమ్మలని సవరిస్తూ నించున్న మేఘ దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చింది మేఘ చెల్లెలు.

"ఏంటక్కా.. పెద్దమ్మ నీక్కూడా ఇదే పని చెప్పిందా?"

"ఏం పని?" ఆలోచనల్లోంచి తెప్పరిల్లి అయోమయంగా అడిగింది మేఘ.

"నువ్వు చేస్తున్న పనే.. అక్షింతల్లో కలపడానికి నాలుగు బంతిపూలు కోసుకు రమ్మందిగా."

"ఆ ఆ.. అదే.. కోసుకు వెళదాం పద."

"నాలుగంటే నాలుగే కాకుండా రకానికి ఒకటి తీసుకెళదామా.. నేను ముద్దబంతి, పట్నం బంతి రెండ్రెండు రంగులు కోస్తాను, నువ్వు కారబ్బంతి, బియ్యబ్బంతి కొయ్యి.. సరేనా.."

"అలాగేలే.. నీకు నచ్చినన్ని కోసుకోవచ్చు.. దీనిక్కూడా పెద్ద ప్లానింగా.." కిలకిలా నవ్వింది మేఘనందన.

"హలో.."

"హలో ఆంటీ.. నేను నీలూని. బాగున్నారా?"

"మేము బాగున్నామమ్మా.. ఇంట్లో అందరూ ఎలా ఉన్నారు?"

"అందరం బాగున్నాం ఆంటీ. మేఘ ఏం చేస్తోంది?"

"చెల్లి వాళ్ళ పిల్లలు వచ్చారు పండక్కి. ఇక ముగ్గురూ కలిసి ఒకటే ఆటలు. ఒక్క క్షణం. పిలుస్తానుండు."

నీలూ ఫోన్ చేసిందని చెప్పగానే ఉత్సాహంగా పరిగెత్తుకు వచ్చింది మేఘ.

"హేయ్ నీలూ.. ఎలా ఉన్నావే? మా ఫోను పాడయింది తెలుసా. నిన్న సాయంత్రమే బాగయ్యింది. రాత్రిపూట పక్కింటివాళ్ళకి ఫోన్ చెయ్యడం ఎందుకులే అని చెయ్యలేదు. కాసేపుంటే నేనే చేసుండేదాన్ని. ఇంత ఉదయాన్నే బయటికొచ్చి మరీ ఫోన్ చేశావేంటి?"

"హలో హలో మేఘనందన గారూ.. మాంచి హుషారుగా ఉన్నట్టున్నారే! కొద్దిగా నెమ్మదించండమ్మా."

"నేనెందుకు హుషారుగా ఉంటాను. అదేం లేదు. మామూలుగానే ఉన్నాను" మాటలు తడబడింది మేఘ.

"ఏం హుషారుగా ఎందుకు లేవు? మామూలుగానే ఎందుకున్నావు?"

"ఏదో చాలారోజులకి నీతో మాట్లాడుతున్నా కదాని సంతోషిస్తుంటే ఈ క్రాస్ ఎక్సామినేషన్ ఏంటమ్మా.."

"మరి లేకపోతే నేను ఫోన్ చేస్తే నాకసలు అవకాశమే ఇవ్వకుండా నువ్వే అన్నేసి ప్రశ్నలు అడిగేస్తావా.."

"హ్మ్.. సరే నువ్వే చెప్పు. నేను బుద్ధిగా వింటాను."

"మరేం లేదు, అన్నయ్య వచ్చాడు వైజాగ్ నుంచి. వాళ్ళ యూనివర్సిటీకి మూడంటే మూడు రోజులంట సెలవులు. నిన్న ఉదయమే వచ్చాడు. తను బయటికి వెళుతుంటే నీకు ఫోన్ చేస్తానని చెప్పి నేను కూడా వెంట వచ్చాను. మనం ఎప్పుడు వెళదాం హాస్టలుకి? ఎల్లుండి మధ్యాహ్నం బయలుదేరేట్టయితే సాయంత్రానికి మనల్ని హాస్టల్లో దించి తను వైజాగ్ వెళతానన్నాడు."

"ఓహో.. శ్రీకాంత్ అన్నయ్య వచ్చాడా.. ప్లాన్ బాగానే ఉంది. అయితే మనం ఒక పూట ముందే హాస్టలుకి వెళ్ళిపోవాలా?"

"అలాగని రూలేం లేదు. ఆ రోజైతే తను దింపుతానన్నాడు. సర్లే రేపు ఫోన్ చెయ్యి ఇంట్లో కనుక్కున్నాక. నేను ఉంటాను ఇంక. ఇక్కడ ఫోన్ బిల్ పరిగెడుతోంది. రెండు రోజుల తర్వాత కలిసే ఉంటాంగా. అప్పుడు తీరిగ్గా మాట్లాడుకుందాం" అంది నీలూ.

"అలాగలాగే.. నేను మళ్ళీ చేస్తానులే. ఉంటానింక" హడావుడిగా ఫోన్ పెట్టేసింది మేఘ.

"హమ్మయ్యా.. ఇప్పటికి మనిద్దరం కూర్చుని ప్రశాంతంగా మాట్లాడుకునే వీలు దొరికింది. ఇప్పుడు చెప్పు నీలమ్మా, సెలవుల్లో విశేషాలేంటి?" అడిగింది మేఘ.

"విశేషాలంటే సంక్రాంతి కాబట్టి ముగ్గులు పెట్టడమే. నేనొక పది కొత్త ముగ్గులు నేర్చుకున్నాను. నీకు తెలుసుగా మా వీధిలో అమ్మాయిలందరూ పోటాపోటీగా వేస్తారు ముగ్గులు. ఇంకా అరిసెలు చేయడంలో సాయం చేశాను. జంతికలు ఒత్తడం వచ్చేసింది తెలుసా!"

"ముగ్గులూ, జంతికలూ కాకుండా వేరే ఇంకేమీ లేవా?" నీరసంగా అడిగింది మేఘ.

"అదేంటే అలా తీసిపారేస్తావు? అసలు నా ప్రావీణ్యం అంతా వాటిల్లోనే అయితేనూ.."

"సరే గానీ రజని ఆ రోజు బస్ స్టేషన్లో ఎందుకు ఏడ్చింది?"

"ఏమో, ఉన్నట్టుండి ఏడ్చేసింది. నాకేమీ అర్థం కాలేదు. కిరణ్ కూడా ఆశ్చర్యపోయాడు. ఆ రోజు ఎంత అడిగినా చెప్పలేదు. నేనింక మళ్ళీ అడగలేదు."

"సెలవుల్లో రోజూ వచ్చి నీ బుర్ర తినే ఉంటుందిగా."

"నువ్వు ఆశ్చర్యపోయే విషయం చెప్పనా..? రజని ఈసారి మా ఇంటికి ఎక్కువ రానేలేదు."

"నిజమా?"

"అవును. ముందు రెండు వారాలు అస్సలు రాలేదు కానీ పండుగ మూడు రోజులు మాత్రం వచ్చింది. హాస్టలుకి ఎప్పుడు వెళదాం అని కనుక్కోవడానికి వచ్చానంది. అన్నయ్య కూడా ఉన్నాడు అప్పుడు. అందుకే వచ్చిందో లేదో తెలీదు కానీ నా దగ్గర మాత్రం మళ్ళీ అన్నయ్య ప్రస్తావన తీసుకురాలేదు."

"హ్మ్.. ఏమోలే, నికరంగా తెలీకుండా నింద వెయ్యకూడదు. మళ్ళీ అన్నయ్య గురించి మాట్లాడలేదంటే ఒకవేళ తన ఆలోచనలు మార్చుకుని ఉండొచ్చుగా."

"సరేలే.. రజని సంగతి వదిలేసి సెలవుల్లో నువ్వేం చేశావో చెప్పు. కిరణ్ మాట్లాడాడా?" అడిగింది నీలూ.

కిరణ్ తో దురుసుగా ప్రవర్తించి మంచి స్నేహితుడిని దూరం చేసుకోకుండా ఉండాలని నిర్ణయించుకోవడం, పోస్టులో గ్రీటింగ్ కార్డ్ పంపుదామనుకోవడం, ఫోను అందుబాటులో లేకపోవడం వల్ల నీలూకి చెప్పకుండానే పంపాల్సి రావడం, కార్డు అందిందని కిరణ్ ఫోన్ చేసి చెప్పడం.. మొత్తం జరిగినదంతా నీలూతో వివరంగా చెప్పింది మేఘ.

"పోనీలే, మంచి పని చేశావు. నన్ను అడిగినా నేనేం అభ్యంతరం చెప్పి ఉండేదాన్ని కాదు. స్నేహం సంగతి సరే కానీ మరి ప్రేమ సంగతి ఏమిటి?" మేఘని సమర్థిస్తూనే సందేహంగా అడిగింది నీలూ.

"ప్రేమ గీమా ఏం లేదూ. తను కూడా ఫోనులో మాట్లాడినప్పుడు అలాంటివేమీ లేకుండా ఇదివరకులా మామూలుగానే మాట్లాడాడు" నీలూ అనుమానాన్ని తోసిపుచ్చింది మేఘ.

"అతని సంగతి సరే, నీలో ఏమన్నా మార్పు వచ్చిందా అని?" కళ్లెగరేసి చిన్నగా నవ్వింది నీలూ.

"మార్పు లేదూ తీర్పూ లేదు. ఇదిగో నువ్విలా మాట్లాడితే ఊరుకోనంతే.." అలిగినట్టు మొహం పెట్టింది మేఘ.

"సరే ఇదొక్కటి మాత్రం చెప్పు. కిరణ్ ఇచ్చిన గ్రీటింగ్ కార్డ్ ఏం చేశావు? చింపి పడేశావా?"

రెండు క్షణాల మౌనం తర్వాత "ఉహూ.. నీలమ్మా, నేనేమన్నా తప్పు చేశానంటావా?" బేలగా అడిగింది మేఘ.

"ఛఛా.. అదేం లేదు" నీలూ అంటుంటే సునంద వచ్చింది వాళ్ళ దగ్గరికి.

జరిగినదంతా సునందకి కూడా వివరంగా చెప్పింది మేఘ.

"మేఘా.. కిరణ్ నీకు ఫ్రెండ్ అయ్యి ఉండటం చేత కావచ్చు, అతని వ్యక్తిత్వం మీద నీకున్న మంచి అభిప్రాయం వల్ల కావచ్చు నీకు అతని పట్ల వ్యతిరేక భావాలేమీ లేవని అర్థమవుతోంది. తన వైపు నుంచి నిన్ను ప్రేమిస్తున్నాడని స్పష్టంగా తెలియచేశాడు. నీకు స్నేహమే తప్ప ప్రేమ లేదనీ, రాదనీ నువ్వంటున్నావు. ఇందులో తప్పొప్పులు తేల్చి చెప్పడానికేమీ లేదు కానీ నేనొక్క సలహా మాత్రం ఇవ్వగలను. ఎవరితోనైనా స్నేహం చెయ్యమని, ఎవరి మీదైనా అభిమానమో, ద్వేషమో పెంచుకోమని ఒకరు చెప్తే మనకా ఫీలింగ్స్ రావు. మనకంటూ ఒక ఫీలింగ్ వచ్చాక ఎవరో చెప్పారని క్షణాల్లో మారిపోవు. కాబట్టి నీ మనసుకీ, బుద్ధికీ ఏమనిపిస్తుందో దాన్ని నమ్ము. నీ స్నేహితులుగా మేమెప్పుడూ నీ పక్కనే ఉంటాం. అంతే కదా నీలూ?" తన అభిప్రాయం స్పష్టంగా, సూటిగా చెప్తూనే నీలూని అడిగింది సునంద.

"నీ అంత బాగా నాకు చెప్పడం రాదు కానీ నువ్వు బ్రహ్మాండంగా చెప్పావక్కా" సంతోషంగా బదులిచ్చింది నీలూ.

"నీ సంగతి సరే, మన కథానాయిక మాట్లాడదేంటి?" మేలమాడింది సునంద.

"నువ్వు కూడా ఏంటక్కా.. నేనేం అలా కాదు" సిగ్గుపడింది మేఘ.

"నువ్వు కాదంటే సరిపోతుందా, మేమందరం అలా నిర్ణయించేశాక" ఉడికించింది సునంద.

"నాది ఉట్టి స్నేహమే. వేరే ఏం కాదు. నిజంగా!" సర్దిచెప్పడానికి ప్రయత్నించింది మేఘ.

"ఉట్టి స్నేహం కాదు గట్టి స్నేహం అని మేమన్నామా?" నీలూ కూడా సునందతో శృతి కలిపింది.

"మీకు చెప్పలేనసలు. నచ్చినట్టు అనుకోండి" బుంగమూతి పెట్టింది మేఘ.

"అరే.. అసలేమీ అనుకోవడం లేదు పిల్లా అంటుంటే నచ్చినట్టు అనుకోండి అంటావేంటి? సరే సరే.. ఎంత నచ్చినట్టో అర్థం చేసుకుంటున్నాంలే" చిలిపిగా నవ్వింది సునంద.

"బాబోయ్.. నేనేం మాట్లాడను ఇంక" తప్పించుకు పారిపోయింది మేఘ.

వారమంతా పరీక్షలతో కుస్తీ పట్టి అలసిపోయారని ఆ ఒక్క రోజు రాత్రి స్టడీ అవర్స్ నుంచి ఒక గంట ముందుగా వదిలారు వార్డెన్లు. రూముకి చేరి పుస్తకాలు పక్కన పడేసి తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ సేద తీరుతున్నారు మేఘ, నీలూ. అప్పటిదాకా కనిపించని రేవతి రజనితో కలిసి వచ్చింది. వచ్చీ రాగానే "మనం ఇప్పుడొక అద్భుతమైన పని చెయ్యబోతున్నాం" అంటూ ఒక నోట్ బుక్, పెన్ తీసుకుని వచ్చి నడి మంచంలో కూర్చుంది.

"చదువుకి సంబంధించింది అయితే నా వల్ల కాదు. అదేదో మీరే చేస్కోండి. నాకు ఇవాళ్టికి రెస్ట్ కావాలి" నీరసంగా అంది నీలూ.

"అవును మరి, అక్కడికి నేనేదో స్టేట్ ర్యాంక్ కోసం కష్టపడిపోతున్నట్టు! అదేం కాదులే కానీ కాసేపు రిలాక్స్ అవ్వడానికి పనికొచ్చే సరదా అయిన పనే చేద్దాం" చిలిపిగా నవ్వింది రేవతి.

"అదేంటో చెప్పు ముందు" అడిగింది మేఘ.

"ఇప్పుడు నేనొక లవ్ లెటర్, అదే ప్రేమలేఖ రాస్తాను. మీరందరూ హెల్ప్ చెయ్యాలి. 'హలో మై డియర్ లవ్' అని మొదలు పెడితే బాగుంటుందా?" రేవతి మాట్లాడుతూనే రాయడం మొదలుపెట్టింది.

"ఏంటీ.. లవ్ లెటరా? ఎవరికి రాస్తున్నావ్? నీకింత ధైర్యం ఎప్పుడొచ్చింది?" ఆశ్చర్యపోయింది నీలూ.

"ఉత్తుత్తి లవ్ లెటరేలే. మీరు భయపడడం మానేసి మీ క్రియేటివిటీకి పదును పెట్టండి" హామీ ఇచ్చింది రేవతి.

"ఎప్పుడైనా రాసి ఏడిస్తే కదా ఏం రాయాలో తెలీడానికి?" నీరసంగా అంది నీలూ.

"రాసిన ఎక్స్పీరియెన్స్ ఎవరికీ లేదు కాబట్టే కదా అందరం కలిసి రాద్దామనేది" అంది రేవతి.

స్నేహితురాళ్ళందరూ ఉత్సాహంగా తెలుగులో, ఇంగ్లీషులో ఎడాపెడా తలా కొన్ని వాక్యాలు చెప్పుకొచ్చారు.

మేఘ ఏం చెప్పినా "మాకు తెలుసులే నీకెలా ఇంత మంచి ఐడియాలు వస్తున్నాయో" నంటూ ఆట పట్టించింది రేవతి. అన్యాపదేశంగా కిరణ్ గురించే ఆట పట్టిస్తున్నారని అర్థమైనా మేఘ చిరాకుపడటం లేదు. చిన్నగా నవ్వి ఊరుకుంటోంది. ఆ నవ్వుల్లో పల్చగా మెరిసి మాయమవుతున్న సిగ్గు తెరలు స్నేహితురాళ్ళ దృష్టిని దాటిపోలేదు.

మధ్యలో వచ్చిన సునంద కూడా వాళ్ళ అల్లరిలో పాలు పంచుకుంది.

అందరి నవ్వులు, కేరింతల నడుమ సందర్భాలు, ఉద్దేశ్యాలు వివరిస్తూ ఏ వాక్యం ఎలా రాస్తే బాగుంటుందని ప్రశ్నలు వేస్తూ వాళ్ళు చెప్పినవన్నీ రాసుకుంటూ పోయింది రేవతి.

వాదప్రతివాదాల నడుమ కొత్త కొత్త ఆలోచనలు, సలహాలు అన్నీ పోగేసి రెండు గంటల్లో మూడు పేజీలు నింపారు. తర్వాత రేవతి చదువుతుంటే సరదా కామెంట్లు చేస్తూ అందరూ ఒకటే నవ్వులు.

"ఈ లవ్ లెటర్ ఎవడికన్నా ఇస్తే ప్రేమించడం సంగతి దేవుడెరుగు చదవగానే స్పృహ తప్పి పడిపోతాడు" పూర్తిగా చదవడం అయ్యాక అంది నీలూ.

"చదివి కాదు, చదవలేక పడిపోతాడు. ఎగ్జామ్ కోసం రాసిన ఆన్సర్ షీట్ లాగా ఉంది దాని సైజు" బిగ్గరగా నవ్వింది రజని.

"అయితే ఇప్పుడు ఇంకొక పరీక్ష మీ అందరికీ. నేను మళ్ళీ చదివి వినిపిస్తాను. ఎక్కువ బాగున్న వాక్యాలని సెలెక్ట్ చేసుకుంటూ వెళ్ళి ఈ నాలుగు పేజీలని ఒక్క పేజీ సైజుకి తీసుకొద్దాం" అని చెప్పి వెంటనే మళ్ళీ చదవడం మొదలుపెట్టింది రేవతి.

మరో గంట సేపు ఆ ప్రహసనం కూడా అయ్యేసరికి నవ్వీ నవ్వీ అలసిపోయారు అందరూ.

"ఈ రోజు రేవతి పుణ్యమా అని భలే ఎంజాయ్ చేశాం" ఆనందంగా అంది నీలూ.

"మరే.. నవ్వులాటలో పడి టైము కూడా చూసుకోలేదు. ఒంటిగంట దాటింది" అంది సునంద.

"అమ్మో.. ఇంక అర్జెంటుగా నిద్రపోకపోతే రేపొద్దున్న క్లాసులో తెగ నిద్రొచ్చేస్తుంది" అంది మేఘ.

అందరూ ఎవరి దారిన వాళ్ళు నిద్రకి పరుగు తీస్తుంటే రేవతి ఒక్కతే శ్రద్ధగా కూర్చుని ఆ ఒక్క పేజీకి కుదించిన ప్రేమలేఖని చక్కగా ఫెయిర్ చేసింది.

ఎంసెట్ అప్లికేషన్ ఫారాల కోసం పాస్పోర్ట్ ఫోటోలు అవసరమని, ఫోటోలు లేనివాళ్ళు వార్డెన్ పర్మిషన్ తీసుకుని అర కిలోమీటరు దూరంలో మెయిన్ రోడ్డు మీద ఉన్న ఫోటో స్టూడియోకు వెళ్ళి ఫోటోలు దిగి తీసుకురమ్మని చెప్పారు కాలేజీ వాళ్ళు.

మేఘ ఫోటోలు ఎక్కడున్నాయో దొరకలేదని, సునంద దగ్గర ఫోటోలు లేవని ఇద్దరూ కలిసి ఒకరోజు మధ్యాహ్నం లంచ్ టైములో బయలుదేరారు. ఫోటో స్టూడియో దాకా వెళ్ళాక పాస్పోర్ట్ ఫోటోలతో పాటు ఇద్దరూ కలిసి సరదాగా మామూలు ఫోటోలు కూడా తీయించుకుని మరుసటిరోజు వాచ్ మెన్ వచ్చి బిల్లు చూపించి తీసుకునేట్టు మాట్లాడారు.

ఫోటో స్టూడియో నుంచి హాస్టలుకి వస్తుంటే దారి మధ్యలో 'మేఘా' అన్న పిలుపు వినిపించి వెనక్కి తిరిగి చూస్తే కిరణ్ కనిపించాడు. అనుకోకుండా అక్కడ అతన్ని చూసి ఆశ్చర్యపోయింది మేఘ.

అతను దగ్గరికొచ్చి మేఘనీ, సునందనీ పలకరిస్తుంటే "మేము ఇలా రోడ్డు మీద మాట్లాడకూడదు. ఎవరైనా చూస్తే హాస్టల్లో కంప్లయింట్ చేస్తారు" అని భయంగా చుట్టూ చూసింది మేఘ.

"సరే సరే.. నేను వెళతానులే. యు డోంట్ వర్రీ. ఫోన్ బూత్ లోంచి బయటకు రాగానే మీరు కనిపించారు. నువ్వేనా కాదా అనుకున్నాను ముందు. టేక్ కేర్.. బై" అని చెప్పి గబగబా వాళ్ళని దాటి ముందుకి వెళ్ళిపోయాడు కిరణ్.

"ఈ కాస్తకే అంత భయం ఎందుకు? నేను కూడా ఉన్నానుగా నీతో పాటు" అతను వెళ్ళిపోయాక మేఘని అడిగింది సునంద.

"ఎందుకో కంగారుగా అనిపించిందక్కా. మళ్ళీ ఎవరైనా తనని ఏమైనా అంటే.." మాటలు దొరకనట్టు సగంలోనే ఆపేసింది మేఘ.

ఆ సంభాషణని పొడిగించకుండా చిన్నగా నవ్వుతూ మేఘ వెన్ను తట్టింది సునంద.

తరువాతి ఆదివారం సునంద కోసం ఎవరో వచ్చారని పిలిస్తే వెళ్ళి చూసేసరికి కిరణ్, ప్రదీప్ ఉన్నారు.

"మేఘ కంగారు పడుతుందేమోనని నీకోసం వచ్చామని చెప్పాం" కిరణ్ ఇంకా చెప్పబోతుంటే సునంద మధ్యలోనే ఆపేసింది. వెళ్ళి ఒక్క పిలుపుతో మేఘతో సహా దండు మొత్తాన్ని తీసుకొచ్చింది.

"సండే ప్లాన్స్ ఏమిటి?" అడిగాడు ప్రదీప్.

"మా అంకుల్ వచ్చి పర్మిషన్ తీసుకుని వాళ్ళింటికి తీసుకెళతానన్నారు" చెప్పింది సునంద.

"మేము సినిమాకి వెళదాం అనుకుంటున్నాం. మీరూ వస్తారా?" అడిగాడు కిరణ్.

నీలూ మేఘ అభిప్రాయం కోసం తన వైపు చూసింది.

ఇంతలో రజని కిరణ్ ని అడిగింది "ఏం సినిమాకి?"

"ప్రేమకథ" అని ప్రదీప్ నుంచి సమాధానం రాగానే తుళ్ళిపడింది మేఘ.

"ఉహూ.. నేను రాను" అంది వెంటనే.

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. కిరణ్ మాత్రం ఇంకొకసారి అడిగాడు. మేఘ మౌనమే సమాధానం అయింది.

నీలూ, మేఘల మీద రజనికి కోపం వచ్చినా ఏమీ అనలేకపోయింది. సునంద వేరే విషయాల మీదకి మాటలు మళ్ళించింది.

మరొక అయిదు నిమిషాలు మాట్లాడి వెళ్ళిపోయారు అబ్బాయిలిద్దరూ.

"నేనొక్కదాన్ని రానన్నాను కానీ మీ అందర్నీ వెళ్ళొద్దని అనలేదుగా" వాళ్ళు వెళ్ళిపోయాక ఇబ్బందిగా అంది మేఘ.

"అబ్బా ఎంత మంచి మనసో!" వెటకారంగా అంది రజని.

“మనందరం ఫ్రెండ్స్ అయినప్పుడు ఒకరి ఫీలింగ్స్ కి ఒకరు విలువ ఇవ్వాలి తప్ప ఇలా పరుషంగా మాట్లాడి బాధపెట్టకూడదు” సునంద రజనిని కోప్పడింది.

“అవును. ఎప్పుడూ ఒక్కరి ఫీలింగ్స్ ని బట్టే మిగతా అందరూ నడుచుకోవాలి. అయినా నాకెందుకులే, అందరూ కలిసి మళ్ళీ నన్ను తప్పంటారు” గొణుక్కుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది రజని.

“అది కాదక్కా.. ఎందుకో నాకు వెళ్ళాలనిపించలేదు. సారీ” తడి కళ్ళతో చెప్పింది మేఘ.

“పిచ్చిపిల్లా.. దీనికే కన్నీళ్ళా? మేమెవ్వరం ఏమీ అనుకోవడం లేదు. ఎందుకు ఏంటీ అని నువ్వేం సంజాయిషీ చెప్పక్కర్లేదు” అనునయంగా కన్నీరు తుడిచింది సునంద.

ఆదివారం రోజున ఎప్పటిలాగే ఇంటికి వెళ్ళి సోమవారం ఉదయం హాస్టలుకి తిరిగి వచ్చింది రేవతి. రాత్రి స్టడీ అవర్స్ అయిపోయాక మీకొక విషయం చెప్పాలంటూ అందరినీ ఒకచోట కూర్చోబెట్టింది.

“నన్ను ఒకరు ప్రేమిస్తున్నారేమోనని డౌటుగా ఉంది. నిజం చెప్పాలంటే డౌట్ లేదు. ఖచ్చితంగా ప్రేమిస్తున్నట్టే” ఉపోద్ఘాతంగా చెప్పింది రేవతి.

“ఎవరమ్మా అది, సల్మానా, అబ్బాసా? మొత్తం విన్నాక ఫూల్స్ అయిపోకుండా ముందే తెలుసుకుంటాం” నవ్వింది నీలూ.

“ఇది కట్టుకథ కాదు నీలూ. నిజంగా చెప్తున్నా” నవ్వకుండా ముఖం గంభీరంగా పెట్టింది రేవతి.

“ముందు కథేంటో వివరంగా చెప్పు” అంది మేఘ.

“అతను చుట్టూ చాలామంది అమ్మాయిలున్నా నా వంకే ప్రత్యేకంగా చూస్తున్నట్టు, నన్ను చూసి నవ్వినప్పుడు అది మామూలు నవ్వులా కాకుండా ప్రత్యేకంగా ఉన్నట్టు, నాతో మాట్లాడినప్పుడల్లా కావాలని ఇష్టంతో మాట్లాడినట్టు నాకు స్పష్టంగా తెలిసిపోతోంది. ఇలా చేస్తుంటే దానర్థం అతను నన్ను ప్రేమిస్తున్నట్టే కదా?” అడిగింది రేవతి.

“అయ్యుండచ్చేమో! ఇంతకీ అతనెవరో, ఇవన్నీ ఎప్పుడు ఎలా జరిగాయో వివరంగా చెప్తే మాకు బాగా అర్థం అవుతుంది” అంది సునంద.

“అతని పేరు ఇబ్రహీం.”

“నేనిందాకే చెప్పలేదూ.. అబ్బాస్ కాకపోతే ఇంకెవడో కొత్త హిందీ సినిమా హీరో అయ్యుంటాడు. మనం నోరు తెరుచుకుని మొత్తం విన్నాక ఫూల్స్ అయిపోయామంటుంది రేవతి” నవ్వుతూ అంది నీలూ.

“ఇంతకీ ఎవరా ఇబ్రహీం? నీకెలా పరిచయం?” అడిగింది సునంద.

“నాకే కాదు, నీలూకూడా తెలుసు” చెప్పింది రేవతి.

“అయ్య బాబోయ్. నాకెవరూ తెలీదు. ఇది తెలివిగా నన్ను ఇరికించేస్తోంది. మీరెవరూ నమ్మకండి” గోల పెట్టింది నీలూ.

"అదేంటి అలా అంటావూ.. మనం ప్రతి రోజూ చూడటం లేదూ ఆయన్ని?"

"ఏయన్ని? ఎక్కడా?" నిలదీసింది నీలూ.

"మన క్లాసురూములో."

"వామ్మో.. అంటే కొంపదీసి నువ్వు చెప్పేది మన జువాలజీ లెక్చరర్ ఇబ్రహీం సర్ గురించి కాదు కదా?" భయం భయంగా అంది నీలూ.

"పర్లేదు. ఇప్పటికన్నా వెలిగింది" నవ్వింది రేవతి.

"ఓసీ దుర్మార్గురాలా.. లెక్చరర్ నిన్ను ప్రేమించడం ఏమిటే.. పిచ్చి పిచ్చి జోకులు వెయ్యకు" మేఘ అరిచింది.

"నీలూ చెప్పిందే కరక్ట్. నువ్వు మా మీద ప్రాక్టికల్ జోక్ ప్లే చేద్దాం అనుకుంటున్నావు కాబట్టి మేము నమ్మమంటే నమ్మము" సునంద కూడా గొంతు కలిపింది.

"నిజం చెప్తుంటే జోకులు అంటారేంటీ తల్లుల్లారా.. సరే అయితే మీకొక ఇన్సిడెంట్ చెప్తాను వినండి. పోయిన వారం ఒక రోజు రాత్రి స్టడీ అవర్స్ లో ఉన్నప్పుడు అందరం సైలెంట్ గా చదువుకుంటున్నాం. ఆ రోజు టైం టేబుల్ ప్రకారం జువాలజీ డౌట్స్ క్లియర్ చెయ్యడానికి ఇబ్రహీం సర్ వచ్చారు. అటూ ఇటూ తిరుగుతూ మా క్లాసు రూమ్ పక్కనున్న నందివర్ధనం చెట్టు నుంచి ఒక పువ్వు కోసి చేతిలో పట్టుకుని ఇద్దరు స్టూడెంట్స్ దగ్గరికి వెళ్ళి డౌట్స్ క్లారిఫై చేశారు. తర్వాత క్లాస్ రూమ్ ముందు ఎంట్రన్స్ నుంచి వెళుతూ వెళుతూ ఫస్ట్ బెంచీలో కూర్చున్న నన్ను చూసి నవ్వి నా టేబుల్ మీద ఆ పువ్వు పెట్టేసి వెళ్ళారు. అంటే ఏంటీ అర్థం?"

"నీ మొహం అని అర్థం. లెక్చరర్స్ స్టూడెంట్స్ ని ప్రేమించడం లాంటి పిచ్చి పనులు చెయ్యరు. అయినా ఆయనేదో చేతిలో ఉన్న పువ్వు విసిరెయ్యలేక వెళ్తూ వెళ్తూ అక్కడున్న టేబుల్ మీద పెట్టి వెళ్ళినంత మాత్రానా ఇంక ప్రేమించినట్టేనా? ఏడ్చినట్టుంది నీ లాజిక్!" అంది మేఘ.

"నువ్వసలే యాంటీ లవ్ టైప్. నేను వినను నీ మాటలు" బుంగ మూతి పెట్టింది రేవతి.

"ఇబ్రహీం సర్ కి పెళ్ళైపోయి ఒక పాప కూడా ఉందని మన క్లాసులో అందరూ చెప్పుకుంటారుగా. ఇలాంటి తింగరి వేషాలు ఆయనెందుకు వేస్తారు?" ఇంకో పాయింటు లాగింది నీలూ.

"అబ్బా.. మీ గోల మీదే గానీ నా మాట నమ్మరేంటి? ఆయన నన్ను స్పెషల్ గా చూస్తున్నట్టే ఉంది నాకైతే" అదే మాట మళ్ళీ గట్టిగా చెప్పింది రేవతి.

"సరే అలాగే అనుకుందాం కాసేపు. అయితే ఇప్పుడేం చేద్దామంటావు? అది చెప్పు" అడిగింది సునంద.

"నాక్కూడా చాలా ఎక్సైటింగా ఉంది ఆయన అలా చూస్తుంటే."

రేవతి మాటల్ని మధ్యలోనే ఆపి "అంటే నువ్విప్పుడు ఆయన్ని ప్రేమిస్తున్నాననవు కదా?" కంగారుగా అడిగింది మేఘ.

"హమ్మయ్యా.. థాంక్స్. ఇదన్నా వెంటనే అర్థం చేసుకున్నారు" నవ్వింది రేవతి.

"ఊ.. ఆ తర్వాత?" అడిగింది సునంద.

"తర్వాతేముందీ.. పాపం ఆయన మొహమాటపడుతున్నాడల్లే ఉంది. అందుకని నేనే ముందడుగు వేసి ఈ ప్రేమ విషయం తేల్చేయ్యాలని నిర్ణయించేశా."

"అంటే నేరుగా వెళ్ళి సర్ కి 'ఐ లవ్ యూ' అని చెప్తావా ఏంటి ఖర్మ?" భయంగా అడిగింది నీలూ.

"ఆ.. చెప్తా పాపం. అప్పుడు కానీ మా డాడీ నాకు డైరెక్ట్ గా పెళ్ళి చెయ్యరు."

"నెక్స్ట నెక్స్ట... తర్వాతేంటో చెప్పు" తొందరపెట్టింది సునంద.

"బాగా ఆలోచించగా చించగా ఒక తెలివైన ఐడియా తట్టింది. అదేంటంటే ఒక లవ్ లెటర్ రాస్తే తేలిపోతుందని."

"లవ్ లెటరా!!!" అందరూ ఒక్క పెట్టున గట్టిగా అరిచి మొహామొహాలు చూసుకున్నారు.

"పర్లేదు. మీరందరూ బాగానే షార్ప్ గా ఉన్నారు. సరిగ్గానే గెస్ చేశారు. మొన్న మనందరం కలిసి సమిష్టి కృషితో రాసిన లవ్ లెటర్ ఇబ్రహీం సర్ కోసమే" చిలిపిగా నవ్వింది రేవతి.

"అంటే ఆ లెటర్ ని తీసుకెళ్ళి సర్ కిచ్చేశావా?" అవాక్కైపోయి అడిగింది నీలూ.

"అందులో మనందరి పేర్లూ రాశావా?" కంగారుపడింది మేఘ.

రేవతి పడీ పడీ నవ్వుతోంది.

"వెధవ నవ్వాపి సరిగ్గా చెప్పి ఏడువ్.. చంపేస్తాం లేకపోతే" తొందరపెట్టింది నీలూ.

"మీ పేర్లు రాస్తే రాస్తానేమో కానీ నా పేరెందుకు రాసుకుంటాను చెప్పు. అలా ప్రూఫ్ తో సహా దొరికిపోతారా ఎవరైనా?" ఇంకా నవ్వుతూనే ఉంది రేవతి.

"అయితే ఇదంతా అబద్ధం. మమ్మల్ని భయపెట్టాలని కల్పించి చెప్తున్నావ్" అంది మేఘ.

"కాదు. ఆ ఉత్తరం నేను నేరుగా ఇవ్వలేదు కానీ ఇబ్రహీం సర్ కి మాత్రం తప్పకుండా అందుతుంది."

"ఎలా?" అడిగింది సునంద.

"ఎందుకంటే దాన్ని భద్రంగా ఒక కవర్లో పెట్టి ఆయన అడ్రసుకి పోస్ట్ చేశాను కాబట్టి."

"ఆయన అడ్రస్ నీకెలా తెలుసు?" అడిగింది నీలూ.

"అదేమన్నా పెద్ద రహస్యమా తెలీకపోడానికి. ఇబ్రహీం సర్ మన కాలేజీలోతో పాటు సిద్దార్థ డిగ్రీ కాలేజీలో కూడా లెక్చరర్ జాబ్ చేస్తున్నారు. ఆయన పేరు కింద సిద్ధార్థ కాలేజీ అడ్రస్ రాసి పోస్ట్ చేసేశాను. అంతే!" తేలిగ్గా చెప్పింది రేవతి.

"మరి ఉత్తరం ఎవరి దగ్గరినుంచి వచ్చిందో పేరు రాశావా?" అడిగింది మేఘ.

"ఆ.. నా పేరు, ఇంటి అడ్రసు ఇస్తాను మరి! 'యువర్స్ లవింగ్లీ' అని రాశాలే. ఖచ్చితంగా ఎవరో అమ్మాయే రాసిందని ఉత్తరం చదివాక అర్థం అవుతుందిగా."

"ఎప్పుడు, ఎలా పోస్ట్ చేశావు ఉత్తరాన్ని? నీ చేతిరాతని గుర్తు పట్టేస్తే? ఎక్కడినుంచి పోస్ట్ చేశారన్నదాన్ని బట్టి దొరికిపోవా?" సందేహాల వర్షం కురిపించింది నీలూ.

"బయటికి వెళ్ళినప్పుడు బజార్లో ఒక పోస్ట్ డబ్బా కనిపిస్తే అందులో వేశాను. ఇన్ని వందల స్టూడెంట్స్ లో ఎవరు రాశారో ఎలా తెలుస్తుంది? అయినా లవ్ లెటర్ ని తీసుకెళ్ళి అందరికీ చూపించి ఇన్వెస్టిగేట్ చేసేంత పప్పుసుద్ద కాదులే ఆయన!" భరోసా ఇచ్చింది రేవతి.

"హ్మ్.. ఏమైనా చాలా పెద్ద సాహసమే చేశావు. ఇలాంటి సరదా ఆటలు బెడిసికొడితే ప్రమాదం. ముందుగా ఒక్కమాటన్నా చెప్పలేదేం మాతో?" అడిగింది మేఘ.

"సర్లే.. చెప్పుంటే మీ భయాలతో నన్ను భయపెట్టి మాన్పించేసేవారు. ఇప్పుడు చూశారా.. మీకు తెలీకుండానే మీరొక అడ్వెంచర్ చేసేశారు. నాకు థాంక్స్ చెప్పాలి మీరందరూ" కాలర్ ఎగరేసింది రేవతి.

"లెక్చరర్ కాబట్టి సరదాగా తీసుకుంటారు తప్ప రాద్ధాంతం చెయ్యరులే అని రేవతి ధైర్యం. అంతే కదూ!" నవ్వింది సునంద.

"అయితే ఇప్పుడు నువ్వు ఇదంతా కేవలం సరదాకి చేసినట్టేగా.. ప్రేమా, గీమా ఏమీ లేదుగా?" రేవతిని అనుమానంగా చూస్తూ అడిగింది నీలూ.

"లవ్ కాదు కానీ వెరీ బిగ్ క్రష్.. ఆ రంగూ, ఎత్తూ, అబ్బా ఎంత హాండ్ సమ్మో! పెళ్ళయిందని నమ్మడం కష్టం. ఆ నడుము మీద చెయ్యేసుకుని స్టైల్ గా నించుని క్లాస్ చెప్తుంటే ఆహా ఆఆ.."

"ఇంకాపవే రాక్షసీ.. నీకసలు సిగ్గే లేదు" రేవతి నోరు నొక్కేసింది నీలూ.

"అందరూ ఎంతో కొంత టెన్షన్ పడుతూ విన్నారు కానీ రజని మాత్రం అస్సలు తొణకలేదు, బెణకలేదు. ధైర్యం ఎక్కువే!" అంది సునంద.

"దాని మొహం! ముందే అంతా తెలుసు కాబట్టి హాయిగా మీ అందరి చిందులు చూసి ఆనందిస్తూ కూర్చుంది" అంది రేవతి.

"చేసిన ఘనకార్యం చాల్లే కానీ ఈ విషయం బయట ఎవరికీ చెప్పకండి. అలా అలా అందరికీ తెలిస్తే లేనిపోని సమస్యలు వస్తాయి" జాగ్రత్త చెప్పింది మేఘ.

"మొత్తం మన గ్రూపులో బాగా ముందుచూపున్న ముసలమ్మ గారు చెప్తున్నారు. అందరూ మర్యాదగా పాటించండి" గంభీరంగా చెప్పింది రేవతి.

నవ్వుల రవ్వలు సవ్వడి చేశాయి..

ఒక రోజు మధ్యాహ్నం సునంద క్లాసులు అయిపోయాక లంచ్ బ్రేక్ లో హాస్టలుకి వస్తుంటే దారిలో కిరణ్, ప్రదీప్ ఎదురై పలకరించారు.

"మరేం లేదు. ఇంకో రెండు నెలల్లో ఫ్రెండ్స్ అందరం విడిపోతాం. మీరందరూ కలిసి సరదాగా ఫోటోలు తీసుకుంటే గుర్తుగా ఉంటాయి. నా దగ్గర కెమెరా ఉంది. మేఘకి ఇద్దామనీ.. అదే మీ అందరికీ ఉపయోగపడుతుందనీ.." సునందకి కెమెరా అందిస్తూ అన్నాడు కిరణ్.

"అయితే నా చేతికి ఎందుకు, మేఘకే ఇద్దువు గానీ పద. నాతో రండి హాస్టలు దాకా. ఇచ్చేసి వెళుదురు" నవ్వింది సునంద.

"నేనిస్తే మేఘ తీసుకుంటుందో లేదో!" సందేహంగా అన్నాడు కిరణ్.

"అదేమో నాకు తెలీదు కానీ మేఘ తరపున నేను తీసుకుంటే మాత్రం అసలు ఒప్పుకోకపోవచ్చు. రెండు నిమిషాల్లో వెళ్ళొచ్చు. మరేం పరవాలేదు. నాతో రండి" నచ్చచెప్పి వెంట తీసుకెళ్ళింది సునంద. నీలూని, మేఘనీ పిలుచుకొచ్చింది.

"ఈ ఆదివారం మేము ఇంద్రకీలాద్రికి వెళుతున్నాం. అమ్మవారి గుడికి మీరూ రావచ్చుగా?" నీలూ వైపు చూస్తూ అడిగాడు ప్రదీప్.

నీలూ ఏం చెప్పాలో తెలీక మేఘ వైపు చూసింది.

"మేఘా ప్లీజ్.. నేనేం సినిమాకి రమ్మనడం లేదుగా, గుడికే కదా! అందరం కలిసి వెళదాం. ప్లీజ్ ప్లీజ్ 'నో' అనకు.." బతిమాలాడు కిరణ్.

ఫ్రెండ్స్ అందరి ముందూ అతనలా అడుగుతుంటే మేఘ చాలా మొహమాటపడిపోయింది. కానీ 'ఊ' అని మాత్రం అనలేదు. అతని మొహంలోకి చూడకుండా మౌనంగా తల దించుకుంది.

ఆమె ఇష్టపడటం లేదని అతను గ్రహించాక ఎక్కువసార్లు అడిగి ఇబ్బంది పెట్టదల్చుకోలేదు.

"మీరందరూ కలిసి ఫోటోలు తీసుకోడానికి పనికొస్తుందని నా కెమెరా తెచ్చాను. మీరు వాడుకున్నాక మళ్ళీ తీసుకుంటాను" అన్నాడు మేఘ చేతికిస్తూ.

"మా దగ్గర కెమెరా ఉంది. రేవతి వాళ్ళింటి నుంచి తెచ్చింది" కెమెరా అందుకోకుండా మెల్లగా చెప్పింది మేఘ.

ఆమె తీసుకోదని అర్థమయ్యాక అట్టే బలవంతం చెయ్యకుండా వెళ్ళిపోయారు వాళ్ళు .

"రేవతి కెమెరా ఎప్పుడు తెచ్చింది?" వాళ్ళు వెళ్ళగానే నీలూ అడిగింది.

"ఇంకా తీసుకురాలేదు కానీ తెస్తానని చెప్పిందిగా అప్పుడొకసారి" అని చెప్పి అక్కడినుంచి వెళ్ళిపోయింది మేఘ.

"అసలు మేఘ ఉద్దేశ్యమేంటో నాకు అర్థం కాలేదు. అతనేమీ ఇబ్బంది పెట్టలేదుగా, ఇప్పుడెందుకా దిగులు?" సునందని అడిగింది నీలూ.

"కిరణ్ ని డిజప్పాయింట్ చేశానని బాధపడుతుందేమో?" సాలోచనగా అంది సునంద.

"అప్పుడైతే డిజప్పాయింట్ చెయ్యడం ఎందుకు? అదేదో తీసుకుంటే సరిపోతుందిగా?" ప్రశ్నించింది నీలూ.

"కిరణ్ మీద తన మనసులో ఉన్న ఇష్టం మనందరికీ, ముఖ్యంగా కిరణ్ కి తెలిసిపోతుందని భయమేమో అమ్మాయి గారికి" నవ్వింది సునంద.

"చిరాకులు, కోపాలు మాయమైనప్పుడే అనిపించింది మేఘకి కిరణ్ మీద కోపం పోయి మెల్లగా ఇష్టం ఏర్పడుతుందేమోనని. అంతలోనే మళ్ళీ అతనితో ఇలా ప్రవర్తించడమే అర్థం కావడం లేదు. అయినా మన దగ్గర మేఘకి భయమా?" సునంద మాటలని ఒప్పుకోలేదు నీలూ.

"నా ఉద్దేశ్యం మనకి భయపడి మేఘ ఏదో దాస్తోందని కాదు. తనలో తనకే యుద్ధం జరుగుతుందనిపిస్తోంది. తన మనసేంటో తనకే ఇంకా పూర్తి స్పష్టత లేదనుకుంటాను. ముందు తన ఇష్టాయిష్టాలు ఏంటని తనే నిర్ణయించుకోవాలి. అప్పుడు కానీ బయటపడదు. చూద్దాం ఏమవుతుందో?" అంది సునంద.

"అయితే మనమేమీ చెప్పొద్దా మేఘకి?" అడిగింది నీలూ.

"ప్రోత్సహించినట్టు గానీ, వ్యతిరేకించినట్టు గానీ సలహాలేమీ ఇవ్వకుండా ఉండటమే మనం చేయదగ్గ సహాయం. మన సలహాలు తన ఫీలింగ్స్ ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. తరచి తరచి ప్రశ్నలడిగి ఇబ్బంది పెట్టకుండా ఉంటే మంచిది" సునంద తన అభిప్రాయం చెప్పింది.

నీలూ కూడా సరేనంటూ మాట ఇచ్చింది.

మరొక పది రోజులు గడిచాక వచ్చిన ఆదివారం కోసం మూడు రోజుల ముందు నుంచే ఉత్సాహంగా ఎదురుచూస్తోంది మేఘ.

మేఘ ఆనందానికి కారణం ఊరి నుంచి వాళ్ళ నాన్నగారు వస్తుండటం. ప్రతి రోజూ అప్పుడే పొద్దునైపోయిందా అనుకుంటూ నీరసంగా నిద్ర లేచేదల్లా ఆ రోజు అలారం మోగగానే నిద్ర లేచి పరీక్షకి వెళ్ళే లోపే చకచకా తలస్నానం చేసి చక్కగా రెడీ అయిపోయింది.

మధ్యాహ్నం పరీక్ష ముగిసిన దగ్గర్నుంచీ ఎప్పుడెప్పుడు తనకోసం పిలుపు వస్తుందా అని ఎదురుచూస్తూ కూర్చుంది.

పరీక్ష నుంచి వచ్చాక నీలూ, రజని, సునంద అందరూ వరసగా రెడీ అవుతున్నారు.

వాచ్ మెన్ నుంచి "మేఘనందన కోసం విజిటర్స్" అన్న పిలుపు వినగానే "మీరందరూ త్వరగా వచ్చెయ్యండి. ముందు నేను వెళతాను" అంటూ ఆగమేఘాల మీద పరుగు తీసింది మేఘ.

చకచకా మేడ మెట్లు దిగి లేడి పిల్లలా పరిగెడుతూ గేటు వైపు వెళుతుంటే దూరంగా నాన్నగారు కనిపించారు. ఆ ఆనందంలో మొహం మరింత వెలిగే లోపే నాన్నగారి పక్కనే నించున్న కిరణ్, ప్రదీప్ లని చూడగానే ఆనందం స్థానంలో ఆశ్చర్యం, సందేహం, అయోమయం మొదలయ్యాయి. తనకి తెలీకుండానే పాదాలు పరుగు ఆపి నిదానంగా వారి వైపు అడుగులు వేశాయి.

9

నాన్నగారు కిరణ్ తో మాట్లాడుతుండటం ఆశ్చర్యంగా చూసింది మేఘ.

“మెయిన్ రోడ్ మీద ఆటో కోసం ఎదురుచూస్తున్నప్పుడు పక్కనే నించున్న ఈ అబ్బాయిలు పరిచయం అయ్యారు. మాటల్లో మీ కాలేజీ పేరు, నీ పేరు చెప్తే మీరంతా స్నేహితులని చెప్పారు. కిరణ్, ప్రదీప్ అని పేర్లు చెప్పగానే మనింటికి ఫోన్ చేసినప్పుడు మాట్లాడానని గుర్తొచ్చింది. ఆటో దొరకలేదు కానీ అలా కులాసాగా మాట్లాడుకుంటూ నడిచే వచ్చేశాం” మేఘ ఆశ్చర్యానికి వివరణ ఇచ్చారు వాళ్ళ నాన్నగారు.

“రండి నాన్నా.. విజిటర్స్ రూంలో కూర్చుందాం. నీలూ వాళ్ళు కాసేపట్లో వస్తారు” అంటూ ఆయన చేతిలో ఉన్న బ్యాగు అందుకుంది.

నాన్నగారి పక్కన కూర్చుని ఇంటి దగ్గరి విశేషాలు అడుగుతూ, హాస్టలు కబుర్లు చెబుతోంది మేఘ.

నీలూ, రజని, సునంద వచ్చి అక్కడ కిరణ్, ప్రదీప్ లని చూసి ముందు ఆశ్చర్యపోయినా తరవాత విషయం తెలుసుకుని స్థిమితపడ్డారు.

నాన్నగారు కిరణ్ ని పక్కనే కూర్చోబెట్టుకుని భుజం మీద చెయ్యి వేసి ఆప్యాయంగా మాట్లాడుతుండటం చూసి మేఘ సంతోషించింది. ఒక అరగంట గడిచాక కిరణ్, ప్రదీప్ వెళ్ళిపోయారు.

నీలూ, మేఘ, రజని ఊరినుంచి వచ్చిన బ్యాగు తెరిచి అందరి ఇళ్ళ దగ్గర్నుంచీ పిండివంటలతో పాటు రాబోయే కాలేజీ వార్షికోత్సవం కోసమని వీళ్ళు కోరిన ప్రకారం ప్రత్యేకంగా సిద్ధం చేసి పంపిన బట్టలు చూసుకుని తృప్తిపడ్డారు.

మేఘ నాన్నగారు అమ్మాయిలందరినీ బయటికి తీసుకెళ్ళి సరదాగా తిప్పి వాళ్ళు అడిగిన చిన్న చిన్న వస్తువులు కొనిచ్చి సాయంత్రానికి తీసుకొచ్చి మళ్ళీ హాస్టల్లో దింపారు. ఎప్పుడూ చెప్పినట్టే

శ్రద్ధగా చదువుకోమని జాగ్రత్తలు చెప్పి తిరిగి ఊరికి వెళ్ళిపోయారు.

కాలేజీ వార్షికోత్సవం సందర్భంగా తలపెట్టిన రకరకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. పాటల పోటీలు, డాన్స్ పోటీలు జరిగాయి.

నీలూ బాగా పాడుతుందని స్నేహితురాళ్ళందరూ ఒక మంచి సినిమా పాటని ఎంపిక చేసి కష్టపడి స్నేహితుల ద్వారా ఆ పాట క్యాసెట్, వాక్ మెన్ సంపాదించి, పాటంతా పేపరు మీద రాసిపెట్టి దగ్గరుండి నీలూ చేత ప్రాక్టీస్ చేయించారు. పాటల పోటీలో నీలూకి మూడో బహుమతి వస్తే ప్రతి ఒక్కరూ తమకే బహుమతి వచ్చినంతగా సంతోషించారు.

వార్షికోత్సవం నాడు స్టేజీ మీద ప్రదర్శించే ఒక గ్రూప్ డాన్సులో రజని కూడా చేస్తుండటంతో రిహార్సల్స్ హడావుడిలో ఉంది.

కేవలం విద్యార్థులనే కాకుండా వారి తల్లిదండ్రులని కూడా వార్షికోత్సవానికి ఆహ్వానించారు కాలేజీ వారు. కాలేజీకి, హాస్టల్సుకి దాదాపు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న పెద్ద గ్రౌండ్స్ లో భారీ ఎత్తున ఫంక్షన్ ఏర్పాట్లు చేశారు. అన్నీ హాస్టల్సుకి మధ్యగా ఉన్న మరొక గ్రౌండ్ లో భోజనాలు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం విందు భోజనాల అనంతరం ఏడున్నర గంటలకి వార్షికోత్సవ సభ, దాన్ని అనుసరించి ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆహ్వాన పత్రికలో అచ్చు వేయించారు.

ఆ రోజు మధ్యాహ్నం నుంచి క్లాసులకి సెలవు ఇచ్చేశారు. రేవతి నాన్నగారు వచ్చి తనని ఇంటికి తీసుకువెళ్ళారు. సాయంత్రం తల్లిదండ్రులతో కలిసి నేరుగా ఫంక్షన్ కి వస్తానని చెప్పి వెళ్ళింది.

డాన్సులు, నాటికలు ప్రదర్శించబోయే అమ్మాయిలంతా ఫైనల్ రిహార్సల్స్, మేకప్, కాస్ట్యూమ్స్ అంటూ ఆ ఏర్పాట్లల్లో తలమునకలై ఉంటే మిగిలిన వాళ్ళు సావకాశంగా సాయంత్రపు వేడుకలకి సింగారించుకోవడంలో నిమగ్నమయ్యారు.

ప్రత్యేకమైన దుస్తుల్లో, అందమైన అలంకరణల్లో మెరిసిపోతూ అటూ ఇటూ హడావిడిగా తిరిగేస్తున్న ఆడపిల్లలతో హాస్టలంతా రంగురంగుల సీతాకోకచిలుకలు విహరిస్తున్న నందనవనాన్ని తలపించింది. చీరలు, పరికిణీ ఓణీలు, గాగ్రాలు లాంటి దుస్తులు ధరించగానే ఇన్నాళ్ళూ ఇంకా చిన్నవాళ్ళేగా అనిపించిన పదహారేళ్ళ ముగ్ధలంతా ఒక్క రోజులోనే ప్రౌఢత్వం సంతరించుకున్నట్టు నిండుగా కనిపిస్తున్నారు. బహుశా ఆడపిల్లల తీరే అంతేమో!

ముదురు పసుపు ఎరుపు రంగుల్లో అద్దాలతో కుట్టిన రాజస్థానీ గాగ్రా చోళీతో సునంద, సన్నటి జరీ అంచు కనకాంబరం రంగు జార్జెట్ చీరలో నీలూ, ముదురు నీలం రంగులో అరచేతి మందం అంచున్న గులాబీ రంగు పట్టులంగా వోణీలో మేఘ ముచ్చటగా ముస్తాబై రజనిని కలవడం కోసం కల్చరల్ ప్రోగ్రామ్స్ లో పాల్గొంటున్న వాళ్ళందరూ రెడీ అవుతున్న మేకప్ రూంకి వెళ్ళారు.

వీళ్ళని చూస్తూనే రజని కేరింతగా అరిచింది. “సునందక్కా.. నిన్ను చూడగానే హైదరాబాదీ సిటీ స్టైల్ తెలిసిపోతోంది. నీలూ చీర రిచ్ గా ఉంది. మేఘ మాత్రం ఈ పాతకాలం లంగావోణీలో పేరంటానికి వెళుతున్న పల్లెటూరి పిల్లలా ఉంది” అని నవ్వింది.

“మా సంగతేమో కానీ నీ కోయ దొరసాని గోచీ చీర మాత్రం భలేగా ఉంది. తలలో కొప్పు చుట్టూ చుట్టిన పువ్వులు, కొప్పు మీద గుచ్చిన ఈకలు, కాళ్ళకి కడియాలు బ్రహ్మాండంగా ఉన్నాయి” సరదాపడింది నీలూ.

“అంతేనా.. నుదుటన పెద్ద బొట్టు, కనుబొమ్మల మీద చుక్కల బొట్లు, ముక్కుకి పెద్ద రింగు, దాని నుంచి చెవి దాకా ఒక గొలుసు.. ఇంకా చాలా మేకప్ ఉంది” ఉత్సాహంగా చెప్పింది రజని.

"టైము ఆరు దాటుతోందిగా. అందరం కలిసి భోజనానికి వెళదామా?" అడిగింది మేఘ.

"మాకందరికీ భోజనం ఇక్కడికే వస్తుందట. అయినా ఈ ఫోక్ డాన్స్ మేకప్ తో బయటికి ఎలా రాగలను? మీరొక పని చెయ్యండి. వెళ్ళి భోజనం చేసేసి ఫంక్షన్ గ్రౌండ్స్ కి వచ్చెయ్యండి. చీఫ్ గెస్టులు, కాలేజీ డైరెక్టర్స్ స్పీచులు అయ్యాక మా డాన్స్ మూడో ప్రోగ్రామే కాబట్టి త్వరగానే అయిపోతుంది. ఆ టైముకి మీరు స్టేజీ వెనకున్న మేకప్ రూం దగ్గరికి రండి. నేను డ్రస్ మార్చుకుని మీతో వచ్చేస్తాను" చెప్పింది రజని.

అలాగేనని రజనికి 'ఆల్ ది బెస్ట్' చెప్పి భోజనానికి బయలుదేరారు ముగ్గురూ.

భోజనాలు చేసే చోటంతా జనంతో కిటకిటలాడిపోతోంది. 'బఫే' మూలాన ఆ ఆవరణంతా గుంపులు గుంపులుగా నించుని కబుర్లాడుతూ భోజనం చేస్తున్నవారితో కోలాహలంగా ఉంది.

అక్కడి పరిస్థితి చూశాక "ఇంత హడావుడిలో తోసుకుంటూ వెళ్ళి తినాలా ఇప్పుడు మనం" నీరసంగా అంది మేఘ.

"తప్పకుండా తినాలి. లేకపోతే అర్ధరాత్రి దాకా మేలుకుని ఉంటాం కాబట్టి ఆకలికి మాడిపోగలం. ఒక్క పది నిమిషాలు లైనులో నించుంటే సరిపోతుందిలే. పదండి పదండి" అంటూ ముందుకి

నడిపించింది సునంద.

దజనుకి పైగా ఉన్న రకరకాల వంటకాల్లోంచి అన్నీ కొద్ది కొద్దిగా వడ్డించుకుని కాస్త ఖాళీగా ఉన్నచోట నించుని భోజనం చేస్తున్నారు.

"హాయిగా కూర్చుని ప్రశాంతంగా తిండి తినకుండా ఈ నించుని తినడాలు ఏమిటో పైత్యం.. అదీ ఇలాంటి బట్టలు వేసుకుని మరీ ఇబ్బంది. మధ్యలో మంచినీళ్ళు కావాలన్నా కష్టమే" విసుగ్గా గొణిగింది మేఘ.

"కూర్చుని తినడం ఓల్డ్ స్టైల్. ఇలా నించుని తినడం మోడ్రన్ పద్ధతి" నవ్వింది నీలూ.

'హాయ్' అంటూ పరిచితమైన గొంతులు వినిపించి వెనక్కి తిరిగి చూస్తే కిరణ్, ప్రదీప్ కనిపించారు.

"ఈ డ్రస్సుల్లో మిమ్మల్ని గుర్తు పట్టడానికి టైం పట్టింది. కొత్తగా కనిపిస్తున్నారు" అన్నాడు ప్రదీప్.

"కొత్తగా అయితే పర్లేదు, చెత్తగా అనకపోతే చాలు" సునంద మాటకి అందరూ గట్టిగా నవ్వారు.

"నో నో.. నిజంగా అమ్మాయిలందర్నీ ఇంత కలర్ ఫుల్ గా చూస్తుంటే చాలా చాలా బాగుంది" అన్నాడు ప్రదీప్.

అందరి సంగతేమో కానీ మేఘని చూస్తూ కిరణ్ కళ్ళల్లో చేరిన వెలుగు మాత్రం నేరుగా అతని వైపు చూడని ఆమెకి తప్ప మిగతా అందరికీ స్పష్టంగా తెలిసింది.

మాటలు, నవ్వుల మధ్యలో తింటూండటం మూలాన నీలూకి పొలమారింది. మంచినీళ్ళు పట్టుకొస్తామంటూ ఇద్దరబ్బాయిలూ పరిగెత్తుకెళ్ళి క్షణాల్లో మూడు మంచినీళ్ళ గ్లాసులతో వచ్చారు.

"ఎప్పుడూ ఇలా రెడీ అయితే ఎంచక్కా అందరూ సేవలు చేసి పెడతారన్నమాట. ఈ సౌకర్యం ఏదో బాగున్నట్టుంది" అన్న నీలూ మాటకి "యెస్ మేడమ్, ఎనీథింగ్ ఫర్ యూ ఏంజెల్స్.." అన్నాడు

ప్రదీప్ భక్తుడిలా ఫోజు పెడుతూ.

భోజనం కన్నా ఎక్కువగా మాటలతోనూ, నవ్వులతోనూ కడుపు నింపుకున్నాక తలా ఒక ఐస్క్రీం కప్పు అందుకుని తింటూ బయటికి నడిచారు.

అప్పుడప్పుడే పొద్దు వాలిపోయి మసక చీకటి మెత్తగా కమ్ముకుంటోంది. రంగు రంగుల దీపపు కాంతుల్లో అలంకరించబడిన కాలేజీ వీధంతా అంతకన్నా మిన్నగా వెలిగిపోతూ నవ్వుతూ తుళ్ళుతూ తిరుగుతున్న కుర్రకారుతో కళకళలాడిపోతోంది.

సిమెంటు రోడ్డుకి రెండువైపులా గుబురుగా పెరిగి ఇహనో ఇప్పుడో పూతకి సిద్ధమంటూ లేత మొగ్గ తొడిగిన గుల్మొహర్ చెట్ల మీదుగా వస్తున్న గాలి రెపరెపలు చూస్తుంటే కుర్రాళ్ళ వయసు వైభోగానికి మనసుపడి మురిపెంగా తలలు వంచి వింజామరలు వీస్తున్నట్టుగా ఉంది.

ఆ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఐదుగురు స్నేహితులు మాట్లాడుతూ నెమ్మదిగా నడుస్తున్నారు. మిగిలిన ముగ్గురూ వేగంగా నడుస్తున్నారో, వీరిద్దరి అడుగులు నిదానంగా పడుతున్నాయో తెలీదు కానీ కాసేపటికి మేఘ, కిరణ్ నాలుగడుగులు దూరమై కాస్త వెనుకగా నడుస్తున్నారు.

"మూడు రోజుల క్రితం మమ్మీ, డాడీ, పెద్దక్క వచ్చారు. పెద్దక్క బాబుతో పాటు తిరిగి అమెరికా వెళ్ళడానికి వీసా పనులు చూసుకోవాలి. అమెరికన్ కాన్సులేట్ కి మద్రాసు వెళుతూ మధ్యలో నా దగ్గరికి వచ్చారు. మీ హాస్టలుకి తీసుకొద్దాం అనుకున్నాను. ట్రెయిన్ కి ఎక్కువ టైం లేకపోవడంతో కుదరలేదు."

అప్పటిదాకా తల వంచుకుని నడుస్తూ అతని మాటలు వింటున్నదల్లా ఆ చివరి మాటలకి ఆశ్చర్యపోయి చటుక్కున అతని మొహంలోకి చూసింది. మాటవరసకి అన్న ఉట్టి మాట కాదని తెలిసింది.

అతని పక్కన నడవడం కొత్తగా వింతగా ఉంది ఆమెకి. పక్కపక్కనే దగ్గరగా నడుస్తుండటంతో ఒకొక్కసారి అడుగులు తడబడి ఇద్దరి భుజాలు, చేతులు దగ్గరవుతున్నాయి.

అలా అదాటున అతనొచ్చి తగిలినప్పుడల్లా ఓ క్షణం గుండె లయ తప్పి అప్పటికప్పుడు పొట్టలోంచి గుప్పెడు సీతాకోకచిలుకలు పుట్టుకొచ్చి అల్లిబిల్లిగా ఎగురుతూ వయసు తాలూకు వన్నెలకి గిలిగింతలు పెడుతూ పైదాకా వచ్చి అసందర్భంగా పెదవులపై సిగ్గుల మల్లెలు పూయించడానికి తెగించేస్తున్నాయి.

లోపలి ఆరాటాన్నంతా పెదవుల మాటునే కట్టడి చెయ్యాలని విశ్వప్రయత్నం చేస్తున్న ఆమెని అతని ఆకర్షణ గెలిచేస్తుంటే ఇదంతా అప్రయత్నంగా జరుగుతోందా లేక అలవి కాని తడబాటులో తనే అతనికి దగ్గరగా వెళుతున్నానా అని తికమకపడిపోతోంది ఆమె.

అతని సాన్నిహిత్యంలోంచి పుట్టుకొస్తున్న కొంటె గాలేదో మాయగా కమ్మేస్తుంటే ఆమె మనసులోకి కొత్త నీరు ప్రవహిస్తోంది. అంతకంతకీ వరద గోదారిలా పోటెత్తుతున్న కొత్త కలవరంలో ఉక్కిరిబిక్కిరవుతున్న

వయసునీ, మనసునీ అదుపు చేయడానికి అవస్థపడుతున్న ఆమెకి అతని మాటలు చెవిన పడకుండా జారిపోతున్నాయి. మధ్య మధ్యన అతి కష్టం మీద తెలివి తెచ్చుకుని అతన్ని ఆలకించే ప్రయత్నం చేస్తోంది.

“పోయిన వారం కొత్త సినిమాకి వెళ్ళాం. అందులో ఒక చిన్న బాబు ఉన్నాడు. వాడు మాట్లాడుతుంటే అచ్చం నీ మూతిలాగే ఉంది తెలుసా!”

అతని మాటలు వింటుంటే అమాయకంగా మొహం పెట్టుకున్న స్కూలుపిల్లాడిలా కనిపిస్తున్నాడని అనుకుంటోంది కానీ ఆమెలో స్త్రీత్వం మేలుకుని అతని వంక చూసే తన చూపుల్లో కొత్తగా లాలిత్యం వచ్చి చేరిందని గుర్తించడం లేదు.

“ప్చ.. నా కెమెరా హాస్టల్లో పోయింది. ఇప్పుడుంటే ఎంత బాగుండేదో! నువ్వీ వోణీలో ఎంత ముద్దు....”

“అబ్బా... ఎంతందంగా ఉందో!” అతని మాట పూర్తి కాకుండానే నడవడం ఆపి కేరింతగా అరిచింది మేఘ.

“ఏమిటది?” అడుగుతూనే ఆమె చూపు నిలిచిన వైపు చూశాడు అతను.

“చంద్రుళ్ళో కుందేలు. ఎంత స్పష్టంగా కనిపిస్తోందో!” ఎదురుగా వీధి చివరన గుల్మోహర్ చెట్ల మీదుగా ఆకాశంలో పైపైకి వస్తున్న పెద్ద చందమామని చూస్తూ సంబరంగా చెప్పింది.

“ఇవ్వాళో రేపో పౌర్ణమి ఉన్నట్టుంది. అందుకే అంత పెద్దగా కనిపిస్తోంది” తన పక్కనున్న చందమామని మరింత అపురూపంగా చూస్తూ చెప్పాడతను.

“ఊ.. పౌర్ణమి అంటే చంద్రుడి మీద ఉండేవాళ్ళకి పండగ రోజు” అటువైపే చూస్తూ చెప్పింది.

“చంద్రుడి మీద ఉండేవాళ్ళా.. అదెవరు? నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ వెళ్ళి చూసి మళ్ళీ భూమి మీదకి వచ్చేసాడుగా” సందేహంగా అన్నాడతను.

గలగలా నవ్వింది ఆమె ఆకాశంలో జాబిలిని మించిన వెన్నెల కురిపిస్తూ.

“అయితే నీకు చంద్రుళ్ళో ఉండే కుందేలు కథ తెలీదా?”

“చిన్నప్పుడు మా నానమ్మ చెప్పేది. చందమామ మీద ఒక ముసలి అవ్వ చెట్టు కింద కూర్చుని అంట్లు తోముతూ కనపడుతుంది చూడమని. ఎన్నేళ్ళయినా అవి తరగవని, అలా తోముతూనే ఉండేలా శాపం ఉందని చెప్పేది. ఈ కుందేలు కథేంటి?”

“గుండ్రంగా ఉండే చంద్రుడి మీద మధ్యలో కుందేలు ఆకారంలో నల్లటి మచ్చలా కనిపిస్తోందే, అదంతా నేల. చుట్టూ తెల్లగా వెలిగిపోయేదేమో పాలసముద్రం. అంటే పాత సినిమాల్లో చూపిస్తారే దేవలోకంలో తెల్లటి పొగ లాంటి మంచు తెరల మధ్య ఉంటుందీ, అలాంటిది. ఆ చంద్రలోకంలో ఉండే దేవతలు ఎవరైనా క్రమశిక్షణ తప్పి తప్పు చేస్తే కుందేల్లా మారిపోయి భూమ్మీద బతకమని

వాళ్ళ రాజుగారు శిక్ష వేస్తారు. పౌర్ణమి రోజుటి వెన్నెల సోకితే గానీ వాళ్ళకి శాపవిమోచనం అయి మళ్ళీ చంద్రుడి మీదకి వెళ్ళలేరు. అదీ కథ. నాకింకా బోల్డు చందమామ కథలు, చుక్కల కథలు

వచ్చు."

మెరుస్తున్న కళ్ళతో చందమామని చూస్తూ కథ చెప్పుకుపోతున్న ఆమె మొహంలోకి నిశితంగా చూశాడు అతను. ఆరేళ్ళ పిల్లా పదహారేళ్ళ పిల్లా అని తేల్చుకోలేకపోయాడు. ఇంత పసిదానికి

నేను చెప్పిన ప్రేమనే మాట వయసుకి మించిందేమో అన్న సందేహం కలిగింది అతనికా క్షణంలో.

ఆ సాయంత్రానికి ముందు వరకూ ఉన్న మనఃస్థితికి భిన్నంగా ఆ వేళ ఇద్దరి మనసుల్లోనూ ఒకరి పట్ల ఒకరికి పరస్పర విరుద్ధమైన ఆలోచనలు కొత్తగా ఊపిరి పోసుకున్నాయని చందమామకి మాత్రమే తెలిసింది.

కాలేజీ వార్షికోత్సవం అయిపోయిన రెండు రోజులకి ఒక మధ్యాహ్నం మేఘ ఒక్కతే తీరిగ్గా మంచం మధ్యలో కూర్చుని న్యూ ఇయర్ కి కిరణ్ ఇచ్చిన గ్రీటింగ్ కార్డు ముందేసుకుని చూస్తోంది.

ఎక్కడో ఆలోచనల్లో కూరుకుపోయిన ఆమె రేవతి లోపలికి వచ్చిన సంగతి గమనించలేదు. మేఘని ఆట పట్టించాలని రేవతి కూడా ఏ మాత్రమూ శబ్దం చెయ్యకుండా వెళ్ళి నీలూ, సునంద, రజనిలను తీసుకొచ్చింది.

"ఎక్కడిదాకా వెళ్ళావమ్మా మేఘనందనా.. ప్రయాణం అదీ బాగా జరిగిందా?" బిగ్గరగా నవ్వుతూ అడిగింది రేవతి.

రేవతి అరుపులకి ఆలోచనల్లోంచి తేరుకుని గబుక్కున ముందున్న గ్రీటింగ్ కార్డుని మూసేసింది మేఘ.

"హమ్మయ్యా.. ఎన్నాళ్ళకెన్నాళ్ళకీ గొప్ప ఛాన్స్ దొరికిందీ.. ప్రతీసారీ చెప్పినట్టే ఇప్పుడు చెప్పు చూద్దాం అస్సలేమీ లేదని.." ఉత్సాహం ఉరకలెత్తుతోంది రజనికి.

సునంద, నీలూ ముసిముసిగా నవ్వుతున్నారు.

గ్రీటింగ్ కార్డ్ చేతిలోకి తీసుకుని చూస్తున్న రేవతి "ట్రూ లవ్ నెవర్ డైస్. అదమ్మాయిలూ సంగతి. కిరణ్ చెప్తున్నాడు. తెలుసుకోండి మీరు కూడా!" అంది.

అప్పటిదాకా ఏమీ మాట్లాడకుండా ఉన్న మేఘ "అదెక్కడ రాసుంది?" అంటూ రేవతి చేతిలోంచి కార్డ్ లాక్కుంది.

"ఇప్పటిదాకా ఎన్నిసార్లు చూసుంటావో ఆ మాత్రం గమనించలేదా? ఓహో అర్థమైందిలే. ఇలా ముందు పెట్టుకుని ఊహాలోకాల్లో విహరిస్తుంటే ఇంక అందులో ఏం రాసుందో చూసే వీలెక్కడలే పాపం.." రేవతి మాటలకి అందరూ నవ్వుతున్నారు.

"ఆ మాట ఎక్కడ రాసుందో చూపించు" మళ్ళీ అడిగింది మేఘ.

"ఇంకా బెట్టు చెయ్యకుండా ఒప్పేసుకున్నట్టేనంటే అప్పుడు చూపిస్తా" అల్లరిగా అంది రేవతి.

"చాల్లే ఇంక హింసించింది. ఊరుకోండి" మేఘ మొహంలో సిగ్గు మెరుపులు చూస్తూ వెనకేసుకొచ్చింది నీలూ.

"ఇదిగో.. ఈ హార్టులో దాక్కుని ఉందా మాట" కార్డు మధ్యలో హృదయాకారంలో ఉన్న అర తెరిచి లోపల రాసున్నది చూపించింది రేవతి.

"ఇప్పటిదాకా నాకు కనిపించనేలేదు" కిరణ్ చేతివ్రాతలో ఉన్న ఆ అక్షరాలకేసి చూస్తూ అంది మేఘ.

"అంతే మరి. మనం చూడాలనుకుంటే తప్ప కనిపించవు కొన్ని" నవ్వింది సునంద.

"ఆలస్యంగానైనా మన ట్యూబులైటు వెలిగినందుకు సంతోషించండమ్మా.." రేవతి అల్లరి ఆపలేదు.

"అది సరే.. అసలు ప్రపోజల్ చదువుతున్నా వినండి. 'అయాం గివింగ్ మై హార్ట్ టు యూ. ప్లీజ్ కీప్ ఇట్ సేఫ్. అదర్ వైజ్ ఇట్ విల్ బ్రేక్ ఇన్ యువర్ హ్యాండ్స్'. కిరణ్ కి కవిత్వం వచ్చనుకుంటా" చదువుతూ కళ్ళెగరేసింది రజని.

స్నేహితురాళ్ళు కిరణ్ గురించి తననలా ఆట పట్టిస్తుంటే ఇష్టంగా అనిపించింది మేఘుకి.

మరో నాలుగు రోజుల తర్వాత రాత్రి స్టడీ అవర్స్ నుంచి వచ్చాక అంతా రేవతి చుట్టూ చేరారు.

"మూడు రోజుల నుంచీ ఇవాళా రేపూ అంటూ దాటవేస్తున్నావు. ఆ సర్ప్రైజ్ ఏంటో ఈ రోజు చూపించాల్సిందే" రేవతితో అంది నీలూ.

"టట్టడాయ్" అంటూ దిండు కింద నుంచీ ఒక పేపర్ కవర్ తీసింది రేవతి.

దాన్ని చూడగానే "మన ఫోటోలు వచ్చేసాయా? ఏదీ చూపించూ" తొందరపెట్టింది నీలూ.

రేవతి ఇంటి నుంచి తెచ్చిన కెమెరాలో అందరూ కలిసి ఒక రీలు వేసుకుని క్లాసురూముల్లో, మెస్ హాల్లో, హాస్టలు గదిలో, మేడ మీద, కాలేజీ వార్షికోత్సవం రోజున, ఇలా రకరకాలుగా ఫోటోలు తీసుకున్నారు. కెమెరాలో రీలంతా పూర్తి చేసాక ప్రింటింగ్ కోసం వాచ్ మెన్ కిచ్చి మెయిన్ రోడ్లో ఉన్న ఫోటో స్టూడియోకి పంపారు. వాటి కోసమే అందరి ఎదురుచూపు.

"నువ్వు చూసేశావా, బాగా వచ్చాయా?" ఆసక్తిగా అడిగింది మేఘ.

రేవతి ఒక్కొక్క ఫోటో తీసి బయటపెడుతుంటే అందరూ ఏ ఫోటో ఎలా వచ్చింది, ఎవరెలాంటి ఫోజు పెట్టారు లాంటి రకరకాల సరదా వ్యాఖ్యానాలు చేస్తూ ముప్పై ఫోటోలని గంటసేపు చూసారు.

అందరూ ఫోటోల ఆనందంలో మునిగి వాటి మీద చర్చలు జరుపుతూ ఉండగా రేవతి "ఇంకొక్క గొప్ప ఫోటో మిగిలింది మీరు చూడాల్సింది" అంది.

అదేం ఫోటోనో ఎవరికీ తోచలేదు రజనికి తప్ప.

"ఇంకెందుకు ఆలస్యం త్వరగా చూపించు. నేను తీసిన కళాఖండం ఎలా వచ్చిందోనని టెన్షన్ గా ఉంది" అంది రజని.

"కళాఖండం అయింది నువ్వు తీయడం వల్ల కాదు, ఫోటోలో ఉన్న గ్రేట్ ఫేసుల వల్ల" ఫోజుగా అంది రేవతి.

"బడాయి చాల్లే గానీ అదేదో మాక్కూడా చూపిస్తే తరిస్తాం" నవ్వింది మేఘ.

"సరే.. ఒక్కొక్కరే వరసగా చూడండి" అంటూ ఫోటో మేఘ చేతిలో పెట్టింది రేవతి.

ఆ ఫోటోలో ఇబ్రహీం సర్ పక్కన ముదురు ఆకుపచ్చ రంగు కంచి పట్టుచీరలో ఉన్న రేవతిని చూసి

వరసగా అందరికీ మాట పడిపోయింది. రేవతి, రజని మాత్రం నవ్వుతున్నారు.

ముందుగా తేరుకున్న సునంద "ఇది మన కాలేజీ యానివర్సరీ రోజు తీసిందే. మరి మాకు తెలీలేదే?" అని అడిగింది.

"ఆ రోజు మీ మమ్మీ, డాడీతో వచ్చావుగా. ఈ ఫోటో తీసుకోవడం ఎలా వీలయింది? ఇబ్రహీం సర్ నీకెలా దొరికారు? ఇది నిజం ఫోటోనేనా?" ఆశ్చర్యంగా ప్రశ్నల వర్షం కురిపించింది నీలూ.

"అవన్నీ తర్వాత చెప్తాను కానీ ముందు మా జంట ఎలా ఉందో చెప్పండి. ఆయనేమో పేద్ద లెక్చరర్, నేనేమో చిన్న స్టూడెంటు అన్నారుగా" రోషంగా అంది రేవతి.

"ఓసీ రాక్షసీ.. పెళ్ళైన లెక్చరర్ ని పట్టుకుని నీకు జంట అంటావేమిటే" పక్కనే ఉన్న రేవతికి మొట్టికాయ వేసింది మేఘ.

"అబ్బా.. ఏదో మాటవరసకి అన్నంతమాత్రాన కొంపలేం అంటుకోవులే. నీదొక చాదస్తం" తేలిగ్గా నవ్వేసింది రేవతి.

"ఏమాటకామాటే, ఆ పెద్ద పట్టుచీరలో సర్ పక్కన స్టూడెంటులా లేవసలు. పాతికేళ్ళ అమ్మాయిలా ఉన్నావు" అంది సునంద.

"కదా.. ఎంత ముద్దొచ్చేస్తుందో ఫోటో!" మురిసిపోయింది రేవతి.

"ఇంతకీ అసలు విషయం చెప్పు. ఎప్పుడు, ఎలా తీసారు ఈ ఫోటో?" మళ్ళీ అడిగింది నీలూ.

"యానివర్సరీ రోజు మమ్మీ, డాడీతోనే వచ్చాను కానీ మధ్యలో రెండు మూడు సార్లు రజని కోసం మేకప్ రూంకి, మీ దగ్గరికి వచ్చానుగా. రజని డాన్స్ ప్రోగ్రాం అయిపోయాక స్టేజ్ దగ్గర హడావుడిగా తిరుగుతున్న ఇబ్రహీం సర్ ని చూసి ఫోటో దిగాలన్న ఐడియా వచ్చింది. 'మీతో ఒక ఫోటో దిగుతాను సర్' అని అడిగితే వెంటనే సరే అనేసారు. మన రజని చేతికి కెమెరా ఇస్తే క్లిక్కుమనిపించేసింది. అంతే!" వివరంగా చెప్పింది రేవతి.

"ఏమైనా నువ్వు భలే తెలివైనదానివి" మెచ్చుకోలుగా అంది నీలూ.

అందరూ కలిసి మళ్ళీ ఇంకో వరస ఫొటోలన్నీ చూస్తుంటే మేఘ లేచి వెళ్ళి ఒక పేకెట్ తీసుకొచ్చింది.

"ఎల్లుండి కిరణ్ పుట్టినరోజు వస్తోంది. అందుకని ఏదైనా గిఫ్ట్ ఇస్తే బాగుంటుందని నేనూ, నీలూ కలిసి మన హాస్టల్ షాపీలో ఒక గ్రీటింగ్ కార్డ్ సెలెక్ట్ చేసి లామినేట్ చేయించాం. ఎలా ఉందో చూడండి" సునంద చేతికిస్తూ చెప్పింది మేఘ.

లాంగ్ నోట్ బుక్ సైజులో ఉన్న లామినేటెడ్ ఫ్రేమ్ ని పేకెట్లోంచి బయటికి తీసింది సునంద.

ఒక పదేళ్ళ అబ్బాయి, అంతకన్నా కొంచెం చిన్న అమ్మాయి ఎదురెదురుగా నించుని ఉన్నారు. అమ్మాయి వీపు వెనుక దాచేసుకున్న ఒక చేతిలో ఎర్రగులాబీల గుత్తి ఉంది. క్రింద 'ఫ్రెండ్షిప్ ఈజ్ యూ అండ్ మీ' అని రాసుంది.

"బానే ఉంది కానీ ఇంకా ఫ్రెండ్షిప్ అంటూ ఈ కన్ఫ్యూజన్ ఎందుకు మేఘూ.." అంది రజని.

“మన మేఘ అసలు మాట చెప్పేసరికి కిరణ్ కి ఓ డెబ్బై ఎనభై ఏళ్ళు వచ్చేసేలా ఉన్నాయి పాపం. నన్నైనా ప్రేమించాడు కాదు. చాలా టైం సేవ్ అయ్యేది” నిట్టూర్చింది రేవతి.

“వీళ్ళ మాటలకేం కానీ నిజంగా బాగుంది మేఘా” నమ్మకంగా చెప్పింది సునంద.

“దీన్ని కిరణ్ దాకా చేర్చడం ఎలా?” ఆలోచిస్తూ అంది నీలూ.

“నేను క్లాసులకి వెళ్ళొచ్చేప్పుడు ఒకోకసారి కిరణ్ కనిపిస్తుంటాడుగా. దీన్ని తనకందించే బాధ్యత నాది” హామీ ఇచ్చింది సునంద.

సునంద, మేఘ కలిసి ఆ లామినేటెడ్ ఫోటో ఫ్రేమ్ తో పాటు ఒక పెద్ద డెయిరీ మిల్క్ చాకొలేట్ కూడా లోపల పెట్టి అందంగా గిఫ్ట్ ప్యాకింగ్ చేసారు.

సునంద అన్నమాట ప్రకారం మేఘ తరపున ఆ పుట్టినరోజు కానుకని కిరణ్ కి అందచేసింది.

జరుగుతున్న ఏ విషయంతోనూ సంబంధం లేనట్టు కాలం తనదైన వేగంతో పరుగు తీస్తూనే ఉంది.

రెండేళ్ళ ఇంటర్ చదువుకి గమ్యంలాంటి ఎంసెట్ పరీక్ష దగ్గరపడే కొద్దీ యుద్ధానికి సిద్ధపడే సైనికుల్లా చదువుల్లో తలమునకలై ఉన్న స్నేహితులంతా ఈ పరీక్ష కాస్తా అయిపోయాక ఇన్నాళ్ళూ ఒకే కప్పు కింద కలిసున్నవారు విడిపోయి తలొక దారీ అవుతారన్న నిజాన్ని తాత్కాలికంగా మరచిపోయారు.

పరీక్ష ఘట్టం ముగిసి హాస్టలుకి తిరిగొచ్చాక ఇక వీడుకోలే మిగిలిందని గ్రహించినప్పుడు అందరి మనసులు కష్టపెట్టుకున్నాయి. ఇన్నాళ్ళూ ఎప్పుడెప్పుడు హాస్టలు వదిలి ఇంటికి వెళ్ళే అవకాశం వస్తుందా అని ఎదురుచూసిన వాళ్ళకి తీరా ఇంక మళ్ళీ ఈ హాస్టలుకి రానక్కరలేదని తలచుకోగానే దుఃఖంగా అనిపించింది.

దేనికైనా కొత్తగా అలవాటు పడేదాకా ఒక రకమైన అవస్థ అయితే, తీరా అలవాటు పడ్డాక ఆ ఏర్పడిన బంధం కాస్తా తెంచుకుని ముందుకెళ్ళాలంటే మరొక విధమైన సంఘర్షణ!

జీవిత ప్రయాణం బహుచిత్రం! ఆగాలనుకున్నప్పుడు నడవక తప్పదంటుంది, నడవాలనుకున్నప్పుడు పరుగులు తీయాల్సిందేనంటుంది, పరుగుకి సిద్ధమైనప్పుడు దారులన్నీ మూసేస్తుంది. జీవితం మన చేతిలో ఉందనుకుంటూండగానే మనల్నే తన గుప్పిట్లోకి తీసుకుంటుంది, ఎప్పుడూ తన మాటే చెల్లించుకుంటుంది!

రానున్న భవిష్యత్తు అందరిలోనూ అనివార్యమైన మార్పులని తీసుకొస్తుందన్న జీవిత సత్యం తెలియని లేతవయసులోని అందరు అమాయకుల్లాగే వాళ్ళందరూ కూడా ఎవరెవరు ఎక్కడున్నా ఏమి చేసినా ఉత్తరాల్లోనూ, ఫోనుల్లోనూ తరచూ మాట్లాడుకుంటూ ఉండాలని ఒకరికొకరు బాసలు చేసుకున్నారు.

అప్పటికే చాలా సామాను ఇళ్ళకి పంపించేసి ఉండటంతో మిగిలిన కొద్ది పుస్తకాలు, బట్టలు సర్దుకుని ప్రయాణాలకి సిద్ధమయ్యారు.

ఐదుగురూ కలిసి హాస్టల్లో మిగతా స్నేహితులకీ, ఇన్నాళ్ళూ మెస్సులో భోజనం పెట్టిన ఆయమ్మలకీ, వాచ్ మెన్ కీ అందరికీ వెళుతున్నామని చెప్పి వచ్చారు.

ముందు రేవతిని తీసుకెళ్ళడానికి వాళ్ళ మమ్మీ డాడీ వచ్చారు. ఎప్పుడూ నవ్వు తప్ప మరొక భావానికి తన ముఖంలో చోటివ్వని రేవతి ఈ పూట నవ్వలేకపోతోంది. కారు వీధి మలుపు తిరిగే వరకూ కిటికీలోంచి వెనక్కి చూస్తూ స్నేహితులకి చెయ్యి ఊపుతూనే వెళ్ళింది.

సునంద హైదరాబాదు ప్రయాణం రాత్రికి పెట్టుకుంది. నీలూ, రజని, మేఘలని బస్టాండుకి పంపాక తను వాళ్ళ అంకుల్ వాళ్ళింటికి వెళ్ళేట్టు నిర్ణయమైంది.

ఈ రెండేళ్ళలో మొట్టమొదటిసారి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేకుండా నలుగురు అమ్మాయిలూ స్వతంత్రంగా హాస్టలు గేటు దాటి వీధిలోకి వచ్చారు.

మధ్యాహ్నం సాయంకాలంగా మారనా వద్దా అన్న సందిగ్ధంలో ఉంది. తెలతెల్లటి మబ్బు తునకలు పల్చగా పరుచుకున్న ఆకాశం విరబూసిన మల్లెపొదలా, అప్పుడే పుట్టిన పాపాయి నవ్వులా స్వచ్ఛంగా, అందంగా ఉంది. ఎవరో మబ్బుల చాటున దాగుండి దోసిలి పట్టి సుతారంగా ముత్యాలు వెదజల్లుతున్నట్టు అలవోకగా నింగి నుంచి జారుతున్న సనసన్నటి వాన చినుకులు.. ఆగి ఆగి వీస్తున్న గాలి అలలపై తేలుతూ మెలమెల్లగా చెట్టు సిగలో నుంచి జారి నేలని తాకుతున్న ఎర్రటి గుల్మోహర్ పూలరేకులు..

అప్పుడప్పుడూ మీద వచ్చి పడుతున్న వాన చినుకుల గురించి ఏ మాత్రం పట్టింపు లేకుండా గుల్మోహర్ చెట్టు కింద నించున్న నలుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిల మధ్య మాటలు, నవ్వులు దొర్లుతున్నాయి.

“ఇదిగో కిరణ్.. నేను కూడా రాసేసాను” నింపిన ఆటోగ్రాఫ్ బుక్ ని తిరిగి ఇచ్చేసింది రజని.

కిరణ్ మేఘుకి తప్ప మిగిలినవాళ్ళకి రాయమని ఇచ్చాడని అందరూ గ్రహించారు.

ఇన్నాళ్ళ నుంచీ ఉన్న సంకోచమేదో తొలగిపోయినట్టు మౌనం వీడి అందరితో, ముఖ్యంగా కిరణ్ తో స్వేచ్ఛగా మాట్లాడుతోంది మేఘు.

“బెంగళూరు నుంచీ మళ్ళీ ఎప్పుడు వెనక్కి వస్తారు?” మరొక ఎంట్రన్సు పరీక్ష రాయడానికి బెంగళూరు వెళుతున్న కిరణ్, ప్రదీప్ లని అడిగింది.

“నాలుగు రోజుల్లో వచ్చేస్తాం” అన్నాడు ప్రదీప్.

“అక్కడినుంచి నీకు ఫోన్ చేస్తాను” తనతో చెప్పిన కిరణ్ కేసి చూసి అంగీకారంగా నవ్వింది మేఘు.

కిరణ్, ప్రదీప్ వాళ్ళ స్నేహితులతో కలిసి టూరుకి వెళ్ళినప్పుడు దిగిన ఫోటోలని నీలూ, సునంద చూస్తూ మధ్యలో వివరం అడుగుతున్నారు.

అందరూ నించుని యథాలాపంగా మాటల్లో ఉండగా ఉన్నట్టుండి కెమెరా ఫ్లాష్ వెలిగింది. అటువైపు తిరిగి చూసిన మేఘకి కిరణ్ చేతిలో ఉన్న కెమెరా కనిపించింది. తననే ఫోటో తీసాడని అర్థమై కళ్ళతోనే చిరుకోపంగా చూసింది.

“సారీ.. ముందే చెప్తే తియ్యనివ్వవనీ..” అన్నాడు నెమ్మదిగా.

అతని మొహంలోకి చూసాక కోపం మాయమై నవ్వేసింది మేఘ.

అటు పక్కగా వస్తున్న ఆటోని ఆపి “మన ట్రెయినుకి టైమవుతోంది” కిరణ్ తో అన్నాడు ప్రదీప్.

ఆ మాట వింటూనే మేఘ కళ్ళల్లోకి దిగులు వచ్చి చేరింది.

సామాను ఆటోలో సర్దేసి అందరికీ బై చెప్పి ఆటో ఎక్కాడు ప్రదీప్.

రజని చేతిలో ఉన్న ఫోటోల వంక చూసి “ఇంక ఇచ్చేసెయ్. వాళ్ళు వెళుతున్నారు” అంది నీలూ.

“ఉండు. ఒక్క నిముషం. ఇంకా అన్నీ చూడలేదు” అంది ఆసక్తిగా చూస్తున్న రజని.

“పరవాలేదులే. తీరిగ్గా చూడండి. మళ్ళీ కలిసినప్పుడు తీసుకుంటాం” నీలూతో చెప్తూ ఆటో ఎక్కేసాడు కిరణ్.

ఆటో పక్కనే నించున్న మేఘ చేతులు అందుకుని మాటల కోసం వెతుక్కుంటూ ఆమె కళ్ళల్లోకి చూసాడు.

ఆటో ముందుకి కదిలింది.

మేఘ చేతిలో చిన్న వస్తువేదో ఉంచిన అతని చేతులు మెల్లగా వీడిపోతూ ఆమె నుంచి దూరంగా వెళుతున్నాయి. అలా ముందుకి సాగిపోతూనే వెనక్కి తిరిగి చూస్తూ “వెళ్ళొస్తానూ..” అంటూ చెప్తున్న వీడుకోలు వాక్యాలు గాలి తెరలనీ, వాన చినుకుల్నీ దాటుకుని ఆమె దాకా వచ్చేసరికి అస్పష్టంగా వినిపిస్తున్నాయి. కళ్ళు విప్పార్చుకుని అటు వైపే చూస్తూ చెయ్యెత్తి గాలిలో ఊపుతూ ఉండిపోయింది మేఘ.

మేఘ భుజం చుట్టూ చెయ్యి వేసి దగ్గరికి తీసుకుంటూ “ఇప్పుడు కాకపోతే ఇంకాసేపటికైనా బై బై చెప్పుకోవాల్సిందే తప్పదు. కానీ మనందరం లైఫ్ టైం ఫ్రెండ్స్ మేఘా. మళ్ళీ మళ్ళీ కలుస్తూనే ఉంటాం. నువ్వసలు బెంగ పెట్టుకోవద్దు” అనునయంగా అంది సునంద.

మరి కాసేపటికి సునంద దగ్గర కూడా సెలవు తీసుకుని నీలూ, మేఘ, రజని బస్టాండుకి బయలుదేరారు.

హాస్టలు నుంచి ఇంటికి వచ్చాక ఎప్పటిలా అలవాటుగా నీలూ వాళ్ళింటికి వచ్చింది రజని.

తిరిగి వెళ్ళేప్పుడు “ఎప్పుడూ నేనే మీ ఇంటికి వస్తున్నాను కానీ నువ్వు మా ఇంటికి రావడం లేదు. రేపు తప్పకుండా మా ఇంటికి రావాలి” అని మరీ మరీ రమ్మంది నీలూని.

ఎలాగూ సెలవులే కాబట్టి సరదాగా కాలక్షేపం అవుతుంది లెమ్మని అలాగే వస్తానని చెప్పి మరుసటి రోజు రజని ఇంటికి వెళ్ళింది నీలూ.

రజని వాళ్ళమ్మ గారికి మధ్యాహ్నం భోజనాలయ్యాక కాలక్షేపంగా ఒక గంట సేపు పక్కింటికి వెళ్ళి కూర్చుని కబుర్లు చెప్పుకునే అలవాటుంది. ఆవిడ అటు వెళ్ళగానే రజని నీలూని రమ్మని పిలిచిన అసలు విషయం కదిలించింది.

"నీలూ.. నువ్వు నాకొక సహాయం చెయ్యాలి. చేస్తానని మాటిస్తే చెప్తాను" ముందరికాళ్ళకి బంధం వేసింది రజని.

"ముందు విషయమేంటో చెప్పు. ప్రయత్నిస్తాను" రజని వాలకం చూసి నీలూ కంగారుపడింది.

"ప్రయత్నించడం కాదు. చెయ్యాల్సిందే. అయినా ఫ్రెండ్ కోసం ఆ మాత్రం చేయలేవూ?"

"అలాగే చేస్తానులే గానీ సూటిగా విషయానికి రా"

"నీకు తెలిసిన విషయమే అనుకో. నేను మీ అన్నయ్య శ్రీకాంత్ ని ప్రేమిస్తున్నాను. నాకు ఖచ్చితంగా తెలుసు తను కూడా నన్ను ప్రేమిస్తున్నాడని. కానీ ముందు ఎవరో ఒకరం బయటపడాలిగా. అందుకనీ.." పూర్తిగా చెప్పకుండా నసిగింది రజని.

"అందుకనీ..?" రెట్టించింది నీలూ.

"నేనొక లెటర్ రాసాను. నువ్వు అది తీసుకెళ్ళి శ్రీకాంత్ కి ఇవ్వాలి" అసలు విషయం చల్లగా చెప్పింది రజని.

"నువ్వింకా ఈ విషయం మర్చిపోలేదా? లెటర్ అంటే లవ్ లెటరేగా? నువ్వు మా అన్నయ్యకి రాసిన లవ్ లెటర్ నేను తీసుకెళ్ళి ఇవ్వాలా? నేనివ్వను. కావాలంటే నువ్వే ఇచ్చుకో" రివ్వున దూసుకొచ్చింది నీలూ తిరస్కారం.

"ఫ్రెండ్ వి అయ్యుండీ ఆ మాత్రం హెల్ప్ చెయ్యలేవా నాకోసం?" బతిమాలుతూ అడిగింది రజని.

"ఫ్రెండ్ అయినంత మాత్రానా ఇలాంటి పిచ్చి పనులు చెయ్యాలా? నీకిదివరకే చెప్పానుగా నాకిలాంటివంటే చిరాకని" కొద్ది కోపంగా చెప్పింది నీలూ.

"ఎందుకు చిరాకు? అదే మేఘ, కిరణ్ చేస్తే మంచి పని. అందరూ సపోర్ట్ చేస్తారు. నా దగ్గరికొచ్చేసరికి పిచ్చి పని అయిపోతుంది. అంతేగా?" వాదన పెంచింది రజని.

"అలా మాట్లాడకు రజనీ. వాళ్ళ సంగతి వేరు, ఇది వేరు. అయినా మా అన్నయ్య నన్నూ, మేఘని చూసినట్టే నిన్నూ చూస్తాడు. మాతో మాట్లాడినట్టే నీతోనూ సరదాగా ఉంటాడు. అంతమాత్రాన అది లవ్ అయిపోతుందా? నీ తరపున నేను ఉత్తరం తీసుకెళ్ళి ఇస్తే ఎంత ఘోరంగా ఉంటుందో ఆలోచించు. దయచేసి అర్థం చేసుకో రజనీ" కోపం మాని ఓపిగ్గా నచ్చచెప్పే ప్రయత్నం చేసింది నీలూ.

"ఘోరం ఏముంది? కిరణ్ మేఘకోసం లెటర్ రాస్తే నేను తీసుకురాలేదా? మేఘని కిరణ్ కి యెస్ చెప్పమని సమర్థించలేదా? నాకు తెలుసు. నేను మిమ్మల్ని ఫ్రెండ్స్ అనుకున్నట్టు మీరు నన్ను అనుకోరు. అందుకే ఈ తేడా! నేను మీలాంటి స్వార్థపరురాలిని

అయ్యుంటే కిరణ్ మేఘల విషయం అందరికీ చెప్పేయొచ్చు. మేఘ ఇబ్బంది పడకూడదని హాస్టలు నుంచి వచ్చే రోజున కిరణ్ ఇచ్చిన ఫోటోలని దాచే బాధ్యత నేను తీసుకున్నాను. కానీ మీకు మీ స్వార్ధమే కానీ ఎదుటివారి గురించి పట్టదు" ఆవేశంగా తిట్టింది రజని.

"ఆ రోజున నువ్వు వదలకుండా చూస్తూ ఉండబట్టేగా వాళ్ళు ఆ ఫోటోలు మన దగ్గరే వదిలేసి వెళ్ళారు. అయినా తన దగ్గర ఉంచుకోనని, నిన్ను తీసుకోమని మేఘ అనలేదు. ఎందుకైనా మంచిది ఇబ్బందులు రావొచ్చు అని నువ్వే వాటిని తీసుకున్నావు. నీకంత కష్టం ఎందుకులే, అవి నాకిచ్చెయ్. నేను తీసుకెళ్ళిపోతాను" అంతే ఆవేశంగా బదులిచ్చింది నీలూ.

"నాకు కష్టం అని నేను అనలేదు. మీరు నాకోసం ఏమీ చెయ్యరు అంటున్నాను" కాస్త తగ్గింది రజని.

"నేను చెయ్యను" స్పష్టంగా చెప్పింది నీలూ.

"సరే అయితే నా ఫ్రెండ్షిప్ తో మీకవసరం లేదని అనుకుంటే అలాగే నీ ఇష్టం" అన్న రజని మాటలకి బాగా కోపం వచ్చి "నేను వెళ్తున్నాను" అంటూ వెంటనే లేచి బయటికి వచ్చేసింది నీలూ.

'రజనికి బెదిరించే ఉద్దేశ్యమే లేకపోతే అవసరం లేకపోయినా కిరణ్, మేఘల ప్రస్తావన ఎందుకు తెచ్చినట్టు? ఇప్పుడు రజని చెప్పిన పని చేయకపోతే మేఘకి ఏదైనా సమస్య సృష్టిస్తుందా? బయటికి స్నేహితురాల్లా ఉంటూనే లోపల ఇంత కుళ్ళుమోత్తనం ఏమిటో! మేఘతో ఈ విషయం చెప్తే బాధపడుతుందేమో? అన్నయ్యకి ప్రేమలేఖ రాయడమే వెధవ పనంటే మళ్ళీ దాన్ని నేను తీసుకెళ్ళివ్వాలట. బంధువులమ్మాయి అయ్యుండీ ఏమన్నా తేడా వస్తే తర్వాత మొహామొహాలు చూసుకుంటూ ఎలా తిరగడం అన్న భయమైనా లేదు. ఈ సమస్యకి పరిష్కారం ఎలా..' రకరకాల ఊహలు వచ్చాయి నీలూకి.

ఒక రోజంతా ఆలోచించాక రజని ఏం చేస్తుందోనని ఊహిస్తూ భయపడటం కన్నా ఎలాగోలా ధైర్యం చేసి రజని ఇచ్చే ఉత్తరాన్ని శ్రీకాంత్ కి ఇవ్వడమే నయమన్న నిర్ణయానికి వచ్చింది నీలూ.

## 10

కోపంగా వెళ్ళిపోయిన నీలూ మరుసటి రోజు తిరిగి వచ్చేసరికి తమ మధ్య జరిగిన వాదోపవాదాలు మర్చిపోయి ఆనందంగా మాట్లాడింది రజని. అప్పటికే రాసి కవర్లో పెట్టి అంటించిన ఉత్తరాన్ని నీలూ చేతిలో పెడుతూ "సాధ్యమైనంత త్వరగా శ్రీకాంత్ కి ఇచ్చెయ్యి" అంది.

సరేనన్నట్టు తలూపి రజని ఇచ్చిన ఉత్తరం తీసుకెళ్ళింది నీలూ.

ఇంటికొచ్చి కళ్ళ ముందు తిరుగుతున్న శ్రీకాంత్ ని చూస్తుంటే ముందున్న ధైర్యం నెమ్మదిగా సడలిపోతున్నట్టు అనిపించింది నీలూకి. అన్నయ్య ఎదుటపడి ఉత్తరం విషయం చెప్పాలంటే భయంగా అనిపించింది. రజని ఉత్తరం వెనుక తన ప్రోత్సాహం ఉందని అనుకుంటాడేమోనన్న ఊహకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రాత్రంతా ఉత్తరం ఆలోచనలతో నిద్ర పట్టలేదు.

తెల్లవారి ఉదయం తన గదిలో కాఫీ తాగుతూ రెండు అరల నిండుగా ఉన్న టేప్ రికార్డర్ కేసెట్లు అన్నీ బల్ల మీద పరిచి వాటిని సర్దే కార్యక్రమంలో లీనమైపోయి ఉన్న శ్రీకాంత్ దగ్గరికి వెళ్ళి కూర్చుంది నీలూ.

ఒక అయిదు నిమిషాలు గడిచేసరికి ఎప్పుడూ ఏదోకటి మాట్లాడుతూ ఉండే చెల్లెలు పరధ్యానంగా ఉండటం గమనించి “ఏంటీ సంగతి? సరైన ఎంసెట్ ర్యాంక్ రాదని భయపడుతున్నావా? నీ మీద మరీ అంత పెద్ద ఆశలు ఎవరూ పెట్టుకోలేదులే. రిలాక్స్ అయిపో” నవ్వుతూ నీలూ తలమీద మొట్టాడు శ్రీకాంత్.

“అదేం కాదులే అన్నయ్యా..” అని ఆగిపోయింది నీలూ.

“కొంపదీసి ఇంటరు సబ్జెక్ట్స్ గట్టెక్కడం కష్టమా?” నీలూ మొహంలోకి చూస్తూ అడిగాడు.

“ఇప్పటివరకూ నేనెప్పుడైనా ఫెయిల్ అయ్యానా?” రోషంగా ఎదురు ప్రశ్న వేసింది నీలూ.

“అదీ నిజమే. ర్యాంకులు అంటే కష్టం కానీ ఎప్పుడైనా పాస్ గ్యారెంటీ” నవ్వాడు.

మాటలతో పాటు నవ్వు కూడా లేకపోవడంతో నీలూ పక్కన కూర్చుని “ఏమైంది నీలమ్మా.. ఎవరైనా ఏమన్నా అన్నారా?” భుజం మీద చెయ్యి వేసి అనునయంగా అడిగాడు.

నీలూ నోరు విప్పలేదు కానీ కళ్ళల్లోంచి కన్నీటిధారలు కారిపోతున్నాయి. ఉన్నట్టుండి ఏడుస్తున్న చెల్లెలిని చూసి కాస్త కంగారుపడిన శ్రీకాంత్ నీలూని సముదాయిస్తూ విషయం ఏమిటని అడిగాడు.

“నేను చెయ్యనన్నా రజని నా మాట వినిపించుకోకుండా బలవంతపెట్టింది అన్నయ్యా..” వెక్కుతూ చెప్పింది నీలూ.

“ఏ విషయమైనా నేను చూసుకుంటానుగా. నువ్వు భయపడకుండా ఏమి జరిగిందో వివరంగా చెప్పు” మెత్తగా అడిగాడు శ్రీకాంత్.

ఉత్తరం తీసి శ్రీకాంత్ చేతికిస్తూ “నీకిది ఇమ్మని రజని బలవంతం చేసింది” అంది.

కవరు చింపి ఉత్తరం బయటకి తీసి చదివాక రెండు నిమిషాల్లోనే విషయమంతా అర్థమైంది శ్రీకాంత్ కి.

“నామీద కోపం వచ్చిందా అన్నయ్యా?” ఏడుపు మొహంతో అడుగుతున్న చెల్లెలికేసి చూసి నవ్వాడు.

“ఛఛా.. నీ మీద నాకెప్పుడూ కోపం రాదు. ఇంకెప్పుడూ అలాంటి భయాలు పెట్టుకోకు” ఆప్యాయంగా చెప్పాడు.

“ఇప్పుడు రజనికి ఏం చెప్పాలి నేను?” అడిగింది నీలూ.

"నువ్వేం చెప్పక్కర్లేదు. మనింటికి వస్తూనే ఉంటుందిగా. ఈసారి వచ్చినప్పుడు నా దగ్గరికి తీసుకురా. నేనే మాట్లాడతాను. నువ్వు మాత్రం ఇంక ఈ సంగతి మర్చిపోయి ప్రశాంతంగా ఉండు" అన్నాడు శ్రీకాంత్.

అన్నయ్య ఇచ్చిన భరోసాకి నీలూ మనసు తేలిక పడింది.

ఆ రోజు సాయంకాలమే రజని నీలూ ఇంటికి వచ్చింది.

"మీ అన్నయ్యకి ఉత్తరం ఎప్పుడు ఇద్దామనుకుంటున్నావు?" అని అడిగింది.

"ఉత్తరం ఇచ్చేశాను. నీతో మాట్లాడాలని అన్నాడు. వెళ్ళి చెప్పనా నువ్వు వచ్చావని?" అంది నీలూ.

నీలూ సరదాకి అంటోందనుకుని రజని నవ్వింది.

"ఉండు. వెళ్ళి అన్నయ్యకి చెప్పి వస్తాను" అంటూ వెళ్ళిన నీలూని చూసి ఆశ్చర్యపోయినా శ్రీకాంత్ తనతో మాట్లాడబోతున్నాడని సంబరపడింది రజని.

ముగ్గురూ ఇంటి వెనక పెరట్లో అరుగుల మీద కూర్చున్నారు.

"నీలూ.. ఇందాకేదో చేస్తానన్నావుగా. ఏంటది?" చెల్లిని అడిగాడు శ్రీకాంత్.

"నిమ్మకాయ షర్బత్ అన్నయ్యా.."

"నువ్వెళ్ళి అందరికీ షర్బత్ చేసి పట్టుకురా" అన్నాడు శ్రీకాంత్.

"చిటికెలో చేసి తెస్తాను" ఉత్సాహంగా ఇంట్లోకి వెళ్ళింది నీలూ.

అయిదు నిమిషాల్లో మూడు షర్బత్ గ్లాసులతో తిరిగి వచ్చింది నీలూ.

అన్నయ్య మొహం ప్రసన్నంగానే ఉంది కానీ రజని ముఖంలో ముందున్న ఉత్సాహం లేదనిపించింది.

ఏమీ మాట్లాడకుండా నేలచూపులు చూస్తూ షర్బత్ తాగుతోంది రజని.

తనకిచ్చిన గ్లాసు తీసుకుని అక్కడనుంచి వెళ్ళిపోయాడు శ్రీకాంత్.

నీలూ ఏదో మాట్లాడబోతుండగానే "ఇవాళ అమ్మ త్వరగా వచ్చేయమంది. రాత్రికి మేము ఊరెళుతున్నాం" అని చెప్పి జవాబు కోసం చూడకుండా చివాలున లేచి వెళ్ళిపోయింది రజని.

సాయంకాలం కాస్త చల్లబడ్డాక పెరట్లో మల్లెపందిరి చుట్టూ తిరుగుతూ మల్లెమొగ్గలు కోస్తోంది మేఘ. ఇంట్లోంచి ఫోన్ రింగ్ అయిన శబ్దం విని రెండు రోజుల నుంచీ ఫోన్ మోగిన ప్రతీసారీ అనుకుంటున్నట్టే కిరణ్ గానీ చేశాడేమో అనుకుంటూ ఇంట్లోకి పరుగు తీసింది.

"హలో.."

"ఏంటీ.. పరిగెత్తుకుంటూ వచ్చావా?" కిరణ్ నవ్వు వినిపించింది అవతలి నుంచి.

"ఊ.. పెరట్లో ఉన్నా. ఎప్పుడు ఫోన్ చేస్తావా అని ఎదురుచూస్తున్నాను."

"ఎందుకు ఎదురుచూడ్డం?"

"ఎందుకంటే... అదే.. మీరిద్దరే అంత దూరం వెళ్ళారు. ఎలా ఉన్నారో ఏంటో తెలుసుకోవాలిగా!"

"మేమేమన్నా స్కూలుపిల్లలమా తప్పిపోడానికి?" నవ్వాడు కిరణ్.

"ఇప్పుడు బెంగళూరునుంచేనా మాట్లాడేది? ఎలా రాసారు ఎంట్రన్స్ టెస్ట్?"

"బానే రాశాం. ఎంసెట్ కన్నా ఈజీగా ఉంది."

"ఇంటికి ఎప్పుడు వస్తున్నారు?"

"ఇంకా తెలీదు. సరదాగా ఒక నాలుగు రోజులు బెంగళూరు, మైసూరు తిరుగుదాం అంటున్నాడు ప్రదీప్. వెళ్ళమంటావా?"

"మీకు వెళ్ళాలనిపిస్తే వెళ్ళండి. నన్ను అడగడం ఎందుకు?"

"అయితే అలాగే తిరిగేసి వస్తాంలే. మేమిద్దరమే కాదు ఇంకా వేరే ఫ్రెండ్స్ కూడా ఉన్నారు. అందరం కలిసి ప్లాన్ చేస్తున్నాం."

"జాగ్రత్త మరి. ఇంటికొచ్చాక ఫోన్ చెయ్యి. నేను ఎదురుచూస్తూ ఉంటాను."

"అంటే ఇప్పుడు మాట్లాడను. ఫోన్ పెట్టేయ్ అనా?"

"ఎస్టీడీ కాల్ కదా.. ఇప్పటికే చాలా బిల్లు అయ్యుంటుంది. నువ్వు ఊరునుంచి వచ్చాక తీరిగ్గా మాట్లాడుకుందాంలే."

"సరే అయితే ఉంటాను మరి. టేక్ కేర్"

"హేవ్ ఎ నైస్ ట్రిప్!" నవ్వుతూ చెప్పి ఫోన్ పెట్టేసింది మేఘ.

మరొక నాలుగు రోజులు గడిచాక ఒక మధ్యాహ్నం పూట తీరిగ్గా పడుకుని చందమామ చదువుకుంటోంది మేఘ. వాళ్ళమ్మ గారొచ్చి పక్కనే కూర్చుని "కాసేపు ఆ చందమామ పక్కన పెట్టు. నీతో మాట్లాడాలి" అన్నారు.

చేతిలో ఉన్న పుస్తకం పక్కన పెట్టేసి వచ్చి ఒళ్ళో పడుకుని "చెప్పమ్మా" అంది మేఘ.

"మన బంధువుల్లో, చుట్టూ చూస్తున్న సమాజంలో ఆడపిల్లలకి పెద్దగా చదువు అక్కర్లేదనుకునేవారు, ఎలాగూ కట్నాలిచ్చి పంపక తప్పదు కాబట్టి వాళ్ళ చదువులకి డబ్బు ఖర్చుపెట్టడం దండగమారి పని అనుకునేవాళ్ళే ఎక్కువ. ఆడపిల్లల్ని ప్రతీదాన్లో కట్టడి చేస్తూ అదుపాజ్ఞల్లో పెంచాలని సుద్దులు చెప్పేవాళ్ళు చుట్టూ ఎంతమందున్నా వాళ్ళని లెక్కచెయ్యకుండా నాన్నగారు నీకింత స్వేచ్ఛనిచ్చి మన తాహతుకి మించిన చదువులు చెప్పిస్తున్నారంటే ఆయనకి నీ మీద ఎంత ప్రేముందో, ప్రేమకి మించి ఎంత నమ్మకం ఉందో ఆలోచించావా ఎప్పుడైనా?" మేఘ ముఖంలోకి చూస్తూ అడిగారు వాళ్ళమ్మ గారు.

ఉన్నట్టుండి ఇలాంటి ప్రస్తావన ఎందుకు తెచ్చారో అర్థంకాని మేఘ అయోమయంగా చూసింది.

“అందరు తల్లిదండ్రుల్లాగా నీ తోటివాళ్ళతో స్నేహం గురించి మేమెప్పుడూ నీకు పరిధులు, పరిమితులు గీయలేదు. ఎందుకంటే నీ హద్దులు గుర్తెరిగి ప్రవర్తించేంత బాధ్యత, తెలివి నీకున్నాయని మా నమ్మకం. మా ఆలోచన సరైనదేనంటావా?” అని అడుగుతున్న అమ్మ ముఖంలో గంభీరత చూసి మేఘ ముఖం చిన్నబోయింది.

ఆవిడ ఒళ్ళోంచి లేచి ఎదురుగ్గా కూర్చుని రెండు చేతులూ గట్టిగా పట్టుకుని “ఎందుకమ్మా ఇలా మాట్లాడుతున్నావు? ఇప్పుడు నా వల్లేమైనా తప్పు జరిగిందా?” బేలగా అడిగింది.

“నిన్న సాయంకాలం రజని వాళ్ళ నాన్నగారు ఫోను చేసి నీలూ వాళ్ళ నాన్నగారిని, మీ నాన్నగారినీ ముఖ్యంగా మాట్లాడే పనుందని పిలిపించారు. నీలూ, మేఘులకి ఎవరో మగపిల్లలు స్నేహితులున్నారట. వారిలో ఒక అబ్బాయితో మేఘకి ప్రేమ వ్యవహారం ఉందట. ఆ అబ్బాయిల ఫోటోలు దాచమని మేఘ మా రజనికి ఇచ్చిందట. మేము ఆ ఫోటోలు చూసి ఏమిటని గట్టిగా అడిగేసరికి అసలు విషయం మొత్తం బయటపెట్టింది రజని. మా అమ్మాయి బతిమాలినా వినకుండా బలవంతంగా ఈ వ్యవహారంలోకి లాగి ఇబ్బంది పెడుతున్నారని ఒకటే ఏడుపు. మొదటినుంచీ ఆడపిల్లల్ని హద్దుల్లో పెంచడం మా ఇంటి పద్ధతి. మీ అమ్మాయిని చూసీ చూడనట్టు ఉండదల్చుకుంటే మీ ఇష్టం కానీ మా పిల్ల జోలికి రాకుండా ఉండమని మాత్రం గట్టిగా చెప్పండి. ఏదో ఒకేచోట చదువుకుంటున్నారని కాస్త స్నేహంగా ఉన్న నేరానికి మా అమ్మాయిని ఇలాంటివాటిల్లోకి లాగితే చూస్తూ ఊరుకోము అని చెప్పి ఫోటోల కవరు మీ నాన్నగారి చేతికిచ్చారు.”

జరిగిందంతా విన్న మేఘ నివ్వెరపోయి తల్లి ఒళ్ళో తల దాచుకుని భోరున ఏడవడం మొదలుపెట్టింది. ఎంతసేపటికీ ఏడుపు తీవ్రత తగ్గకపోవడంతో మేఘ వాళ్ళమ్మ గారు ఊరడించే ప్రయత్నం చేసారు.

“ఆ ఫోటోలకి, నాకూ ఏమీ సంబంధం లేదమ్మా. మాకు సెలవులిచ్చిన రోజున వాళ్ళు మా ఫ్రెండ్స్ అందరికీ ఫోటోలు చూపించారు. వాళ్ళు ట్రెయిన్ కి టైం అయిందని వెళ్ళిపోతుంటే రజని ఇంకా చూస్తూ ఉందని హడావుడిగా వదిలేసి వెళ్ళిపోయారు” వెక్కుతూ చెప్పింది మేఘ.

“రజని ప్రత్యేకంగా నీ గురించే ఎందుకు చెప్పింది? ఆ అబ్బాయిల వల్ల ఏదైనా సమస్యా? మీరు తెలిసీ తెలియనితనంతో గోరంతలు కొండంతలు చేసుకుంటారు. ఇప్పుడు చూసావా విషయం ఎంత పెద్దదయిందో, నీ గురించి వేరే ఎవరో బయటివాళ్ళు అలా మాట్లాడుతుంటే నాన్నగారి మనసు ఎంత కష్టపడి ఉంటుందో ఆలోచించు. అయినా ఆయన నిన్ను ఒక్కమాట కూడా అడగలేదు. అసలేం జరిగిందో ఏమీ దాచకుండా చెప్పు మేఘూ” బుజ్జగిస్తూ అడిగారు వాళ్ళమ్మ గారు.

“నావల్లే మీరింత బాధపడాల్సి వచ్చింది. సారీ అమ్మా.. నేను కావాలని ఏ తప్పూ చేయ్యలేదమ్మా. సారీ అమ్మా” పదే పదే అవే మాటలు చెప్తూ ఏడుస్తూనే ఉంది మేఘ.

“కొన్ని నెలల క్రితం కిరణ్ నన్ను ఇష్టపడుతున్నానని చెప్తే నేను కాదన్నాను. ఆ తర్వాత అతను మళ్ళీ ఆ ప్రస్తావన తీసుకురాలేదు. నన్నేమీ ఇబ్బంది పెట్టలేదు. అందరం స్నేహితుల్లాగా ఉన్నామంతే. అందరూ కలిసి బయటికి వెళదాం అన్నప్పుడు కూడా నేను రాననే చెప్పాను” ఏడుస్తూనే చెప్పింది మేఘ.

“ప్రేమలు, పెళ్ళిళ్ళు లాంటివి మీ వయసుకి అక్కర్లేని ఆలోచనలు. ఇప్పుడు ఇలాంటి వాటి మీదకి మీ దృష్టి వెళితే మీ భవిష్యత్తుని మీరే నాశనం చేసుకున్నవారవుతారు. మీకింత స్వేచ్ఛనిచ్చి ఇంతింత ఖర్చు పెట్టి చదువులు చెప్పించినందుకు మమ్మల్నీ, మా పెంపకాన్నీ నలుగురూ నానామాటలంటారు. నిన్నేదో బాధపెట్టాలని నేనిలా మాట్లాడటం లేదు మేఘా.. నీకు ఇసుమంత కష్టం కలిగినా నీ కన్నా వంద రెట్లు ఎక్కువ బాధ కలుగుతుంది మాకు. మా బాధంతా నీ గురించీ, నీ భవిష్యత్తు గురించేనని నీకు అర్థం అవుతుందనుకుంటాను. ఆలోచించి చూడు” చెప్పాల్సినవన్నీ చాలాసేపు వివరంగా చెప్పాక మేఘని ఒంటరిగా వదిలి అక్కడినుంచి వెళ్ళి పోయారు మేఘ వాళ్ళమ్మ గారు.

ఒక్కసారిగా ఉప్పెనలా మీదొచ్చి పడిన ఇబ్బందికర పరిస్థితిలో అపరాధభావంతో ఉక్కిరిబిక్కిరయింది మేఘ.

'రజని ఎందుకిలా చేసింది? నీలూ వాళ్ళింట్లో కూడా ఇదే పరిస్థితి ఉండి ఉంటుందా? చిన్నప్పటినుంచీ తనను చూస్తున్న వాళ్ళందరూ ఇప్పుడు ఈ సంగతి విన్నాక నా గురించి ఏమనుకుంటారు? నీలూని ఏమంటున్నారో? నాన్నగారి ముఖం ఎలా చూడగలను? ఎందుకిలా జరిగింది.. తప్పంతా నాదే.. కిరణ్ ఉత్తరం చూడగానే తనతో మాట్లాడటం పూర్తిగా మానేయవలసింది. చాలా పెద్ద తప్పే చేశాను. వెనక్కి తీసుకోలేనంత తప్పు జరిగిపోయింది. ఒకే ఒక్క సంఘటనతో ఇన్నేళ్ళుగా నా మీద అమ్మానాన్నలు ఉంచిన నమ్మకం వమ్మైపోయింది. ఇప్పుడు నేనేం సంజాయిషీ చెప్పినా ఉపయోగం లేదు. జన్మలో నన్నింక నమ్మరేమో...'

మేఘ ఆలోచనలు రకరకాలుగా పోతున్నాయి. వాటి తీవ్రతతో పాటు దుఃఖం పెరుగుతోంది. ఎంతసేపు ఏడ్చిందో ఏడుస్తూనే అలసిపోయి నిద్రపోయింది.

ట్రింగ్ ట్రింగ్ మని బిగ్గరగా మోగిన ఫోన్ శబ్దానికి మేఘకి మెలకువ వచ్చింది. ఒక్క క్షణం ఉదయమో, సాయంత్రమో అర్థం కాలేదు. గడియారం వైపు చూస్తే ఆరున్నర అయింది. నొప్పిగా ఉన్న కళ్ళు మధ్యాహ్నం జరిగిందంతా గుర్తు చేశాయి. అమ్మ బయట ఎక్కడో పనిలో ఉన్నట్టుంది అనుకుంటూ లేచి వెళ్ళి ఇంకా మోగుతూనే ఉన్న ఫోన్ ఎత్తింది.

“హలో..”

కిరణ్ గొంతు విన్న మేఘకి మాట పెగల్లేదు.

“హలో.. హలో..”

“హలో..”

“హే మేఘా.. ఎలా ఉన్నావ్? మధ్యాహ్నమే వచ్చాను బెంగళూరు నుంచి.”

"నాకు నీతో మాట్లాడటం ఇష్టం లేదు. ఇంకెప్పుడూ నాకు ఫోన్ చెయ్యొద్దు" మేఘ గొంతులో వినిపించిన కోపం కిరణ్ ని ఆశ్చర్యపరిచింది.

"ఏమైంది మేఘా? ఆర్యూ ఆల్ రైట్? ఎవరైనా ఏమన్నా అన్నారా? ఏదయినా సమస్యా?" ఆదుర్దాగా అడిగాడు కిరణ్.

"ఏమీ అవ్వలేదు. ఏ సమస్యా లేదు" ఆవేశంగా చెప్పింది మేఘ.

"ఏం జరిగిందో నాతో చెప్పు మేఘా.. ఇప్పుడు చెప్పలేకపోతే పోనీ నేను మళ్ళీ మాట్లాడనా.."

కిరణ్ మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ "ఇంకెప్పుడూ నాతో మాట్లాడటానికి ప్రయత్నించకు. నాకు ఫోన్ చెయ్యొద్దు. నీతో మాట్లాడ్డం నాకిష్టం లేదు. నన్ను వదిలేయ్. జస్ట్ లీవ్ మీ అలోన్!" గట్టిగా అరిచేసి ఫోన్ పెట్టేసింది. ఆవేశంతో పాటు దుఃఖం కూడా పొంగుకొచ్చింది మేఘకి.

ఎంత ఆలోచించినా తన సమస్యకి అన్నిరకాలుగా కిరణే కేంద్రబిందువులా కనిపిస్తున్నాడు. కిరణ్ తో స్నేహాన్ని వదిలించుకోవడం ఒక్కటే పరిష్కారంగా కనిపిస్తోంది. ఇన్ని అనర్థాలకూ ఈ స్నేహమే కారణం. ఎప్పుడూ లేనిది అమ్మానాన్నల ముందు దోషిలా నిలబడాల్సి వచ్చింది. ఇంకెప్పుడూ కిరణ్ తో మాట్లాడకూడదు. ఎట్టి పరిస్థితిలోనూ పట్టుదల సడలిపోకుండా చూసుకోవాలి.

ఇలాంటి ఆలోచనల్లో ఉన్న మేఘకి ఫోన్ మోగినప్పుడల్లా భయంగా ఉంది. కిరణ్ ఫోను చేస్తే ఎలాంటి పరుషమైన మాటలు మాట్లాడాలి అని తనలో తనే పదే పదే వల్లెవేసుకుంటోంది. కానీ కిరణ్ మళ్ళీ ఫోను చెయ్యలేదు.

మరుసటి రోజు సాయంకాలం ఫోను మోగితే బెదిరిపోతూనే తీసింది మేఘ.

"హలో"

సునంద గొంతు వినగానే ప్రాణం లేచి వచ్చింది మేఘకి.

"హలో సునందక్కా.. ఎలా ఉన్నావు? సర్ప్రైజ్.. నువ్వు ఫోన్ చేస్తావనుకోలేదు" ఉత్సాహంగా అంది మేఘ.

"కిరణ్ మాట్లాడాడు. తన మీద కోపంగా అరిచావట. ఇంకెప్పుడూ మాట్లాడను అన్నావట. ఎందుకో ఏమిటో తెలియక నీకేమైనా సమస్య వచ్చిందేమో అని తను చాలా వర్రీ అవుతున్నాడు. అలా మాట్లాడి తనని కంగారుపెట్టడం ఏమన్నా బాగుందా? అసలేం జరిగిందో చెప్పు" సూటిగా విషయానికొచ్చేసింది సునంద.

కిరణ్ ప్రస్తావన రావడంతోటే "మళ్ళీ చెప్పేదేమీ లేదు. నాకు తనతో మాట్లాడటం ఇష్టం లేదు. ఇంకెప్పుడూ కాల్ చెయ్యొద్దని అన్నాను" ఆవేశంగా చెప్పింది మేఘ.

"అదే ఎందుకని అడుగుతున్నా నేను. కిరణ్ వల్ల ఏమైనా తప్పు జరిగిందా? ఇంట్లో ఏదైనా సమస్యా?"

"నాకు ఏ సమస్యా లేదు. నాకిష్టం లేదు, నేను మాట్లాడను అంతే!" మొండిగా చెప్పింది మేఘ.

"ఇన్నాళ్ళూ మనందరం స్నేహంగా ఉండి ఇలా కారణం చెప్పకుండా అర్ధాంతరంగా పో అంటే దారుణం మేఘా.. ఎదుటి మనిషి గురించి కాస్తైనా ఆలోచన ఉండొద్దా చెప్పు."

"ఈ విషయం గురించైతే ఇంకేం చెప్పొద్దక్కా.. నువ్వేం చెప్పినా నేను కిరణ్ తో మాట్లాడను. వేరే ఏమన్నా మాట్లాడేట్టయితే మాట్లాడు."

"పరిస్థితుల్నీ, మనుషుల్నీ అర్థం చేసుకోగలిగే విజ్ఞత ఉందనుకున్నాను మేఘా నీకు. ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తావనుకోలేదు. కిరణ్ తో అయితే ఏంటీ నాతో అయితే ఏంటీ స్నేహానికి విలువ లేనప్పుడు" సునంద గొంతులో బాధ వినపడింది.

"నీకిష్టం లేకపోతే మాట్లాడకు. మానెయ్. నాకెవరూ అక్కర్లేదు" దురుసుగా అంది మేఘ.

"సరే అయితే.. మరోసారి నీకు ఫోన్ చేసి ఇబ్బంది పెట్టను. ఉంటాను" ఫోన్ డిస్కనెక్ట్ చేసింది సునంద.

"ఇంకెప్పుడూ నాతో మాట్లాడకు. నన్ను వదిలేయ్.. లీవ్ మీ అలోన్!"

నిద్రలోంచి దిగ్గున లేచి కూర్చుంది మేఘ.

అరుపులు కలలోవే అయినా కన్నీళ్ళతో తడిసిన చెంపలు నిజంలాంటి అనుభవాన్ని తలపించాయి. ఒక్క క్షణం తనెక్కడుందో అర్థం కాలేదు. చుట్టూ చూసింది. గది బయట నుంచి పూజ కేరింతలు, నీలూ మాటలు లీలగా వినపడుతున్నాయి.

లేచి వెళ్ళి చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుని అద్దంలోకి చూస్తే ఓ క్షణం అక్కడ కలలోని పదహారేళ్ళ మేఘ రూపం కదలాడింది.

రెండు నిమిషాలు స్థిమితంగా కూర్చుని అప్పుడప్పుడూ ఇలా గతంలోంచి కలల రూపంలో తరుముకొచ్చి కలవరపెట్టే జ్ఞాపకాలని విదిలించుకుని తన గదిలోంచి బయటికి నడిచింది మేఘ.

డైనింగ్ హాల్లో ఉన్నారందరూ. నీలూ పూజకి టిఫిన్ తినిపిస్తుంటే, పక్కనే కాఫీ తాగుతూ పేపర్ చూస్తూ కూర్చున్నాడు శరత్. ఆ అందమైన దృశ్యం చూడగానే మనసు తేలికపడి హాయిగా అనిపించింది మేఘకి.

"అప్పుడే నిద్ర లేచావేంటి? ఇంకాసేపు పడుకోవచ్చుగా" అంది నీలూ.

"ఇంక నిద్ర పట్టదులే" మేఘ కూడా డైనింగ్ టేబుల్ కుర్చీ ఒకటి లాక్కుని వాళ్ళతో కూర్చుంది.

"నేను త్రీ డేస్ స్కూలుకి వెళ్ళక్కర్లేదు కదా అమ్మా" చేతి వేళ్ళు లెక్కపెట్టుకుంటూ అడిగింది పూజ.

"ఆహా.. త్రీ డేస్ సరిపోతాయా.. పది రోజులు మానేయరాదూ?" వెటకారంగా అంది నీలూ.

"మా అనిత మిస్ ఒప్పుకోదు అమ్మా" దిగులుగా చెప్పింది పూజ.

"అంటే ఒప్పుకుంటే స్కూలు మానేసి ఊర్లు తిరుగుదామనేగా.. అసలు దీనికి ఆ పల్లెటూర్లో ఎలా పొద్దుపోతుందో అర్థం కాదు అక్కడికంటే చాలు క్షణాల్లో రెడీ అయిపోతుంది" కినుకగా అంది నీలూ.

"'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్నారుగా. నా బంగారుతల్లి అక్షరాలా పాటించేస్తోంది" పూజ తల నిమురుతూ అన్నాడు శరత్.

"ఆ మాటకొస్తే అది పుట్టింది విజయవాడలో కాబట్టి ఈ ఊరే జన్మభూమి అయినట్టు లెక్క" మూతి ముడిచింది నీలూ.

"ఇంతకీ ఏమిటీ జన్మభూమి యుద్ధం?" వాళ్ళ చర్చ చూసి నవ్వుతూ అడిగింది మేఘ.

"మా అత్తగారి ఊర్లో కొత్తగా రామాలయం కట్టారు. ఆ గుడికి స్థలం మా మావయ్య గారే ఇచ్చి దగ్గరుండి మరీ కట్టించారు. రేపు ఉదయం ఆ గుళ్ళో ధ్వజస్థంభం, విగ్రహప్రతిష్ట జరుపుతున్నారు. దానికి ఇంటి ఆడపిల్లలు తప్పనిసరిగా ఉండి తీరాలని చెప్పారు" నీలూ చెప్తోంది.

"నేనూ, విజితక్కా స్పెషల్ గా రావాలని నాన్నమ్మ చెప్పింది" మధ్యలో అందుకుని ఉత్సాహంగా చెప్పింది పూజ.

"విన్నావుగా.. రేపు ఊరెళ్ళేదానికి ఇప్పటినుంచే ఎంత సంబరమో చూడు అమ్మాయి గారికి. మా ఆడపడుచు వాళ్ళమ్మాయి విజిత ఇక్కడే విజయవాడలో ఇంటర్ చదువుతుందని చెప్పానుగా. తనని కూడా ఊరికి తీసుకెళ్ళాలి" పూర్తిగా చెప్పింది నీలూ.

"అయితే ఫ్యామిలీ ట్రిప్ అన్నమాట. నువ్వూ వెళ్ళాలిగా?" అడిగింది మేఘ.

"మామూలుగా అయితే వెళ్ళేదాన్ని కానీ ఇప్పుడు వెళ్ళను. ఒక్క రోజేగా వీళ్ళు వెళ్ళి వచ్చేస్తారు. ఎంచక్కా మనిద్దరం ఇంట్లో ఉందాం" తేలిగ్గా అంది నీలూ.

"అయ్యో నేనున్నానని మీ ప్లాన్ మార్చుకోవాల్సివచ్చిందా?" నొచ్చుకుంది మేఘ.

"అదేం కాదులెండి. పూజకి స్కూలు పోతుంది. విజిత వాళ్ళ హాస్టల్లో కూడా ఒక్కరోజు పర్మిషన్ దొరకడమే చాలా కష్టం. అందుకని రేపు ఉదయాన్నే వెళ్ళి ఎల్లుండి తెల్లవారుతూనే బయలుదేరి వచ్చేస్తాం. కారుతో పాటు అశోక్ ఇక్కడే ఉంటాడు. మీ ఫ్రెండ్స్ ఇద్దరూ హ్యాపీగా ఎక్కడికంటే అక్కడికి వెళ్ళండి" మేఘతో చెప్పాడు శరత్.

"మాకు కారు అక్కర్లేదు శరత్. మీరే తీసుకెళ్ళండి. మా కాలేజీ రోజుల్లోలాగా బస్సుల్లోనూ, ఆటోల్లోనూ తిరుగుతాం. ఏమంటావ్ నీలూ?"

"మేఘ అమెరికాలో కారుల్లో తిరిగీ తిరిగీ మన బస్సుల్నీ, ఆటోల్నీ బాగా మిస్సయినట్టుందండీ. వచ్చిన దగ్గర్నుంచీ మాట్లాడితే ఆటో ఎక్కుదాం, బస్సెక్కుదాం అంటోంది. ఆ ముచ్చట కూడా తీర్చేస్తే సరి" నవ్వింది నీలూ.

"సరే మీకెలా నచ్చితే అలా చెయ్యండి. సాయంకాలం విజితని తీసుకురావడానికి ఏ టైముకి రమ్మంటావు నన్ను?" నీలూని అడిగాడు శరత్.

"మీకు ముఖ్యమైన పనేదో ఉందన్నారుగా. అది చూసుకోండి. అశోక్ తో పాటు నేనూ, మేఘ వెళ్ళి విజితని తీసుకొచ్చేస్తాం" చెప్పింది నీలూ.

అనుకున్న ప్రకారం సాయంకాలం పూజ స్కూలు నుంచి వచ్చాక అందరూ కలిసి విజిత ఉంటున్న హాస్టలుకి వెళ్ళారు.

హాస్టలు మేనేజర్ని కలిసి అడిగితే "ఆదివారం తప్ప మిగతా రోజుల్లో స్టూడెంట్స్ ని కలవడానికి కూడా అనుమతి ఉండదు. వేరే ఊరు నుంచి వచ్చారంటున్నారు కాబట్టి పది నిమిషాలు టైము ఇస్తాం తప్ప సెలవు పెట్టి ఇంటికి తీసుకెళ్ళడం సాధ్యం కాదు" అన్నారు.

ఈ ఒక్కసారికి పంపించమని బతిమాలితే "ఇంటికి పంపాలంటే ప్రిన్సిపాల్ మాత్రమే పర్మిషన్ ఇవ్వగలరు. ఆయన అరగంటలో వస్తారు. విజిటర్స్ రూంలో వెయిట్ చెయ్యండి" అని చెప్పారు.

అక్కడ కూర్చున్నాక బయటికెళదామని మారాం చేసింది పూజ. మేఘని అక్కడే ఉండమని చెప్పి పూజని తీసుకుని కారు దగ్గరికెళ్ళి "టైం పట్టేట్టు ఉంది. కాసేపు ఇద్దరూ బయట తిరగండి. నేను ఫోన్ చేసి పిలుస్తాను" అని అశోక్ కి చెప్పి పూజని అతని దగ్గరే వదిలి తిరిగి హాస్టల్లోకి వెళ్ళింది నీలూ.

చుట్టూ పరిసరాలని గమనిస్తూ కూర్చున్న మేఘకి ఖాళీగా ఉన్న ఆ విజిటర్స్ రూంలో ఒక పక్కగా ఒంటరిగా కూర్చున్న ఆమె కనపడింది. సాదాసీదాగా ఉన్న ఆమె అక్కడ పనిచేసే ఆయానేమో అనుకుంది. కానీ ఆవిడ వాలకం చూస్తే అలవాటైన చోట ఉన్నట్టు లేదు. కుర్చీలో పూర్తి సౌకర్యంగా కూడా కూర్చోలేదు. కుతూహలంగా అనిపించి ఆమెనే గమనిస్తూ కూర్చుంది. చీరచెంగుతో కళ్ళొత్తుకుంటున్న ఆమె ముఖంలోకి పరీక్షగా చూస్తే ఏదో బాధలో ఉన్నట్టనిపించింది. ఓ నిమిషం తటపటాయించి వెళ్ళి ఆవిడ పక్కన కూర్చుని మాట కలిపింది.

"మా బంధువులమ్మాయి ఈ హాస్టల్లోనే చదువుతోంది. ఒక్కరోజు కోసం ఇంటికి తీసుకువెళతామంటే కుదరదంటున్నారు. ఆదివారం తప్ప పిల్లలని కలవనివ్వరట" అంది మేఘ.

అప్పుడే లోపలికి వచ్చిన నీలూ కూడా మేఘ పక్కన కూర్చుంది.

"మా అమ్మాయి అలివేణి ఈ కాలేజీలోనే చదువుతుందమ్మా. అమ్మాయిని చూద్దామని వస్తే క్లాసు మధ్యలో పిలవడం కుదరదని అందాకా ఇక్కడ కూర్చోమన్నారు" చెప్పింది ఆవిడ.

అంత పేదరాల్లా కనిపిస్తున్న ఆవిడ కూతురు లక్షల ఫీజు కట్టి చదివే కాలేజీలో చదువుతుందంటే నీలూ, మేఘ ఆశ్చర్యపోయారు.

"మా అలివేణి పదో తరగతి దాకా మా ఊరు గవర్నమెంటు స్కూల్లోనే చదువుకుంది. మార్కులు బాగా వచ్చాయని ఫీజు లేకుండా కాలేజీలో చేర్చుకున్నారు. సెలవులిచ్చినప్పుడు అమ్మాయే ఇంటికొస్తుంది కానీ నేనెప్పుడూ ఇక్కడికి రాలేదు. ఇదే మొదటిసారి రావడం. నిన్న రాత్రి ఫోనులో ఏడ్చింది. రాత్రంతా నిద్ర పట్టలేదు. ఒక్కసారి అమ్మాయిని చూసి పోదామని మా తమ్ముడిని వెంటపెట్టుకుని వచ్చాను" వివరంగా చెప్పిందావిడ.

“ఇల్లొదిలి హాస్టల్లో ఉండే పిల్లలు అప్పుడప్పుడూ కాస్త డీలా పడటం మామూలే. అంత చక్కగా చదివే అమ్మాయి గురించి మీరేం భయాలు పెట్టుకోనక్కర్లేదు. ధైర్యంగా ఉండండి” అంది మేఘ.

“చిన్నచిన్నవాటికి ఏడ్చే తత్వం కాదు అలివేణిది. వాళ్ళ నాన్న పోయినప్పటి తర్వాత మళ్ళీ నిన్ననే ఏడవడం చూసాను. సరైన ర్యాంకు రాకపోతే డాక్టరు చదువు చదవలేనని భోరున ఏడుస్తుంటే గాభరాగా అనిపించింది” చెప్తుంటే ఆవిడ గొంతు వణికింది.

ఏం మాట్లాడాలో తోచలేదు నీలూ, మేఘలకి.

“అలివేణి వాళ్ళ నాన్న ఆటోడ్రైవరుగా పని చేసేవాడు. ఏడాదిన్నర క్రితం యాక్సిడెంటులో చనిపోయాడు. పదో తరగతిలో మంచి మార్కులు వచ్చాయని ఈ కాలేజీ వాళ్ళు చేర్పించమని అడిగినప్పుడు ఉన్న ఒక్క కూతురినీ ఒంటరిగా ఇంత దూరం పంపటానికి భయపడ్డాను. మనలాంటి పేదవారి ఆరోగ్యం కోసం సహాయపడాలంటే డాక్టరు చదువే చదవాలని, ఇలాంటి పెద్ద కాలేజీలో చదువుకుంటేనే డాక్టరు సీటు తెచ్చుకోవచ్చని అమ్మాయే నాకు నచ్చచెప్పింది. అలాంటి పిల్ల బావురుమనేసరికి తట్టుకోలేకపోయాను” కళ్ళు తుడుచుకుంది ఆవిడ.

నీలూ, మేఘ ఆవిడకి సర్దిచెప్తుండగానే ఆ గదిలోకి ఒక పదహారేళ్ళ అమ్మాయి వచ్చింది. రెండు పొడవాటి జడలతో, కాస్త తక్కువ ఎత్తులో సన్నగా చామనఛాయగా ఉన్న ఆ అమ్మాయి ముఖంలో ఇంతసేపూ ఆవిడ చెప్పిన ధీరత్వం కనిపించి ఆ అమ్మాయే అలివేణి అనిపించింది.

వస్తూనే వాళ్ళ అమ్మని చుట్టేస్తూ “నువ్వెందుకమ్మా కష్టపడి ఇంతదూరం వచ్చావు? మావయ్యతో వచ్చావా? నేను మళ్ళీ వీలు చూసుకుని ఫోను చేసేదాన్నిగా. మొన్న జరిగిన మంత్లీ టెస్టులో మార్కులు బాగా తగ్గేసరికి నాకు సీటు వస్తుందో లేదోనని భయమేసిందమ్మా. ఇప్పటినుంచి ఇంకా ఎక్కువ కష్టపడి చదువుతాను. నువ్వు మాత్రం నా గురించి బెంగపడొద్దు. ఇక్కడ హాస్టల్లో చాలా బాగా చూసుకుంటున్నారు” అంటూ పెద్దరికంగా మాట్లాడుతూ కూతురే తల్లిలా మారి తన కన్నతల్లిని ఊరడిస్తున్న దృశ్యం చూసి నీలూ, మేఘల కళ్ళు చెమర్చాయి.

“అలివేణీ.. నువ్వు చక్కగా చదువుతావని మీ అమ్మగారు చెప్పారు. పరీక్షలన్నాక ఒకోసారి మార్కులు కాస్త అటూ ఇటూ అవ్వడం సహజమే. ఇప్పుడంతా మీకు ప్రాక్టీసు టెస్టులు కదా.. చెయ్యడానికి ఆస్కారం ఉన్న తప్పులన్నీ ఇప్పుడే చేసేస్తే రాబోయే ఎంట్రన్స్ కి మరింత పక్కాగా ప్రిపేర్ అయ్యే అవకాశం ఉంటుంది. అసలు తప్పులే చెయ్యలేదనుకో, ఎక్కడెక్కడ జాగ్రత్త పడాలో మనకి తెలిసిరాదు. గొప్పగా చదువుకోవాలనే తపన ఉండాలే గానీ ఒక్క డాక్టరనే కాదు ఏ రంగంలోనైనా గొప్ప స్థాయికి చేరుకోవచ్చు. నువ్వెప్పుడూ నిరాశ దరి చేరకుండా ఉత్సాహంగా చదువుకోవాలి” ఆ అమ్మాయిని ఉత్తేజపరిచే ప్రయత్నం చేసింది మేఘ.

“మా ఫిజిక్స్ సర్ కూడా తప్పులు చేయడం గురించి ఇదే చెప్పారు. నాకు వేరే ఏమీ వద్దు. నేను ఎలాగైనా డాక్టర్ అయ్యి తీరాల్సిందే!” అంటున్న అలివేణి ముఖంలో ఆమె సంకల్పబలం కనిపించింది.

"ఇప్పుడు ఎలా వస్తున్నాయమ్మా మార్కులు?" అడిగింది నీలూ.

"వన్ ఫిఫ్టీ నుంచి వన్ ఫిఫ్టీ త్రీ, ఫోర్ దాకా వస్తుంటాయండీ. ఈసారి మరీ తక్కువగా వన్ ఫార్టీ సిక్స్ వచ్చాయి" చెప్పింది అలివేణి.

ఆశ్చర్యంతో మేఘ వైపు తిరిగి "ఆ మార్క్స్ వన్ సిక్స్టీకి!" అంది నీలూ.

"నీ పట్టుదల ఇలాగే ఉంటే ఇంకా ఎక్కువ మార్క్స్ కూడా వస్తాయి అలివేణీ.. ఒకవేళ ఎప్పుడన్నా తగ్గినా ఛాలెంజ్ లా తీసుకోవాలే తప్ప డల్ అయిపోకూడదు" నవ్వుతూ చెప్పింది మేఘ.

ఇంతలో ప్రిన్సిపాల్ వచ్చారు రమ్మని బయటనుంచి పిలుపు వచ్చింది. అలివేణికి, వాళ్ళ అమ్మగారికీ చెప్పి ప్రిన్సిపల్ రూంకి వెళ్ళారు నీలూ, మేఘ.

పది నిమిషాలు బతిమాలాక "ఇంకోసారి ఇలా పంపించడం కుదరదు. ఈ ఒక్కసారికీ తీసుకెళ్ళండి. చెప్పిన టైముకి రాకపోతే ఫైన్ కట్టాల్సి ఉంటుంది" అని చెప్పి పర్మిషన్ ఇచ్చాడు ప్రిన్సిపాల్.

'ఇదే మహాప్రసాదం' అనుకుంటూ బయటికొచ్చి ఊపిరి పీల్చుకున్నారు. అటెండర్ వెళ్ళి పిలవగానే ఉరుకులు పరుగుల మీద వచ్చింది విజిత.

నీలూ దగ్గరిగా వచ్చి గుసగుసగా "మా ప్రిన్సీ పర్మిషన్ ఇచ్చాడా అత్తా?" అని అడిగింది.

నీలూ నవ్వుతూ తల మీద ఒక్కటేసి "వెళ్ళి నీ బ్యాగ్ తెచ్చుకో. ఇదిగో పర్మిషన్ లెటర్" అంటూ చేతిలో ఉన్న కాగితం చూపించింది.

వెలిగిపోతున్న మొహంతో "మొన్న ఫోన్ చేసినప్పుడు అమ్మ చెప్పిందిలే నువ్వొస్తావని. నా బ్యాగ్ రెడీగా ఉంది. నిమిషంలో వచ్చేస్తా ఉండు" అంటూ హాస్టల్లోకి తుర్రుమంది విజిత.

అశోక్ కి ఫోన్ చేసి బయటికి వచ్చేస్తున్నామని చెప్పింది నీలూ.

అప్పుడే హాస్టల్లో బ్రేక్ టైం కూడా అవ్వడంతో అమ్మాయిలంతా కోలాహలంగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

అన్నట్టుగానే నిమిషంలో తిరిగొచ్చిన విజిత పక్కన ఇద్దరు అమ్మాయిలని వెంటబెట్టుకొచ్చి "అత్తా.. జస్ట్ ఫైవ్ మినిట్స్ పనుంది. విజిటర్స్ రూంలోకి వెళదాం" అని అడిగింది.

లోపలకి వెళ్ళాక ఆ ఇద్దరమ్మాయిలని చూపిస్తూ "వీళ్ళు నా ఫ్రెండ్స్ రుచిత, శరణ్య. ఒక్కసారి నీ ఫోన్ ఇస్తే వాళ్ళ పేరెంట్స్ తో మాట్లాడి ఇచ్చేస్తారు. జస్ట్ టూ మినిట్స్. వీళ్ళు మిస్డ్ కాల్ ఇస్తే చాలు. వాళ్ళే కాల్ బ్యాక్ చేస్తారు" అని చెప్పి నీలూ దగ్గర ఫోన్ తీసుకుని వాళ్ళకిచ్చింది.

ఆ అమ్మాయిలు "థాంక్స్ ఆంటీ.. థాంక్యూ" అని మహా సంబరంగా ఫోన్ తీసుకుని పక్కకి వెళ్ళిపోయారు.

"ఇంతకీ ఈ కొత్త ఆంటీ ఎవరు?" మేఘని చూస్తూ అడిగింది విజిత.

"తను నా చిన్నప్పటి ఫ్రెండ్ మేఘ. అమెరికా నుంచి వచ్చింది" పరిచయం చేసింది నీలూ.

"మీరెక్కడుంటారు యూఎస్ లో?" మేఘని అడిగింది విజిత.

"న్యూయార్క్ లో" చెప్పింది మేఘ.

"నా ఫ్రెండ్ ఆకృతి వాళ్ళ పేరెంట్స్ న్యూజెర్సీలో ఉంటారు. మాకు సెలవులిచ్చినప్పుడు వస్తుంటారు" అంది విజిత.

నీలూ ఫోన్ పట్టుకెళ్ళిన వాళ్ళలో ఒకమ్మాయి వచ్చి పిలిస్తే విజిత వెళ్ళింది.

అలివేణి, వాళ్ళమ్మ ఇద్దరూ విజిటర్స్ రూంలోంచి బయటికెళుతూ కనిపిస్తే ఇప్పుడే వస్తానని నీలూతో చెప్పి అటువైపు నడిచింది మేఘ.

అలివేణి వాళ్ళమ్మకి ఏదో చెబుతూ ఇంటికి సాగనంపుతుంటే దూరం నుంచీ చూస్తూ నించుంది.

ఆ అమ్మాయి వెనక్కి హాస్టల్లోకి వెళ్ళబోతుంటే పిలిచి "నువ్వెప్పుడూ నీ వ్యక్తిత్వాన్ని మార్చుకోకు. నీ మనోధైర్యంతో నువ్వు అనుకున్నదేదైనా తప్పకుండా సాధించగలవు. మళ్ళీ ఎప్పుడో అప్పుడు డాక్టర్ అలివేణిగా నిన్ను తప్పకుండా కలుస్తాను. విష్ యూ ఆల్ సక్సెస్!" భుజం తట్టి చెప్పింది మేఘ.

"చాలా థాంక్సండీ మా అమ్మకి కూడా ధైర్యం చెప్పినందుకు. థాంక్యూ సో మచ్!" నిండుగా నవ్వి అక్కడినుంచి వెళ్ళిపోయింది అలివేణి.

నీలూ దగ్గరికొచ్చి "ఆ అమ్మాయిని మర్చిపోగలమా మనం.. ఇంత చిన్న వయసుకి ఎంత పరిణతి సంపాదించిందో.. జనరేషన్ గ్యాప్ అంటే ఇదేనేమో! మనం ఈ వయసుకి జీవితమంటే కనీస అవగాహన కూడా లేకుండా మట్టిబుర్రల్లా ఉన్నాం. అయాం రియల్లీ ఇంప్రెస్డ్ విత్ హర్!" మెచ్చుకోలుగా అంది మేఘ.

నీలూ ఏదో చెప్పబోయేంతలో విజిత పరిగెత్తుకుంటూ వచ్చేసి "పదండి పదండి.. త్వరగా మా జైలునుంచి బయటపడదాం" అంటూ తొందరపెట్టింది.

అందరూ బయటికొచ్చి కారు ఎక్కగానే పూజ "విజితక్కా.. నీకోసం ఇదిగో ఫైవ్ స్టార్" అంటూ విజిత పక్కన చేరింది.

"మళ్ళీ దానికి చాక్లెట్స్ కొనిచ్చావా అశోక్? పూజకేమో కానీ ముందు నీకు భయం చెప్పాలి" చిరుకోపంగా అంది నీలూ.

"ఈ మధ్య అస్సలు కొనివ్వందే.. ఈ వారంలో ఇదే ఫస్ట్ వదినా.." అశోక్ మాటలకి నీలూతో సహా అందరూ నవ్వారు.

"ఎలా చదువుతున్నావు విజ్జీ.. మార్కులు బాగా వస్తున్నాయా, మంచి ర్యాంక్ వస్తుందా?" విజితని అడిగింది నీలూ.

"ఏదో అలా అలా వస్తున్నాయత్తా.. ర్యాంక్ గురించి ఇప్పటినుంచే టెన్షన్ ఎందుకూ.. ఇంకా టైముందిగా" తేలిగ్గా అంది విజిత.

"హాస్టల్లో భోజనం బాగుంటోందా?"

"అదే గడ్డి కంటిన్యూ చేస్తున్నారు. మార్పేమీ లేదు. మండే ఇడ్లీ, ట్యూస్డే దోసె, అదే సేమ్ ఓల్డ్ టైం టేబుల్.."

"మీ హాస్టల్లో అలివేణి అనే అమ్మాయి తెలుసా నీకు?" అడిగింది నీలూ.

"మా సెక్షన్లో అయితే లేరు. ఎందుకు?"

"నీకోసం ఎదురు చూస్తున్నప్పుడు పరిచయం అయిందిలే. ఆ అమ్మాయికి ఎంసెట్ మోడల్ టెస్టుల్లో వన్ ఫిఫ్టీ పైన వస్తాయట మార్క్సు తెలుసా.."

"ఓహో.. ఆ అలివేణా! మా కాంపస్ టాపర్స్ లిస్టులో ఉంటుందిలే ఆ అమ్మాయి. నోటీస్ బోర్డులో చూస్తుంటాం. క్రీమ్ సెక్షన్ స్టూడెంట్. మార్కులైతే బానే వస్తాయి కానీ ఆ అమ్మాయి కొంచెం తేడా!"

"తేడా అంటే?"

"అంటే ఏముందీ? ఎవరితోనూ ఎక్కువ మాట్లాడదు. అసలా మొహంలో నవ్వే కనపడదు. ఎవరో పనిష్మెంట్ ఇచ్చినట్టు ఎప్పుడూ మొహం సీరియస్ గా పెట్టుకుని కనిపిస్తుంది. నాకు తెలిసి ఆ అమ్మాయికి ఒక్క ఫ్రెండ్ కూడా ఉండి ఉండరు. ఎంతసేపూ పుస్తకాల పురుగులా చదువే చదువు. బాబోయ్.. అలా రోబోట్ లా ఉంటే తేడా అనక ఇంకేమంటారు? ఆ అమ్మాయి మీతో మాట్లాడిందంటే నమ్మలేని వింతే!" చెప్తూ నవ్వింది విజిత.

కాసేపటికి కారు ఇంటికి చేరింది. పూజ, విజిత కారు దిగుతూనే అరుపులు, కేరింతలతో పరుగు తీసారు.

కారు పార్క్ చేసి ఉదయం ఆరున్నరకల్లా వస్తానని చెప్పి ఇంటికి వెళ్ళాడు అశోక్.

మేఘ, నీలూ నిదానంగా మాట్లాడుకుంటూ మెట్లు ఎక్కుతున్నారు.

"ఇందాకేదో అన్నావే జనరేషన్ గ్యాప్ అనీ.. అప్పుడైనా ఇప్పుడైనా ఈ వయసుకే అన్నీటినీ అర్థం చేసుకోగలిగే పరిణతి, దేన్నైనా సాధించాలనే పట్టుదల కలిగినవాళ్ళు ఉన్నారు. పిరికితనంతో భయపడి పారిపోయేవాళ్ళు, చావుని ఆహ్వానించేవాళ్ళు ఉన్నారు. జీవితం బరువు అనుభవంలోకి రానివాళ్ళు, రావలసిన అవసరం కూడా లేనివాళ్ళు, అన్నీటినీ తేలిగ్గా తీసుకునేవాళ్ళు కూడా ఉన్నారు. ఇప్పుడే చూశావుగా ఈ తరంలో కనిపించిన రెండు విభిన్నధృవాలని. అయినా అప్పుడు మాత్రం మనం రకరకాల వ్యక్తిత్వాలు చూడలేదూ? నీ పట్టుదల మాత్రం ఏం తక్కువ? ఒక్కసారి మాట పడాల్సి వచ్చినందుకు అంత ఆత్మీయ స్నేహితులని కూడా క్షణంలో దూరంగా విసిరి కొట్టలేదూ.. అదీ బలమైన వ్యక్తిత్వమేగా?" అంది నీలూ.

ఆ చివరి మాట వినగానే ఒక్క క్షణం అడుగు తడబడింది మేఘకి.

"హ్మ్.. అప్పటి నా ప్రవర్తన పట్టుదలలో మొండితనమో, ఆత్మాభిమానమో అహంకారమో.. దేన్ని సూచిస్తుందో ఇప్పటికీ స్పష్టంగా తెలీదు నాకు" నీలూ ముఖంలోకి చూస్తూ చెప్పింది మేఘ.

# 11

ముందు రోజు చెప్పినట్టుగానే తెల్లారి ఉదయం ఆరున్నరకల్లా వచ్చేసాడు అశోక్. నానమ్మ ఇంటికి ప్రయాణం కట్టే ఉత్సాహంలో పూజ అంత ఉదయాన్నే పేచీల్లేకుండా నిద్రలేచింది.

ఏడింటికల్లా విజిత, పూజలని తీసుకుని శరత్ ఊరికి బయలుదేరాడు. నీలూ, మేఘ దగ్గరుండి అందర్నీ సాగనంపారు.

"ఒక్క రోజైనా సరే పూజ నువ్వు లేకుండా ఉండగలదా, ముఖ్యంగా రాత్రిపూట?" నవ్వుతూ టాటా చెప్తున్న పూజని చూస్తూ నీలూని అడిగింది మేఘ.

"ఉండకేం, ఒక్క రోజు కాదు వారం రోజులైనా బ్రహ్మాండంగా ఉంటుంది వాళ్ళ నానమ్మ దగ్గర. అసలు పూజ అని ఎందుకు పేరు పెట్టామనుకున్నావు? మా అత్తగారి పేరు పుష్ప. అది పాత పేరని అదే అక్షరంతో కొంచెం మార్చి పూజ అని పెట్టాం. పేరుకి పూజే కానీ జూనియర్ పుష్ప అనొచ్చు. అంత చేరిక దానికి వాళ్ళ నానమ్మ దగ్గర. ఇక్కడి కంటే అక్కడే సరదా. పెద్ద ఇల్లూ వాకిలి, తాతా నానమ్మల గారం ఇవన్నీ ఉంటే నేనసలు గుర్తు కూడా రాను" నవ్వుతూ బదులిచ్చింది నీలూ.

ఇద్దరూ కలిసి టిఫిన్ చేస్తుండగా "మన కాలేజీ క్యాంపస్ చూడాలనుంది అన్నావుగా. పదింటికి బయలుదేరి వెళదామా?" గుర్తు చేసింది నీలూ.

ఓ నిముషం ఆలోచించి "రేపు వెళదాంలే. బద్ధకంగా ఉందివాళ. హాయిగా ఇల్లు కదలకుండా చేసే పనులుంటే చెప్పు" అంది మేఘ.

"అలా అంటే ఎలా? రెండు రోజులే టైముంది మనకి."

"అలా డెడ్ లైన్ గుర్తు చేసి కంగారుపెట్టకుండా ఎంచక్కా కమ్మటి కబుర్లు చెప్పు. విని పెడతా. కబుర్లంటే గుర్తొచ్చింది. రేవతికి కాల్ చేద్దామన్నావుగా."

"భలే గుర్తు చేసావు. ఫోన్ బుక్లో రాసి పెట్టా రేవతి నంబరు. వెతికి తెస్తానుండు" లేచి లోపలికి వెళ్ళింది నీలూ.

"ఈ రోజుల్లో కూడా ఇంకా బుక్లో ఫోన్ నంబర్స్ రాస్తున్నావా. నువ్వు సూపర్ నీలమ్మా" పెద్దగా నవ్వింది మేఘ.

"సూపర్ లేదూ ఏం లేదూ.. ఫోన్ని నమ్ముకుంటే కష్టం. ఒకసారి నా ఫోన్ పోయి దాంతో పాటు నంబర్లు కూడా పోయాయి. అందుకని మళ్ళీ పుస్తకాన్ని నమ్ముకోడం మొదలుపెట్టా" ఫోన్ బుక్ తీసుకొస్తూ చెప్పింది నీలూ.

రేవతి నంబరుకి డయల్ చేస్తే ఫోన్ ఆన్సర్ చెయ్యలేదు. ఒక పది నిమిషాలు ఆగి మళ్ళీ చేసినా ఫోన్ ఎత్తలేదు.

“ఎర్లీ మార్నింగ్ ఎయిట్ థర్టీకే నిద్రలేచే అలవాటు లేదేమో పాపం. కాలేజీలో ఉన్నప్పుడు అంటూ ఉండేదిగా 'ఈ చదువుల బారినుంచి బయటపడ్డాక రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా తిండి, నిద్ర, షికారు అదే పనిగా చేసెయ్యాలని. అప్పటి కలల్ని నిజం చేసుకోవడం కోసం ఇప్పుడు నిద్రపోతుందేమో” పరిహాసంగా నవ్వింది మేఘ.

“అంతేనంటావా, అయితే మనం నిద్ర లేపుదాం” అని చెప్పి మళ్ళీ మళ్ళీ రీడయల్ చేసింది నీలూ.

నాలుగు సార్లు ప్రయత్నించాక అవతల ఫోన్ ఎత్తి “హలో.. ఎవరు మాట్లాడేది?” కాస్త కటువుగా వినిపించింది ఒక ఆడగొంతు.

“హలో. ఇది రేవతి నంబరేనాండీ?” సందేహంగా అడిగింది నీలూ.

“అవును. రేవతినే మాట్లాడుతున్నాను. మీరెవరో చెప్పండి” రేవతి గొంతులో కొంచెం విసుగు ధ్వనించింది.

“హే రేవతీ.. నేను నీలూ, సునీలని. నీ ఇంటర్ మీడియెట్ హాస్టల్ రూమ్మేట్. మేఘ కూడా ఉంది ఇక్కడే. అప్పుడు విజయవాడలో కలిసినప్పుడు నువ్వు నంబర్ ఇచ్చావుగా.”

నీలూ మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ “ఓహ్ నువ్వా నీలూ.. నేను తర్వాత కాల్ బ్యాక్ చేస్తాను” అంది రేవతి.

“ఓకే. అలాగే” నీలూ అంటూండగానే ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

అయోమయంగా ఉన్న నీలూ మొహం చూస్తూ “ఏంటీ బిజీగా ఉందా?” అడిగింది మేఘ.

“ఏమో! మనం కాల్ చేసామని కొంచెం కూడా థ్రిల్ అవలేదు. ఆ రోజు బజార్లో కనిపించినప్పుడు చాలా బాగా మాట్లాడిందే” సంశయంగా కళ్ళెగరేసింది నీలూ.

“ఇప్పుడు మాట్లాడనని పెట్టేసిందా?” ఆశ్చర్యంగా అడిగింది మేఘ.

“తర్వాత తనే కాల్ చేస్తానంది. ఇదివరకొకసారి కాల్ చేస్తే ఫోన్ అసలు ఆన్సర్ చెయ్యలేదని చెప్పానుగా. మనతో మాట్లాడటం ఇష్టం లేదేమో” సందేహంగా అంది నీలూ.

“ఏదో పనిలో బిజీగా ఉండుంటుంది. చాలాసేపటికిగానీ ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదుగా. తనే మళ్ళీ చేస్తుందిలే” తేలిగ్గా అంది మేఘ.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్లు “రజని, రేవతిల స్నేహం కొనసాగుతోందా?” నీలూని అడిగింది మేఘ.

“నువ్వూ, నేనూ తప్ప మిగతా ఎవరికీ ఎవరితో కాంటాక్ట్స్ లేవు. రేవతి కలిసినప్పుడు రజని గురించి నన్నడిగింది. పెళ్ళి చేసుకుని సింగపూర్ వెళ్ళిపోయాక కాంటాక్ట్ లో లేదని చెప్పాను. మాకు బంధువులవడమేమో కానీ చాలా రోజులు భరించాల్సి వచ్చింది దాని హింస” నిట్టూర్చింది నీలూ.

“రజనితో ఏంటి సమస్య?” అడిగింది మేఘ.

“నీకు తెలుసుగా.. అప్పటి గొడవల తర్వాత అన్నయ్య కాదన్నాడని నా మీద కూడా కక్షగట్టి మాట్లాడడం మానేసింది. నువ్వు హాయిగా ఇంజనీరింగ్ కోసం అందరికీ దూరంగా వెళ్ళిపోయావు కానీ నా ఖర్మ కొద్దీ నేను చేరిన డిగ్రీ కాలేజీలోనే రజని కూడా చేరింది.

అప్పట్లో ఉత్తరాల్లో చెప్పేదాన్నిగా నీకు ఒకే హాస్టల్లో ఉన్నా తనకీ నాకూ మాటల్లేవని. నేనెంత దూరంగా ఉన్నా దానితో తిప్పలు తప్పేవి కావు. రజని ప్రస్తావన తెస్తే నీకు నచ్చదని అప్పట్లో నీతో ఏమీ చెప్పేదాన్ని కాదు."

"ఇప్పుడేం కోపం రాదులే చెప్పు" నీలూ చెయ్యి అందుకుని నవ్వింది మేఘ.

"నా రూమ్మేట్స్ ఇద్దరమ్మాయిలు, రజని ఒకే గ్రూప్ అవడంచేత బాగా స్నేహంగా ఉండేవారు. రజనికి ఒకతనితో ప్రేమ వ్యవహారం ఉండేది. నా రూమ్మేట్స్ మాటల్లో ఇవన్నీ తెలిసేవి. అతను వేరే ఊరినుంచీ కేవలం రజని కోసమే అప్పుడప్పుడూ వచ్చేవాడు. అతను వచ్చిన రోజున అందరితోపాటు కాలేజీకి బయలుదేరి మధ్యలో అతనితో బయటికి వెళ్ళిపోయేది. కాలేజీలో, హాస్టల్లో సమస్య రాకుండా, బయటపడకుండా రజని ఫ్రెండ్స్ మేనేజ్ చేసేవారు. ఇంటి దగ్గరనుంచీ వాళ్ళ అమ్మ వచ్చినప్పుడల్లా అతను ఇచ్చిన గిఫ్ట్స్, గ్రీటింగ్స్ లాంటివన్నీ ఒక పెట్టెలో తీసుకొచ్చి మా రూంలో దాచమని ఇచ్చేది. నాకు కాదులే, చెప్పానుగా నా రూమ్మేట్స్ తన ఫ్రెండ్స్ అని. బియస్సీ సెకండ్ ఇయర్లో మొదలైన వాళ్ళ ప్రేమ రజని ఎమ్మెస్సీ చివరిదాకా నడిచిందని తెలిసింది."

"అయితే రజని అతన్ని పెళ్ళి చేసుకుని సింగపూర్ వెళ్ళిందా?" ఆసక్తిగా అడిగింది మేఘ.

"హ్మ్.. సర్లే అలా జరిగుంటే అది రజని ఎందుకవుతుంది. ఆ ప్రేమించినోడు డిగ్రీ చదివి సొంతంగా ఏదో బిజినెస్ చేసుకునేవాడు అప్పట్లో. అందుకే ధారాళంగా డబ్బు ఖర్చుపెట్టి దీన్ని సినిమాలకి, షికార్లకి తెగ తిప్పేవాడు. ఎమ్మెస్సీ అయిపోయాక సైలెంటుగా వాళ్ళింట్లో వాళ్ళు తెచ్చిన సింగపూర్ సంబంధం చేసుకుని విమానం ఎక్కి తుర్రుమంది."

"వేరే అతన్ని పెళ్ళి చేసుకుందా? మరి ఆ ప్రేమించినతనో?" ఆశ్చర్యంగా అడిగింది మేఘ.

"ఏముందీ నెత్తిన గుడ్డ వేసుకున్నాడు. ఏదో ఇద్దరూ మాటా మాటా అనుకుని నీ దారి నీది నా దారి నాది అనుకుంటే అదొక తరహాగా ఉంటుంది. ఇక్కడలా జరగలేదు. రజని పెళ్ళి విషయం అతనికి తెలియలేదు. అతనికే కాదు, అప్పటి తన ఫ్రెండ్స్ ఎవరికీ చెప్పలేదు. బియస్సీ అయిపోతూనే నాకు పెళ్ళయిపోయిందిగా. అందుకని ఫ్రెండ్స్ ఎవరితోనూ నాకు పెద్ద కాంటాక్ట్స్ లేవు. రెండేళ్ళ తర్వాత అప్పటి నా రూమ్మేట్ ఒకమ్మాయి చాలా కష్టపడి నా నంబరు సంపాదించి నాకు ఫోన్ చేసింది. రజని గురించి వాకబు చేయడానికే నన్ను వెతుక్కుంటూ వచ్చిందని తెలిసింది. రజనిని ప్రేమించినతను రెండు నెలలుగా రజని నుంచి ఏ సమాచారమూ లేదని ఆందోళన పడుతూ వీళ్ళందరినీ సంప్రదించాడట. రజనికీ, నాకూ బంధుత్వం ఉందని తెలిసిన నా ఫ్రెండ్ నన్ను వెతికి పట్టుకుంది. అప్పటికే రజని పెళ్ళైపోయి దాదాపు నెల రోజులైపోయింది. నేనా విషయమే చెప్తే ఆ పిల్ల ఫోన్లో దాదాపు ఏడ్చినంత పని చేసింది రజని చేసిన పనికి. ఇంక ఆ తర్వాత ఏం జరిగిందో, అతను ఏమయ్యాడో నాకు తెలీదు. అదీ రజని చేసిన ఘనకార్యం!" నిట్టూర్చింది నీలూ.

"వినటానికే దారుణంగా ఉంది బాబోయ్" తల విదిలించింది మేఘ.

"అసలు మిగతావాళ్ళందరికే తిప్పలు గానీ రజనిలా ఎప్పటికప్పుడు తమ స్వార్థం మాత్రమే చూసుకునేవాళ్ళే సుఖంగా ఉంటారేమో అనిపిస్తుంటుంది నాకు" ఆలోచిస్తూ అంది నీలూ.

ఇంతలో శరత్ నుంచి నీలూకి ఫోన్ వచ్చింది. అరనిముషం మాట్లాడి పెట్టేసింది.

“అప్పుడే చేరిపోయారటనా?” నీలూని అడిగింది మేఘ.

“ఊ.. మరీ అంత దూరమేం కాదు. కారులో రెండున్నర గంటల్లో వెళ్ళిపోవచ్చు.”

“అశోక్ వాళ్ళది కూడా అదే ఊరు అన్నావుగా. మరి అతను ఫ్యామిలీని తీసుకెళ్ళలేదేంటి?”

“హ్మ్.. అదొక పెద్ద కథ!” నిట్టూర్చింది నీలూ.

“ఏంటా కథ?” ఆసక్తిగా అడిగింది మేఘ.

“అశోక్, శరత్ చిన్నప్పటినుంచీ స్నేహంగా ఉండేవారని చెప్పానుగా. అశోక్ వాళ్ళ నాన్న అతని చిన్నప్పుడే పోయారు. వాళ్ళకి ఆస్తిపాస్తులేమీ లేవు. తనకి చేతనైన చిన్నాచితకా పనులన్నీ చేస్తూ అశోక్ కి ఏ కష్టమూ తెలియకుండా గారాబంగా పెంచింది వాళ్ళమ్మ. బాగా చదువుకుని వృద్ధిలోకి వస్తాడని ఆశలు పెట్టుకుంది గానీ అశోక్కి చదువు అబ్బలేదు. పదోతరగతి తప్పాక బడికెళ్ళే పని కూడా లేకపోయేసరికి ఇంకా బలాదూర్ గా తిరగడం మొదలుపెట్టాడు. ఏదో ఒక పని నేర్పిస్తే బ్రతుకు తెరువు ఉంటుందని మెకానిక్ పనుల్లాంటివి నేర్పించే ప్రయత్నం చేసినా అవేవీ ముడిపడలేదు. ఆవిడకి ఏదో జబ్బు చేసి కొన్నాళ్ళకి చనిపోయింది.”

“అయ్యో పాపం అయితే అశోక్ కి కుటుంబం లేదా? సొంత ఊర్లో బంధువులైనా ఉండుంటారుగా?” అంది మేఘ.

“అశోక్ తండ్రి చనిపోయాక చుట్టాలెవరూ వీళ్ళని ఆదరించలేదు. అందుకని మొదటినుంచీ పెద్ద బంధుత్వాలేమీ లేవు. అశోక్ భార్య వసంతది కూడా ఆ ఊరే.”

“అయితే వసంత ఫ్యామిలీ అక్కడే ఉంటారుగా. సొంత ఊరు అయినా తను వెళ్ళలేదేంటి?” ఆశ్చర్యంగా అడిగింది మేఘ.

“అదే అసలు కథ. వసంత వాళ్ళ నాన్నగారు ఆ ఊరి ధనవంతుల్లో, పెద్దమనుషుల్లో ముందువరసలో ఉంటారు. ఎన్నో ఎకరాలు పొలమున్న పెద్ద మోతుబరి రైతు. వసంత తాతయ్య, నాయనమ్మ, బాబాయిలు, పిన్నులు అంతా కలిసి ఉమ్మడి కుటుంబం. వసంతకి ఒక అన్నయ్య ఉన్నా కూతురంటే అమితమైన ప్రేమ తండ్రికి. అమ్మాయి ఇంటర్ అయిపోయాక గొప్ప సంబంధం వచ్చిందని పెళ్ళి కుదిర్చారు. వయసు చిన్నదే అయినా పెళ్ళయ్యాక చదువుకోవచ్చని ఇంటర్ పరీక్షలయిన వేసవికాలంలోనే ముహూర్తాలు పెట్టుకున్నారు. అప్పుడు వసంత అశోక్ ని కలుసుకుని పెళ్ళి చేసుకోమని అడిగిందట.”

“అంటే అశోక్కి, వసంతకి అప్పటికే లవ్ స్టోరీ ఉందా?” అడిగింది మేఘ.

“అదే మొదటిసారట వాళ్ళిద్దరూ ఏకాంతంగా మాట్లాడుకోవడం” చెప్పి నవ్వింది నీలూ.

“వాట్?? ఏమాత్రం పరిచయం లేకుండా పెళ్ళి చేసుకోమని అడిగిందా?” వింతగా అడిగింది మేఘ.

“పరిచయం అంటే పల్లెటూర్లో ఎవరు ఏంటని తెలీకుండా ఉండదు. వాళ్ళిద్దరికీ కూడా అందరిలో మాట్లాడుకున్న మామూలు పరిచయం ఉంది కానీ ప్రత్యేకమైన స్నేహమేమీ లేదు. అంత పెద్దింటి అమ్మాయి కోరి వచ్చి పెళ్ళి చేసుకోమంటే కలో నిజమో అర్థం

కాలేదు అశోక్కి. అసలే మన హీరోకి చదువూసంధ్య, ఆస్తీపాస్తీ ఏమీ లేవాయే. అమ్మాయి నాన్న తలచుకుంటే అతని స్థాయికి అశోక్ ని ఏమైనా చెయ్యగలడు. అందుకని దూరం ఆలోచించి భయపడి ఇది కుదిరే పని కాదని అమ్మాయికి సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు కానీ అమ్మాయి ససేమిరా అంది. అశోక్ కాదంటే అసలు పెళ్ళే చేసుకోకుండా చచ్చిపోతానంది. ఇంకేముంది, ఒకానొక శుభముహూర్తంలో ఇద్దరూ పారిపోయి గుడిలో పెళ్ళి చేసుకున్నారు. పెళ్లి చేసుకున్నాక వచ్చి ఎవర్ని కలిసారో తెలుసా?" కళ్లెగరేస్తూ అడిగింది నీలూ.

"ఎవర్నీ.. మిమ్మల్నేనా?" అంది మేఘ.

"నన్ను కాదులే. శరత్ ని కలిసారు. ఒక వారం రోజులు మా ఇంట్లో ఉన్నాక వేరే ఇల్లు తీసుకుని వెళ్ళిపోయారు. అప్పుడు శ్రద్ధగా డ్రైవింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టి డ్రైవరు ఉద్యోగం సంపాదించాడు. శరత్ బిజినెస్ కి సంబంధించిన పనులు కూడా కొన్ని చేస్తుంటాడు. శరత్, అశోక్ ఆర్థిక స్థాయిలతో సంబంధం లేకుండా అన్నాదమ్ముల్లా స్నేహంగా ఉంటారు."

"అశోక్ సంగతి సరే వసంత అలా ఇంట్లోంచి చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుంటే వాళ్ళింట్లో ఏమీ అనకుండా ఊరుకున్నారా?" సందేహంగా అడిగింది మేఘ.

"అశోక్, వసంతలు పెళ్ళి చేసుకుని వచ్చినప్పుడు శరత్ చాలా భయపడ్డారు. పెద్ద గొడవలు అవుతాయి అనుకున్నారు. కానీ విచిత్రంగా అలాంటిదేమీ జరగలేదు. కూతురు కనపడలేదని కంగారుగా వెతికే ప్రయత్నం చేసారు. వసంత ఇలా అశోక్ ని పెళ్ళి చేసుకుందన్న వార్త తెలిశాక అంతా నిశబ్దమైపోయారు. చాలామంది తల్లిదండ్రుల్లాగే వాళ్ళు కూడా కుటుంబసభ్యుల్లోంచి కూతురి పేరు రద్దు చేసారు. అలా ఆ ఊరికీ, వీళ్ళకీ బంధం తెగిపోయింది" నిట్టూర్చింది నీలూ.

"ఇదంతా జరిగి ఎన్నేళ్ళయింది? వాళ్ళకి ఒక బాబు అన్నావుగా. ఒక్కసారి కూడా ఎవరూ సంధి ప్రయత్నాలు చెయ్యలేదా?" ఆసక్తిగా అడిగింది మేఘ.

"వాళ్ళు పెళ్ళి చేసుకుని ఏడేళ్ళయింది. అప్పటికీ ఇప్పటికీ వసంత కుటుంబం నుంచి ఎటువంటి స్పందనా లేదు. వాళ్ళ కొడుకు శశికి రెండున్నరేళ్ళు. శశికి ఏడాది వయసున్నప్పుడు అశోక్ బలవంతం మీద ముగ్గురూ కలిసి వసంత వాళ్ళింటికి వెళ్ళారు. గుమ్మంలో వీళ్ళని చూసినా ఎవ్వరూ కనీసం పలకరించకుండా పక్కకి వెళ్ళిపోయారట. కాసేపుంటే మాట్లాడకపోతారా అని ఒక గంటసేపు అక్కడే ఎదురుచూసారు వీళ్ళు. కనీసం చంటిపిల్లాడి అరుపులు వినైనా ఒక్కరూ దగ్గరికి రాలేదట. ఇంకేం చేస్తారు, వెనక్కి వచ్చేసారు. మళ్ళీ ఇంకెప్పుడూ వాళ్ళని కలిసే ప్రయత్నం చెయ్యలేదు" చెప్పడం ముగించింది నీలూ.

"హ్మ్.. చాదస్తం బాగా ఎక్కువన్నమాట వాళ్ళకి" అంది మేఘ.

"వాళ్ళ బాధలో కూడా న్యాయం లేదంటావా? ఎన్నో ప్రేమపెళ్ళిళ్ళు గురించి విన్నాను కానీ నాకీ పెళ్ళి ఎంత విచిత్రంగా అనిపిస్తుందో! వసంత అశోక్ ని ఎందుకు పెళ్ళి చేసుకోవాలనుకుందో, ఎక్కువ పరిచయం కూడా లేని మనిషిని అంతిదిగా ప్రేమించేసి కుటుంబాన్ని వదులుకుని మరీ వచ్చేసేంత గొప్పతనం అశోక్ లో ఏం చూసిందో, అలాంటి నిర్ణయం ఎందుకు తీసుకుందో అర్థమే కాదు.

మొదట్లో ఇలా పెళ్ళి చేసుకుని వచ్చినప్పుడు చిన్నవయసు కాబట్టి అజ్ఞానం కొద్దీ తొందరపాటుగా ఈ పని చేసింది కానీ అంత గారాబంగా పెరిగిన అమ్మాయి సాదాసీదా జీవితం ఎలా గడపగలదో, అసలు వీళ్ళ భవిష్యత్తు ఏమిటోనని భయంగా ఉండేది నాకు. కానీ నెమ్మదిగా వసంత తత్త్వం, వ్యక్తిత్వం అర్థమయ్యేకొద్దీ భయం పోయి ఆశ్చర్యం పెరుగుతూ వచ్చింది."

"ఆశ్చర్యం ఎందుకు? అయినా ప్రేమకథల్లో రీజన్స్ కోసం వెతక్కూడదు నీలూ. లవ్ ఈజ్ బ్లైండ్, దట్సాల్!" తేలిగ్గా నవ్వింది మేఘ.

"ఎంత ప్రేమ గుడ్డిదనుకున్నా ఏమో వసంత మాత్రం మిస్టరీనే నాకు" అంది నీలూ.

"ఎందుకో చెప్పు. ఆ మిస్టరీ ఏదో తేల్చేద్దాం" డిటెక్టివ్ లా ఫోజు పెట్టింది మేఘ.

"అలాగే కనిపెట్టు. రేపు రాత్రి మనింటికి డిన్నర్ కి పిలిచానుగా" నవ్వింది నీలూ.

"సరే ముందు కేసు వివరాలన్నీ చెప్పు. ఏం కనుక్కోవాలో తెలుస్తుంది" అంది మేఘ.

"పదిహేడేళ్ళ వసంత అశోక్ ని పెళ్ళి చేసుకుని వచ్చాక అతనిలో చాలా మార్పు తీసుకొచ్చింది. అప్పటివరకూ ఎక్కడా కుదురు లేనివాడల్లా బాధ్యాతాయుతంగా మెలగడం నేర్చుకున్నాడు. ఇప్పుడు డ్రైవింగ్ ఒక్కటే కాకుండా రకరకాల కొత్త విషయాలు నేర్చుకుని ఆర్థికంగా ఎదగడానికి సాయశక్తులా ప్రయత్నిస్తుంటాడు. ఒక చిన్న గదిలో కాపురం మొదలుపెట్టాక వసంత డిగ్రీ కాలేజీలో చేరి బియస్సీ పూర్తి చేసి, ఎమ్మెస్సీ సీటు తెచ్చుకుని ఓపక్క అది చదువుతూ ఇంకోపక్క శశి పుట్టడం, ఒంటిచేత్తో వాడి పెంపకం అన్నీ సమర్థించుకుంటూనే మంచి మార్కులతో కంప్యూటర్ సైన్స్ లో ఎమ్మెస్సీ పట్టా తెచ్చుకుంది. అప్పటినుంచీ లెక్చరర్ ఉద్యోగం కూడా చేస్తోంది. అసలా పిల్లని చూస్తే ఎంత ముచ్చటేస్తుందో! ఆ అమ్మాయి మొహంలో ఒక్కసారి కూడా అపరాధభావం కానీ, కష్టపడుతోందన్న ఫీలింగ్ కానీ కనపడదు. అంత గొప్పింట్లో పెరిగిన పిల్ల ఒక డ్రైవరు భార్యగా ఏమాత్రం నామోషీ అనుకోదు. ఇంటినీ, భర్తనీ, పిల్లాడినీ ఎంత ప్రేమగా చూసుకుంటుందో! అశోక్కి వసంతంటే అపురూపం, గౌరవం కూడా. అన్నీ వదిలేసి తనకోసం వచ్చిన రాకుమారిలా చూసుకుంటాడు. నువ్వు గమనించే ఉంటావు, ఎంత ఆలస్యమైనా ఇంటికెళ్ళే భోజనం చేస్తాడు తప్ప బయట తినడు. నేను ఎప్పుడు భోజనానికి ఉండమన్నా వసంత ఎదురుచూస్తుందని మెత్తగానే చెప్పి వెళ్ళిపోతాడు. ఆ అమ్మాయి తినడం మానుకుని ఎదురుచూడదు కానీ మహారాణిలా బతకాల్సిన పిల్ల నాకోసం కష్టపడి వంట చేసిపెడితే తినకుండా ఉండటానికి మనసొప్పనంత ప్రేమ అతనికి. మేమింత దగ్గరగా ఉంటామా, అయినాసరే ఎప్పుడో ఎంతో అవసరమైతే మరీ మరీ పిలిస్తే తప్ప మా ఇంటికి కూడా రాదు. అలాగని ముభావంగా ఉండే రకం కూడా కాదు. చాలా స్నేహంగా, కలుపుగోలుగా ఉంటుంది. ఎంత మానసిక పరిణతి ఉన్నవాళ్ళైనా ఏదో ఒక సందర్భంలో మనకన్నా పైస్థాయిలో ఉన్నవారిని చూసి మనమూ అలా ఉండాలనో, కనీసం వాళ్ళెంత బాగున్నారని కాస్తో కూస్తో గొప్పగా అనుకోవడం సర్వసాధారణం. వసంతలో అలాంటివి ఎప్పుడూ కనిపించవు. ఆమె ముఖంలో అంతా పరిపూర్ణంగా ఉందన్న

సంతృప్తి కనిపిస్తుంది. నేనైతే మరీ అంత గొప్పగా ఆలోచించలేను, ఆచరించలేను. అందుకే నాకు ఆ అమ్మాయి ఎప్పుడూ ఆశ్చర్యార్థకమే!" వివరంగా చెప్పింది నీలూ.

"వెరీ ఇంటరెస్టింగ్! ఆవేశంగానో, అజ్ఞానంలోనో పెళ్ళి చేసుకోలేదన్నమాట. లోతైన అవగాహన, ఆలోచనతో పాటు బలమైన వ్యక్తిత్వం ఉన్న అమ్మాయన్నమాట. తప్పకుండా కలవాల్సిన వ్యక్తే" అంగీకారంగా అంది మేఘ.

మధ్యాహ్నం భోజనం చేసాక నీలూ, మేఘ తీరిగ్గా కూర్చున్నప్పుడు ఫోన్ మోగింది. ఎవరా అని చూస్తే రేవతి పేరు కనపడింది.

"హలో రేవతీ.." ఉత్సాహంగా పలకరించింది నీలూ.

"సారీ నీలూ.. ఉదయం నువ్వు కాల్ చేసినప్పుడు మాట్లాడలేకపోయాను. అప్పుడు హాస్పిటల్లో ఉన్నాను. నువ్వెలా ఉన్నావు? మేఘనందన అమెరికా నుంచి వచ్చిందా?" వరుసగా అన్నీ అడిగేసింది రేవతి.

"మేము బానే ఉన్నాము. మేఘ అమెరికా నుంచి రెండు వారాల సెలవుల కోసం వచ్చింది. మా ఇంట్లో నాలుగు రోజులు ఉందామని విజయవాడ వచ్చింది. ఉండు. ఫోన్ స్పీకర్లో పెడితే ముగ్గురం మాట్లాడుకోవచ్చు."

"హాయ్ రేవతీ ఇబ్రహీం.. ఎలా ఉన్నావే?" మేఘ పలకరించింది.

ఫోనులో అవతలి నుంచి బిగ్గరగా నవ్వు వినపడింది.

"స్పెల్లింగ్ మిస్టేక్.. రేవతీ సుధాకర్ అని పిలవాలి నన్ను. ఒక్క పిలుపుతో ఎక్కడికో తీసుకువెళ్ళిపోయావు మేఘా" నవ్వుతూనే ఉంది రేవతి.

"మీ బ్యాంక్ మేనేజర్ ఫాదర్, టీచర్ మదర్, మీ తమ్ముళ్ళు, ఇంకా మీ బ్యాంక్ మేనేజర్ హస్బెండ్ అందరూ బాగున్నారా?" కొంటెగా అడిగింది మేఘ.

"మా సంగతి సరే, మిస్టర్ మేఘనందనుడి గురించి చెప్తే విని సంతోషిస్తాం" అంది రేవతి.

"మిస్టర్ మేఘనందనుడి ఆచూకీ ఇంకా దొరకలేదు రేవతీ.. ఉద్యోగాలూ, ఊళ్ళేలడాలూ కాస్త తగ్గించి తొందరగా పెళ్ళి చేసుకోమని నువ్వైనా గట్టిగా చెప్పు మేఘకి" అంది నీలూ.

"ఓహో అయితే లైఫ్ ఎంజాయ్ చేస్తోందన్నమాట. హాయిగా వీలైనన్ని రోజులు ఇలాగే కంటిన్యూ అయిపో మేఘా" చెప్పింది రేవతి.

"ఇది మరీ బాగుంది. నువ్వింకా చెడగొట్టేట్టు ఉన్నావు. మీ బ్యాంక్ మేనేజర్ గారు నీ ఆటలు సాగనివ్వడం లేదా పాపం!" అంది నీలూ.

"అవునవును. ఎప్పుడైనా భార్యలకి జ్ఞానం వచ్చిందంటే అది భర్తల పుణ్యమే మరి. అందుకే నాకొచ్చిన జ్ఞానాన్ని మేఘకి పంచుతున్నా" గలగలా నవ్వింది రేవతి.

"కాలేజీ రోజుల్లో మనిద్దరం ఎప్పుడూ యాంటీ పార్టీల్లో ఉన్నా ఇప్పుడు మాత్రం నీకే నా ఓటు రేవతీ" సంతోషంగా చెప్పింది మేఘ.

"ఇందాకేంటి హాస్పిటల్ నుంచి వచ్చానన్నావు? అంతా బాగేనా?" రేవతిని అడిగింది నీలూ.

"నేను బ్రహ్మాండంగా ఉన్నాను. కొన్ని నెలల క్రితం మా మరిదికి యాక్సిడెంట్ జరిగింది. అక్కడికక్కడే పోవలసిన మనిషి అదృష్టవశాత్తూ బతికి బయటపడ్డాడు. కానీ వెన్నెముకకి బలమైన గాయాలు అవడంచేత మంచానికే పరిమితమైపోయాడు పాపం. అతని పరిస్థితి ఏమైనా బాగు చేయగలమేమోనని రకరకాలుగా ప్రయత్నిస్తున్నాం. అందుకని తరచూ హాస్పిటల్స్ చుట్టూ తిరగాల్సి వస్తోంది" చెప్పింది రేవతి.

"అయ్యో పాపం. మొత్తం అంతా మీరే చూసుకోవాలా? ఇంకెవరూ సాయం లేరా?" అడిగింది నీలూ.

"అతనికి రెండేళ్ళ క్రితమే పెళ్ళయింది. వాళ్ళకో చిన్న పాప కూడా ఉంది. పాపం ఆ అమ్మాయి ఒక్కతీ ఎంతకని చూసుకోగలుగుతుంది. మా అత్తమామలు ఎప్పుడో పోయారు కాబట్టి ఇంక అతనికి ఉన్న ఒకే ఒక ఆసరా మేమే. ప్రస్తుతానికి అందరం కలిసి ఒక ఇంట్లోనే ఉంటున్నాము. మొత్తంగా బాగవడం కుదరకపోయినా కొన్ని రకాల ట్రీట్మెంట్స్ చేస్తూ పోతే క్రమంగా కొంత మార్పు రావచ్చు అంటున్నారు డాక్టర్లు. సుధాకర్ కి ఆఫీస్ బిజీ ఉంటుంది. అందుకని నేనూ, ఆ అమ్మాయి కలిసి అతన్ని హాస్పిటల్స్ కి తిప్పుతూ ఉంటాం. చూడాలి ఏమవుతుందో!" వివరంగా చెప్పింది రేవతి.

"అంత కష్టంలో వాళ్ళని ఎంత బాగా ఆదుకుంటున్నావో, నిజంగా నీది చాలా పెద్ద మనసు రేవతీ. ఒక రోజు, రెండు రోజులతో తీరిపోయేది కాదని తెలిసినా పూర్తిగా వాళ్ళ బాధ్యతంతా నెత్తిన వేసుకోవడం నిజంగా చాలా గొప్పవిషయం" అంది నీలూ.

"నీలూ చెప్పింది నిజమే. యు ఆర్ డూయింగ్ ఎ గ్రేట్ జాబ్ రేవతీ!" అభినందించింది మేఘ.

"చాల్లే ఆపండి ఇద్దరూ. ఇందులో అంత గొప్పేముందీ. సుధాకర్ ఒక్కగానొక్క తమ్ముడికి కష్టం వస్తే మేము కాకపోతే ఇంకెవరు చేస్తారు? నేనేమీ సంఘసేవ, సమాజోద్ధరణ చేయడం లేదుగా. ఇదంతా సరే గానీ మీ పాప ఎలా ఉంది నీలూ? పేరు పూజ కదూ?" అంది రేవతి.

"పూజ బ్రహ్మాండంగా ఉంది. నాన్నాకూతుర్లిద్దరూ కలిసి నానమ్మింటికి వెళ్ళారు. రేపు వచ్చేస్తారు. ఈ ఒక్క రోజుకీ ఇదిగో నేనూ, మేఘ కలిసి పాత రోజులు గుర్తు చేసుకుంటూ కూర్చున్నాం" చెప్పింది నీలూ.

"ఈసారి నాకు కాల్ చేస్తే నీ పెళ్ళికి పిలవడానికే అయ్యుండాలి మేఘా. ఏమంటావు?" అంది రేవతి.

"భలే చెప్పావు రేవతీ" కేరింతగా అరిచింది నీలూ.

“మీరు మరీ అంత ఫీలయిపోనక్కర్లేదు. నేనేమీ సన్యాసం తీసుకోబోవట్లేదు. ఇంకా ఆ టైం రాలేదంతే!” నవ్వింది మేఘ.

“సరే సరే.. మేఘనందన పెళ్ళి పిలుపు కోసం ఎదురుచూస్తాం. ఇప్పటికి మాత్రం ఇండియా ట్రిప్ బాగా ఎంజాయ్ చేసి వెళ్ళు. నీలూ, మనం మళ్ళీ మాట్లాడదాం. అప్పుడప్పుడూ రింగ్ చేస్తుండు” చెప్పింది రేవతి.

“థాంక్స్ రేవతీ. టేక్ కేర్!” అంది మేఘ.

“అలాగే తప్పకుండా చేస్తుంటాను. నువ్వు జాగ్రత్త! ఉంటాం మరి. బై బై” ఫోన్ పెట్టేసింది నీలూ.

రేవతితో మాట్లాడాక ఎక్కడో ఆలోచిస్తూ మౌనంగా ఉన్న నీలూని చూసి “ఏంటీ అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు? మీ హాల్లో సీలింగ్ కి ఏ కలర్ పెయింట్ బాగుంటుందనా?” అంది మేఘ.

గలగలా నవ్వింది నీలూ.

“రేవతి గురించి ఆలోచిస్తున్నా ఇంతలోనే ఎంత మారిపోయిందీ అని. దేన్నీ ఎక్కువ పట్టించుకోకుండా, ఎక్కువ కష్టపడకుండా ఎప్పుడూ సుఖంగా ఎలా కాలం గడపాలా అన్నట్టుండే రేవతి ఎదుటివాళ్ళ కోసం ఇంత కష్టపడటం నమ్మలేకపోతున్నాను. కాలం మనుషులని మరీ ఇంతలా మార్చేస్తుందా మేఘూ?” ఆశ్చర్యంగా అడిగింది నీలూ.

“మనుషుల్లో అసలంటూ మంచితనం లేకపోతే కాలమే కాదు ఏదీ వాళ్ళని మార్చలేదు. టీనేజ్లో అల్లరి చిల్లరిగా ఉన్నట్టు ఎప్పటికీ ఉంటామా?” అంది మేఘ.

“నిజమేననుకో. కానీ పెళ్ళి మాత్రం అమ్మాయిల్లో చాలా చాలా మార్పు తీసుకొస్తుంది. పెళ్ళికి ముందొక జీవితం, తర్వాత మరో జీవితం రెండూ పూర్తిగా వేరువేరేమో అన్నట్టు పొంతన ఉండదు రెంటికీ.”

“అంటే మార్పంతా పెళ్ళిలోనే ఉందంటావ్?” నవ్వింది మేఘ.

“నువ్వు పెళ్ళి చేసుకున్నాక చెప్పాలి అవునో కాదో! ఇంకా ఎన్నాళ్ళు ఎదురుచూడాలంటావు మేమందరం?” అడిగింది నీలూ.

“ఏదో చెప్తారుగా, కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదని. అలాంటివి ఎప్పుడొస్తాయో ఎలా చెప్పడం? పనిగట్టుకుని ఏదైనా చెత్త తిని పొట్ట పాడు చేసుకుంటే తప్ప అలా షెడ్యూల్ చేయడం కుదరదు” నవ్వుతూ అంది మేఘ.

“చాల్లే పిచ్చి పోలికలు. నిజంగా పెళ్ళి మీద నీకు మంచి అభిప్రాయం ఉందో లేదో చెప్పు” గట్టిగా అడిగింది నీలూ.

“పిచ్చి నీలమ్మా, అలాంటి సందేహాలు పెట్టుకుని నువ్వేం బెంగ పెట్టుకోకు. పెళ్ళి మీద నాకేం చెడ్డ అభిప్రాయాలు లేవు. ఒకవేళ అలాంటి వాళ్ళెవరైనా ఉన్నా మీ ఇంటికొచ్చి రెండు రోజులుంటే పెళ్ళి చేసుకుని కుటుంబం ఏర్పరచుకుంటే ఇంత శాంతి ఉంటుందా అని క్షణంలో అభిప్రాయం మార్చుకోవలసిందే!” అని చెప్తూ నీలూ బుగ్గలు పుణికింది మేఘ.

“అబ్బా మరీ అంత గొప్ప విశేషమేముంది మా ఇంట్లో. అందరిలాగే మేమూనూ” సిగ్గుపడింది నీలూ.

“అదంతే. ఆ విశేషం చూసేవాళ్ళకి మాత్రమే తెలుస్తుందిలే” నవ్వింది మేఘ.

"సరేగానీ మన కాలేజీ క్యాంపస్ చూసొద్దాం పద. మళ్ళీ మనకి టైం కుదరకపోవచ్చు."

"కుదరకపోతే పోనీ" తేలిగ్గా అంది మేఘ.

"ఇంతవరకూ వెళదాం వెళదాం అని ఇప్పుడేంటీ?"

"నిజం చెప్పనా. నాకు వెళ్ళాలని లేదు."

"ఇంతలోనే ఏమైంది?"

"కొత్తగా ఏమీ అవ్వలేదు. మన కాలేజీ, హాస్టలు, వాటి ముందున్న సిమెంటు రోడ్డు, గుల్మోహర్ చెట్లు అవన్నీ మళ్ళీ ఒకసారి చూసి అప్పటి రోజులు గుర్తుచేసుకుందాం అనుకున్నాను. ఇప్పటిదాకా చూడాలనిపించింది కానీ ఇప్పుడు వద్దనిపిస్తోంది."

"అదే ఎందుకని?"

"ఏమో, వద్దనిపిస్తుందంతే! చూసొచ్చాక నా బాధ మరింత ఎక్కువవుతుందేమో అన్న భయం, ఆ పరిసరాలన్నీ మారిపోయి మనకి అపరిచితంగా అనిపిస్తే నా నా జ్ఞాపకాల్లో ఉన్న సజీవ చిత్రం వాస్తవం తాకిడికి చెదిరిపోతుందేమోనన్న సందేహం."

"నిజమే, ఖచ్చితంగా ఎంతో కొంత మారిపోయి ఉంటుంది. అసలు బిల్డింగులు, రోడ్లు మొత్తంగా మాయమైపోయినా ఆశ్చర్యం లేదు. సందేహం ఒప్పుకోతగిందే కానీ భయం ఎందుకు? కిరణ్ విషయమేనా?"

మేఘ అవునన్నట్టు తల ఊపింది.

"ఇన్నేళ్ళయినా నువ్వింకా కిరణ్ గురించి ఇంతలా బాధపడుతున్నావా?" ఆశ్చర్యంగా అడిగింది నీలూ.

"అంటే ఇన్నేళ్ళూ అదే పనిగా రోజూ తల్చుకుని బాధపడలేదు. నిజానికి మొదట్లో అమ్మానాన్నల ముందు నేను అవమానపడ్డానికి కారణం తనేనన్న కోపం అంతవరకూ తన మీదున్న అభిమానాన్ని పూర్తిగా చెరిపేసింది. ఆ పంతం కొద్దీ ఇలాంటి ఆలోచనలేమీ పెట్టుకోకుండా చదువు మీద మాత్రమే ధ్యాస పెట్టాలని పట్టుదలగా నిర్ణయించుకున్నాను. ఇంజనీరింగ్, ఎంటెక్ చదివిన ఆరేళ్ళలో ఎప్పుడో తప్ప కిరణ్ గుర్తొచ్చేవాడే కాదు. తర్వాత్తరవాత అదేంటో విచిత్రంగా కాలం గడుస్తున్న కొద్దీ తనని తలచుకోవడం ఎక్కువవుతూ వచ్చింది. అప్పుడు జరిగినవన్నీ తప్పులన్న నా అభిప్రాయం మారిపోయింది. అప్పుడు అవమానం అనిపించినదంతా ఇప్పుడు అపురూపంగా తోస్తుంది. అప్పటి తన ప్రేమ, నాకు తనంటే ఉన్న ఇష్టం గుర్తొచ్చి బాధపెడుతుంటాయి. కిరణ్ తప్పేమీ లేకుండా మొత్తం అంతటికీ అన్నిటికీ తననే బాధ్యుణ్ణి చేసి దూరం చేయడం తప్పనిపిస్తుంది. ఇదీ విషయం అని చెప్పి నా పరిస్థితుల కారణంగా నా నిర్ణయం ఇది తప్ప ఇందులో తన నేరమేమీ లేదు అని చెప్పాల్సిందేమో అనిపిస్తుంది. కిరణ్ పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించి తప్పు చేసానన్న గిల్టీ ఫీలింగ్ నన్ను వదలడం లేదు" మనసులో ఎన్నాళ్ళ నుంచో గూడు కట్టుకున్న బాధనంతా నీలూ ముందు బయటపెట్టింది మేఘ.

చిన్నబోయిన మేఘ మొహం చూసి తనకి దగ్గరిగా జరిగి ఆప్యాయంగా చేతులు పట్టుకుంది నీలూ.

“మేఘా.. నీకు తెలియంది కాదు. అందరికీ టీనేజ్లో రకరకాల పరిచయాలు, స్నేహాలు ఏర్పడతాయి. అప్పటి పరిస్థితుల్ని బట్టి కొన్ని స్నేహాలు అలా అర్ధాంతరంగా ముగుస్తాయి. అంతమాత్రానా అవే తల్చుకుని ఎవ్వరూ బాధ పడరు. జీవితంలో ముందుకెళ్ళే కొద్దీ ఇలాంటివన్నీ అందరూ మర్చిపోతారు. ఒకవేళ గుర్తున్నా అప్పటి మన ప్రవర్తన, జరిగిన సంఘటనలు పిల్లచేష్టల్లా సిల్లీగా అనిపిస్తాయి. నవ్వుకుని ఊరుకుంటారు తప్ప కోపమో, బాధో తెచ్చుకునేవాళ్ళు ఉండరు. కిరణ్ అదంతా ఎప్పుడో మర్చిపోయి ఉంటాడు. నువ్వు ఇంకా గుర్తు పెట్టుకుని గిల్టీగా ఫీలవ్వడం అనవసరం” అనునయంగా చెప్పింది నీలూ.

“అప్పటి గొడవ తర్వాత నేను మళ్ళీ కిరణ్ ని కలిసాను” నెమ్మదిగా చెప్పింది మేఘ.

“ఏంటీ?? మళ్ళీ కిరణ్ ని కలిసావా? ఎప్పుడూ, ఎక్కడా, ఎలా? అసలేం జరిగిందో వివరంగా చెప్పు” నమ్మలేనట్టు అడిగింది నీలూ.

# 12

మేఘ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది అప్పుడు.

ఒకరోజు ఉదయం కాలేజీకి వెళ్ళే తొందరలో అద్దం ముందు నించుని జడ వేసుకుంటుంటే “మేఘా.. నీకోసం ఎవరో వచ్చారు” అంటూ ఒక అమ్మాయి పిలుపు బిగ్గరగా వినిపించింది.

తనకోసం వచ్చేవాళ్ళు ఎవరున్నారా అని సందేహిస్తూ మిగిలిన సగం జడ అల్లుకుంటూనే మొదటి అంతస్థులో ఉన్న ఆ గది బయటి బాల్కనీలోకి వచ్చి కిందకి చూసింది.

ఇంతకుముందు అరిచిన అమ్మాయి కొంచెం దూరంగా ఆ ఆవరణలో ఉన్న గానుగచెట్టు వైపు చూపించి వెళ్ళిపోయింది. అక్కడ హీరోహోండా బైకుకి ఆనుకుని నించున్న ఓ అబ్బాయి కనిపించాడు.

ఎవరై ఉంటారా అని ఆలోచిస్తూనే మెట్లు దిగి నెమ్మదిగా గానుగ చెట్టు వైపు నడిచింది మేఘ.

పదడుగుల దూరం నుంచి ఆ వచ్చిందెవరోనని పరీక్షగా చూస్తున్న మేఘ ఆ అబ్బాయి కళ్ళకున్న కూలింగ్ గ్లాసెస్ తీసి నవ్వుతూ “హాయ్ మేఘా” అనేసరికి నివ్వెరపోయింది. తత్తరపాటుతో అడుగు ముందుకి పడలేదు.

కాస్త తెప్పరిల్లాక “నువ్వు, నువ్వేంటి ఇక్కడ? నువ్వెలా వచ్చావ్ ఇక్కడికి?” అయోమయంగా అడిగింది.

“థాంక్ గాడ్. గుర్తు పట్టావు. నువ్వెవరు అంటావేమో అనుకున్నా” కిరణ్ మొహంలో నవ్వు చెరగలేదు.

“వెంటనే గుర్తుపట్టలేకపోయాను. చాలా మారిపోయావు.”

“మంచిగానా, చెడ్డగానా?”

"స్టైల్ గా కనిపిస్తున్నావులే" నవ్వింది.

"మణిపాల్ మెడికల్ క్యాంపస్లో అందరూ ఇలాగే పోష్ గా ఉంటారు."

"ఇంతకీ నువ్వెలా వచ్చావు? నీకెలా తెలుసు నేనిక్కడ ఉన్నానని?"

"నువ్వెలా ఉన్నావో చెప్పు. 'నేను బాగా చదువుకోవాలి, నాతో ఇంకెప్పుడూ మాట్లాడి డిస్టర్బ్ చెయ్యకు' అని నన్ను తిట్టావుగా. బాగా శ్రద్ధగా చదువుకుంటున్నావా?"

"అలా అన్నానా? నాకు గుర్తు లేదు" నవ్వొచ్చింది మేఘకి.

"అన్నవాళ్ళకి గుర్తుండవులే, పడ్డవాళ్ళకి బాగా గుర్తుంటాయి."

"అసలు నువ్వెలా వచ్చావో చెప్పు ముందు" పక్కనున్న బైకుని చూస్తూ అడిగింది.

"నేనూ, మా కజిన్ గాడూ కలిసి హైదరాబాద్ నుంచి బైకేసుకుని వచ్చాం."

"అప్పుడు మీ ఊరొస్తే కలిసి తిరిగేవారు, ఆ కజినేనా? అయినా ఇంతదూరం బైక్ మీద వస్తారా ఎవరైనా? భయం లేదసలు."

"ఈ కజిన్ వేరే ఇంకొకడు. భయం ఎందుకు? జాలీగా వచ్చేసాం."

"ఏంటీ క్రిస్టియన్ గా మారిపోయావా?" మెడలో కనిపిస్తున్న బుల్లి క్రాస్ చూసి అడిగింది మేఘ.

"ఓ ఇదా? గ్రేస్ అని మా ఫ్రెండ్స్ గ్యాంగ్లో అమ్మాయి గిఫ్ట్ గా ఇచ్చిందని వేసుకున్నా."

"ఓహో"

"షి ఈజ్ జస్ట్ ఎ ఫ్రెండ్!"

"నేను కాదన్నానా ఇప్పుడు? ఇంకేంటి సంగతులు?"

"నీలూ, రజని ఎలా ఉన్నారు?"

"రజని సంగతి తెలీదు. నీలూకి పోయిన వేసవిలో బియస్సీ అవగానే పెళ్ళయింది. విజయవాడలో ఉంటోంది."

"అప్పుడే నీలూకి పెళ్ళయిపోయిందా?"

"వాళ్ళ నాన్నగారికి ఆరోగ్యం బాలేదని తొందరగా చేసేసారు."

"మీ డాడీ ఎలా ఉన్నారు?"

"బావున్నారు. నాకు కాలేజీకి టైమవుతుంది. హాస్టల్లో ఇంతసేపు మాట్లాడకూడదు."

"హ్మ్.. ఓకే, ఐ లెట్ యు గో. నా సెల్ ఫోన్ నంబర్ ఇవ్వనా?"

"నా దగ్గర పెన్, పేపర్ లేదు."

జేబులోంచి పెన్, పేపర్ తీసి నంబర్ రాసి మేఘ చేతికిచ్చాడు.

"ఎప్పుడైనా కాల్ చేస్తావా?"

"....."

"ఇంకా కోపమా? అసలు నీకు నా మీద కోపం ఎందుకొచ్చిందో చెప్పు."

"నాకెందుకు నీమీద కోపం? అలాంటిదేం లేదు" నవ్వింది మేఘ.

"మనం ఫ్రెండ్స్ లా అయినా ఉండలేమా?"

"ఇంతసేపు చక్కగా ఫ్రెండ్స్ లాగే మాట్లాడుకున్నాంగా"

అటూ ఇటూ దిక్కులు చూస్తూ మాట్లాడుతున్న మేఘకేసి చూసి "నువ్వలా ఇబ్బందిగా చూడకు. ఎవరూ ఏమీ అనుకోరులే. నేను వెళతానింక" అంటూ చెయ్యి ముందుకి చాపాడు.

అర్థం కానట్టు చూసింది మేఘ.

"బై చెప్పడానికి షేక్ హేండ్ కూడా ఇవ్వవా?"

చప్పున చెయ్యి కలిపింది మేఘ.

బైక్ స్టార్ట్ చేసి పక్కకి తిరిగి మేఘ కళ్ళల్లోకి చూస్తూ "బాగా చదువుకో. టేక్ కేర్! ఐ విల్ వెయిట్ ఫర్ యువర్ కాల్!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

బైక్ వీధి చివర మలుపు తిరిగి మాయమయ్యాక కూడా కాసేపు అక్కడే నిలబడింది మేఘ. మెల్లగా వెనక్కి తిరిగి వస్తూ చేతిలో ఉన్న ఫోన్ నంబర్ కాగితాన్ని చూసింది.

"మనం ఫ్రెండ్స్ లా అయినా ఉండలేమా?" అన్నప్పుడు అతని కళ్ళలోకి చూసింది గుర్తొచ్చింది.

ఫోన్ నంబర్ వంకే చూస్తూ కూర్చుంది.

నాలుగేళ్ళుగా మూతపడిన మనసు గది ఈ రోజున తెరుచుకుని రకరకాల భావాలు ఒక్కుమ్మడిగా దాడి చెయ్యడం మొదలుపెట్టాయి.

ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఆ ఫోన్ నంబర్ రాసున్న కాగితాన్ని గబగబా గుర్తు పట్టటానికి వీల్లేనంత చిన్న ముక్కలుగా చింపి పడేసింది.

మేఘ చెప్పింది విన్న నీలూ ఆశ్చర్యంతో నోటి మీద చెయ్యేసుకుని కాసేపు ఏమీ మాట్లాడకుండా ఉండిపోయింది.

నెమ్మదిగా తేరుకుని "కిరణ్ నీకు ఫోన్ నంబర్ ఇచ్చినా నువ్వు ఒక్కసారి కూడా ఫోన్ చెయ్యలేదు కాబట్టి నీకు తనతో మాట్లాడటం ఇష్టంలేదని స్పష్టంగా అర్థమైపోయుంటుంది. అందుకని అప్పుడు కాస్తో కూస్తో బాధపడినా తర్వాత మర్చిపోయే ఉంటాడు. లేకపోతే మళ్ళీ ఎప్పుడో వచ్చి కలిసేవాడుగా!" అంది నీలూ.

"మళ్ళీ కనిపించాడు" నెమ్మదిగా చెప్పింది మేఘ.

"అమ్మో నువ్విచ్చే షాకులకి నాకు హార్ట్ ఎటాక్ వచ్చేలా ఉంది. మళ్ళీ కలిసాడా? ఎప్పుడూ ఎక్కడా?" అడిగింది నీలూ.

"అంటే, నన్ను కలవడానికేమీ రాలేదులే. నేను ఎంటెక్ చదివే రోజుల్లో అనుకోకుండా మూడు సార్లు కనిపించాడు. రెండు సార్లు రోడ్డు మీద, ఒకసారి గుడిలో."

"కనిపించి ఏమన్నాడు?" ఆసక్తిగా అడిగింది నీలూ.

"ఏమీ అనలేదు. నేను గుర్తుపట్టి ఫ్రెండ్లీగా నవ్వుతూ పలకరించాను. తను కూడా హాయ్ చెప్పాడు."

"అంతేనా!"

"అంతేనా అంటే మొదటిసారి కలిసినప్పుడు మొబైల్ నంబర్ అడిగితే నాకు మొబైల్ లేదని అబద్ధం చెప్పాను. చివరిసారి కనిపించినప్పుడు త్వరలో ఆస్ట్రేలియా వెళుతున్నాడని చెప్పాడు."

"హ్మ్.. అనుకోకుండా దారిలో కనపడి హాయ్ హలో అని పలకరించి వెళ్ళిపోయాడంటే ఖచ్చితంగా ముందు జరిగినవన్నీ ఈజీగా తీసుకుని మర్చిపోయినట్టే లెక్క" బాగా ఆలోచించి చెప్పింది నీలూ.

"కాదని నేననడం లేదు. ఇప్పుడు సమస్య తను మర్చిపోవడం గురించి కాదు, నేను మర్చిపోలేకపోవడం గురించి. అంతకుముందు తనతో అన్నిసార్లు పరుషంగా మాట్లాడినప్పుడు చాలా బాధపడి ఉంటాడుగా. నాలుగేళ్ళ తర్వాత తనంత కష్టపడి నన్ను వెతుక్కుంటూ వస్తే నేనేమో కనీసం తిరిగి ఫోన్ కూడా చెయ్యలేదు. తర్వాత కనపడినప్పుడు ఫోన్ లేదని అబద్ధం చెప్పాను. అప్పుడు దూరం పెట్టేసాను కానీ అప్పుడలా చేయడాన్ని ఎందుకో ఇప్పుడు భరించలేకపోతున్నాను. ఆ అపరాధభావం రోజురోజుకీ పెరిగిపోతూ నన్ను తినేస్తోంది. దీన్నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియడం లేదు" మేఘ గొంతులో నిస్సహాయత వినపడింది.

"పిచ్చి మేఘా.. మామూలు ఫ్రెండ్స్ లా ఉండటానికైనా ప్రయత్నించకుండా ఎందుకలా పూర్తిగా దూరం పెట్టావో అసలు కారణం నీకు తెలుసుగా?" మెత్తగా అడిగింది నీలూ.

మేఘ కళ్ళల్లోంచి ఉబికిన కన్నీటి ధారల్లో చెక్కిళ్ళు తడిసాయి. మేఘని చూస్తూ నీలూ కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగాయి.

ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు. ప్రాణస్నేహితురాలి సాంగత్యపు నిశబ్దంలో కాస్త సాంత్వన పొందింది మేఘ.

"నిన్ను నువ్వు మరీ కఠినంగా విచారించుకుని విమర్శించుకుంటున్నావు మేఘా. అందుకే నీకంత గిల్టీగా ఉంది. ఈ రోజున ఈ క్షణంలో నిలబడి గతంలో మనం చేసిన తప్పొప్పుల్ని బేరీజు వేయడం సరి కాకపోవచ్చు. అప్పటి నీ వయసు, నీ స్థాయి, నీ పరిణతి, నీ చుట్టూ ఉన్న పరిస్థితులు అన్నీ వేరు. నీవల్ల కిరణ్ కి బాధ కలిగిన మాట వాస్తవమే కానీ అదేం నువ్వు కక్షగట్టి చేసింది కాదుగా. నేను చెప్తున్నానుగా నమ్ము, కిరణ్ గురించి నాకు తెలిసినంతలో తను నీమీద అస్సలు కోపం తెచ్చుకుని ఉండడు. నీకెందుకు ఇంకా వర్రీ?"

"నాకెలాంటి వర్రీలు లేవు. నేను వర్రీ అవుతున్నానని నువ్వేం వర్రీ అవ్వక్కర్లేదు" ఉక్రోషంగా అంది మేఘ.

నీలూ ప్రశ్నార్థకంగా చూసింది.

"అప్పట్లో ఒకసారి కిరణ్ నీలాగే వర్రీ అవ్వద్దని చెప్తే ఇలాగే అన్నా నేను."

"అబ్బ ఎంత గుర్తో నీకు. అంత చిన్న చిన్న సంగతులు ఇంతలా గుర్తున్నాయంటే ఎన్నెన్ని సార్లు తల్చుకున్నావో! దీన్ని బట్టి తెలుస్తోంది కిరణ్ ని నువ్వెంత..."

నీలూ మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ "చాల్లెండి డిటెక్టివ్ సునీల గారూ, మీ నైపుణ్యాన్ని మేము గుర్తించాం" అంటూ నవ్వింది మేఘ.

"సరేలే నాదొక నైపుణ్యమా? అందుకే మరి ఏళ్ళ తరబడి ఒక్క ముక్కా తెలుసుకోలేకపోయాను" నిట్టూర్చింది నీలూ.

"అందులో నీ తప్పేం లేదు. నేనే చెప్పలేదుగా" అంది మేఘ.

"సరే, ఇంక ఈ విషయం గురించి నువ్వసలు బాధపడొద్దు. కిరణ్ ఇవన్నీ ఎప్పుడో మర్చిపోయి ఎక్కడో పెద్ద డాక్టరైపోయి హేపీగా ఉండుంటాడు. కాదూ కూడదూ అంటావా ఏదో ఒక రోజు మళ్ళీ ఏదో దేశంలో యథాలాపంగా కనిపించినప్పుడు 'సారీ' చెప్పి బరువు దించేసుకుందువుగానీ. ఏమంటావ్?" మేఘ బుగ్గ గిల్లింది నీలూ.

"నిజంగా మళ్ళీ ఇంకోసారి కనిపిస్తాడంటావా? అలాగైతే మరి ఇన్నేళ్ళూ కనపడలేదేం?" నీరసంగా అంది మేఘ.

"పోనీ నువ్వే వెతికి పట్టుకో. వరల్డ్ ఈజ్ ఎ గ్లోబల్ విలేజ్ అని తెగ మొత్తుకుంటూ ఉంటారుగా మీరంతా!" పరిహాసంగా నవ్వింది నీలూ.

నీలూ వేళాకోళంగా అన్న మాట మేఘ మనసులో ఒక కొత్త ఆలోచనని నాటింది.

మరుసటి రోజు ఉదయం శరత్, విజిత, పూజ అందరూ ఊరినుంచి వచ్చారు. విజితని హాస్టల్లో దించేసి పూజని వెంటబెట్టుకుని సాయంకాలం దాకా షాపింగ్ చేస్తూ హడావుడిగా తిరిగారు మేఘ, నీలూ.

మేఘ తెల్లవారి ఊరెళ్ళిపోతుందని ఆ రోజు రాత్రి అశోక్, వసంతలని భోజనానికి పిలిచింది నీలూ. వసంత గురించి నీలూ చెప్పింది విన్నప్పటి నుంచీ ఆమెని కలవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తోంది మేఘ.

శరత్, పూజ ఐస్క్రీం కొనుక్కొస్తామని బయటికి వెళ్ళారు. నీలూ వంటగదిలో పనిలో ఉంది. కాలింగ్ బెల్ మోగితే మేఘ వెళ్ళి తలుపు తీసింది.

గుమ్మంలో ఎదురుగా ఒక అమ్మాయి కనిపించింది. ఆమె వెనుకనే ముమ్మూర్తులా ఆమె పోలికలతో ముద్దుగా ఉన్న శిశిని ఎత్తుకుని మెట్లెక్కుతూ అతి సామాన్యంగా కనిపిస్తున్న ఆమె భర్తనీ, కళ్ళు చెదిరే అందగత్తె అయిన ఆమెనీ మార్చి మార్చి చూస్తూ నోట మాట రాలేదు మేఘకి.

“నా పేరు వసంత. నేను అశోక్ భార్యనండీ. మేఘనందన మీరేనా?” అంటూ పరిచయం చేసుకుంటున్న ఆ అమ్మాయిని చూసిన ఆశ్చర్యంలోంచి తేరుకోడానికి సమయం పట్టింది మేఘుకి.

ఇంతలో నీలూ వచ్చి వాళ్ళని పలకరించింది. పూజ బయటినుంచి వస్తూనే శశిని చూసి కేరింతగా అరిచింది. శరత్, అశోక్, వసంత అందరూ హాల్లో కూర్చుని మాటల్లో ఉండగా నీలూ వెంటే వంటగదిలోకి వెళ్ళింది మేఘు.

“వసంత ఇంతందంగా ఉంటుందని నాకు చెప్పలేదేం? చాలా చిత్రంగా ఉంది వాళ్ళిద్దర్నీ జంటగా చూస్తుంటే” నీలూ చెవిలో గుసగుసగా చెప్పింది మేఘు.

“ముందే చెప్తే థ్రిల్ పోతుందని చెప్పలేదు. అయినా లవ్ ఈజ్ బ్లైండ్ అన్నావుగా నువ్వే. అందంగా ఉంటే ఏంటీ లేకపోతే ఏంటీ?”

“ఓ మై గాడ్! నాట్ ఓన్లీ బ్లైండ్, లవ్ ఈజ్ మిస్టికల్, మేజికల్, మిరాక్యులస్....”

“చాలు చాలు. నీకు కవిత్వం వచ్చేస్తోందే!” నవ్వింది నీలూ.

“వసంత అశోక్ ని అంతిదిగా ప్రేమించడానికి కారణమేంటో ఎంత ప్రయత్నించినా మనం తెలుసుకోలేం నీలూ..”

“ఎందుకలా?”

“ఎందుకంటే, ప్రేమకి కారణాలు అక్కర్లేదేమో!”

“ప్రేమ వేదాంతమా?”

“ఏమో వాళ్ళిద్దర్నీ చూసాక అలా అనిపించింది. భలే ముచ్చటైన జంటని పరిచయం చేసావు నీలూ..” సంతోషంగా చెప్పింది మేఘు.

ఆ రోజు రాత్రి అందరూ కలిసి సరదాగా గడిపారు.

తెల్లవారి ఉదయం మేఘు హైదరాబాదుకి ప్రయాణమైంది. నాలుగు రోజుల నుంచీ వెలిగిపోతున్న స్నేహితురాళ్ళిద్దరి మొహాలు చిన్నబోయాయి.

మేఘు సామానంతా అశోక్ కారులో సర్దేసాడు.

“ముందు అనుకున్నట్టు నువ్వూ వస్తే బాగుండేది నీలూ” బెంగగా అంది మేఘు.

“మనిద్దరం నాలుగు రోజులు కలిసున్నాంగా. నీకు మిగిలిందే పది రోజులు. అమ్మానాన్నలతో హాయిగా గడుపుతూ నీ పనులన్నీ చూసుకో. వీలున్నప్పుడు ఫోన్ చేస్తుండు” అప్పగింతలు పెట్టింది నీలూ.

పూజని ముద్దాడి, శరత్ కి కూడా వెళ్ళొస్తానని చెప్పి కారెక్కింది మేఘు.

కారు బయలుదేరగానే బయటికి చూస్తూ చెయ్యి ఊపుతున్న మేఘతో "నేను చెప్పింది గుర్తుంచుకో. ఏ ఆలోచనలు పెట్టుకోకుండా సంతోషంగా ఉండు" చెప్పింది నీలూ.

"అస్సలు మర్చిపోను. అదే పనిలో ఉంటాను" నవ్వుతూ స్నేహితురాలికి వీడ్కోలు చెప్పింది మేఘ.

తరచి చూస్తే కాలానిదీ, జీవచైతన్యానిదీ ఒకటే వైఖరి అనిపిస్తుంది. ఒక్కొక్క క్షణాన్ని పేర్చుకుంటూ అడుగులో అడుగు వేస్తూ నిమిషాలు గంటలు రోజులుగా రూపాంతరం చెందుతూ అన్నిటా అంతటా తనదైన ముద్ర వేస్తూ ముందుకే కదలిపోతాయి.

విడిగా ఒక్కొక్క నిమిషాన్నో, రోజునో గమనిస్తే నిశ్చలంగానే ఉన్న భ్రమని కలిగిస్తూ రోజుల్నీ వారాల్నీ ఒకేసారి కుప్పగా పోగేసి చూసినప్పుడు మాత్రం మన స్మృతి కన్నా ఎన్నో రెట్లు పెద్దదిగా ఎదిగిపోయిన 'మార్పు' రూపం మన ముందు సాక్షాత్కరించి అబ్బురపరుస్తుంది.

మార్పు రూపాన్ని కళ్ళకి కట్టేది కాలమే! గడిచే కాలం నిడివి పెరిగే కొద్దీ మార్పు క్రమంగా మరింత చిక్కనవుతూ మనకో సరికొత్త రూపం సంతరించి పెడుతూ ఉంటుంది.

నిరంతరంగా, నిర్విరామంగా, నిర్నిబంధంగా, నిత్య చంచలంగా శాఖాచంక్రమణం చేస్తూ సాగిపోయే ప్రాణస్పందనకి నిదర్శనమే మార్పు.

అదే పనిగా అరుస్తున్న ఫోనుకేసి విసుగ్గా చూసినా ఫోన్ స్క్రీన్ మీదున్న పేరు చూసి ముఖం ప్రసన్నంగా మారిపోయింది. ఫోన్ మోగుతూనే మాట్లాడవచ్చిన మనిషెవరో చూపించే ఈ సౌకర్యం లేని కాలంలో తప్పించుకు తిరగడానికి ఎంత ఇబ్బందిగా ఉండేదో అన్న తన ఆలోచనకి నవ్వుకుంటూ ఫోన్ ఆన్సర్ చేసింది మేఘనందన.

"హాయ్ నీలూ.. ఏంటీ ఉదయాన్నే ఫోన్ చేశావు? ఏమన్నా విశేషమా?"

"ప్రత్యేకంగా ఏమీ లేదు. నువ్వు బిజీగా ఉంటే చెప్పు మళ్ళీ మాట్లాడదాం."

"పర్లేదు. ఆఫీసుకి వెళ్ళే దారిలో ఉన్నా. వెళ్ళేదాకా మాట్లాడొచ్చు. చెప్పు."

"ప్రణవ్ కోసం నువ్వు పంపిన వెండి గిన్నె, స్పూను అందాయి ఈ రోజు. చాలా ముద్దుగా ఉన్నాయి."

"పోనీలే రెండు రోజులు ఆలస్యంగానైనా అందాయి. పార్టీ బాగా జరిగిందా?"

"ఇప్పటి నుంచీ వాడికి రోజూ నువ్వు పంపిన గిన్నెలోనే అన్నం తినిపిస్తాలే. పార్టీ ఏంటి?"

"అదే అన్నప్రాసన మహోత్సవం అనాలా.. అది బాగా జరిగిందా అని అడిగాను."

"బ్రహ్మాండంగా జరిగింది. అంతమంది జనాలని చూసి వాడు అసలు కొంచెం కూడా ఇబ్బంది పడలేదు. ఎవరు ఎత్తుకున్నా నవ్వుతూనే ఉన్నాడు."

“పిల్లలు అంత బుద్ధిగా ఉంటే పెంచడం ఎంత హాయో! పూజ ఎలా ఉంది? తమ్ముడిని బాగా ఆడిస్తోందా?”

“మాములుగా ఆడించడం కాదు ముద్దు ఎక్కువైపోయి ఎత్తుకుంటానని ఒకటే గొడవ. ఒక్క నిముషం పక్కకెళ్ళినా వాడిని ఎత్తుకోవాలని ప్రయత్నిస్తుంది. చాక్లెట్లో, బిస్కెట్లో తినిపించాలనుకుంటుంది. వాడేమో కనీసం అరవడు, ఏడవడు. చిద్విలాసంగా నవ్వుతూనే ఉంటాడు. పూజకి కాపలా కాయడమే సరిపోతుంది మాకు.”

“అక్కాతమ్ముళ్ళ అల్లరితో భలే కాలక్షేపం నీకు. అశోక్, వసంత వాళ్ళు బాగున్నారా?”

“అందరూ బాగున్నారు. శశి స్కూలుకి కూడా వెళుతున్నాడు.”

“సరే నీలూ. నేను ఆఫీసుకి వచ్చేశాను. వీకెండ్లో కాల్ చేస్తాను. తీరిగ్గా మాట్లాడుకుందాం.”

“అలాగే. బై బై”

“బై నీలూ..”

కాల్ కట్ చేశాక ఫోన్ స్క్రీన్ మీద కొత్త మెయిల్ వచ్చినట్టు చూసి మెయిల్ బాక్స్ ఓపెన్ చేసింది మేఘ.

'ఆదిత్య కిరణ్ ఆక్సెప్టెడ్ యువర్ ఫ్రెండ్ రిక్వెస్ ఆన్ ఫేస్ బుక్' అని కనిపించిన ఈమెయిల్ చూసి ఒక్క క్షణం నడక ఆపి నించుండిపోయింది.

దాదాపు నాలుగు నెలల క్రితం ఈ ప్రొఫైల్ కనపడింది. పేరు, ఉండేది ఆస్ట్రేలియా అని తప్ప మిగతా వివరాలేమీ తెలియలేదు. అయినా ప్రయత్నించి చూద్దామని ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపింది మేఘ. అటునుంచి ఎటువంటి స్పందనా లేకపోయేసరికి అది ఇంకెవరిదో ప్రొఫైల్ అయ్యుండొచ్చని సమాధానపడింది.

ఇప్పుడు ఇన్నాళ్ళ తర్వాత ఫ్రెండ్ రిక్వెస్ట్ ఆక్సెప్టెడ్ అంటే అది నిజంగా కిరణ్ ప్రొఫైలేనేమోననే ఆశ కలిగింది. అంటే నిజంగానే తను కిరణ్ ని వెతికి పట్టుకోగలిగిందా, అన్న ఆలోచనకి ఉద్వేగంగా అనిపించింది మేఘకి.

ఆఫీసులోకి రాగానే గబగబా లాప్టాప్ తెరిచి ఫేస్ బుక్ ఓపెన్ చేసింది. 'ఆదిత్య కిరణ్ అండ్ యు ఆర్ ఫ్రెండ్స్ నౌ' అని చూసి నవ్వొచ్చింది.

ఇప్పుడు ప్రొఫైల్లో మరిన్ని వివరాలు కనిపిస్తున్నాయి. ప్రొఫైల్ పిక్చర్ మీద క్లిక్ చేసింది. ఎక్కడో బీచ్ లో లాంగ్ షాట్ లో తీసిన ఫోటో. గాగుల్స్ పెట్టుకుని ఉండటంతో పోలికలు పట్టుకునేంత స్పష్టంగా లేదు. అది తప్ప మరేం ఫోటోస్ లేవు.

టైం లైన్లో పోస్ట్స్ కూడా నాలుగైదే ఉన్నాయి. అవి కూడా వేరే ఎవరో ట్యాగ్ చేసినవి. వాటన్నీటిలోనూ 'ఆది, ఆదిత్యా' అన్న సంబోధనలే ఉన్నాయి. కిరణ్ అని ఎవరూ పిలవడం లేదంటే ఇది వేరే ఇంకెవరోనేమోనన్న సందేహం కలిగింది మేఘకి.

ఒకవేళ ఇది తను వెతుకుతున్న కిరణే అయితే ఇప్పుడేంటి చెయ్యడం అన్న ప్రశ్నకి చటుక్కున సమాధానం తోచలేదు మేఘకి.

ఇన్నాళ్ళూ వెతకాలీ వెతకాలీ అని ఇంత తపన పడి తీరా ఎదురుపడ్డాక ఇప్పుడేమి మాట్లాడాలి అన్న కంగారు బయలుదేరింది.

ఇన్నేళ్ళుగా మనసులో గూడు కట్టుకున్న అపరాధభావాన్ని పోగొట్టుకోవాలంటే తప్పకుండా కిరణ్ తో మాట్లాడి తీరాలి. తనని కష్టపెట్టినందుకు సారీ చెప్పాలి.

కానీ, ఇన్నేళ్ళ తర్వాత మేఘ అనే పేరైనా గుర్తుందో లేదో, గుర్తున్నా మేఘ అనే పేరు వింటూనే కోపం వస్తుందేమో. ఇప్పుడు కిరణ్ కి తనతో మాట్లాడే ఆసక్తి ఉంటుందా? కిరణ్ కి నిజంగా తన మీద కోపం ఉన్నా అదీ న్యాయమేనేమో!

ఏది ఏమైనా ఇప్పుడు కిరణ్ ఏమనుకుంటాడన్న ఆందోళన అనవసరం. అతని అభిప్రాయం ఎలా ఉన్నా తను చెప్పాల్సింది చెప్పి తీరాలి. అప్పుడు గానీ మనసుకి శాంతి దొరకదు అనుకుంది మేఘ.

ప్రొఫైల్లో ఉన్న ఈమెయిల్ ఐడీ కాపీ చేసుకుని మెయిల్ రాయడం మొదలు పెట్టింది.

“నేను ఆదిత్య కిరణ్ అని నా ఇంటర్మీడియెట్ ఫ్రెండ్ కోసం వెతుకుంటే మీ ఫేస్ బుక్ ప్రొఫైల్ కనిపించింది. మీ పుట్టినరోజు మార్చ 9 అయితే, మీకు నా పేరుతో ఎవరైనా తెలిసుంటే నా ఉత్తరానికి స్పందించండి. కాని పక్షంలో ఈ మెయిలుని పట్టించుకోనవసరం లేదు.

థాంక్స్!

- మేఘనందన”

మెయిల్ పంపించేశాక రిప్లై ఎప్పుడొస్తుందో అనుకుంటూ ఫేస్ బుక్ ప్రొఫైల్లో రాయబడిన వివరాల ప్రకారం సిడ్నీ, ఆస్ట్రేలియాలో ఇప్పుడు టైం ఎంతయింది అని వెతికి చూసింది మేఘ. అర్ధరాత్రి ఒకటిన్నర. మేఘకి అప్పుడు ఉదయం తొమ్మిదిన్నర.

'ప్రపంచ పటానికి చెరొక కొసన ఉండటమే కాదు, టైము కూడా తల్లక్రిందులుగానే ఉందన్నమాట! అయితే రాత్రికి గానీ రిప్లై వచ్చే అవకాశం లేదు' అనుకుంది మేఘ.

రోజంతా ఒక పక్కన పని చేసుకుంటూనే మరోపక్కన కిరణ్ నుంచి సమాధానం ఎప్పుడొస్తుందా అని పదే పదే ఈమెయిలు చూసుకుంటోంది మేఘ.

కేవలం ఒక్క మెయిలుకి రిప్లై కోసం ఇంత కొద్ది సమయంలో తనింత ఉద్విగ్నత అనుభవిస్తుంటే తన కోసం అప్పుడంతా కిరణ్ ఎంత ఎదురుచూసి ఉంటాడో కదా అనే ఆలోచనకి మేఘ కళ్ళు చెమర్చాయి.

ఒక మనిషిని, అందులోనూ తనకి బోల్డంత ఇష్టమున్న మంచి స్నేహితుడి పట్ల అంత కర్కశంగా ప్రవర్తించగలిగింది తనేనా అన్న అనుమానం,ఆశ్చర్యం కలిగాయి మేఘకి.

మొదటినుంచీ తామిద్దరి మధ్యన జరిగిన సంఘటనలన్నీ వరుసగా వచ్చి కళ్ళముందు నిలుస్తున్నాయి. గతం తాలూకూ క్షణాలన్నీటినీ ఒక్కొక్కటీ తరచి తరచి చూసుకుంటోంది మనసు.

నువ్వు గుర్తొస్తావు.. నువ్వు చాలా గుర్తొస్తావు.. నువ్వు బోల్డు గుర్తొస్తావు.. మళ్ళీ మళ్ళీ నువ్వే గుర్తొస్తావు.. అసలు నువ్వెంతలా గుర్తొస్తావో తెలుసా నీకు!?

ఎక్కడో ఓ చెత్త కాగితం మీద ఒక ఊరి పేరు కనిపిస్తుంది. అదే అక్కడెక్కడో భూగోళానికి ఇంకో వైపునున్న ఊరు, అదే నువ్వున్న ఊరని గుర్తొస్తుంది. అసలు ఇప్పటి దాకా కనీసం పేరైనా పరిచయం లేని ఆ ఊరంటే ఉన్నట్టుండి గంపెడంత ప్రేమ పొంగుకొచ్చేస్తుంది.

యథాలాపంగా ఎక్కడో చోట మీ ఊరి పేరు విన్నప్పుడల్లా గుండె ఝల్లుమంటుంది. ఊపిరాడనట్టు, గుండెల్లో ఏదో పట్టేసినట్టు అయిపోతుంది. ఆ ఊరి పేరు వింటూనే ఏదో నీ పేరే విన్నంత ఆనందం, నిన్నే చూస్తున్నంత పరవశంలో పడిపోతాను.

ఎవరో అపరిచితులు గబుక్కున మీ ఊరి పేరు చెప్తే వాళ్ళంటే అప్పటికప్పుడు బోల్డు ఇష్టం వచ్చేస్తుంది. వీళ్ళు నాకు బాగా కావలసినవాళ్ళన్న పిచ్చి అభిమానం ముంచుకొచ్చేస్తుంది. అంటే, నువ్వుండే ఊర్లో వాళ్ళు కూడా ఉంటున్నారనీ, నువ్వు తిరిగే చోట వాళ్ళూ తిరిగారని, నీ కళ్ళతో చూసిన దృశ్యాలని వాళ్ళూ చూసారనీ, అంతటి గొప్పవాళ్ళని నేనూ ఇప్పుడు నా కళ్ళారా చూస్తున్నా అని నా సంబరమన్నమాట! అదే చిన్నప్పుడు స్కూల్లో చెప్పేవారు కదా a=b=c అయితే a=c అని.. అలాగన్నమాట!

మరీ సిల్లీగా అనిపిస్తోంది కదూ. నాక్కూడా అంతే అనిపిస్తోంది. కానీ, అదంతే! ఒకోసారి కొన్ని నిజాలు సిల్లీగానే అనిపిస్తాయి.

నీ పేరు.. నీకసలు ఎందుకా పేరు పెట్టారు? ఈ ప్రపంచంలో ఎప్పుడు ఏ మూలకెళ్ళినా ఎవరో ఒకరు నీ పేరుతో వినిపిస్తూ కనిపిస్తూనే ఉంటారు. ఒకోసారి ఒళ్ళు మండిపోతుంది. అబ్బబ్బా ఈ పేరుతో అసలు మనుషులే లేకపోతే బాగుండు, అసలీ పేరు పెట్టుకోడానికి వీల్లేదని ఏదన్నా చట్టం తెస్తే బాగుండు, ఇలాంటి దారుణమైన ఆలోచనలు వస్తాయి.

ఆ పేరుని వింటున్నప్పుడూ, పలుకుతున్నప్పుడంతా ఓ పక్క మనసుని మెలితిప్పే ఏదో చెప్పలేని బాధ, మరో పక్క నీ పేరుని అన్నిసార్లు పలికే అదృష్టం దొరుకుతున్నందుకు అదో మురిపెం. పిలిచేది నిన్ను కాకపోయినా, ఎంచక్కా నీ పేరునలా హాయిగా గొంతెత్తి పిలుస్తుంటే, ఆహా అదో గొప్ప ఆనందంలే, నీకు చెప్పినా అర్థం కాదేమో. హుమ్మ్.. ఇది ఖచ్చితంగా పిచ్చి లక్షణమే అనిపిస్తోంది కదూ!

ఒకోసారి నేను ఏదోక పనిలో ఊపిరి సలపనంతగా మునిగిపోయి నీ ఊసే అసలు గుర్తుకు రాని సందర్భాల్లో.. అబ్బా ఎంత హాయిగా ఉంది ఈ కాసేపు అనిపిస్తుంది. అంతలోనే ఇంతసేపూ నిన్ను మర్చిపోయానని అనుకోగానే చాలా బెంగగా అనిపిస్తుంది. ఏడుపొచ్చేస్తుంది.

అదే పనిగా కంటికి కనిపించిన ప్రతీదానిలో నిన్నే తలచుకోవడం చాలా దిగులుగా, బాధగా ఉంటుంది. కానీ అదేంటో ఆ బాధే చాలా అందంగా, ఆనందంగా అనిపిస్తుంది. ఈ బాధని ప్రేమించడవేంటో నా మొహం అని నాకు నాకే తెగ నవ్వొస్తుంది కూడా!

ఎందుకిలా!?

హుమ్మ్.. కేవలం ఒక్క మనిషి మీదున్న ప్రేమ ఇలా ఇన్నిటి మీద ప్రేమని పుట్టిస్తుందని నాకిప్పటి దాకా తెలీనే తెలీదు. ఆలోచిస్తుంటే ఇంకోటి కూడా అనిపిస్తుంది. ఒకవేళ నేను నిజంగా నీతోనే ఉన్నాననుకో. అప్పుడు ఇలా నువ్వున్న ఊరు, నీ పేరూ, నువ్వు

మాట్లాడిన ప్రతీ అక్షరం అక్షరమూ, నీతో గడిపిన చిన్ని చిన్ని క్షణాలు.. ఇవన్నీ ఇన్ని వేల సార్లు మళ్ళీ మళ్ళీ తలచుకునేదాన్నంటావా? కాదేమో కదా. నువ్వే నాతో ఉన్నప్పుడు ఇంక నీ జ్ఞాపకాలతో నాకేం పని అనుకునేదాన్నేమో.

అబ్బ.. నాకెంత స్వార్థం కదూ!

ఇంకా నీ గురించిన తలపుల ప్రవాహంలో పడి కొట్టుకుపోతూ ఉన్నప్పుడు నాకింకో సందేహం కూడా వస్తూ ఉంటుంది.

నాలో నీ మీద ఇంత ప్రేమ ఉన్నప్పుడు నువ్వు ఎదురుగా ఉన్నప్పుడు నేనెందుకు నిన్ను బాధ పెట్టానసలు? అంటే ఇప్పుడు నిన్ను దూరం చేసుకున్నాక గానీ నాలో ఇంత ప్రేమ దాగుందని నేను గుర్తించగలిగానా?

లేకపోతే నిన్ను కోల్పోయాక నీ విలువ అమాంతంగా పెరిగిపోయి నీ జ్ఞాపకాలన్నీ ఇంత అపురూపం అయ్యుంటాయా?

ఏమో.. నా దగ్గర ఇలాంటి జవాబులు లేని ప్రశ్నలు గంపల కొద్దీ ఉన్నాయి. ఏమైనా, ప్రశ్నించడం చాలా సులువనుకుంటా. సమాధానాలు వెతుక్కోడం, సమాధానాలు ఇవేనని సకాలంలో గుర్తించి సరైన సమయానికి సరైన నిర్ణయాలు తీసుకోగలగడంలో ఉంది అసలు చిక్కంతా.

ఏవిటో, పరీక్షలయిపోయాక సెలవుల్లో సమాధానాలు రాసినట్టుంది కదూ నా తెలివి!

ఒకోసారి నీ మీద చాలా కోపమొస్తుంది. నేను మూర్ఖంగా ప్రవర్తించినప్పుడు నువ్వెందుకు ఊరుకున్నావసలు, అప్పుడే చెవి మెలిపెట్టి బుద్ధి చెప్పాల్సిందేమో. అప్పుడైతే నేను నీకు దూరం అయ్యేదాన్ని కాదు కదా!

నాకు వినిపిస్తోందిలే నువ్వేం అంటున్నావో, నాలాంటి పెంకి మొహాలకి చెవి మెలెయ్యడం అంత సులువు కాదనేగా! పెద్ద గొప్పేలే, ఆ విషయం మాక్కూడా తెలుసు. అయినా సరే, నువ్వే ఏదోకటి చేసుండాల్సింది. అంతే.. ఇంకో మాటే లేదు!

అసలు నువ్వంటే నాకు చాలా బోల్డు కోపం. అసలీ ప్రపంచంలో నీ మీద కంటే కోపం నాకు ఇంక దేని మీదా లేదు, రాదు. ఎందుకు నిన్ను వదిలించుకోలేకపోతున్నాను నేను, నాకెందుకింత బాధ నీ వల్ల అని.

కానీ అంతలోనే నీ మీద కోపమంతా నా మీదకి మళ్ళుతుంది. అసలిదంతా నా వల్లేగా. నేనే నిన్ను వెళ్ళగొట్టేసాను. తప్పంతా నాదే, నా ఒక్కదానిదే.

అయినా వేటూరి గారన్నట్టు కొన్ని దూరమైనా, దగ్గరైనా ఆనందమే.. నీలాగా!

అసలు నువ్వు నాకు లేకపోతే..? అమ్మ బాబోయ్, నేనస్సలు ఊహించలేను. అసలు నువ్వే లేకపోతే నా చేతిలో ఉన్న సమయమంతా ఏమి చెయ్యాలో తెలీక మహా ఇబ్బంది పడిపోయేదాన్నేమో!

దేని గురించి గంటల తరబడి అదే పనిగా ఆలోచించాలి, దేనికి సంబరపడాలి, దేని విలువ ఎలా తెలుసుకోవాలి, బాధ ఎందుకొస్తుంది, ప్రేమంటే ఏంటీ, పిచ్చి అంటే ఏంటీ.. ఇవన్నీ నాకు తెలిసేవి కాదుగా మరి!

ఏవిటో.. అంతా అయోమయంగా, అస్పష్టంగా, చిందరవందరగా, గందరగోళంగా ఏదేదో చెబుతున్నాను కదూ! ఏమో.. నాకలాగే చెప్పాలనిపించింది మరి. చెప్పేశాను. అంతే!

ఇలాంటప్పుడే నాకు నేనే అర్థం కావట్లేదేమోననిపిస్తుంది. అంతలోనే ప్రేమో, పిచ్చో.. ఇది ఏదైనా కానీ నాకు మాత్రం ఇదే మరి నీకో!?

ఉదయం నుంచీ రాత్రి వరకూ ప్రతీ పది నిమిషాలకి మెయిల్ చెక్ చేసుకుంటూనే ఉంది మేఘ.

చివరకి రాత్రి పదకొండు గంటలకి కిరణ్ నుంచి రిప్లై వచ్చింది.

"యా, అయాం ది కిరణ్ యు ఆర్ లుకింగ్ ఫర్. ఐ జస్ట్ కాంట్ బిలీవ్ ఇట్! నువ్వు నిజంగా మేఘ, మేఘనందన?"

అది చూసిన మేఘ ఆనందానికి అవధుల్లేవు. ఆనందంతో కళ్ళు తడిసాయి.

"అయాం గ్లాడ్ దట్ ఐ ఫౌండ్ యు కిరణ్, ఎట్ లాస్ట్! లెట్ మీ నో వెన్ యు విల్ బీ ఫ్రీ. లెట్స్ చాట్. ఇప్పుడు మా టైం రాత్రి పదకొండు." అని రిప్లై పంపింది.

కిరణ్ తో మాట్లాడబోతోందన్న ఆనందంతో చాలాసేపు నిద్ర పట్టలేదు మేఘకి. ఏం మాట్లాడాలో ఆలోచించుకుంటూ ఎప్పటికో నిద్రలోకి జారుకుంది.

# 13

తెల్లవారి ఉదయాన్నే కిరణ్ నుంచి ఈమెయిలు చూసిన మేఘ అది పది నిమిషాల క్రితమే వచ్చి ఉండటం గమనించి చాట్ బాక్స్ లో పింగ్ చేసింది.

"హలో కిరణ్"

"హేయ్"

"థాంక్స్ ఫర్ యువర్ రిప్లై. నాతో మాట్లాడతావో లేదో అనుకున్నా."

"ఎందుకు మాట్లాడను? అయినా ఏంటీ సర్ప్రైజ్? ఎప్పుడూ నేను కదా నీ వెంట పడేది."

"నిజమే! నేను దాదాపు రెండేళ్ళ నుంచీ వెతుకుతున్నా నీకోసం. లక్కీగా ఇప్పటికైనా దొరికావు."

"ఎందుకు వెతకడం?"

"ఎందుకంటే... ఊరికే, నీతో మాట్లాడాలని."

"నువ్వెలా ఉన్నావు? ఎక్కడున్నావు? ఏం చేస్తున్నావు?"

"నేను మాస్టర్స్ అయిపోయాక ఇండియాలో జాబ్ చేశాను కొన్నాళ్ళు."

"అది తెలుసులే. ఆ టైంలో ఒకసారి మనం కలిసాంగా."

"ఊ. అదే చివరిసారి మనం కలవడం. ఒక ప్రాజెక్ట్ పని మీద ఏడాది కోసమని న్యూయార్క్ వచ్చాను. అప్పటినుంచీ ఇక్కడే ఉండిపోయాను. నువ్వేం చేస్తున్నావు?"

"అప్పుడు చెప్పానుగా ఆస్ట్రేలియా వెళుతున్నానని. అప్పటినుంచీ సిడ్నీలోనే ఉన్నా. ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో జూనియర్ కార్డియాలజిస్ట్ గా వర్క్ చేస్తున్నా."

"ప్రదీప్, నువ్వూ కాంటాక్ట్ లో ఉన్నారా?"

"అప్పుడప్పుడూ ఫోన్ చేస్తుంటాను. కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ మధ్యే ఎంబీబీయెస్ పూర్తి చేసి పీజీ చేసే ప్లాన్లో ఉన్నాడు."

"ఎంబీబీయెస్ ఇప్పుడు పూర్తవడం ఏంటి?"

"ప్రదీప్ గురించి తెలుసుగా. కంగారేముందిలే అని జాలీగా తీరిగ్గా పూర్తి చేశాడు. సునీల, సునంద, రజని ఎలా ఉన్నారు?"

"నీలూకి పెళ్లయిపోయిందని తెలుసుగా. ఒక పాప, బాబు. విజయవాడలోనే ఉంటారు. రజని పెళ్ళి చేసుకుని సింగపూర్ వెళ్ళిందని తెలిసింది. అప్పటి తర్వాత మళ్ళీ ఎప్పుడైనా మన కాలేజీ క్యాంపస్ కి వెళ్ళావా?"

"లేదు. నువ్వు వెళ్ళావా?"

"రెండేళ్ళ క్రితం ఇండియా వెళ్ళినప్పుడు నాలుగు రోజులు నీలూ వాళ్ళింట్లో ఉన్నాను. అప్పుడు మన కాలేజీ చూసొద్దాం అనుకున్నాం గానీ తీరా చివరి నిమిషంలో నాకే వెళ్ళాలనిపించలేదు. నేను నీతో పాటు సునందక్క స్నేహాన్ని కూడా పోగొట్టుకున్నాను. అప్పట్లో నీమీద అరవడం పొరపాటని తను సర్దిచెప్పబోయింది. నేనే దురుసుగా మాట్లాడాను. ఆ తర్వాత మళ్ళీ తనతో మాట్లాడే అవకాశం నాకిప్పటికీ దొరకలేదు."

"ఎంతైనా నీకు పొగరు ఎక్కువే కదా?"

"హహ్హహ్హా.. అంతేనంటావా? ఏమో మరి!"

"సరదాగా అన్నాను. అప్పట్లో సునంద హైదరాబాద్లో నాకూ, ప్రదీప్ కీ రెండు మూడు సార్లు కనపడింది. వెరీ నైస్ లేడీ! నీ గురించి అడిగితే నాతో మాట్లాడనన్నావని చెప్పాను. కానీ నిన్ను అడిగిందని తెలీదు."

"షి ఈజ్ ఇండీడ్ వెరీ నైస్."

"నేను మా కజిన్ పెళ్ళి కోసం ఒకసారి విజయవాడ వెళ్ళాను. డబ్బులు నీళ్ళలో పడేసాను కూడా."

"డబ్బులు పడెయ్యడం ఏంటీ?"

“కృష్ణానదిలో రూపాయి నాణేలు వేస్తే కోరికలు తీరతాయిగా.”

“నీకింకా ఆ విషయం గుర్తుందా? అప్పుడేంటో అలాంటి పిచ్చి పనులు చేసాను.”

“బస్లో వేరుశనక్కాయలు వలిచిపెట్టావు. గుర్తుందా?”

“ఓ మై గాడ్! నిజంగా చాలా ఆశ్చర్యంగా ఉంది నీకవన్నీ ఇంకా గుర్తున్నాయంటే. నీ కోసం వెతికేప్పుడు, మెయిల్ ఇచ్చేప్పుడు నేనసలు నీకు గుర్తున్నానో లేదో అనుకున్నాను కిరణ్..”

“హౌ కెన్ ఐ ఫర్గెట్? ఐ స్టిల్ రిమెంబర్ ఎవిరీ మైన్యూట్ డీటైల్ అబౌట్ యూ.”

“డోంట్ నో వాట్ టు సే! నేను నిన్ను చాలా బాధపెట్టాను. అయాం సారీ కిరణ్! నీకు సారీ చెప్పడం కోసమే నిన్ను చాలా కష్టపడి వెతికి పట్టుకున్నాను.”

“ఇట్స్ ఒకే మేఘా. డోంట్ వర్రీ. నాకెప్పుడూ నీమీద కోపం లేదు. నేనెప్పుడూ ఎవరిలోనైనా మంచి విషయాలు మాత్రమే గుర్తుపెట్టుకుంటాను. అయినా ఆస్ట్రేలియా వచ్చాక చాలా మారిపోయాను. ఎప్పుడూ చుట్టూ బోల్డు ఫ్రెండ్స్, పార్టీలు, ఫన్, ఓన్లీ ఫన్. సెంటిమెంటల్ గా ఫీలవడం అస్సలు పడదు మనకి.”

“గుడ్ టు హియర్ దట్. ఐ నో యు ఆర్ ఎ ప్రాక్టికల్ పర్సన్. బట్ ఐ ఆల్సో నో హౌ స్టుపిడ్ ఐ వాజ్. నిన్ను చాలా చాలా బాధపెట్టాను. ఇట్ కీప్స్ హర్టింగ్ మీ ఈవెన్ నౌ. నువ్వు వెళ్ళిపోయేప్పుడు మా దగ్గర ఉండిపోయిన నీ ఫోటోస్ రజని వాళ్ళింట్లో చూపించి మనిద్దరి గురించి చెప్తే వాళ్ళ నాన్న మా ఇంట్లోనూ, నీలూ వాళ్ళింట్లోనూ చాలా గొడవ చేసారు. ఆ బాధ, కోపం నీ మీద చూపించాను. ఐ నెవర్ హేటెడ్ యు. అయాం రియల్లీ సారీ ఫర్ ఆల్ ద పెయిన్ ఐ గేవ్ యు. ఆ వయసుకి అంతకన్నా నిశితంగా ఆలోచించేంత పరిణితి నాకు లేకపోయింది.”

“నేను నిన్ను ఇష్టపడుతున్నానని చెప్పాకే నాకు నీలో అమాయకత్వం, పసితనం మరింత బాగా అర్థమయ్యాయి. నీ పరిధికి మించిన ఆలోచనల భారం నీ మీద పెట్టకూడదన్న నిర్ణయానికి వచ్చాకే నువ్వు కారణం చెప్పకుండా కసురుకుని నాతో మాట్లాడటం మానేసావు. నిన్ను ఇబ్బంది పెట్టకూడదు, అన్నీటినీ సక్రమంగా ఆలోచించుకోడానికి నీకు సమయం ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే మళ్ళీ నాలుగేళ్ళ వరకూ నేను నీకు కనపడలేదు. సమయం గడిచే కొద్దీ పరిస్థితిలో మార్పు వస్తుంది అనుకున్నాను. కానీ అప్పుడు కూడా నువ్వు అంతే మొండిగా ప్రవర్తించావు. ప్రతీదాంట్లో ఫస్ట్ ఛాయిస్ ఈజ్ ది బెస్ట్ అనుకుంటాను నేను. అన్ఫార్చునేట్లీ యు హేపెండ్ టు బి మై ఫస్ట్ లవ్.”

కిరణ్ చెప్పింది విన్నాక ఏం మాట్లాడాలో తోచలేదు మేఘకి. అతను చెప్పింది సబబుగానే తోస్తుంది. నాలుగేళ్ళ తర్వాత కిరణ్ కనిపించినప్పుడు కూడా అంతే మొండిగా ఎందుకు ప్రవర్తించింది అన్న ప్రశ్నకి ఎంత వెతికినా సరైన సమాధానం దొరకలేదు.

"అప్పటి పరిస్థితుల్లో ఈ స్నేహాలు, ప్రేమలూ అన్నీ చాలా తప్పు. కేవలం చదువు మీద తప్ప వేరే దేనిమీదా దృష్టి పెట్టకూడదు అని గట్టిగా నిర్ణయించుకున్నాను. అది నా అజ్ఞానమేమో!"

"ఈ ఒక్కమాట నువ్వు నాతో అప్పుడే చెప్పి ఉంటే ఈ రోజు దాకా నిన్ను డిస్టర్బ్ చెయ్యకుండా ఎదురుచూసేవాడిని. ఇప్పుడు నువ్విలా మాట్లాడుతుంటే చాలా ఆశ్చర్యంగా, వింతగా ఉంది మేఘా. నేను నిన్ను కలిసి మాట్లాడాలని ప్రయత్నించిన నాలుగైదుసార్లలో ఒక్కసారైనా నువ్వు ఇలా మాట్లాడుంటే ఎలా ఉండేదో!"

"నాలుగైదు సార్లు ఎప్పుడొచ్చి కలిసావు? ఒక్కసారేగా మా ఇంజనీరింగ్ హాస్టలుకి వచ్చి కలిసింది?"

"నువ్వు పీజీ చేసేప్పుడు కలిసాముగా గుర్తులేదా?"

"అప్పుడు అనుకోకుండా రోడ్డు మీద కనిపించి హాయ్ చెప్పావంతే."

"నా ఫ్రెండ్స్, కజిన్స్ హెల్ప్ తో నువ్వెక్కడున్నావు ఏంటని నీ గురించి బోల్డంత వర్క్ చేసి అన్నీ కనుక్కుని కేవలం నిన్ను కలవడానికి నేను మణిపాల్ నుంచీ వస్తే నువ్వసలు నాకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా 'హాయ్ కిరణ్, యు లుక్ స్మార్ట్, బై బై' అని చెప్పేసి వెళ్ళిపోయావు. చివరిసారి కలిసినప్పుడు నీతో పాటు ఎవరో ఉన్నారు. బై బై అనేసి అతని చెయ్యి పట్టుకుని వెళ్ళి పోయావు."

"వాట్!!! అంటే, నువ్వప్పుడు అనుకోకుండా నాకు దారిలో కనిపించలేదా? నాతో మాట్లాడటానికే నన్ను వెతుక్కుంటూ వచ్చావా? నిజంగానా? నమ్మలేకపోతున్నాను కిరణ్.. నేనంత స్టుపిడ్ గా ఎలా ప్రవర్తించానసలు!"

"మేఘా.. యు డోంట్ నో హౌ ఐ ఫెల్ట్ ఫర్ ఎయిట్ లాంగ్ ఇయర్స్ అండ్ ఐ డోంట్ వాంట్ టు టెల్ యు నౌ."

"ఏం చెప్పాలో తెలీడం లేదు. అప్పుడు చివరిసారి కలిసినప్పుడు నాతో ఉన్నది మా కజిన్. ఏంటో నువ్వెప్పుడు కనిపించినా హడావుడిగా పారిపోదామని ప్రయత్నించేదాన్ని. నాకోసమే వచ్చి ఉంటావన్న ఊహే రాలేదు నాకిన్నేళ్ళలో. నేనింకా అప్పటికి నువ్వు అంతా మర్చిపోయావు అందుకే యథాలాపంగా రోడ్డు మీద కనిపిస్తే హాయ్ చెప్పేసి వెళ్ళావు అనుకుంటున్నాను. నేను నీకు సారీ చెప్పి నా గిల్టీ ఫీలింగ్ పోగొట్టుకోవాలనుకున్నాను కానీ నేను అనుకున్నదానికన్నా ఎక్కువే తప్పు చేసానని అర్థమవుతోందిప్పుడు. ఐ థింక్ ఐ కెన్ నెవర్ ఫర్గివ్ మైసెల్ఫ్ ఫర్ దిస్. ఫీలింగ్ టెర్రిబుల్."

"గో ఈజీ మేఘా.. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటికైనా నువ్వు నాతో మాట్లాడటం చాలా హేపీగా ఉంది. జరిగిపోయినవాటిని గురించి ఆలోచించి బాధపడటం సరికాదు. రిలాక్స్.. వి హేవ్ టు మూవ్ ఆన్.."

"సారీ చాలా చిన్న పదం అనిపిస్తోంది నిజంగా."

"అదంతా వదిలెయ్. హౌ ఈజ్ లైఫ్ ఇన్ న్యూయార్క్? నేను పోయిన సంవత్సరం న్యూయార్క్ వచ్చాను తెలుసా?"

"ఏ టైంలో వచ్చావు?"

"డిసెంబర్లో వచ్చాను."

"అప్పుడు నేను ఇండియా వెళ్ళాను."

"డిసెంబర్లో ఇండియాలో ఉన్నావా? ఆ టైంలో మా డాడీ మీ ఊరికి వచ్చారు. మీ ఊర్లో బ్యాంక్ ఇన్స్పెక్షన్ కి వెళ్తున్నారని చెప్తే నేనే 'వన్ లాస్ట్ ట్రై' అనుకుని మీ నాన్నగారి పేరు, వివరాలు చెప్పాను. కనుక్కోవడానికి ప్రయత్నించారు కానీ ఏమీ తెలీలేదు."

"అయ్యో అవునా.. మా పేరెంట్స్ ఆ ఊరి నుంచి హైదరాబాదుకి వచ్చేసి నాలుగేళ్ళయింది. ఇంతకీ న్యూయార్క్ ఎందుకొచ్చావు?"

"మా పెద్దక్క వాళ్ళు వాషింగ్టన్ లో ఉంటారు. సెలవులకనీ సరదాగా వచ్చాను. మా పేరెంట్స్ తెలిసినవాళ్ళ అమ్మాయి ఉంది వెళ్ళి చూసి రమ్మంటేనూ బావ, నేను డ్రైవ్ చేసుకుంటూ వచ్చాం."

"ఓ.. పెళ్ళి చూపులా?"

"అలాంటిదే. కానీ ఆ అమ్మాయి నాకు నచ్చలేదు."

"ఓహ్.. మరి ఏ అమ్మాయి నచ్చింది?"

"ఐ హేవ్ ఎ గర్ల్ ఫ్రెండ్. ఆస్ట్రేలియాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. సంవత్సరంన్నర నుంచీ పరిచయం. చూడాలి ఏమవుతుందో!"

"గుడ్ లక్ టు హర్!"

"నీ పెళ్ళి అయిపోయింది కదూ?"

"ఊ.."

"లవ్ మేరేజా, పేరెంట్స్ డెసిషనా?"

"నువ్వేం అనుకుంటున్నావు?"

"లవ్.. ఐ హోప్"

"హోప్ ఎందుకు?

"ఏమో, అలా అనిపిస్తుంది."

"తను నా కొలీగ్. మూడేళ్ళ స్నేహం తర్వాత చెప్పాడు. ఒకసారి చేసిన తప్పు మళ్ళీ చెయ్యకుండా సరే అనేసాను. నాకన్నా చాలా మంచోడు. పోయిన డిసెంబర్లో ఇండియా వెళ్ళింది పెళ్ళి కే."

"గుడ్. నైస్ టు హియర్ ఇట్."

"ఫేస్ బుక్లో నీ ప్రొఫైల్ పిక్చర్ చూసి నువ్వు కాదేమో అనుకున్నాను. చాలా దూరం నుంచి తీసిన ఫోటో కదా పోల్చలేకపోయాను."

"ఇన్నేళ్ళ తర్వాత నువ్వెలా ఉన్నావో! కెన్ ఐ సీ యువర్ ఫేస్ వన్స్?"

"అఫ్ కోర్స్, వై నాట్? ఫోటో పంపిస్తా ఉండు. నీ ఫోటో కూడా పంపు."

"మేఘా.. యు నో వాట్.. ఇన్నేళ్ళ తర్వాత కూడా నువ్వు అలాగే ఉన్నావు. ఏం మారలేదు. అప్పుడు చూసినట్టే ఉంది."

"నువ్వు మాత్రం చాలా మారిపోయావు. కంప్లీట్ డిఫరెంట్ లుక్. ఇంకా స్మార్ట్ గా కనిపిస్తున్నావు."

"రెండు నెలల క్రితం ఇండియా వెళ్ళి పార్టీలు, బిరియానీల మూలంగా ఎనిమిది కేజీలు బరువు పెరిగాను. వర్కింగ్ హార్డ్ నౌ టు లూస్ ఇట్."

"హహ్హహ్హ.. నేనిలా బోల్డంతసేపు సోది చెప్తూ నీ టైం వేస్ట్ చేస్తున్నానా?"

"నో. నాట్ ఎటాల్. ఐ కెన్ టాక్ టు యు ఫరెవర్."

"స్వీట్ ఆఫ్ యు. థాంక్స్. కెన్ ఐ ఆస్క్ యు వన్ మోర్ థింగ్?"

"చెప్పు."

"నాకొకసారి నీ గొంతు వినాలనుంది. కెన్ ఐ టాక్ టు యు వన్స్?"

చాట్ బాక్స్ లో ట్రింగ్ ట్రింగ్ శబ్దం వింటూనే వెనుకటి రోజుల్లో తామిద్దరం మాట్లాడుకున్న లాండ్ లైను ఫోన్లు గుర్తొచ్చాయి మేఘుకి.

"హలో.. కిరణ్.." మేఘు గొంతు వణికింది.

"హాయ్ మేఘూ.."

ఇరువురి మధ్యనా ఇంతసేపూ కీబోర్డు మీద సాగినంత జోరుగా గొంతులోంచి బయటపడటం లేదు మాటలు.

"ఎలా ఉంది మీ ఆస్ట్రేలియా?"

"ఎక్కడో వర్షాలు, వరదలు అంట పాపం. టీవీలో చూపిస్తున్నారు."

"ఇదంతా నేను నీతో మాట్లాడ్డం వల్లేనంటావా?" గలగలా నవ్వింది మేఘు.

"అయ్యుండొచ్చు."

"నీ గొంతు అచ్చం అప్పటిలాగే ఉంది తెలుసా కిరణ్.. నాకు అప్పటి మా ఇంట్లో లాండ్ లైన్ ఫోన్లో నుంచి మాట్లాడుతున్నట్టే ఉంది. ఆ గతంలోనే ఇప్పుడు కూడా ఉన్నంత భ్రమగా ఉంది. నిజంగానే నేను నీతో మాట్లాడుతున్నానా ఇదంతా కలా అనిపిస్తోంది. మన కాలేజీ రోడ్డు గుర్తుందా నీకు? అన్నీ గుల్మోహర్ చెట్లుంటాయి. నువ్వు ఫస్ట్ టైం లెటర్ రాసినప్పుడు నన్ను మా హాస్టలు మెట్ల మీద

కనిపించమని చెప్పి నాకోసం ఎదురుచూస్తూ తిరిగావు. కాలేజీ యానివర్సరీ ఫంక్షన్ జరిగినప్పుడూ, చివరి రోజు కూడా అక్కడే కలిసాం. నాకెప్పుడూ ఆ రోడ్డు, చెట్లు బాగా గుర్తొస్తుంటాయి."

"చివరి రోజే కాదు, మొదటి రోజు కూడా అక్కడే కలిసాం. నేను రోడ్డు మీద తిరిగినట్టు నీకెలా తెలుసు? అప్పుడు నువ్వు నాకు కనపడలేదుగా?"

"అంటే, నీకు కనపడలేదు గానీ సీక్రెట్ గా దాక్కుని నిన్ను మాత్రం చూశామన్నమాట! సారీ.. కనిపిస్తే మరి 'యెస్' చెప్పాననుకుంటావని భయపడి దాక్కున్నా. అప్పుడు నా ఫ్రెండ్స్ అందరూ నీ ఫ్యాన్స్ తెలుసా. నిన్ను బోల్డు పొగిడేసి నన్ను తిట్టేవారు. నువ్విచ్చిన గ్రీటింగ్ కార్డ్ వాళ్ళందరికీ ఎంత నచ్చేసిందో! కానీ ఇంట్లో గొడవయ్యాక అది చింపేసి పడేసాను నేను."

"నువ్వు చింపకుండా ఉంటే ఆశ్చర్యపడాలి. నువ్విచ్చిన గ్రీటింగ్స్, గిఫ్ట్స్ మాత్రం మా ఇంట్లో భద్రంగా ఉన్నాయి."
"ఆ గ్రీటింగ్ కార్డ్ మరీ చాటంత ఉంటుంది బాబూ.. దాచిపెట్టడం చాలా కష్టం. అందులో ఏం రాసావో గుర్తుందా నీకు?"

"ఉహూ.. గుర్తు లేదు."

"నువ్వు కాదా రాసింది?" నవ్వింది మేఘ.

"నేనే రాసాను. కానీ ఇప్పుడు గుర్తు లేదు. ఫన్నీగా ఏమన్నా రాసానా?"

"నాకింకా గుర్తుంది. 'అయాం గివింగ్ మై హార్ట్ టు యూ. కీప్ ఇట్ సేఫ్. అదర్ వైజ్ ఇట్ విల్ బ్రేక్ ఇన్ యువర్ హాండ్స్. ' ట్రూ లవ్ నెవర్ డైస్.' అని రాసావు. మిగతా అన్నీ పోయినా ఒక బుల్లి క్రిస్టల్ స్నెయిల్ బొమ్మ ఇచ్చావే, అదొక్కటి మాత్రం ఇప్పటికీ నా దగ్గరుంది."

"ఫస్ట్ టైం మనం కలిసినప్పుడు నువ్వు వీధిలో ఉన్న ఒక స్నెయిల్ ని తీసుకెళ్ళి పక్కనే ఉన్న ఇంటి గోడ మీద వదిలిపెట్టావు. యు ఆర్ సో కైండ్ అనుకున్నాను మొదటిసారి నిన్ను చూసినప్పుడు."

"అవునా, నాకదేం గుర్తు లేదు. స్నెయిల్ బొమ్మకి ఓ కారణం కూడా ఉందని అస్సలు తెలీదు. హ్మ్.. మొదట్లో అలా భ్రమపడినా తర్వాత్తర్వాత అర్థమైందా కైండ్ కాదూ ఏం కాదూ మేఘ ఉట్టి రాక్షసీ అని" నవ్వింది మేఘ.

"నిన్నొకసారి చంపెయ్యాలనుంది మేఘా.."

"ఎందుకూ? రాక్షసీ అని తెలుసుకున్నందుకా?" మళ్ళీ నవ్వింది మేఘ.

"సరదాగా అన్నానులే."

"మన కాలేజీ చివరి రోజున వెళ్ళిపోయే ముందు నువ్వు నన్ను ఫోటో తీసావు గుర్తుందా?"

"ఆ ఫోటో చాలా బాగా వచ్చింది. మా మమ్మీ జాగ్రత్తగా దాచిపెట్టింది."

"మీ మమ్మీ, డాడీకి నువ్వంటే చాలా ప్రేమనుకుంటా."

"నువ్వంటే కూడా ఇష్టం. అప్పట్లో మా ఇంటికి కాల్ చేసినప్పుడు మమ్మీతో మాట్లాడేదానివిగా."

"ఊ. మీ పెద్దక్క, చిన్నక్క అందరూ బాగున్నారా?"

"అందరూ స్టేట్స్ లోనే ఉన్నారు. వాళ్ళకి నలుగురు పిల్లలు. అంతా హేపీ."

"నేనొక్కదాన్ని తప్ప నీ చుట్టూ అందరూ మంచివాళ్ళే ఉన్నందుకు నాకు చాలా హేపీగా ఉంది కిరణ్. ఐ మీన్ ఇట్. చాలా థాంక్స్ ఇంతసేపూ నన్ను మాట్లాడనిచ్చినందుకు."

"నువ్వు మాట్లాడినా, మాట్లాడకపోయినా రెండూ కష్టమే మేఘా.."

"ఎందుకలాగ?"

"అలా అయినా ఇలా అయినా ఎదుటివాళ్ళని మాట్లాడనివ్వవుగా అందుకని."

గలగలా నవ్వింది మేఘ.

"మొత్తానికి చాలా అర్థం చేసుకున్నావు నన్ను. ఇప్పటికే మీకు అర్ధరాత్రి దాటిందేమో, ఇంక ఉంటాను నేను. గుడ్ నైట్ కిరణ్.."

"సరే అలాగే.. హేవ్ ఎ నైస్ డే.. బై!"

"బై!"

ఆ రోజంతా మేఘకి కిరణ్ తో మాట్లాడిన విషయాలే మళ్ళీ మళ్ళీ గుర్తొస్తూ ఉన్నాయి. ఇన్నేళ్ళ తరువాత కిరణ్ తో మనస్ఫూర్తిగా మాట్లాడగలగడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇన్ని సంవత్సరాలుగా మనసులో గూడు కట్టుకున్న భారం తీరిపోయి ఉపశమనంగా అనిపించింది.

తన తెలిసీ తెలియనితనంతో, మూర్ఖత్వంతో తను ఊహించినదానికన్నా ఎక్కువగానే అతన్ని బాధపెట్టిందని తెలిసిరావడం కష్టంగానే ఉన్నా, గడిచిపోయిన గతాన్ని కిరణ్ తనకన్నా సమర్ధవంతంగా వెనుకే వదిలి ప్రశాంతంగా ముందుకి వెళ్ళగలిగినందుకు ఊరటగా అనిపించింది.

ఇప్పటికీ తనవైపు తప్పు చూపించి పరుషంగా చిన్నమాటైనా అనకుండా, ఎటువంటి నిష్ఠూరాలాడకుండా తనతో అంతే స్వచ్ఛంగా, ఆత్మీయంగా ప్రవర్తించిన అతని వ్యక్తిత్వపు ఔన్నత్యానికి మనసు తడిసింది.

రోజంతా ఇవే ఆలోచనలతో గడిపాక కిరణ్ కి ఒక ఈమెయిలు రాసింది మేఘ.

డియర్ కిరణ్,

గతం తాలూకు జ్ఞాపకాలు పదే పదే గుర్తొచ్చి బాధ, సంతోషం రెండీటినీ ఒకేసారి అనుభవంలోకి తీసుకొచ్చేవి. ఇన్నేళ్ళ తర్వాత నేను మళ్ళీ కనిపించి నిన్ను విసిగించానో బాధపెట్టానో తెలీదు కానీ నీతో మాట్లాడినందుకు, నీ గొంతు విన్నందుకు నాకెంత సంతోషంగా ఉందో చెప్పలేను. సంతోషం కన్నా మనశ్శాంతి. ఇన్నేళ్ళుగా మనసులో ఉన్న అలజడంతా మాయమైపోయి ప్రశాంతంగా ఉంది.

నీలాంటి నిన్ను దూరం చేసుకుని తప్పు చేశానన్న బాధని అధిగమిస్తూ నీలాంటి గొప్ప మనసున్న స్నేహాన్ని కొన్నాళ్ళైనా పొందగలిగినందుకు గర్వంగా ఉంది.

జీవితప్రయాణంలో ముందుకి సాగిపోతున్నప్పుడు కొందరు ప్రత్యేకమైన వ్యక్తులు మనకి దూరం కావచ్చు. అంతమాత్రాన వాళ్ళని మనం కోల్పోవడం జరగదు. వాళ్ళు మనలోనే ఒక భాగంగా మారిపోయి ఎప్పుడూ మనసుకి దగ్గరగా మనతోనే ఉంటారు. వాళ్ళతో పెనవేసుకున్న జ్ఞాపకాలన్నీ మనలో ఎప్పుడూ సజీవంగా ఉంటాయి.

యు ఆర్ వన్ సచ్ పర్సన్ ఫర్ మీ అండ్ యు రిమెయిన్ సో! థాంక్స్ ఫర్ బీయింగ్ దేర్ ఇన్ మై లైఫ్ అండ్ మేకింగ్ ఇట్ మోర్ బ్యూటిఫుల్!

ఎప్పుడో పదమూడేళ్ళ క్రితం హేపీ న్యూ ఇయర్ చెప్పాననుకుంటా కదూ నీకు. మళ్ళీ ఇప్పుడు చెప్తున్నా. ఇన్నేళ్ళు గడిచాయా అని చిత్రంగా ఉంది. నీ చుట్టూ ఉన్నవాళ్ళందరూ ఎప్పుడూ సంతోషంగా ఉంటారని నాకు తెలుసు. నువ్వు కూడా వాళ్ళతో పాటు ఎప్పుడూ బోల్డంత సంతోషంగా ఉండాలనీ, నువ్వు కోరుకున్నవన్నీ నీకు దక్కాలనీ ఆశిస్తూ.. హేపీ న్యూ ఇయర్ కిరణ్!

ప్రేమతో,

మేఘనందన

నువ్వు నా మనసుకి ఎంత దగ్గరైన మనిషివైనా నిన్నేమని పిలవాలో కూడా తెలియని, తెలిసినా నాకు నచ్చినట్టు నిన్ను గొంతెత్తి పిలవలేని అశక్తత నాది. నువ్వు తలపుకి రాగానే నా గొంతుకేదో అడ్డం పడినట్టవుతుంది. మాట బయటికి పెగలదు. ఎన్నేళ్ళ నుంచో గొంతులో గడ్డకట్టుకుపోయిన మాటలివి.

నువ్వు ప్రేమగా మాట్లాడినప్పుడు, కబుర్లు చెప్తూ అల్లరి చేసినప్పుడు, అమాయకంగా నవ్వినప్పుడు, నిన్ను చూస్తుంటే నాక్కలిగే సంతోషమే నువ్వు తిట్టినప్పుడు కూడా కలిగేది. అసలు నువ్వు నా కళ్ళముందు కనిపిస్తుంటే చుట్టూ మరేదీ నా కనుచూపుమేరలో నిలిచేది కాదు. నిన్ను కళ్ళారా చూస్తూ ఎన్ని యుగాలైనా క్షణాల్లా గడిచిపోతాయనిపించేది.

చివరికి నువ్వు నన్ను విసుక్కున్నప్పుడు, కోప్పడ్డప్పుడు, చెడామడా తిట్టేసినప్పుడు కూడా మురిపెంగానే ఉండేది తప్ప ఒక్క మాటైనా గట్టిగా అనాలనిపించేది కాదు. నువ్వు నన్ను కాదన్నావ్, వదిలి వెళ్ళిపొమ్మనావ్, నా మీద అరిచావ్, ఇంకెప్పుడూ కనపడొద్దన్నావ్, ఇంకసలు నాతో మాట్లాడనన్నావ్.... కానీ అసలు నీకేం నచ్చలేదో, నామీద ఎందుకు కోపమొచ్చిందో ఎంతగా ఆలోచించినా ఇప్పటికీ నాకు సమాధానం దొరకలేదు.

ఒకోసారి అనిపిస్తుంటుంది. నేను నిన్ను తప్ప వేరెవర్నీ నా మనసుకి దగ్గరగా రానివ్వకుండా దూరదూరంగా జరిగాను. నా స్నేహం కోరి నా చుట్టూ తిరిగిన ఎంతోమందిని కాదనుకుని ఏనాటికైనా నువ్వొస్తావనీ, కోపం తగ్గిపోయి ప్రేమగా దగ్గరౌతావనీ ఎదురు చూసాను. ఆ ఎదురు చూపుల్లోనే ఎన్నెన్నో రోజులు, నెలలు, సంవత్సరాలు దొర్లిపోయాయి. ఇన్నేళ్ళ తర్వాత వెనక్కి తిరిగి చూస్తే అన్నీ జ్ఞాపకాలే తప్ప నాతో ఎవ్వరూ లేరు. నా చుట్టూ ఉన్న ప్రపంచంలోంచి నెమ్మదిగా ఒక్కొక్కరూ కనుమరుగైపోయారు. నువ్వు మాత్రం అప్పటికీ ఇప్పటికీ నాలోనే ఉన్నావు నా మనసుకి దగ్గరగా.

నన్ను ఇష్టపడని వాళ్ళెవరూ ఉండరని ఒక్కోసారి చాలా గర్వంగా అనిపిస్తుంది. అంతలోనే నువ్వు గుర్తొస్తావు. నువ్వు లేవుగా నాతో, ఇంకెందుకు ఇవన్నీ అనిపిస్తుంది. జీవితంలో ఎన్నో అరుదైన విజయాలు సాధించాననిపిస్తుంది. ఎంతో తక్కువమందికి మాత్రమే సాధ్యమైన ఎత్తులు చూసాననిపిస్తుంది. పేరు, ప్రతిష్ట, డబ్బు అన్నీ ఉన్నాయి. కానీ ఎన్నున్నా నా మనసు పదే పదే కావాలని మారాం చేసే నిన్ను మాత్రం తెచ్చివ్వలేనుగా!

నీ ధ్యాసలోనే, నీ ప్రేమ కోసం చూస్తూనే ఇప్పటికిలా ఒంటరిగా మిగిలిపోయానేమో అనిపిస్తుంది. చిత్రంగా ఒంటరితనంలో కూడా నువ్వే. నువ్వున్నంత వరకూ నేనో ఒంటరిని కాని ఒంటరిని. అసలెందుకిలా చేసావ్? ఇన్నేళ్ళయినా కోపం తగ్గిపోనంత పెద్ద తప్పు నేనేం చేసాను? ఎందుకు నాకిలా దూరమైపోయావ్? ఎందుకింత పెద్ద శిక్ష వేసావ్?

నీ పేరు గుర్తొస్తే చాలు నా గుండె ఒక్క క్షణం ఆగి మళ్ళీ కొట్టుకుంటుంది. మనిద్దరం స్నేహంగా ఉన్నప్పుడు ఎంత స్వచ్ఛంగా నవ్వేదానివి, ఎన్నెన్ని కబుర్లు చెప్పేదానివి, ఎంత ముద్దుగా అల్లరి చేసేదానివి. అవన్నీ నన్నింకా మురిపిస్తాయి తెలుసా! జీవితంలో ఎంతమందో పరిచయం అవుతూనే ఉంటారు. ఎవ్వరొచ్చినా పోతున్నా నా మనసులో నీ స్థానం మారే అవకాశం ఈ జన్మకైతే కనిపించట్లేదు. అది ఎప్పటికీ నీకే సొంతం నువ్వు అవునన్నా కాదన్నా!

అసలు నేను నీకు గుర్తున్నానో లేదో, ఎప్పుడన్నా నా పేరైనా తలచుకుంటావో లేదో అనిపిస్తుంది. ఒకవేళ నన్ను తలచుకున్నా ఇంకా అదే కోపమా? కనీసం ఇప్పటికైనా మనిద్దరం సంతోషంగా కలిసి గడిపిన జ్ఞాపకాల్ని తలచుకోవా అనిపిస్తుంది. ఆలోచిస్తుంటే ఒకోసారి తప్పంతా నాదేనేమో, నువ్వు నాకెంత అపురూపమో నేనే నీకు సరిగ్గా అర్థమయేలా చెప్పలేకపోయానేమో అనిపిస్తుంది. అయినా అలాంటి ప్రయత్నం చెయ్యాలన్నా అసలప్పుడు నువ్వు మాట్లాడనిచ్చావా నన్ను. అమ్మో ఎంత మొండిపిల్లవో నువ్వసలు!

అందరూ అంటుంటారు. నేను దేన్నైనా చాలా తేలికగా తీసుకుంటానని, నన్ను చూసి నేర్చుకోవాలనీ. హుమ్మ్.. నాకప్పుడు నవ్వొస్తుంది. నువ్వు గుర్తొస్తావు. ఎక్కడైనా కేరింతలు కొడుతూ అల్లరి చేస్తున్న పిల్లల్ని చూస్తే నువ్వే గుర్తొస్తావు. జోరున వర్షం కురుస్తుంటే నువ్వే గుర్తొస్తావు. ఇదే వాన ఎక్కడో చోట నిన్ను తడిపేస్తూ ఉంటుందేమోనన్న ఊహ బాగుంటుంది.

మనిద్దరం ఎంత దూరతీరాలలో ఉన్నా ఒకటే జాబిలినీ, వెన్నెలనీ కలిసి చూస్తున్నట్టు, ఏ రాత్రి వేళో ఆకాశంలో చుక్కల్ని చెరో వైపు నుంచీ లెక్కబెడుతున్నట్టు అనిపిస్తుంది. నీకిష్టమైన జాజులూ, మల్లెల్ని చూసినప్పుడల్లా వాటిల్లో నవ్వుతున్న నువ్వే కనిపిస్తావు. నేను దూరమైనా ఇవన్నీ నీకు చేరువగానే ఉండి ఉంటాయి కదూ!

ఒక్కసారి నువ్వు కనిపిస్తే బాగుండుననిపిస్తుంది. అంతలోనే వద్దనిపిస్తుంది. ఊహించడానిక్కూడా ధైర్యం సరిపోదు. ఇన్నేళ్ళ తర్వాత నువ్వు కనిపిస్తే... ఉహూ వద్దు. నా గుండె ఆగిపోతుందేమో, వద్దు వద్దు. నేను భరించలేను. నువ్వెక్కడున్నా సంతోషంగా ఉండాలనే కోరుకుంటాను కానీ.. నీ పక్కన ఇంకొకరిని నేను చూడలేను! చూసి తట్టుకునేంత శక్తి నాకు లేదు. ఎంతో ధైర్యంగా కనిపించే నాలో ఏ మూలో పిరికితనం కూడా దాక్కుని ఉందని ఇలాంటప్పుడే అనిపిస్తుంటుంది.

నువ్వు నా పక్కన ఉంటావన్న ఒకే ఒక్క ఆశ కారణంగా నాకు ఇంకో జన్మ ఉంటుందని నమ్మాలని ఉంది. కాలం గడిచే కొద్దీ అన్నీ మారిపోతుంటాయి. అది లోకసహజం. కానీ కాలం గడిచే కొద్దీ కొన్ని జ్ఞాపకాల బరువు పెరుగుతూ ఉంటుంది. కొన్ని బంధాలు మరింత బలపడతాయి. మరుపన్నదే లేనివి కొన్ని ఉంటాయనీ, అవి ఓ కంట కన్నీరునీ, మరో కంట సంతోషాన్నీ రప్పిస్తాయనీ అనుభవపూర్వకంగా తెలిసొస్తోంది.

నా ఆరోప్రాణమా.. ఇంతకన్నా నన్నేం చెప్పమంటావూ?

మేఘ ఉత్తరానికి కిరణ్ దగ్గర్నుంచీ జవాబు వచ్చింది.

మేఘూ..

సంతోషాన్నిచ్చే జ్ఞాపకాలకే తప్ప బాధని కలిగించే జ్ఞాపకాలకి చోటివ్వకు. ఎక్కువగా ఆలోచించి మనసు పాడు చేసుకోకు. అవన్నీ దాటేసి మనం చాలా ముందుకి వచ్చేసాం. మంచి చదువు, ఉద్యోగం, చక్కటి ఫేమిలీ.. అయాం రియల్లీ హేపీ ఫర్ వాట్ యు ఆర్ నౌ. సో, కీప్ రాకింగ్!

కిరణ్

కాలం తనదైన వేగంతో ముందుకి సాగిపోతూనే ఉంది.

ఒకప్పుడు కారణాంతరాల వల్ల ఒకరికి ఒకరు మాటకి అందనంత దూరంలో ఉండిపోయిన కిరణ్, మేఘులు ఇప్పుడు ఒకే ఈమెయిల్ దూరంలోనే ఉన్నా వారి మధ్య మాటల్లేవు. దానిక్కారణం కోపమో, అయిష్టతో కాదు. ఒకప్పటి ఎదురుచూపులు, అపరాధభావాలు ఇప్పుడు లేవు. ఒకరి మీద ఒకరికి ఎన్నటికీ చెరిగిపోని అభిమానం, గౌరవం ఉన్నాయి. అయినప్పటికీ మాటల అవసరం వాళ్ళ కిక లేదేమో!

ఏడాది గడిచాక మేఘ మెయిల్ బాక్స్ లో కిరణ్ నుంచి వచ్చిన ఈమెయిల్ ఆశ్చర్యపడుతూ తెరిచి చూసింది. అందులో 'మై సన్' అని రాసి కింద ఒక బుల్లి పాపాయి ఫోటో ఉంది.

ఆ బుజ్జాయిని చూస్తూనే కొన్ని క్షణాలు ఏవేవో వింత భావనలు.. కానీ అదంతా అతి కొద్ది క్షణాలే! తర్వాత స్థిమితం, మురిపెం, సంతోషం, సంతృప్తి...

“జూనియర్ కిరణ్ బాగున్నాడు ముద్దుగా. హేవ్ ఫన్ మిస్టర్ ప్రౌడ్ ఫాదర్!” జవాబిచ్చింది మేఘ.

కిటికీలోంచి వాలిపోతున్న సంధ్యావర్ణాల పక్కనే తాజాగా మబ్బుల మాటు నుంచీ వెన్నెల కిరణాలు వెదజల్లుతూ పైపైకి తేలి వస్తోంది చందమామ కుందేలుతో సహా..

ఇంకెప్పుడూ మేఘనందన కలల్లో గుల్మోహర్ చెట్లు రాలేదు!

(అయిపోయింది)

“అమ్మో సీరియల్ రాయడమే, నావల్లయ్యే పని కాదు బాబోయ్” అని ఎప్పటికప్పుడు తప్పించుకు పారిపోతున్న నన్ను లాక్కొచ్చి కుదురుగా కూర్చోబెట్టి “నువ్వు రాయగలవు” అంటూ కథాకథనాలు నాతో చర్చించి, ఎలా రాస్తే బాగుంటుందీ, ఎలాంటి తప్పులు చెయ్యకూడదు లాంటి పాఠాలన్నీ చెప్పి ప్రోత్సహిస్తూ నా చేత 'చంద్రుళ్ళో కుందేలు' మొదలుపెట్టించిన **కిరణ్ ప్రభ** గారూ...

సీరియల్లో ప్రతీ అంశాన్నీ నాతో వివరంగా చర్చించి, నేను రాయగానే మొట్టమొదట చదివి చక్కటి సలహాలు చెబుతూ, నేను ఈ సీరియల్ ని బాగా రాయాలని నాకంటే ఎక్కువగా తపించి ఈ ఏడాదంతా నాతో పాటు సమానంగా కష్టపడిన **కాంతి కిరణ్** గారూ...

సహజంగా మనుషుల నిజజీవితాల్లో జరిగే వాస్తవ సంఘటనల్లో ఉండే గొప్ప 'డ్రామా', రచయితలు ఊహించి సృష్టించే కథలకి ఏ మాత్రం తీసిపోదని నా అభిప్రాయం, కొంతవరకూ అనుభవం కూడా! అలాంటి ఓ నిజమైన కథని రాయాలని నాకు ఆసక్తిని కలిగించిన **'కిరణ్'** పాత్ర...

ఈ మూడు కిరణాల వెలుగులు లేకపోతే 'చంద్రుళ్ళో కుందేలు' వెలుగు చూసేది కాదు. 'ధన్యవాదాలు' అనేది చాలా చిన్న మాటయిపోతుంది. అంతకన్నా ఇది వాళ్ళు ప్రాణం పోసిన కుందేలు అని చెప్పడం సరైన మాటేమో!

ఇన్నాళ్ళూ 'చంద్రుళ్ళో కుందేలు' క్రమం తప్పక చదువుతూ ప్రోత్సహించిన కౌముది పాఠకులకి హృదయపూర్వక కృతజ్ఞతలు.

**- మధురవాణి**